సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 16 సంచిక: 274

సోమవారం 17-6-2024

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే నాకు అసలైన పండగ రోజు'



స్మృతి సూపర్ సెంచరీ

తొలి వన్డేలో దక్షిణాఫ్రికాపై భారత మహిళల గెలుపు - 12లో



క్లెయిమ్ ఎలా?

ఒకటి కన్నా ఎక్కువ హెల్త్ పాలసీలుంటే క్లెయిమ్ విధానాలపై కథనం - 13లో



ఉగ్రవాదాన్ని అణచివేయండి

జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదాన్ని అణచివేయాలని భద్రతా దళాలను కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ఆదేశించారు.

వివరాలు 6లో ▸



బాబ్రీ కాదు.. 3 గోపురాలు

12వ తరగతి పొలిటికల్ సైన్స్ పుస్తకంలో బాబ్రీ మసీదు సహా పలు అంశాలను ఎన్‌సీఈఆర్‌టీ తొలగించింది.

వివరాలు 6లో ▸



దోషులుగా తేలితే ఎవరినీ వదలం

నీట్ యూజీలో అవకతవకలకు పాల్పడి ఉంటే ఉన్నతాధికారులపైనా కఠిన చర్యలుంటాయని కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ చెప్పారు.

వివరాలు 6లో ▸



ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు

ముస్లిం సోదర, సోదరీమణులకు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేశారు.

వివరాలు 2లో ▸



రేపు 'పీఎం కిసాన్'

తొలి విడత

- రాష్ట్రంలో 43.52 లక్షల మంది అర్హులు.. ఒక్కొక్కరికి రూ.2 వేల చొప్పున సాయం
- రూ.870 కోట్లు జమ చేయనున్న ప్రధానమంత్రి మోదీ
- రాష్ట్రంలో ఐదేళ్లూ ఠంచన్‌గా పెట్టుబడి సాయం అందించిన వైఎస్ జగన్
- ఐదేళ్లలో 53.58 లక్షల మంది రైతులకు రూ.34,288 కోట్లు అందజేత

2లో

ఈవీఎంల గుట్టు విప్పేదెవరు?

ఒక్కొక్కటిగా ఓటింగ్ యంత్రాల అక్రమాలు వెలుగులోకి..

ముంబైలో గెలిచిన శివసేన(షిండే) అభ్యర్థి రవీంద్రపై దర్యాప్తు

- ఆయన బంధువు మొబైల్‌తో ఈవీఎంను ఆపరేట్ చేసినట్లు ఆరోపణలు
- ఈవీఎంల హ్యాకింగ్ అసాధ్యమేమీ కాదన్న టెక్ దిగ్గజం ఎలాన్ మస్క్
- ఏఐ ద్వారా ఈజీగా హ్యాక్ చేయొచ్చనంటూ ట్వీట్
- ముంబై ఘటన నేపథ్యంలో ఈవీఎంలపై రాహుల్ గాంధీ అనుమానాలు
- ఏపీలో ఓటింగ్ సరళిపై ఇప్పటికే పలువురు ప్రజలు, నేతల అనుమానాలు
- మా ఓట్లు ఏమయ్యాయంటూ ఇప్పటికే ప్రశ్నిస్తున్న జనం
- గెలిచిన అభ్యర్థులే ఆశ్చర్యపడేంత మెజారిటీలు రావటంపై సందేహాలు
- 20 లక్షల ఈవీఎంలు ఏమయ్యాయో చెప్పాలని ప్రశ్నించిన ఉండవల్లి
- బీజేపీతో పొత్తు కోసం చంద్రబాబు పాట్లన్నీ ఆరోపణలకు బలం చేకూర్చేవే
- ప్రజాస్వామ్య వ్యవస్థల్లో పారదర్శకత లేకుంటే భవిష్యత్తు లేదన్న రాహుల్
- ఎన్ని ఆరోపణలొస్తున్నా నోరు విప్పని సీఈసీ.. కూటమి నేతలు
- బహిరంగంగా పరీక్షిస్తే తప్ప రహస్యం వీడదంటున్న టెక్ నిపుణులు
- ఇలాంటి సందేహాల వల్లే ఈవీఎంలకు స్వస్తి చెప్పిన ప్రపంచ దేశాలు

2లో



'మహా' ఈవీఎం వివాదం ముంబై నార్త్ వెస్ట్‌లో 48 ఓట్లతో నెగ్గిన శివసేన అభ్యర్థి | మొబైల్ ఫోన్‌తో ఈవీఎంను హ్యాక్ చేశారంటూ ఆరోపణలు 6లో **ఈవీఎంలకు స్వస్తి పలకాలి** సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేష్‌యాదవ్

జనసేనకు డిప్యూటీ స్పీకర్?

- రేసులో బుద్ధప్రసాద్, బొలిశెట్టి
- ఈ నెల 19 నుంచి అసెంబ్లీ సమావేశాలు నిర్వహించే యోచన



సాక్షి, అమరావతి: కూటమి ప్రభుత్వంలో జనసేన పార్టీకి అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ పదవి దక్కే అవకాశం కనిపిస్తోంది. ఇప్పటికే జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్‌కు ఉప ముఖ్యమంత్రి పదవి లభించిన విషయం తెలిసిందే. 21 మంది ఎమ్మెల్యేలున్న నేపథ్యంలో డిప్యూటీ స్పీకర్ పదవి ఇవ్వాలని జనసేన ప్రతిపాదించినట్టు

మిగతా 2వ పేజీలో ▸

అమరావతికి రూ. లక్ష కోట్లు



- పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ
- రెండున్నరేళ్లలో రాజధాని పనులు పూర్తి చేస్తాం
- పాత మాస్టర్ ప్లాన్ ప్రకారం మూడు దశల్లో నిర్మాణం.. రూ.48 వేల కోట్లతో మొదటి దశ పనులు చేపట్టాం
- గతంలోనే రూ.9 వేల కోట్లు చెల్లించాం
- రెండో దశలో గన్నవరం-అమరావతి మెట్రో రైల్

2లో



బంగాళాఖాతంలో

ఆవర్తనం

బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. దీని ప్రభావంతో రానున్న రెండు రోజులు రాష్ట్రంలో విస్తారంగా వానలు కురవనున్నాయి. అనేకచోట్ల తేలికపాటి వర్షాలు, కొన్నిచోట్ల మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం తెలిపింది.

14లో

నెట్‌ఫ్లిక్స్.. డిస్నీ హాట్‌స్టార్.. అమెజాన్ ప్రైమ్.. ఆహా.. జీ5.. జియో.. సోనీలివ్ ఏదైనా కాని ఐదేళ్ల క్రితం వరకు ఈ ఓటీటీ (ఓవర్ ది టాప్) ప్లాట్‌ఫాంల గురించి తెలిసింది కొద్దిమందికే. అన్ని రంగాలనూ కుదేలుచేసిన కరోనా ఓటీటీకి మాత్రం కాసుల వర్షం కురిపించింది. లాక్‌డౌన్‌తో ఇళ్లకే పరిమితమైన జనానికి ఏకైక వినోద సాధనమైంది. సరికొత్త సినిమాలు, వెబ్‌సిరీస్‌లు, సీరియళ్లు, వినూత్న కంటెంట్‌తో ఆకర్షించింది. చౌకైన ప్లాన్లు, ఇంటిల్లపాదీ చూసే వీలుండటంతో అతికొద్ది కాలంలోనే వీటికి జనాదరణ అమాంతం పెరిగింది. భారీ బడ్జెట్ సినిమాలు సైతం నేరుగా ఓటీటీలోకి వస్తున్నాయంటే వీటి క్రేజ్ అర్థం చేసుకోవచ్చు.

ఓటీటీలకు యమ క్రేజ్

సాక్షి, భీమవరం: మానసిక ఒత్తిడి నుంచి ఉపశమనం పొందేందుకు మంచి వినోద సాధనం సినిమా. ఇంటిల్లిపాది అంతా కలిసి థియేటర్‌కు వెళ్లి ఆనందించేవాళ్లు. ఆధునిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని ఐదేళ్ల క్రితం పలు టూరింగ్ టాకీస్‌లు ఏసీ థియేటర్లుగా రూపాంతరం చెందాయి. పశ్చిమగోదావరి జిల్లాలో 45, ఏలూరు జిల్లాలో 31 థియేటర్ల వరకు ఉన్నాయి. పట్టణాల్లో వెండితెర 70 ఎంఎం నుంచి మల్టీప్లెక్స్ స్థాయికి ఎదిగింది. వినోదంతో పాటు షాపింగ్, ఫుడ్ పాయింట్ కేంద్రాలుగా థియేటర్లు మారాయి. కాలక్రమంలో టికెట్, పార్కింగ్, ఇంటర్వెల్ సమయంలో స్నాక్స్, కూల్‌డ్రింక్ ధరలు చూసి కుటుంబ సమేతంగా థియేటర్లకు వెళ్లాలంటేనే బెంబేలెత్తిపోయే పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం భార్యాపిల్లలతో సినిమాకు వెళితే సగటు ప్రేక్షకుడికి రూ.1,200 నుంచి రూ.1,500 వరకు ఖర్చవుతోంది. సినిమా హాళ్లలో ధరల మోతతో ఓటీటీలకు జనాదరణ పెరగడం థియేటర్లకు ఆశనిపాతంలా మారింది.

కరోనాతో పెరిగిన ఆదరణ

ఓటీటీ అంటే కేబుల్ టీవీ, డీటీహెచ్ కనెక్షన్ అవసరం లేకుండా ఇంటర్నెట్ ద్వారా వినోదాన్ని అందించే సాధనం. దీనినే డిజిటల్ స్ట్రీమింగ్ మీడియా సర్వీస్ అని కూడా పిలుస్తారు. ఇందులో సినిమాలతో పాటు వెబ్ సిరీస్, టీవీ కార్యక్రమాలు, సెలెబ్రిటీ తదితర షోలు ప్రసారం చేస్తారు. కరోనా సమయంలో ఓటీటీ క్రేజ్ విపరీతంగా పెరిగిపోయింది. ఆ సమయంలో ఓటీటీ ప్లాట్‌ఫాంలే ప్రజలకు వినోద సాధనంగా మారాయి. ఓటీటీ యాప్‌లు స్మార్ట్ టీవీల్లోనే ఇన్‌స్టాలై ఉండటం, తక్కువ ధరలు, సులభ వాయిదాల్లో ఈ టీవీలు లభ్యమవుతుండటంతో అన్నివర్గాల వారు వీటి కొనుగోలుకు మొగ్గు చూపుతున్నారు. ఇప్పుడు చాలా వరకు ఇళ్లల్లో స్మార్ట్ టీవీలే కనిపిస్తున్నాయి. ఏపీ ఫైబర్, ఇతర ప్రైవేట్ ఆపరేటర్లు తక్కువ ప్లాన్‌లలోనే నెట్ సదుపాయం అందిస్తుండటం ఓటీటీకి వరంలా మారింది.

ప్లాన్లతో ఆకర్షిస్తూ..

ఓటీటీ ప్లాట్‌ఫాంలు క్వార్టర్, హాఫ్ ఇయర్లీ, ఇయర్లీ పేరిట తక్కువ ధరల సబ్‌స్క్రిప్షన్లతో వినియోగదారులను ఆకర్షిస్తున్నాయి. రీచార్జి ప్లాన్‌ను బట్టి టీవీతో పాటు సెల్‌ఫోన్ ఇతర ఐదు వరకు డివైజ్‌లలో ఆయా యాప్‌లను ఏడాది పాటు చూడొచ్చు. ఇంటర్నెట్ ద్వారా



ఓటీటీ పనిచేయడం వలన అంతరాయం లేకుండా ఎప్పుడు కావాలంటే అప్పుడు నచ్చిన కార్యక్రమాలు చూసే వీలుంటుంది. ఎలాంటి ప్రకటనలు లేకుండా సినిమాలు, వెబ్ సిరీస్‌లు చూసే వీలుండటం, కొన్ని ఓటీటీల్లో టీవీ చానెల్స్ ప్రత్యక్ష ప్రసారాలు రావడం వీటికి బాగా కలిసొచ్చింది. సబ్‌స్క్రిప్షన్ ప్లాన్ తీసుకోలేని వారి కోసం ఉచితంగా కొన్ని ఓటీటీలు అందుబాటులో ఉన్నాయి. ఎటువంటి రుసుం లేకుండానే వీటిలో కొత్త సినిమాలు, వెబ్‌సిరీస్‌లు చూడవచ్చు. అయితే వీటిలో వాణిజ్య ప్రకటనలు అధికంగా ఉంటాయి.

నేరుగా ఓటీటీలోనే..

చిన్న హీరోల నుంచి పెద్ద హీరోల వరకు, చిన్న సినిమాల నుంచి భారీ బడ్జెట్ సినిమాల వరకు కొన్ని నేరుగా ఓటీటీల్లోనే విడుదలవుతుండగా మరికొన్ని వారం పదిరోజుల్లో ఓటీటీలోకి వచ్చేస్తున్నాయి. ప్రతి శుక్రవారం కొత్త సినిమాలు, వెబ్‌సిరీస్‌లతో ఓటీటీలు ఆకట్టుకుంటున్నాయి. అలాగే తెలుగు, తమిళం, మలయాళం, హిందీ, ఇంగ్లిష్‌తో పాటు చైనీస్, జపాన్, కొరియన్ సినిమాలు, వెబ్‌సిరీస్‌లు స్థానిక భాషల్లో అలరిస్తున్నాయి.

థియేటర్లు వెలవెల

ఓటీటీలకు ఆదరణ పెరగడంతో సినిమా థియేటర్లకు వచ్చే వారి సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. కొత్త సినిమాలు విడుదలైన సందర్భంలో ఒకటి రెండు రోజుల సందడి మినహా తర్వాత థియేటర్లు ఖాళీ అయిపోతున్నాయి. ఒకసారి కుటుంబంతో థియేటర్‌కు వెళ్లి ఒక సినిమా చూడటానికి అయిన ఖర్చుతో ఒకటి, రెండు ఓటీటీలను ఏడాదంతా చూడవచ్చు. దీంతో నిర్వహణ ఖర్చులు కూడా రావడం లేదని, నష్టాల్లో నడుపుతున్నామని థియేటర్ యజమానులు అంటున్నారు.

లాభాల లిచీ...

ఏజెన్సీలో లిచీ సాగు చేపట్టిన రైతులు మంచి ఆదాయం పొందుతున్నారు. ఈ ప్రాంత వాతావరణం సాగుకు అనుకూలమని గుర్తించిన చింతపల్లిలోని డాక్టర్ వైఎస్సార్ ఉద్యానవన పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు ప్రయోగాత్మకంగా సాగు చేపట్టారు. విజయవంతమవడంతో 2016లో రైతులకు సాగును పరిచయం చేశారు. తోటలు ఏపుగా పెరగడంతో గిరిజన రైతులు నిలకడగా మంచి ఆదాయం పొందుతున్నారు.



చింతపల్లిలోని వైఎస్సార్ ఉద్యానవన పరిశోధన స్థానంలో విరగ్గాసిన లిచీ చెట్టు

- సాగుకు అనుకూలించిన ఏజెన్సీ వాతావరణం
- గుర్తించిన చింతపల్లి ఉద్యానవనం పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు
- మంచి ఆదాయం పొందుతున్న రైతులు
- స్థానికంగా కిలో రూ.100 నుంచి రూ.120కు కొనుగోలు
- పెరగనున్న విస్తీర్ణం

చింతపల్లి రూరల్: ఉత్తర భారతదేశానికి మాత్రమే పరిమితమైన లిచీ పండ్ల రుచులు ఇప్పుడు జిల్లాలోని గూడెంకొత్తవీధి మండలం సిగినపల్లిలో కనిపిస్తున్నాయి. ఇప్పటికే డ్రాగన్‌ఫ్రూట్, అవకాడో, స్ట్రాబెర్రీని గిరిజనులు పండిస్తున్నారు. ఈ కోవలో ఇప్పుడు లిచీ కూడా చేరింది. మంచి ఆదాయం వస్తుండటంతో గిరిరైతులు సాగుపట్ల ఆసక్తి చూపుతున్నారు.

మెండుగా రుచి,పోషకాలు

రుచితోపాటు ఆరోగ్య పోషకాలు అందించే పండ్లలో లిచీ ఒకటి. బిహార్, వెస్ట్ బెంగాల్‌లో అధిక విస్తీర్ణంలో కనిపించే ఈ పండ్లతోటల విస్తీర్ణం ఇక జిల్లాలో పెరగనుంది. ఏజెన్సీలో తేమ, ఎండ, చలి వాతావరణం ఈ సాగుకు అనుకూలం. చింతపల్లిలోని డాక్టర్ వైఎస్సార్ ఉద్యానవన పరిశోధన స్థానంలో శాస్త్రవేత్తలు ప్రయోగాత్మకంగా చేపట్టిన సాగు మంచి దిగుబడి ఇవ్వడంతో 2016లో రైతులకు పరిచయం చేశారు. అప్పటిలో కాఫీ మొక్కలతోపాటు ఒకొక్క రైతుకు 30 లిచీ మొక్కలను మాతోట సంస్థ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. బిహార్ రాష్ట్రంలోని ముజాహార్‌పూర్‌లోని నేషనల్ రిసార్చ్ సెంటర్ నుంచి షాహీ, బేడా, చైనా రకాల మొక్కలను తీసుకువచ్చి నాటారు. ఈ రకాలు మన్యం వాతావరణంలో మంచి దిగుబడి ఇస్తున్నాయని ఉద్యానవన పరిశోధనస్థానం శాస్త్రవేత్త శివకుమార్ తెలిపారు.

మిశ్రమ సాగుగా..

గూడెంకొత్తవీధి మండలం దామనపల్లి పంచాయతీ సిగినపల్లిలో 2016లో సుమారు 40 మంది గిరిజన రైతులు లిచీ మొక్కలను మామిడిలో మిశ్రమ పంటగా నాటారు. ఎకరాకు 60 మొక్కలు అవసరం కాగా వీటిలో 30 మామిడి, మిగతా 30 లిచీ మొక్కలను నాటారు. సాగుపట్ల సరియైన అవగాహన లేకపోవడంతో ఎకరా తోటలో 10 మాత్రమే మిగిలాయి. ఇవి మంచి ఆదాయం ఇస్తున్నాయని రైతులు తెలిపారు. మామిడితో పోలిస్తే లిచీపైనే మంచి ఆదాయం వస్తోందని వారు వివరించారు. 2016లో నాటగా ఐదేళ్ల తరువాత నుంచి పండ్ల దిగుబడి మొదలైందని, సారవంతాన్ని బట్టి ఎకరాకు 50 నుంచి వంద కిలోల వరకు దిగుబడి వస్తోందని రైతులు పేర్కొన్నారు. చెట్టు ఎదిగే కొద్దీ ఏటా దిగుబడి పెరుగుతోందని వారు వివరించారు.

స్థానికంగా మార్కెటింగ్: లిచీ పండ్లకు మార్కెటింగ్ సౌకర్యం అందుబాటులో ఉంది. పట్టణ ప్రాంతాల్లో మంచి డిమాండ్ ఉన్నందున చింతపల్లి ప్రాంతానికి చెందిన వర్తకులు కిలో రూ.100 నుంచి 120కు కొనుగోలు చేస్తున్నారని గిరి రైతులు తెలిపారు. వీటిని చింతపల్లిలో కిలో రూ.150కు విక్రయిస్తున్నారు. నర్సీపట్నం, విశాఖపట్నం తదితర ప్రాంతాల్లో కిలో రూ.200 వరకు ధర ఉంది. ఏటా ఏప్రిల్ నుంచి జూన్ వరకు కాపు ఉంటుంది. అవసరమైన పోషకాలన్నీ పండ్లలో ఉన్నా యి. గుండె, కాలేయం, మెదడు సంబంధిత వ్యాధులు, మధుమేహం, క్యాన్సర్, ఊబకాయంతో బాధపడే వారికి ఆరోగ్యపరంగా ఎంతగానో ఉపయోగపడుతుంది.



సిగినపల్లిలో మామిడితోటలో లిచీ చెట్లు

మామిడి కన్నా మేలు



ఈ ప్రాంతానికి కొత్త పంట కావడంతో ఎకరాలో మామిడితోపాటు 30 లిచీ మొక్కలను నాటాం. అయితే వీటి పెంపకం పట్ల సరియైన అవగాహన లేకపోవడంతో 10 మొక్కలు మాత్రమే మిగిలాయి. మామిడి కన్నా ఆదాయం బాగుంది. ప్రస్తుత సీజన్‌లో వంద కిలోల వరకు విక్రయించగా రూ.10 వేలు వచ్చింది. సాగుపట్ల శాస్త్రవేత్తలు పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తే మంచి ఆదాయం వస్తుంది.

- సాగిన లక్ష్మణరావు, లిచీ రైతు, సిగినపల్లి, గూడెంకొత్తవీధి మండలం


మంచి ఆదాయ వనరు



రానున్న రోజుల్లో లిచీ సాగు గిరిజన రైతులకు ఆదాయ వనరుగా మారనుంది. ఇప్పటికే గూడెంకొత్తవీధి మండలంలో సిగినపల్లి, మాడేం గ్రామాల్లో గిరిజన రైతులు పండిస్తున్నారు. విదేశీ పంటల సాగుకు మన్యం వాతావరణం ఎంతో అనుకూలం. అవకాడో, స్ట్రాబెర్రీ, డ్రాగన్ ఫ్రూట్ మాదిరిగానే ఏజెన్సీ ప్రాంతంలో పండటం గిరిజన రైతుల అదృష్టం. రైతులంతా ఈ సాగు చేపడితే మంచి ఆదా యం పొందవచ్చు.

- డాక్టర్ శివకుమార్, శాస్త్రవేత్త, ఉద్యానవన పరిశోధన స్థానం, చింతపల్లి

సీఎం చంద్రబాబు బక్రీద్ శుభాకాంక్షలు



సాక్షి, అమరావతి: స్వార్థం, అసూయ, రాగద్వేషాలను విడిచిపెట్టి మానవుల్లో త్యాగనిరతిని వ్యాపింపజేయడమే బక్రీద్ పండుగ ముఖ్య ఉద్దేశం అని సీఎం చంద్రబాబు అన్నారు. అన్ని గుణాల కన్నా దానగుణమే ఉత్తమమన్నది బక్రీద్ సారాంశమని, పండుగ సందర్భంగా ఖుర్బానీ ద్వారా పేదలకు ఆహారం వితరణగా ఇస్తారన్నారు. హజ్రత్ ఇబ్రహీం త్యాగ నిరతిని స్మరించుకుంటూ బక్రీద్ పండుగను భక్తి శ్రద్ధలతో జరుపుకొంటున్న ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. బక్రీద్ పండుగను స్ఫూర్తిగా తీసుకుని సమైక్యతను, సమానత్వాన్ని సాధిద్దాం అని సీఎం పిలుపునిచ్చారు.

ముస్లింలకు వైఎస్ జగన్ బక్రీద్ శుభాకాంక్షలు



సాక్షి, అమరావతి: ముస్లిం సోదర, సోదరీమణులకు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. త్యాగనిరతికి, ధర్మబద్ధతకు, దాతృత్వానికి బక్రీద్ ప్రతీకగా నిలుస్తుందన్నారు. దైవ ప్రవక్త ఇబ్రహీం త్యాగాన్ని స్మరించుకుంటూ.. ఈ పండుగ జరుపుకొంటారన్నారు. పేద, ధనిక తారతమ్యాలు లేకుండా, రాగద్వేషాలకు అతీతంగా ముస్లింలందరూ ఈ పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకుంటారని చెప్పారు. అల్లాహ్ ఆశీస్సులు ప్రజలందరికీ ఎల్లప్పుడూ ఉండాలని అభిలషించారు.

పోలా భాస్కర్‌కు అదనపు బాధ్యతలు

సాక్షి, అమరావతి: ఉన్నత విద్యాశాఖ ముఖ్య కార్యదర్శిగా ప్రస్తుత విద్య కమిషనర్ పోలా భాస్కర్‌కు పూర్తి స్థాయి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ సీఎస్ నీరబ్ కుమార్ ప్రసాద్ ఉత్తర్వులిచ్చారు.

రూ.884 కోట్లతో గూడూరు-రేణిగుంట మూడో రైల్వే లైన్

సాక్షి, అమరావతి: గూడూరు-రేణిగుంట మధ్య మూడో రైల్వేలైన్ నిర్మాణానికి రైల్వే శాఖ పచ్చ జెండా ఊపింది. ప్రధానమంత్రి గతిశక్తి జాతీయ మాస్టర్ ప్లాన్‌లో భాగంగా ఈ రైల్వేలైన్‌ను నిర్మించనున్నారు. ఈమేరకు కేంద్ర రైల్వే, జాతీయ రహదారులు, పట్టణాభివృద్ధి శాఖలతో కూడిన కేంద్ర నెట్‌వర్క్ ప్లానింగ్ గ్రూప్ సమావేశంలో నిర్ణయించారు. గూడూరు-రేణిగుంట మధ్య 83.17 కి.మి మేర రూ.884 కోట్లతో మూడో రైల్వే లైన్ నిర్మాణ ప్రాజెక్టును ఆమోదించారు. అధునాతన సిగ్నలింగ్ వ్యవస్థ, ఇతర మౌలిక వసతులతో ఈ రైల్వేలైన్‌ను రెండేళ్లలో నిర్మిస్తారు. 2 రైల్వే వంతెనలు, అండర్‌పాస్‌లు కూడా నిర్మించనున్నారు. ఈ ప్రాజెక్ట్ కోసం 36.58 హెక్టార్ల భూమి సేకరించాల్సి ఉంటుందని అంచనా. దీంతో గూడూరు-రేణిగుంట మార్గంలో సరుకు రవాణా మరింత ఊపందుకోనుంది.

జనసేనకు డిప్యూటీ స్పీకర్?

▶ మొదటి పేజీ తరువాయి

తెలుస్తోంది. దీనికి చంద్రబాబు అంగీకరించినట్టు టీడీపీ వర్గాలు చెబుతున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జనసేనకు మూడో వంతు పదవులు వస్తాయని పవన్‌కళ్యాణ్ చెప్పేవారు. ఈ నేపథ్యంలో డిప్యూటీ స్పీకర్ పదవి లభించే అవకాశం ఉందని సమాచారం. ఈ పదవికి జనసేన పార్టీ నుంచి అవనిగడ్డ, తాడేపల్లిగూడెం ఎమ్మెల్యేలు మండలి బుద్ధప్రసాద్, బొలిశెట్టి శ్రీనివాస్ పేర్లు వినిపిస్తున్నాయి. బుద్ధప్రసాద్ ఎన్నికలకు ముందు టీడీపీ నుంచి జనసేనలో చేరారు. బొలిశెట్టి తొలినుంచీ జనసేనలోనే ఉన్నారు. నిజంగా అవకాశం వస్తే వీరిద్దరిలో ఒకరు ఆ పదవిలో కూర్చోవడం ఖాయమని చెబుతున్నారు. మరోవైపు స్పీకర్ పదవికి టీడీపీ సీనియర్ నేత చింతకాయల అయ్యన్నపాత్రుడి పేరును పరిశీలిస్తున్నారు. ఈ నెల 19వ తేదీ నుంచి శాసనసభ సమావేశాలు నిర్వహించాలని ప్రభుత్వం యోచిస్తున్నట్టు తెలుస్తోంది. రెండు రోజులపాటు సమావేశాలు నిర్వహించే అవకాశం ఉంది. తొలిరోజు ప్రొటెం స్పీకర్‌తో ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారం, రెండో రోజు స్పీకర్, డిప్యూటీ స్పీకర్ ఎన్నిక నిర్వహిస్తారని సమాచారం.



దాని విలువేనం దిగజార్చలేదు సార్! 30 లక్షలు పెట్టి పెంచాం!!

ఈవీఎంల గుట్టు విప్పేదెవరు?

ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్న ఈవీఎంల అక్రమాలు

సాక్షి, అమరావతి: ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్ల (ఈవీఎంలు) పనితీరుపై ముసురుకుంటున్న అనుమానాలతో ప్రస్తుతం దేశవ్యాప్తంగానే కాకుండా అంతర్జాతీయంగా పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. ఈవీఎంల హ్యాకింగ్ అసాధ్యమేమీ కాదని, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పరిజ్ఞానం సాయంతో వాటిని సులభంగా హ్యాక్ చేయవచ్చని టెక్ దిగ్గజం, టెస్లా కంపెనీ అధినేత ఎలాన్ మస్క్ తాజాగా ట్వీట్ చేయడం తీవ్ర కలకలం రేపుతోంది. ఈవీఎంలను మనుషులు కూడా హ్యాక్ చేసేందుకు ఆస్కారం ఉందని, అసలు వీటిని రద్దు చేయాలని చాట్ జీపీటీ నిపుణుడైన ఆయన గట్టిగా డిమాండ్ చేయడం గమనార్హం. మరోవైపు ముంబైలో గెలుపొందిన శివసేన (షిండే) అభ్యర్థి రవీంద్ర వైకర్ బంధువు ఒకరు మొబైల్ ద్వారా ఈవీఎంను హ్యాక్ చేసి ఆపరేట్ చేసినట్లు వెలుగులోకి రావడం ఎన్నికల నిర్వహణ ప్రక్రియను ప్రశ్నార్థకంగా మారుస్తోంది. కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్‌గాంధీ సైతం ఈవీఎంల పనితీరుపై పలు అనుమానాలు వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థల్లో పారదర్శకత లేకుంటే భవిష్యత్తు లేదని హెచ్చరించారు. సార్వత్రిక ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్‌లో ఓటింగ్ సరళిపై ఇప్పటికే పలువురు నిపుణులు, పరిశీలకులు అనుమానాలు వ్యక్తం చేస్తుండగా తమ ఓట్లన్నీ ఏమయ్యాయంటూ గ్రామాలకు గ్రామాలే నిలదీస్తుండటం గమనార్హం. గెలుపొందిన అభ్యర్థులు సైతం ఊహించని స్థాయిలో మెజారిటీలు రావటంపై నీలి నీడలు అలుముకుంటున్నాయి. 2024 సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడిన నాటి నుంచి ఈవీఎంల పనితీరుపై సర్వత్రా సందేహాలు తలెత్తుతున్నా... తాము వేసిన ఓట్లు ఏమయ్యాయని ఓటర్లు ప్రశ్నిస్తున్నా.. 20 లక్షల ఈవీఎంలు ఏమయ్యాయని యావత్ దేశం నిలదీస్తున్నా... ఇవిగో ఈవీఎం మోసాలంటూ ఆధారాలు చూపిస్తున్నా... కేంద్ర ఎన్నికల సంఘం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండటం మరింత ఆందోళన రేకెత్తిస్తోంది. 'తాంబూలాలు ఇచ్చేశాం ... ఇక తన్నుకు చావండి' అనే రీతిలో ఎన్నికల ప్రక్రియ ముగిశాక తమకు సంబంధం లేదనే రీతిలో బాధ్యతల నుంచి ఈసీ పలాయనం చిత్తగించడం ఈ సందేహాలకు మరింత బలం చేకూరుస్తోంది. ఈవీఎంల ద్వారా ఎన్నికలు నిర్వహించిన అనంతరం అందులో లొసుగులు గుర్తించడంతో వాటిని నిషేధించిన దేశాల సంఖ్య పెరుగుతోంది. సాంకేతికంగా ఎంతో అభివృద్ధి చెందిన దేశాలు సైతం ఇప్పటికీ బ్యాలెట్ పేపర్ విధానాన్నే అనుసరిస్తున్న నేపథ్యంలో మన దేశంలో ఈవీఎంలతో ఎన్నికల నిర్వహణ సరికాదని సాధారణ ఓటర్లతోపాటు నిపుణులు ఏకాభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. బహిరంగంగా పరీక్షిస్తే కానీ ఈ రహస్యం వీడదని టెక్ నిపుణులు వ్యాఖ్యానిస్తున్నారు.

చిప్‌లోనే చిదంబర రహస్యం..!

ఈవీఎంలలో ఉపయోగిస్తున్న చిప్‌లపై పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ పరిజ్ఞానంపై కేంద్ర ఎన్నికల కమిషన్ (ఈసీ) సూటిగా సమాధానం చెప్పకపోవడం సందేహాలకు బలం చేకూరుస్తోంది. ఈవీఎంలను హ్యాక్ చేయవచ్చని పలువురు సవాళ్లు విసురుతున్నా ఈసీ ఏమాత్రం పట్టించుకోవట్లేదు. దీనిపై కొందరు న్యాయస్థానాన్ని ఆశ్రయించగా ఈసీ చేసిన ప్రకటన మరిన్ని సందేహాలకు తావిచ్చింది. ఈవీఎంలలో బ్లూటూత్ టెక్నాలజీ లాంటిది ఉండదు కాబట్టి హ్యాక్ చేయడం సాధ్యం కాదని ఈసీ ఇటీవల వరకు వాదిస్తూ వచ్చింది. అయితే ఈవీఎంలలో ప్రోగ్రామబుల్ చిప్‌లు ఉపయోగిస్తున్నామని, ఫ్లాష్ మెమరీ వాడకం కూడా ఉంటుందని ఈసీ ఇటీవల తొలిసారిగా అంగీకరించింది. ప్రోగ్రామబుల్ చిప్‌లు, ఫ్లాష్ మెమరీని హ్యాక్ చేయవచ్చని నిపుణులు చెబుతున్నారు. మరి ఈవీఎంలు భద్రమేనా? అంటే ఈసీ సూటిగా సమాధానం చెప్పడం లేదు.



ఈవీఎంలను నిషేధించాలి: ప్యూర్టోరికోలో ఎన్నికల అక్రమాలపై ఎక్స్‌లో ఎలాన్ మస్క్

ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు నిర్వహించాలంటే ఈవీఎంలను నిషేధించాలి. ఈవీఎంల ద్వారా ఎన్నికల నిర్వహణ సరికాదు. వాటిని సులభంగా హ్యాక్ చేయవచ్చు. ఈ భూమ్మీద హ్యాక్ చేయలేనిది ఏదీ లేదు.

ఈవీఎంలు బ్లాక్ బాక్స్‌లు: ఎక్స్‌లో రాహుల్‌గాంధీ

ఈవీఎంలు బ్లాక్ బాక్సులు లాంటివి. వాటిని పరిశీలించేందుకు ఎవరికీ అనుమతి ఇవ్వరు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత లేకపోవడం తీవ్ర ఆందోళనకరం.

భద్రతా సందేహాస్పదమే

ఈవీఎంల భద్రత, నిర్వహణపైనా నీలి నీడలు అలుముకుంటున్నాయి. నిపుణులు వ్యక్తం చేస్తున్న సందేహాలకు ఈసీ సూటిగా సమాధానాలు చెప్పడం లేదు. ఈవీఎంల నిర్వహణ విషయంలో ఎన్నో భద్రత లోపాలు, ఇతర లొసుగులు ఉన్నట్లు ఇప్పటికే చాలా సందర్భాల్లో రుజువైంది. 2017 డిసెంబరు నాటికే ఈవీఎంల చోరీ, ధ్వంసం ఉదంతాలు దాదాపు 70 వరకూ చోటు చేసుకున్నట్లు 'ద వైర్' ప్రచురించిన కథనం స్పష్టం చేసింది. ఉత్తరాఖండ్‌కు చెందిన మాజీ మంత్రి సమాచార హక్కు చట్టం కింద అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ ఈసీ ఈ విషయాన్ని వెల్లడించింది. ఈవీఎంలను తయారు చేసే ఎలక్ట్రానిక్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ ప్రకటన ప్రకారం.. ఈసీఐ కోరిన దాని కంటే 1,97,368 ఈవీఎంలు, 3,55,747 కంట్రోల్ యూనిట్లు ఎక్కువగా తయారయ్యాయి. 2024 ఎన్నికల సందర్భంగా కొన్ని ఉత్తరాది రాష్ట్రాల్లో ఈవీఎంలు ప్రైవేట్ వ్యక్తుల వద్ద లభించాయి. ఇక చోరీకి గురైన ఈవీఎంలపై ఈసీ స్పందన విడ్డూరంగా ఉంది. ప్రతి ఈవీఎంకు ప్రత్యేకమైన ఐడీ ఉంటుందని, యంత్రం చోరీకి గురైనా, కనిపించకుండా పోయినా ఆ ఐడీని బ్లాక్‌లిస్ట్‌లో పెడతామని పేర్కొంది. తద్వారా ఆ ఈవీఎంలలో నమోదైన ఓట్లు పోలైన ఓట్లలో కలవకుండా జాగ్రత్త పడుతున్నట్లు తెలిపింది. మరి చోరీకి గురైన యంత్రాల్లో పరికరాలను మార్చినా, ఓటింగ్ నమోదు చేసేందుకు వాడిన సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేసి ఇతర ఈవీఎంలతో కలిపేస్తే ఏమవుతుంది? అనే ప్రశ్నలకు ఈసీ మౌనం దాల్చడం గమనార్హం. ఈవీఎంలను భద్రపరుస్తున్న ప్రదేశాలు సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఉన్నాయా? సీసీ కెమెరాలు ఉంటే వాటి ఫుటేజీని అందరికీ ఎందుకు అందుబాటులోకి ఉంచడం లేదు? అందులో ఇబ్బంది ఏమిటి? అని నిపుణులు ప్రశ్నిస్తున్నారు. పోలింగ్ ముగిసిన తరువాత ఓట్ల లెక్కింపు వరకు స్ట్రాంగ్ రూమ్‌లలో ఈవీఎంల భద్రత వ్యవస్థ ఎంతవరకు పటిష్టం? అనే సందేహాలున్నాయి. స్ట్రాంగ్ రూమ్‌ల సీసీ కెమెరాల ఫుటేజీలను అన్ని పార్టీలకూ అందుబాటులో ఉంచితే పారదర్శకంగా ఉంటుంది. ఈ డిమాండ్‌పై ఈసీ కనీసం స్పందించలేదు. ఒకవైపు ఈవీఎంలను హ్యాక్ చేయడం సాధ్యమేనని నిపుణులు బల్లగుద్ది చెబుతుండగా సందేహాలను నివృత్తి చేయాల్సిన ఈసీ దాగుడుమూతలు ఆడటం అనుమానాలను బలపరుస్తోంది.

20 లక్షల ఈవీఎంలు ఏమయ్యాయి?

దేశంలో ఏకంగా 20 లక్షల ఈవీఎంలు కనిపించకపోడం మొత్తం ఎన్నికల ప్రక్రియపైనే ప్రశ్నార్థకంగా మారేసింది. ఎన్నికల నిర్వహణ కోసం 60 లక్షల ఈవీఎంలను దిగుమతి చేసుకోగా వాటిలో 40 లక్షల ఈవీఎంలను ఎన్నికల ప్రక్రియకు కేటాయించినట్టు ఈసీ వెల్లడించింది. మరి మిగిలిన 20 లక్షల ఈవీఎంలు ఎక్కడున్నాయనే ప్రశ్నకు ఇటు ఈసీగానీ అటు కేంద్ర ప్రభుత్వంగానీ జవాబు చెప్పడం లేదు. ఆ 20 లక్షల ఈవీఎంలు ఏమయ్యాయో చెప్పాలని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ గట్టిగా డిమాండ్ చేశారు. దేశంలో ఎంపిక చేసిన రాష్ట్రాలు, నియోజకవర్గాల్లో గుట్టు చప్పుడు కాకుండా ఈవీఎంలను మార్చి అక్రమాలకు పాల్పడినట్లు కమ్యూనిస్టు పార్టీలు ఆరోపిస్తున్నాయి. అందుకు తగ్గట్టుగానే ఆంధ్రప్రదేశ్, ఒడిశాలో ఎన్నికల ఫలితాలపై దేశవ్యాప్తంగా విభ్రాంతి వ్యక్తమవుతోంది. వైఎస్సార్ సీపీ, బిజూ జనతాదళ్ పార్టీలు తమకు అత్యంత బలమైన స్థానాల్లో కూడా ఓడిపోవడం విస్మయపరుస్తోంది. రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీకి ఏమాత్రం బలం లేని నియోజకవర్గాల్లో సైతం ఆ పార్టీల అభ్యర్థులకు అనూహ్య మెజార్టీలు వచ్చాయి. ఇక ఒడిశాలో బీజేపీ ఉనికి అంతంత మాత్రంగా ఉన్న నియోజకవర్గాల్లో కూడా ఆ పార్టీ అభ్యర్థులు విజయం సాధించడం గమనార్హం. బీజేపీతో పొత్తు కోసం చంద్రబాబు పడ్డ పాట్లన్నీ ఆరోపణలకు బలం చేకూరుస్తున్నాయి.

బస్సులు, ప్రైవేట్ వాహనాల్లో..

కర్ణాటకలో ఓ బీజేపీ ఎంపీ అభ్యర్థి వాహనంలో ఈవీఎంలు తరలిస్తున్న విషయం ఎన్నికల ముందే బయటపడింది. పిఠాపురం నియోజకవర్గంలో ఈవీఎంలను బస్సులో తరలించారు. ఓ ప్రైవేట్ వాహనంలో సైతం ఈవీఎంలు తరలించినట్లు బయటపడ్డా ఈసీ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. దేశవ్యాప్తంగా పలుచోట్ల ఇదే రీతిలో ఈవీఎంలను ప్రైవేట్ వ్యక్తుల పర్యవేక్షణలో తరలించినట్లు తెలుస్తోంది. అవన్నీ కనిపించకుండాపోయిన 20 లక్షల ఈవీఎంలలోనివేనని పరిశీలకులు స్పష్టం చేస్తున్నారు. అదృశ్యమైన 20 లక్షల ఈవీఎంలు ఎక్కడున్నాయో వెల్లడించాలని వామపక్షాలతోపాటు ఇతర పార్టీలు, స్వచ్ఛంద సంస్థలు డిమాండ్ చేస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన 40 లక్షల ఈవీఎంతోనే ఎన్నికలు నిర్వహించామని, మిగిలిన 20 లక్షల ఈవీఎంల సంగతి తమకు తెలియదంటూ ఈసీ దాటవేత వైఖరి అనుసరిస్తోంది. ఈసీ, కేంద్ర ప్రభుత్వం కుమ్మక్కై ఈ అంశాన్ని కప్పిపుచ్చేందుకు యత్నిస్తున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

నిషేధిస్తూ విధాన నిర్ణయాలు

ప్రపంచంలో మెజార్టీ దేశాలు ఈవీఎంల ద్వారా ఎన్నికల నిర్వహణకు వ్యతిరేకంగా విధాన నిర్ణయం తీసుకున్నాయి. భారత్‌తో పాటు బ్రెజిల్, వెనిజులా తదితర దేశాల్లో మాత్రమే ఈవీఎంల ద్వారా ఎన్నికలు నిర్వహిస్తున్నారు. అత్యధిక దేశాల్లో ఈవీఎంలను పూర్తిగా నిషేధించగా మరికొన్ని దేశాల్లో ఇతర పద్ధతులను జోడించి ఓటింగ్ ప్రక్రియ నిర్వహిస్తున్నారు.

దేశం	నిషేధానికి కారణం
ఫిన్లాండ్	అవిశ్వాసం
ఫ్రాన్స్	భద్రతపై ఆందోళన
జర్మనీ	భద్రతపై ఆందోళన
నెదర్లాండ్స్	భద్రతపై ఆందోళన
ఐర్లాండ్	భద్రతపై ఆందోళన
జపాన్	ఆర్థిక, లాజిస్టికల్ భారం
కజకిస్తాన్	అవిశ్వాసం
నేపాల్	ఆర్థిక, లాజిస్టికల్ భారం
నార్వే	భద్రతపై ఆందోళన
పరాగ్వే	అవిశ్వాసం

మొబైల్‌తో ఈవీఎం హ్యాకింగ్

ఈవీఎంలు ఎంత లోపభూయిష్టమో... వాటిని ఎంత సులువుగా హ్యాక్ చేయవచ్చో బహిర్గతమైంది. ముంబై నుంచి వెలువడే ప్రముఖ దినపత్రిక 'మిడ్ డే' కథనం ప్రకారం.. మహారాష్ట్రలోని వాయువ్య ముంబై నియోజకవర్గం నుంచి ఎంపీగా కేవలం 48 ఓట్లతో విజయం సాధించిన శివసేన (ఏక్‌నాథ్ షిండే) అభ్యర్థి రవీంద్ర వైకర్ సమీప బంధువు మంగేశ్ పండిల్కర్ తన మొబైల్ ఫోన్ ద్వారా ఈవీఎంను అన్‌లాక్ చేశారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియను ఈ నెల 4న ముంబైలోని నెస్కో సెంటర్‌లో నిర్వహించారు. ఎంపీ బంధువు మంగేశ్ పండిల్కర్ ఈ సందర్భంగా తన మొబైల్ ఫోన్ ద్వారా ఈవీఎంను అన్‌లాక్ చేశారు. ఓటీపీ జనరేట్ చేయడం ద్వారా ఈవీఎంను అన్‌లాక్ చేయడం గమనార్హం. మొదట్లో శివసేన(ఉద్ధవ్ ఠాక్రే) అభ్యర్థి అమోల్ సంజన కీర్తికర్ కంటే వెనుకబడిన రవీంద్ర వైకర్ అనూహ్యంగా కేవలం 48 ఓట్లతో విజయం సాధించడం గమనార్హం. నిబంధనలకు విరుద్ధంగా కౌంటింగ్ కేంద్రంలోకి మొబైల్ ఫోన్ తీసుకువెళ్లడం, అదే ఫోన్ ద్వారా శివసేన (ఏక్‌నాథ్ షిండే) అభ్యర్థి పలువురితో మంతనాలు జరపడంపై ముంబై పోలీసులు ఈ నెల 14న కేసు నమోదు చేసి నిందితులకు నోటీసులు జారీ చేశారు. మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకుని ఫోరెన్సిక్ పరీక్షకు పంపారు. అయితే మొబైల్ ద్వారా ఈవీఎంను హ్యాక్ చేశారన్న మిడ్ డే పత్రిక కథనాన్ని ఎన్నికల కమిషన్ ఖండించింది.

అమరావతికి రూ.లక్ష కోట్లు

- మూడు వారాల్లో వంద అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ
- పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ



సాక్షి, అమరావతి: రాజధాని అమరావతి అభివృద్ధి పనులను రెండున్నరేళ్లలో పూర్తి చేస్తామని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. పాత మాస్టర్ ప్లాన్ ప్రకారమే రాజధానిలో నిర్మాణాలు చేపడతామన్నారు. మూడు దశల్లో రాజధాని పనులు పూర్తి చేసేందుకు రూ.లక్ష కోట్లు ఖర్చవుతుందని అంచనా వేసినట్లు మంత్రి వెల్లడించారు. ఆదివారం ఉదయం వెలగపూడిలోని సచివాలయం రెండో బ్లాక్‌లో మంత్రిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రపంచంలో ఐదు అత్యుత్తమ రాజధానుల్లో ఒకటిగా తీర్చిదిద్దే లక్ష్యంతో అమరావతి నిర్మాణాన్ని చేపట్టినట్లు చెప్పారు. అత్యుత్తమ డిజైన్ రూపొందించి సింగపూర్, చైనా, జపాన్, రష్యా, మలేసియా తదితర దేశాలను సందర్శించామన్నారు. అమరావతి నిర్మాణాన్ని మూడు దశల్లో పూర్తి చేయాలని నిర్ణయించామని, తొలిదశలో భాగంగా రూ.48 వేల కోట్లతో మంత్రులు, కార్యదర్శులు, అధికారులు, ఉద్యోగులకు నివాస భవనాల నిర్మాణం, మౌలిక వసతుల కల్పన పనులు చేపట్టామన్నారు. తొలిదశ పనులకు గతంలోనే టెండర్లు పిలిచి దాదాపు రూ.9 వేల కోట్ల చెల్లింపులు కూడా చేసినట్లు తెలిపారు. ఈ నిర్మాణాలు దాదాపు 90 శాతం పూర్తైనట్లు పేర్కొన్నారు. తొలి దశలో సిటీ నిర్మాణం పూర్తి చేసి రెండో దశలో మెట్రో రైల్ నిర్మాణ పనులు చేపడతామని ప్రకటించారు. రాజధాని విషయంలో గతంలో రూపొందించిన మాస్టర్ ప్లాన్‌నే ఇప్పుడూ అమలు చేస్తామని, అయితే అంచనా వ్యయాన్ని ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా పరిశీలించాల్సి ఉందన్నారు.

217 చ.కి.మీ మేర అమరావతి నిర్మాణం

రాజధానిలో ల్యాండ్ పూలింగ్ కోసం 2015 జనవరి 1న నోటిఫికేషన్ ఇవ్వగా అదే ఏడాది ఫిబ్రవరి 28 నాటికి ఎలాంటి వివాదాలు లేకుండా 34 వేల ఎకరాలను రైతులు ప్రభుత్వానికి ఇచ్చారని మంత్రి నారాయణ తెలిపారు. రాజధాని అభివృద్ధి విషయంలో గత ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరించిందన్నారు. మొత్తం 217 చ.కి.మీ విస్తీర్ణంలో అమరావతి నిర్మాణాన్ని చేపడతామని, సుమారు 3,600 కి.మీ మేర రోడ్లు నిర్మిస్తామని వివరించారు. రూ.48 వేల కోట్లతో చేపట్టిన ఈ తొలిదశ పనులు పూర్తవగానే రెండో దశలో గన్నవరం విమానాశ్రయాన్ని అమరావతితో కలుపుతూ మెట్రో రైలు ప్రాజెక్టును చేపట్టనున్నట్టు వెల్లడించారు. ఈ ఖర్చు గత మాస్టర్ ప్లాన్ ప్రకారం అంచనా వేశామని, మరోసారి టెండర్లు పిలిచి సవరించే అవకాశం ఉందన్నారు. అధికారులతో సమీక్షించి 15 రోజుల్లో దీనిపై పూర్తి సమాచారాన్ని ప్రజలకు తెలియ చేస్తామన్నారు. మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన నారాయణకు పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వై.శ్రీలక్ష్మి, సీడీఎంఏ శ్రీధర్, సీఆర్డీఏ కమిషనర్ వివేక్ యాదవ్, అదనపు కమిషనర్ కట్టా సింహాచలం, విజయవాడ మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్, సీఆర్డీఏ చీఫ్ ఇంజనీర్లు ఎన్వీఆర్కే ప్రసాద్, సీహెచ్ ధనుంజయ్ తదితరులు శుభాకాంక్షలు తెలియచేశారు.

అన్న క్యాంటీన్ల పునరుద్ధరణపై అంచనాలకు ఆదేశం

అన్న క్యాంటీన్లను మూడు వారాల్లోగా వంద చోట్ల పునరుద్ధరిస్తామని మంత్రి నారాయణ తెలిపారు. సీఎం చంద్రబాబు తొలి ఐదు సంతకాల్లో అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ కూడా ఉందన్నారు. గతంలో తమ ప్రభుత్వ హయాంలో 203 క్యాంటీన్ల ఏర్పాటుకు ప్రణాళిక రూపొందించగా 184 చోట్ల ప్రారంభించినట్లు చెప్పారు. వాటిని తిరిగి వినియోగంలోకి తెచ్చేందుకు రెండు మూడు రోజుల్లో అంచనాలు అందజేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు.

రేపు 'పీఎం కిసాన్' తొలి విడత

సాక్షి, అమరావతి: రైతన్నలకు ప్రధానమంత్రి కిసాన్ 17వ విడత సాయం పంపిణీకి కేంద్ర ప్రభుత్వం సిద్ధమైంది. ఈ పథకం కింద ఏటా మూడు విడతల్లో మొత్తం రూ.6 వేలు జమ చేస్తోంది. 2024-25 వ్యవసాయ సీజన్‌లో తొలి విడత పీఎం కిసాన్ సాయం కింద ఈ నెల 18వ తేదీన ఖాతాల్లోకి జమ చేయనుంది. మూడోసారి పగ్గాలు చేపట్టిన ప్రధాని మోదీ ప్రమాణ స్వీకారం చేసిన రోజే పీఎం కిసాన్ పెట్టుబడి సాయంపై తొలి సంతకం చేసి రైతుల పట్ల చిత్తశుద్ధి చాటుకున్నారు.

అన్నదాతలకు అండగా..

2018-19 నుంచి కేంద్రం పీఎం కిసాన్ పథకం ద్వారా పెట్టుబడి సాయాన్ని అందిస్తోంది. తొలి విడత సాయం మే-జూన్‌లో, రెండో విడత అక్టోబర్- నవంబర్‌లో, మూడో విడత జనవరి-ఫిబ్రవరిలో జమ చేస్తూ వస్తోంది. ఇప్పటివరకు 16 విడతల్లో దేశ వ్యాప్తంగా రూ.3.04 లక్షల కోట్లు జమ చేసిన కేంద్రం రాష్ట్రంలో అర్హులైన రైతులకు పీఎం కిసాన్ పథకం కింద రూ.14,717 కోట్లు అందచేసింది. 2024-25 సీజన్‌లో ఏపీలో 43.52 లక్షల మంది రైతుల ఖాతాల్లో సుమారు రూ.870 కోట్లు జమ చేయనుంది. ఇప్పటికే ఈ నిధులను కేంద్రం విడుదల చేసింది. యూపీ పర్యటనలో భాగంగా మంగళవారం పీఎం కిసాన్ 17వ విడత డబ్బులను ప్రధాని మోదీ నేరుగా బటన్ నొక్కి రైతుల ఖాతాలకు జమ చేయనున్నారు.

ఐదేళ్లూ ఠంచన్‌గా ఇచ్చిన వైఎస్ జగన్

పీఎం కిసాన్‌తో పాటే గత ఐదేళ్లూ ఖరీఫ్ సీజన్ ప్రారంభంలోనే రైతన్నలకు తొలి విడత పెట్టుబడి సాయాన్ని అందజేసి వైఎస్ జగన్ ప్రభుత్వం అండగా నిలిచింది. ఐదేళ్లలో 53.58 లక్షల మందికి రూ.34,288 కోట్లు పెట్టుబడి సాయంగా అందించి తోడుగా నిలిచింది. తాము అధికారంలోకి వస్తే రైతులకు రూ.20 వేలు పెట్టుబడి సాయం అందిస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో చంద్రబాబు హామీ ఇచ్చారు. నూతన ముఖ్యమంత్రి పగ్గాలు చేపట్టి వారం రోజులు గడుస్తోంది. మరోవైపు రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో ఖరీఫ్ సీజన్ ఊపందుకుంటోంది. ఈ సమయంలో అందించాల్సిన పెట్టుబడి సాయంపై ప్రభుత్వ పెద్దలు స్పందించకపోవడం పట్ల రైతన్నలు నిరాశ వ్యక్తం చేస్తున్నారు.

నేడు పోలవరానికి సీఎం చంద్రబాబు

క్షేత్రస్థాయిలో ప్రాజెక్టు పనుల పరిశీలన

సాక్షి, అమరావతి/ఏలూరు(మెట్రో)/పోలవరం రూరల్: పోలవరం ప్రాజెక్టు పనులను సోమవారం క్షేత్రస్థాయిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పరిశీలించనున్నారు. ఉండవల్లి నుంచి పోలవరం ప్రాజెక్టు వద్దకు హెలికాప్టర్‌లో సోమవారం ఉదయం 10 గంటలకు చంద్రబాబు చేరుకోనున్నారు. స్పిల్ వే, గైడ్ బండ్, ఎగువ కాఫర్ డ్యామ్, దిగువ కాఫర్ డ్యామ్, ఈసీఆర్ఎఫ్ డ్యామ్ గ్యాప్-1, గ్యాప్-2, గ్యాప్-3లతో పాటు జల విద్యుత్ కేంద్రం పనులను పరిశీలించనున్నారు. ఆ తర్వాత జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఆ శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్, పీపీఏ(పోలవరం ప్రాజెక్టు అథారిటీ) సీఈవో అతుల్ జైన్, జలవనరులు, జెన్‌కో అధికారులతో సమీక్ష నిర్వహిస్తారు. అనంతరం సాయంత్రం 5 గంటలకు పోలవరం నుంచి బయలుదేరి ఉండవల్లిలోని నివాసానికి చేరుకుంటారు.

ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి నిమ్మల

సీఎం చంద్రబాబు పర్యటనకు సంబంధించి ఏర్పాట్లను రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆదివారం ప్రాజెక్టు ప్రాంతంలో పరిశీలించి అధికారులతో సమీక్షించారు. పటిష్ట ఏర్పాట్లు చేయాలని, ప్రాజెక్టు ప్రాంతంలో ప్రతి పనినీ సీఎం పరిశీలిస్తారని చెప్పారు. జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి, ఎస్పీ డి.మేరీ ప్రశాంతిలకు తగు ఆదేశాలిచ్చారు.

రుషికొండలో ఉన్నవి ప్రభుత్వ భవనాలే

స్పష్టం చేసిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ

సాక్షి, అమరావతి: రుషికొండలో ఉన్నవి ప్రభుత్వ భవనాలేనని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పేర్కొంది. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ ఆదివారం సామాజిక మాధ్యమం ఎక్స్‌లో తెలిపింది. 'ప్రభుత్వానికి సంబంధించిన ఆస్తులు అవి. అవేమీ ప్రైవేటు ఆస్తులు కావు. అవి ఎవరి సొంతం కూడా కాదు. విశాఖపట్నానికి గత ప్రభుత్వం ఇచ్చిన ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని ఈ భవనాలను నిర్మించారు. వాటిని ఎలా వినియోగించుకోవాలన్నది ప్రభుత్వం ఇష్టం. అలాంటి ప్రభుత్వ భవనాల్లోకి వెళ్లి ఫొటోలు తీయించి, వాటికి వక్రీకరణలకు జోడించి బురదజల్లాలని ప్రయత్నించడం వెనుక ఉద్దేశాలేంటో ప్రజలు గమనిస్తున్నారు. 1995 నుంచి కూడా విశాఖపట్నం ఆర్థిక రాజధాని అని చంద్రబాబు ఊదరగొడుతూనే ఉన్నారు. ఇప్పటికి నాలుగుసార్లు ముఖ్యమంత్రి అయ్యారు. విశాఖ నగరానికి ఒక ప్రధానమంత్రి వచ్చినా, ఒక రాష్ట్రపతి వచ్చినా, ముఖ్యమంత్రి వెళ్లినా, గవర్నర్‌లాంటి వ్యక్తులు వెళ్లినా వారికి ఆతిథ్యం ఇవ్వడానికి సరైన భవనమే లేదన్న విషయాన్ని గుర్తించండి. రుషికొండ రిసార్ట్ భవనాల్లోకి వెళ్లి ఫొటోలు తీసి, పైత్యం ప్రదర్శించడంవల్ల మీకు మానసిక తృప్తి కలుగుతుందేమోగాని, విశాఖపట్నం ప్రజలకు మేలు జరగదు' అని పేర్కొంది.

చీటికి మాటికి దుష్ప్రచారం తగదు: ఎమ్మెల్సీ వరుదు కల్యాణి

రుషికొండలో ఉన్నవి ప్రభుత్వ భవనాలేనని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ వరుదు కల్యాణి పేర్కొన్నారు. ఇలా ప్రతి ఒక్కరూ అక్కడికి వెళ్లి చీటికిమాటికి తమ పార్టీపై దుష్ప్రచారం చేయటం తగదన్నారు. ఆమె ఆదివారం సాక్షితో మాట్లాడుతూ అవేమీ ప్రైవేటు ఆస్తులు కావని తమ ప్రభుత్వం అధికారంలో ఉండగానే స్పష్టం చేసిందని గుర్తుచేశారు. 'ప్రజలు విజ్ఞులు. అన్నీ గమనిస్తూ ఉంటారు. టీడీపీ ఎమ్మెల్యేలు చెప్పినంత మాత్రాన ప్రజలు నమ్మే ప్రసక్తేలేదు. అధికారం ఇచ్చింది ప్రజలకు సేవచేయమని. కల్పితకథలు సృష్టించి వైఎస్సార్‌సీపీపై నిందలు వేయమని కాదు..' అని చెప్పారు. ఉద్దేశపూర్వకంగా వ్యవహరిస్తే టీడీపీ వారికే నష్టం అని ఆమె పేర్కొన్నారు.

అనంతపురం మేయర్‌కు అరుదైన గౌరవం

రష్యాలో ఈ నెల 21న జరిగే బ్రిక్స్ దేశాల మేయర్ల సదస్సుకు ఆహ్వానం



అనంతపురం కార్పొరేషన్: అనంతపురం నగరపాలక సంస్థ మేయర్ మహమ్మద్ వసీం సలీంకు అరుదైన గౌరవం దక్కింది. ఈ నెల 21న రష్యాలోని కజాన్ నగరంలో బ్రిక్స్ దేశాల అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగే మేయర్ల సదస్సుకు ఆహ్వానం అందింది. ఈ సదస్సులో వివిధ దేశాల నుంచి 50 మందికి పైగా మేయర్లు పాల్గొననున్నారు. భారత్ నుంచి ఐదుగురు మేయర్లకు ఆహ్వానం అందగా..అందులో అనంతపురం మేయర్ ఒకరు. మిగిలిన వారిలో జైపూర్, క్యాలికట్, త్రిసూర్, నాగర్ కోయిల్ మేయర్లు ఉన్నారు.

అనంతపురం మేయర్‌కే ఎందుకంటే..

అనంతపురానికి, రష్యాకు చారిత్రక సంబంధం ఉంది. 550 ఏళ్ల కిందట రష్యన్ యాత్రికుడు అఫానసీ నికితిన్ విజయనగర సామ్రాజ్యంలో భాగమైనటువంటి అనంతపురాన్ని సందర్శించాడు. ఆ అంశాలు ఇటీవల కజాన్‌లో జరిగిన అసోసియేషన్ వ్యవస్థాపక సమావేశంలో చర్చకు వచ్చి.. అనంతపురం ప్రాధాన్యతను గుర్తు చేశాయి. కాగా, అనంతపురం నగరాన్ని సందర్శించిన రష్యన్ యాత్రికుని రచనలను పరిగణనలోకి తీసుకుని మేయర్ల సదస్సుకు అనంతపురం నగరాన్ని ఎంపిక చేయడం చాలా సంతోషంగా ఉంది అని మేయర్ అన్నారు.

■ తెలంగాణ

అంతర్జాతీయ ముఠా అరెస్టు

- ఈఎంఐ కడతామని వాహనాల కొనుగోళ్లు
- ఆపై స్క్రాప్ పేరిట విదేశాలకు తరలింపు



స్వాధీనం చేసుకున్న కార్లతో పోలీసులు

రామన్నపేట(వరంగల్): ఈఎంఐలు చెల్లిస్తామని వాహనాలు కొనుగోలు చేసి.. స్క్రాప్ కింద విదేశాలకు తరలించే అంతర్జాతీయ ముఠాను అరెస్ట్ చేసినట్టు డీసీపీ మహ్మమద్ అబ్దుల్ బారీ తెలిపారు. ఆదివారం వరంగల్ మట్టెవాడ పోలీస్ స్టేషన్‌లో ఏసీపీ నందిరాంనాయక్‌తో కలిసి ఆ వివరాలు వెల్లడించారు. దశరథ, దుర్గం సందాస్, కొక్కొట్టి రాకేశ్, మహ్మద్‌జాబీర్‌లు తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించాలనే లక్ష్యంతో ఓ ముఠాగా ఏర్పడ్డారు. ఏపీ, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో ఆర్థిక ఇబ్బందులతో పెద్దపెద్ద వాహనాలను అమ్మకానికి పెట్టిన యజమానుల నుంచి ఈఎంఐలు చెల్లిస్తామని నమ్మించి వాటిని కొనుగోలు చేశారు. ఆపై స్క్రాప్ చేసి ముంబయిలో కొన్ని టీంల ద్వారా విదేశాలకు ఎగుమతి చేస్తున్నారు. గతంలో హైదరాబాద్ పోలీసులకు పట్టుబడి 16 కేసుల్లో జైలుకు వెళ్లారు. తిరిగి వచ్చాక వారి తీరు మారలేదు. 2023 నుంచి మట్టెవాడ, తిప్పర్తి, ఆమనగల్లు, మోకిల కల్వకుర్తి, కీసర రూ.4.5 కోట్ల విలువైన వాహనాలను మోసపూరితంగా తీసుకొని స్క్రాప్ కింద నెదర్లాండ్, సౌత్ ఆఫ్రికా, కంబోడియా దేశాలకు ఎగుమతి చేశారు. నిందితులను వరంగల్ ఆటోనగర్‌లోని హనుమాన్‌జంక్షన్ వద్ద పట్టుకున్నారు. వారి నుంచి రూ.40 లక్షల విలువైన కార్లు స్వాధీనం చేసు కున్నారు. నిందితులపై 12 కేసులు ఉన్నాయి. 23 వాహనాలు అక్రమ పద్ధతిలో విదేశాలకు పంపించినట్టు పోలీసులు గుర్తించారు.

క్లుప్తంగా...

జగనన్నను కాదని టీడీపీలోకి ఎలా వెళ్తా!

- ప్రతిపక్షంలో ఉంటూ ప్రజా సమస్యలపై పోరాడతా
- ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి

కర్నూలు టౌన్: 'వైఎస్సార్‌సీపీ మ్యాండెట్‌తో గెలిచి టీడీపీలోకి పోయేందుకు నా ఆత్మసాక్షి ఎలా ఒప్పుకుంటుంది. ఆత్మాభిమానం కలిగిన వ్యక్తిని. ఎమ్మెల్యేగా గెలిపించిన జగనన్నను కాదని పార్టీని వీడే ప్రసక్తే లేదు' అని ఆలూరు ఎమ్మెల్యే బి.విరూపాక్షి స్పష్టం చేశారు. ఆదివారం ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ.. పార్టీ మారుతున్నట్టు పత్రికల్లో వస్తున్న నిరాధార ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నట్టు చెప్పారు. ముందునుంచీ తాను కాంగ్రెస్ అభిమానిగా.. ఆ తరువాత దివంగత రాజశేఖర్ రెడ్డి ఆశయాల కోసం జగనన్న పట్టుదలను చూసి వైఎస్సార్‌సీపీలో చేరానన్నారు. జగనన్న తనను గుర్తించి ఎమ్మెల్యేగా నిలబెట్టి గెలిపించారన్నారు. నియోజకవర్గంలో ప్రజల సమస్యలను పరిష్కరించడమే తనముందున్న కర్తవ్యమన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైతే అసెంబ్లీలో నిలదీస్తానని పేర్కొన్నారు. ప్రతిపక్షంలో ఉంటూ పోరాటం చేస్తానని స్పష్టం చేశారు. వదంతులు నమ్మొద్దని ప్రజలను కోరారు.

జోగి రమేష్ కంకిపాడు రాకూడదంటూ బ్యానర్



కంకిపాడు బస్టాండ్ కూడలిలో ఏర్పాటు చేసిన బ్యానర్

కంకిపాడు: కృష్ణా జిల్లా కంకిపాడులో జనసేన కార్యకర్తలు మాజీ మంత్రి జోగి రమేష్ కంకిపాడు రాకూడదంటూ హెచ్చరిక బ్యానర్ ఏర్పాటుచేశారు. 'జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్‌ను విమర్శించిన జోగి రమేష్ కంకిపాడులోకి రాకూడదు' అంటూ బస్టాండు కూడలిలో శనివారం రాత్రి భారీ బ్యానర్ ఏర్పాటు చేశారు. 'పార్టీ ఆదేశానుసారం ఏ కార్యక్రమాలు చేపట్టినా మాకు అభ్యంతరం లేదు. ఆ కార్యక్రమానికి జోగి రమేష్‌ను పిలిస్తే తదుపరి పరిణామాలకు వైఎస్సార్‌సీపీ బాధ్యత వహించాల్సి ఉంటుంది' అంటూ బ్యానర్‌లో పేర్కొన్నారు. ఈ బ్యానర్ విషయమై ఎస్‌ఐ డి.సందీప్‌ను వివరణ కోరగా.. తన దృష్టికి రాలేదన్నారు. వెంటనే ఆ బ్యానర్‌ను తొలగిస్తామన్నారు. బ్యానర్ ఏర్పాటు చేసిన వ్యక్తులను సీసీ కెమెరాల ద్వారా గుర్తించి కౌన్సెలింగ్ ఇస్తామని చెప్పారు.

కొడాలి నానిని విమర్శిస్తూ గుంటూరులో వెలిసిన ఫ్లెక్సీ

పట్నంబజారు: మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ నేత కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని)ని విమర్శించేలా గుంటూరులో ఫ్లెక్సీలు దర్శనమిచ్చాయి. సీఎం చంద్రబాబు బూట్లకు కొడాలి నాని పాలిష్ చేస్తున్నట్లు ఈ ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. టీడీపీ నేత కనపర్తి శ్రీనివాసరావు ఆ ఫ్లెక్సీలు వేయించారు. ఎన్నికల ముందు.. కుప్పంలో చంద్రబాబు గెలిస్తే.. రాజకీయ సన్యాసం చేయడంతోపాటు ఆయన బూట్లు తుడుస్తానని కొడాలి నాని చేసిన వ్యాఖ్యల నేపథ్యంలోనే ఈ ఫ్లెక్సీ ఏర్పాటు చేసినట్లు టీడీపీ నాయకులు చెబుతున్నారు.

ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

కృష్ణలంక(విజయవాడ తూర్పు): ఎన్నికల మేనిఫెస్టోలో ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబు నాయుడు ప్రభుత్వం అమలు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. గవర్నర్‌పేటలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కొత్తగా ఏర్పడిన రాష్ట్ర ప్రభుత్వానికి సీపీఎం తరపున శుభాకాంక్షలు తెలిపారు. హామీల అమలుకు వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాజధాని సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. పోలవరం నిర్వాసితుల కాలనీలను సందర్శించి వారికి సత్వర న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీలో జీవో నంబర్-3 పునరుద్ధరించి స్పెషల్ డీఎస్సీ నిర్వహించాలని, రాష్ట్రంలో ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులన్నింటినీ పూర్తిగా నింపేందుకు మెగా డీఎస్సీ సంఖ్యను పెంచాలని విజ్ఞప్తి చేశారు. రైతులకు ఇబ్బందిగా ఉన్న స్మార్ట్ మీటర్లను తొలగించాలని కోరారు. జీవో నంబర్ 596ను ఉపసంహరించుకొని అసైన్డ్‌మెంట్ భూములు పేదవారికి దక్కేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు, విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం కృషి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు మంతెన సీతారాం పాల్గొన్నారు.

ఆఖరి మజిలీలో ఆర్థిక అభద్రత

- దేశంలో 65% మంది వృద్ధులది ఇదే పరిస్థితి
- హెల్ప్ ఏజ్ ఇండియా సర్వేలో వెల్లడి
- దేశవ్యాప్తంగా 10 రాష్ట్రాల్లోని టైర్ 1, 2 నగరాల్లో 5,169 మంది వృద్ధులపై అధ్యయనం

సాక్షి, అమరావతి: జీవిత చరమాంకంలో ఆర్థిక అభద్రతతో పండుటాకులు విలవిల్లాడుతున్నాయి. దేశంలో సగానికిపైగా వృద్ధుల్లో ఈ సమస్య ప్రబలంగా ఉంది. ఈ విషయం ఇటీవల హెల్ప్ ఏజ్ ఇండియా సంస్థ నిర్వహించిన అధ్యయనంలో వెల్లడైంది. 'ఏజింగ్ ఇన్ ఇండియా' దేశవ్యాప్తంగా 10 రాష్ట్రాల్లో సర్వే నిర్వహించింది. సర్వేలో భాగంగా 10 రాష్ట్రాల్లోని 20 టైర్ 1, 2 నగరాల్లో 60 నుంచి 80 ఏళ్ల పైబడిన 5,169 మంది వృద్ధులు, 1,333 మంది సంరక్షకులను సర్వే చేశారు. దక్షిణాదిలో తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లోని టైర్ 1 చెన్నై, బెంగళూరు, టైర్ 2 సేలం, హుబ్లీ నగరాలను సర్వే కోసం ఎంపిక చేశారు. కాగా, సేకరించిన అభిప్రాయాలను అధ్యయనం చేసిన అనంతరం ప్రతి ముగ్గురిలో ఒకరు గత సంవత్సర కాలంలో ఎటువంటి ఆదాయం పొందలేదని గుర్తించారు. 65 శాతం మంది ఆర్థికంగా అభద్రతా భావంతో జీవిస్తున్నట్లు నిర్ధారించారు. 29 శాతం మంది వృద్ధాప్య పెన్షన్, ప్రావిడెంట్ ఫండ్, సామాజిక భద్రతా పథకాల ద్వారా లబ్ధిపొందుతున్నారు.

అభద్రతాభావం మహిళల్లోనే అధికం



తమ ప్రస్తుత రాబడి, పెట్టుబడులు, పొదుపు పరిగణనలోకి తీసుకుని 65 శాతం మంది ఆర్థికంగా అభద్రతతో ఉన్నారు. పురుషులతో పోలిస్తే మహిళల్లోనే అభద్రతా భావం ఎక్కువగా ఉంది. ఇక మధ్యప్రదేశ్ రాష్ట్రంలో 90 శాతం, తమిళనాడులో 38 శాతం మంది అభద్రతా భావాన్ని వ్యక్తపరిచారు. 15 శాతం మంది వృద్ధులు నేటికీ పనిచేస్తున్నారు. వీరిలో 85 శాతం మంది అక్షరాస్యులుగా ఉన్నారు.

48 శాతం బీపీ.. 43 శాతం షుగర్ సమస్యలు



68శాతం మంది వృద్ధులు తమ సాధారణ ఆరోగ్య పరిస్థితి మెరుగ్గా ఉందని అభిప్రాయపడ్డారు. 10శాతం మంది మాత్రం తమ ఆరోగ్యం బాగోలేదన్నారు. మొత్తంగా పరిశీలిస్తే 48 శాతం మంది బీపీ, 43 శాతం మంది షుగర్ సమస్యలతో బాధపడుతున్నారు. 35 శాతం మంది ఎముకలు, కీళ్లకు సంబంధించిన ఆర్థరైటీస్ వంటి వ్యాధులను ఎదుర్కొంటున్నారు. 19 శాతం మందికి అధిక కొలెస్ట్రాల్ వంటి సమస్యలున్నాయి. అదే 80 ఏళ్లు పైబడిన వారిలో అయితే 62 శాతం మంది బీపీ, 54 శాతం మందిలో షుగర్ సమస్యతో ఉన్నట్టు తేలింది. 60 ఏళ్లు పైబడిన వారిలో 54 శాతం మంది నాన్ కమ్యూనికబుల్ డిసీజెస్‌తో బాధపడుతున్నారు. 79 శాతం మంది రెగ్యులర్ చెకప్‌లు, అనారోగ్య పరిస్థితుల్లో ప్రభుత్వ ఆస్పత్రులకు వెళుతున్నారు.

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిగా పల్లా శ్రీనివాస్

పార్టీ అధినేత చంద్రబాబు ప్రకటన



సాక్షి, అమరావతి: తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా పల్లా శ్రీనివాస్ యాదవ్‌ను నియమించారు. ఈ మేరకు ఆదివారం చంద్రబాబు పేరుతో ఆ పార్టీ కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. ఇప్పటివరకు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడుగా ఉన్న అచ్చెన్నాయుడు ఇటీవల రాష్ట్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన విషయం తెలిసిందే. దీంతో ఆయన స్థానంలో గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్‌ను చంద్రబాబు నియమించారు.

విశాఖను రాజధానిగా ప్రజలు హర్షించలేదు

టీడీపీ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు



మాట్లాడుతున్న గంటా శ్రీనివాసరావు

కొమ్మాది (విశాఖ): విశాఖపట్నాన్ని రాజధాని చేస్తానన్న మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయాన్ని ఇక్కడి ప్రజలు హర్షించలేదని.. అందుకే జిల్లాలో ఘోర ఓటమి చవిచూశారని టీడీపీ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. రుషికొండపై నిర్మాణాలను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రుషికొండ కట్టడాలపై ఏం జరుగుతుందో తెలుసుకుందామని వెళితే గతంలో అక్రమ కేసులు పెట్టారని, ఈ రోజుతో ఆ ఉత్కంఠకు తెరపడిందన్నారు. 2019లో ఒక్క చాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన జగన్ ప్రజావేదిక కూల్చివేతతో పాలన ప్రారంభించారని, తరువాత మూడు రాజధానుల పేరుతో రుషికొండపై పచ్చని టూరిజం రిసార్టులను అన్యాయంగా కూల్చివేసి విలాసవంతమైన భవనాల నిర్మాణం చేపట్టారన్నారు. కొండను బోడిగుండు చేసినప్పటి నుంచి నిర్మాణం పూర్తయ్యే వరకు అన్నీ వివాదాలే నెలకొన్నాయని చెప్పారు. తొలుత టూరిజం కోసం నిర్మాణాలు చేపట్టినట్టు చెప్పిన జగన్.. ఆ తరువాత రిసార్ట్స్ అని.. చివరకు ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం అంటూ ప్రజలను అయోమయంలో పడేశారన్నారు. 9.8 ఎకరాల్లో 7 బ్లాకులతో రుషికొండపై నిర్మాణాలు ఉన్నాయని.. రూ.500 కోట్లతో నిర్మించిన ఈ భవనాలను ఎలా ఉపయోగించుకోవాలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో చర్చించి త్వరలో ఓ నిర్ణయాన్ని ప్రకటిస్తామని తెలిపారు. భీమిలి జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పంచకర్ల సందీప్ తదితరులు పాల్గొన్నారు.

ఐక్య పోరాటాలే శరణ్యం

రైతు కూలీ సంఘం రాష్ట్ర మహాసభల్లో మాజీమంత్రి వడ్డే



ఏలూరు (టూటౌన్): రైతుల సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటాలే మార్గమని మాజీ మంత్రి, సంయుక్త కిసాన్ మోర్చా రాష్ట్ర కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు పిలుపునిచ్చారు. ఏలూరులో జరుగుతున్న రైతు కూలీ సంఘం(ఆంధ్రప్రదేశ్) రాష్ట్ర మహాసభల్లో రెండో రోజు ఆదివారం 'వ్యవసాయ రంగ సంక్షోభం-పాలకుల విధానాలు-మన కర్తవ్యాలు' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. స్థానిక టుబాకో మర్చంట్స్ అసోసియేషన్ హాల్లో సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు సింహాద్రి ఝాన్సీ అధ్యక్షతన జరిగిన సదస్సులో వడ్డే శోభనాద్రీశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. గత పదేళ్లలో రైతు ఆదాయం రెట్టింపు చేసే హామీని ఎగ్గొట్టిన మోదీ ప్రభుత్వం.. కార్పొరేట్లకు మాత్రం రూ.25లక్షల కోట్ల రుణాలు రద్దు చేసిందన్నారు. కనీస మద్దతు ధర చెల్లించకుండా రైతులను లక్షల కోట్ల నష్టాలకు గురిచేసిందని చెప్పారు. దేశంలో మొత్తంగా 19 కోట్ల రైతు కుటుంబాలు, కుటీర పరిశ్రమలకు ఇచ్చిన రుణాల కన్నా.. కేవలం 20 కార్పొరేట్ కంపెనీలకు ఇచ్చిన రుణాలే ఎక్కువని చెప్పారు. ప్రభుత్వాలు పెడుతున్న పంటల బీమా పథకాలు రైతుల కంటే ఇన్సూరెన్స్ కంపెనీలకే ఎక్కువ మేలు చేస్తున్నాయని, మోదీ హయాంలో పీఎం ఫసల్ బీమా యోజన ద్వారా 2016-17లో రైతుల నుంచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.22,500 కోట్లు ప్రీమియంలు వసూలు చేయగా.. రైతులకు పంటనష్టంగా కేవలం రూ.7,500 కోట్లు చెల్లించినట్టు తెలిపారు. రైతు, ప్రజావ్యతిరేక, ఆదివాసీలకు ద్రోహం చేసే చట్టాలపై ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు.

స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేయాలి

నల్లమడ రైతాంగ సమితి నేతలు డాక్టర్ కొల్లా రాజమోహన్ 'భారత రైతాంగ ఉద్యమం-కనీస మద్దతు ధర' అనే అంశంపై ప్రసంగిస్తూ స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ముందుగా ప్రజాకవి సుంకర రచించిన అల్లూరి సీతారామరాజు బుర్రకథ ప్రదర్శన ఆకట్టుకుంది. వ్యవసాయ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఎస్.వేణుగోపాల్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు, ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కేవీవీ ప్రసాద్ తదితరులు ప్రసంగించారు.

ప్రత్యేక హోదా సాధనకు ఇదే సరైన సమయం



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న చలసాని శ్రీనివాసరావు

- ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం పనిచేయాలి
- అఖిలపక్షం ఏర్పాటు అవశ్యం
- రౌండ్‌టేబుల్ సమావేశం డిమాండ్

కృష్ణలంక (విజయవాడ తూర్పు): రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధనే లక్ష్యంగా కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం పని చేయాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. రాజధాని అమరావతి, పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయటంతో పాటు ప్రత్యేక హోదా సాధన, విభజన హామీల అమలును సాధించటం కూడా ప్రాధాన్యతా అంశాల్లో చేర్చాలన్నారు. హోదా సాధనకు ఇదే సరైన సమయమన్నారు. విజయవాడ గవర్నర్‌పేటలోని బాలోత్సవ భవన్‌లో ఏపీ ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి ఆధ్వర్యంలో ఆదివారం రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ.. పదేళ్లుగా బీజేపీ రాష్ట్రానికి చేసిన అన్యాయాన్ని తెలుగు ప్రజలు మర్చిపోలేదని, ఇప్పటికీ గమనిస్తూనే ఉన్నారని పేర్కొన్నారు. ప్రత్యేక హోదా సాధన కోసం సీఎం చంద్రబాబు అఖిలపక్షాన్ని ఏర్పాటు చేయాలని, అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాలని సూచించారు. విశాఖ రైల్వే జోన్, రామాయపట్నం పోర్టు, కడప స్టీల్ ఫ్యాక్టరీని సాధించుకోవాల్సి ఉందన్నారు.

హోదా ముగిసిన అధ్యాయం కాదు

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రత్యేక హోదా ముగిసిన అధ్యాయం కాదని, అది సజీవ సమస్యగా ఉందని స్పష్టం చేశారు. కేంద్ర మంత్రులు, ఎంపీలను కలిసి ఏపీకి ప్రత్యేక హోదా గురించి చర్చిస్తామన్నారు. వైఎస్సార్‌సీపీ ఎంపీలు రాజ్యసభలో హోదాపై తీర్మానం చేయాలని కోరారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం ఐక్యంగా పోరాడాలని, దానికి ప్రతిపక్షం కూడా సానుకూలంగా స్పందించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర పద్మశ్రీ మాట్లాడుతూ.. హోదా కోసం 2014 నుంచి పోరాటం జరుగుతోందని, చంద్రబాబు, జగన్ ఇద్దరు రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధనే లక్ష్యంగా ముందుకు సాగాలని కోరారు. ప్రత్యేక హోదా, విభజన హామీ సాధన సమితి అధ్యక్షుడు చలసాని శ్రీనివాసరావు మాట్లాడుతూ గతంలో చంద్రబాబు, జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాలు అధికారంలో ఉన్నప్పుడు అసెంబ్లీలో ప్రత్యేక హోదా, విభజన హామీలపై ఏకగ్రీవ తీర్మానాలు చేశాయని, వాటిని మరోసారి కేంద్రానికి పంపించాలని కోరారు. సాఫ్ట్‌వేర్ ఎగుమతుల్లో ఆంధ్రప్రదేశ్ పొరుగు రాష్ట్రాల కంటే చాలా వెనుకబడి ఉందన్నారు. మీడియాపై అప్రకటిత నిషేధాన్ని ఎట్టి పరిస్థితుల్లో సమర్థించబోమని స్పష్టంచేశారు. ఈ సమావేశంలో ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెన్మెత్స దుర్గాభవాని, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉమామహేశ్వరరావు, జై భారత్ పార్టీ అధ్యక్షుడు వీవీ లక్ష్మీనారాయణ, ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.ఈశ్వరయ్య, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాసంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆటో యూనియన్ స్టాండ్‌లో జనసేన నేతల ఫ్లెక్సీలపై ఆగ్రహం

చెప్పులు నెత్తిన పెట్టుకుని యూనియన్ నాయకుల నిరసన



చెప్పులు తలపై పెట్టుకుని నిరసన తెలుపుతున్న ఆటో యూనియన్ నాయకులు

తిరుపతి(అలిపిరి): తిరుపతి రైల్వేస్టేషన్ ఎదుట ఆటో యూనియన్ నాయకులు ఆదివారం వినూత్నంగా చెప్పులు నెత్తిన పెట్టుకుని నిరసన తెలిపారు. ఆటో యూనియన్‌లో జనసేన నేతల ఫొటోలతో కూడిన ఫ్లెక్సీ, బోర్డు ఏర్పాటు చేయడంతో యూనియన్ నేతలు నిరసనకు దిగారు. గత 30 ఏళ్లుగా రైల్వేకు చలానాలు కడుతూ స్టాండులో కొనసాగుతున్నామని, ప్రస్తుతం తమ స్టాండ్‌లో ఇలాంటి బోర్డులు ఏర్పాటుచేసి తమ బతుకులపై దెబ్బ కొట్టడానికి ప్రయత్నాలు చేయడం తగదని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

కాటేస్తున్న విష సర్పాలు

- వర్షాకాలంలో పెరుగుతున్న పాము కాట్లు
- గత 12 నెలల్లో 20 మందికి పైగా మృతి
- జాగ్రత్తలు పాటిస్తే మేలంటున్న వైద్యులు
- ప్రభుత్వాస్పత్రుల్లో అందుబాటులో మందులు





దేవన్న (ఫైల్)

- బొమ్మనహాళ్ మండలం ఉప్పరహాల్‌కు చెందిన తెలుగు దేవన్న (55)కు భార్య చిత్తమ్మతో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. వ్యవసాయ పనులతో జీవనం సాగిస్తున్న ఆయన ఈ నెల 5న తెల్లవారుజామున ఇంటి నుంచి బయటకు కాలు పెట్టగానే పాము కాటేసింది. కుటుంబసభ్యులు వెంటనే కణేకల్లు క్రాస్‌లోని ఆర్డీటీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం బళ్లారిలోని విమ్స్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు.

రాయదుర్గం: జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తుండడంతో ఖాళీ జాగాల్లో గడ్డి బాగా పెరిగింది. ఈ క్రమంలో పాముల సంచారం అధికమై పాము కాట్లకు గురయ్యే వారి సంఖ్య పెరుగుతోంది. గడ్డి పొదలు, పొలం గట్లను స్థావరంగా చేసుకుని పొంచి ఉన్న పాములు రైతులు, రైతు కూలీలను కాటేస్తున్నాయి. గట్టు వెంబడి నడిచి వెళుతున్న వారు, పొలం దుక్కి పనుల్లో నిమగ్నమైనప్పుడు, రాత్రిళ్లు పొలం వద్ద కాపలాకు వెళ్లిన సమయంలో, పంట తొలగింపు సమయంలో, గడ్డి కోత సందర్భాల్లో పాము కాట్లు ఎక్కువగా ఉంటున్నాయి. జిల్లాలో గతేడాది జూన్ నుంచి ఇప్పటి వరకూ 20 మందికి పైగా పాము కాటుతో మృతి చెందినట్లు అధికారిక లెక్కలు స్పష్టం చేస్తున్నాయి. అనధికారికంగా ఈ లెక్క రెట్టింపులో ఉంటుందని అంచనా.

పాము కరవగానే..



- భయాందోళనలకు గురికాకూడదు. భయం వల్ల రక్త ప్రసరణ పెరిగి విషం త్వరగా వ్యాపించే ప్రమాదముంది.
- పక్కనున్నవారు ఆ పాము విషసర్పమో కాదో గుర్తించే ప్రయత్నం చేయాలి. దాని వల్ల చికిత్స మరింత కచ్చితంగా అందుకునేందుకు మార్గం ఏర్పడుతుంది.
- నాటు వైద్యం, మంత్ర తంత్రాలంటూ ఆలస్యం చేయరాదు. సాధ్యమైనంత తొందరగా దగ్గరలోని ఆస్పత్రికి పాము కాటు బాధితుడిని తరలించి చికిత్స అందజేయాలి. బాధితుడిని నడిపించరాదు. ఆటో, అంబులెన్స్, స్కూటర్ కనీసం మంచం సాయంతోనైనా ఆస్పత్రికి తరలించాలి.
- పాము కాటు వేయగానే కొందరు ఆ గాయాన్ని మరింత కోస్తే రక్తంతోపాటు విషం బయటకు వస్తుందని గాటు పెడతారు. ఇలా చేయడం చాలా ప్రమాదకరం. ఒక్కోసారి పాము కాటు కన్నా ఈ గాయం ప్రమాదకరంగా మారుతుంది.
- మరికొందరు గాటుపెట్టి నోటితో విషం పీల్చేస్తామంటారు. పాము కాటు వేయగానే విషం రక్తం ద్వారా శరీరంలోని అన్ని భాగాలకు, గుండెకు చేరుకుంటుంది. కాబట్టి దీనివల్ల ప్రయోజనం ఉండదు.



పాము విష విరుగుడు సూది మందు

జాగ్రత్తలు పాటించాలి

- రాత్రిళ్లు పొలాల్లోకి వెళ్లే రైతులు మోకాలి వరకు రక్షణ కల్పించేలా ఉన్న బూట్లు ధరించాలి.
- టార్చిలైట్లు లేదా లాంతరు తప్పక వెంట తీసుకెళ్లాలి.
- చేతిలో ఉన్న కర్రకు గజ్జెలు కట్టి గట్టుపై కొడుతూ వెళ్లాలి.
- బురద మడుల్లో పనిచేసే వారు రంధ్రాలు పూడ్చే సమయంలో జాగ్రత్తగా ఉండాలి.
- ఆరుబయలులో రాత్రిళ్లు కింద కాకుండా మంచం, ఎత్తయిన బండపై పడుకోవాలి

పాములన్నీ ప్రమాదం కావు!

పాముల్లో చాలావాటికి విషం ఉండదు. 50 శాతం విషం లేని, ప్రమాదంలేని మామూలు పాములే. వీటి కాటుకు సాధారణ చికిత్స తీసుకుంటే సరిపోతుంది. త్రాచు, కట్లపాము వంటి 15 శాతం సర్పాలతోనే ప్రమాదముంటుంది. పాము విషం కన్నా చాలా మంది పాము కరిచిందనే భయంతోనే చనిపోతున్నారు. ఇంట్లోని వారు, ఇరుగుపొరుగు ధైర్యం చెప్పడానికి బదులు ఏడుపులు ప్రారంభిస్తుండడంతో పాము కాటుకు గురైన వ్యక్తి మరింత ఆందోళనకు గురై పరిస్థితి చేజారుతోంది.

సకాలంలో ఆస్పత్రికి తేవాలి



90 శాతం పాములు తక్కువ విషం కలిగి ఉంటాయి. నాగుపాము, కట్లపాము లాంటి 10 శాతం పాములు ప్రాణాంతకమైనవి. విష సర్పం కాటు వేయగానే నరాల మీద ప్రభావం చూపి ఊపిరి పీల్చుకునేందుకు ఇబ్బందిగా మారుతుంది. సకాలంలో ఆస్పత్రికి చేరిస్తే ప్రాణాపాయం తప్పించవచ్చు.

– డాక్టర్ మాధవి, మెడికల్ సూపరింటెండెంట్, రాయదుర్గం

నాటువైద్యం మంచిది కాదు



పాము ఏదైనా సరే విషం విరుగుడుకు సూది మందు త్వరగా పనిచేస్తుంది. పాము కరిచిన వెంటనే ప్రభుత్వ ఆస్పత్రుల్లో చేర్పించాలి. నాటు వైద్యం అంటూ ఆలస్యం చేస్తే పరిస్థితి చేజారి పోవచ్చు. ఇది మంచిది కాదు. జిల్లా వ్యాప్తంగా అన్నీ పీహెచ్‌సీల్లోనూ సరిపడేంతా పాము కాటు మందులు అందుబాటులో ఉన్నాయి.

– డాక్టర్ సుజాత, వైద్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి, అనంతపురం



మతం అనేది విశ్వాస సంస్కృతి :
సైన్సు అనేది సందేహ సంస్కృతి.
- రిచర్డ్ పి. ఫెయిన్‌మాన్

సాక్షి

సోమవారం, 17 జూన్ 2024

కరవు పాట

దేశానికి ఎదురయ్యే నానా సమస్యల్లో కరవు ఒకటి. శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం కృత్రిమ మేధ వరకు ఎదిగినా, కరవు కాటకాలను పూర్తిగా రూపుమాపే స్థాయికి మాత్రం ఇంకా చేరుకోలేదు. రాజ్యానికి వాటిల్లే అనేకానేక ఆపదల్లో దుర్భిక్షాన్ని కూడా ఒకటిగా మన ప్రాచీన సాహితీవేత్తలు గుర్తించారు. అయితే, ఇందులో మానవ ప్రమేయాన్ని మాత్రం పాపం వారు గుర్తించలేకపోయారు. ‘అమాను షోగ్నిః, అవర్షం, అతివర్షం, మారకః, దుర్భిక్షం, సస్యోపఘాతః, జంతుసర్గః, వ్యాధిః, భూత పిశాచ శాకినీ సర్ప వ్యాళ మూషక క్షోభాశ్చేత్యాపదః’ అన్నాడు సోమదేవుడు. ఈ శ్లోకం ఆయన రాసిన ‘నీతి వాక్యామృతం’లోనిది. అంటే, మనుషుల వల్ల కాకుండా, ఇతర కారణాల వల్ల వాటిల్లే అగ్ని ప్రమాదాలు, వర్షాలు లేకపోవడం, అతి వర్షాలు, మహమ్మారి వ్యాధులు, దుర్భిక్షం, పంటలకు నష్టం కలగడం, అడవి జంతువుల సంఖ్య విపరీతంగా పెరగడం, రోగాలు, భూత పిశాచాదులు, పాములు, అదుపు తప్పిన ఏనుగులు, ఎలుకలు– ఇవీ రాజ్యంలో కలిగే ఆపదలు. పురాతన రాజ్యాల్లోనే కాదు, దుర్భిక్ష పరిస్థితులు వర్తమాన దేశాల్లోనూ ఉన్నాయి.

పురాతన కాలంలో ఆనకట్టలు కట్టే పరిజ్ఞానం లేకపోవడంతో అతివృష్టి, అనావృష్టి పరిస్థితులను ఎదుర్కోవడం కష్టంగా ఉండేది. ఆధునిక కాలంలో ఆనకట్టలు కట్టడం నేర్చుకున్నాం. నీటిపారుదలను మెరుగుపరచుకున్నాం. అయినా ఎక్కడో ఒకచోట కరవు తాండవిస్తూ ఉండటమే విచారకరం. ముందుచూపు లేకుండా అడవులను నరికివేయడం వల్లనే ప్రపంచంలో చాలా చోట్ల కరవు కాటకాలు తలెత్తుతున్నాయి. ఒకప్పటి పచ్చని నేలలు ఇప్పుడు బీడు భూములుగా, ఎడారులుగా మారుతున్నాయి. ‘విచారకరమైన సంగతేమిటంటే, అడవిని సృష్టించడం కంటే ఎడారిని సృష్టించడం సులువు’ అన్నాడు ఇంగ్లిష్ పర్యావరణ శాస్త్రవేత్త జేమ్స్ లవ్‌లాక్. కష్టమైన పనులు చేపట్టే బదులు సులువైన పనులు చేయడమే కదా మనుషుల సహజ లక్షణం. అందుకే సునాయాసంగా ఎక్కడికక్కడ ఎడారులను సృష్టిస్తున్నారు.

కరవు సాహిత్యం మనకు కరవు కాదు. దుర్భిక్ష వర్ణన తెలుగు సాహిత్యంలో శ్రీనాథుడితో మొదలైంది. అప్పట్లో కరవు కాటకాలకు ఆలవాలమైన పలనాటి సీమలో ఆకుకూరలతో జొన్నకూడు తినలేక శ్రీనాథుడు నానా తిప్పలు పడ్డాడు. చివరకు ఉక్రోషం అణచుకోలేక ‘ఫుల్ల సరోజనేత్ర యల పూతన చన్నుల చేదు గ్రావి నా/డల్ల దవాగ్ని మ్రింగితి నటంచును నిక్కెదవేమొ? తింత్రిణీ/పల్లవ యుక్తమౌ నుడుకు బచ్చలి శాకము జొన్న కూటిలో/ మెల్లన నొక్క ముద్ద దిగమ్రింగుము నీ పస కాననయ్యెడిన్’ అంటూ సాక్షాత్తు భగవంతుడైన శ్రీకృష్ణుడికే సవాలు విసిరాడు. కేవలం పలనాడులోనే కాదు, రేనాటి సీమలో కూడా శ్రీనాథుడికి కారం కలిపిన జొన్నకూడు తినవలసిన దుర్గతి తటస్థించింది. అప్పుడు ‘గరళము మ్రింగితి ననుచుం/బురహర గర్వింపబోకు పో పో పో నీ/ బిరుదింక గానవచ్చెడి/ మెరసెడి రేనాటి జొన్న మెతుకులు తినుమీ’ అని పరమశివుడిని సవాలు చేశాడు. దుర్భిక్ష దుర్గతిని అనుభవించి పలవరించిన తొలి తెలుగు కవి శ్రీనాథుడు.

ఆధునికులలో విద్వాన్ విశ్వం రాయలసీమలోని పెన్నా పరివాహక ప్రాంతంలోని పల్లెల కరవు కష్టాలకు చలించిపోయి, ‘అదే పెన్న! అదే పెన్న!/ నిదానించి నడు/ విదారించు నెదన్, వట్టి/ ఎడారి తమ్ముడు’ అంట ‘పెన్నేటి పాట’ను హృదయ విదారకంగా రాశారు. కరవు మనిషిని నానా రకాలుగా దిగజారుస్తుంది. నేరాలకు పురిగొల్పుతుంది. ‘కరవు కాలంలో రొట్టెముక్కను దొంగిలించిన మనిషిని దొంగగా చూడరాదు’ అన్నాడు బ్రిటిష్ గీత రచయిత క్యాట్ స్టీవెన్స్. అయితే, కరవు కాలంలో మనుషుల్లో అంత ఔదార్యం మిగిలి ఉంటుందా అన్నది అనుమానమే! మొదటి ప్రపంచ యుద్ధం దెబ్బకు 1914–23 కాలంలో భారత్ సహా నలభై ఐదు దేశాలు కరవు కాటకాలతో అల్లాడిపోయాయి. అప్పటి కరవుకాలంలో అమెరికా ఈ దేశాలను ఆదుకున్న తీరును, ఆనాటి కరవు తీవ్రతను వివరిస్తూ అమెరికన్ రచయిత, సామాజిక కార్యకర్త హెర్బర్ట్ హూవర్ ‘యాన్ అమెరికన్ ఎపిక్: ఫేమిన్ ఇన్ ఫార్టీ ఫైవ్ నేషన్స్’ అనే పుస్తకం రాశాడు.

నేటి ప్రపంచంలో కరవు కరాళనృత్యం చేసే దేశాల్లో సోమాలియా ముందు వరుసలో ఉంటుంది. ప్రకృతి కారణాలే కాకుండా; యుద్ధాలు, సంక్షోభాలు అక్కడి కరవును మరింత కర్కశంగా మారుస్తున్నాయి. ‘ఆకలి నా అనుదిన ఆహారం/ కరవు నా ఊపిరి/ నిర్లక్ష్యమే నా సంరక్షణ/ దాతల జోలపాటకు నేను నిద్రపోతాను/ ఆ పాట ఎలా పాడాలో వితరణ సంస్థలకు తెలుసు’ అంటాడు ‘నేను సోమాలీ శిశువును’ అనే కవితలో సోమాలీ కవి అబ్ది నూర్ హాజీ మహమ్మద్.

నేడు కరవు, ఎడారీకరణలపై పోరాట దినం. ప్రస్తుత ప్రపంచంలో ఇరవై మూడు దేశాలు గడచిన ఆర్థిక సంవత్సరంలో కరవు ఆత్యయిక పరిస్థితిని ప్రకటించాయి. వీటిలో మూడు ఆఫ్రికన్ దేశాలైతే, వరుసగా నలభై ఏళ్ల నుంచి కరవుతోనే సతమతమవుతున్నాయి. కరవు కాటకాలు ఉన్నచోట అశాంతి, అలజడులు తప్పవు. మనుషుల్లో హింసా ప్రవృత్తి పెరుగుతుంది. ‘హింస కలుపుమొక్క లాంటిది. ఎంతటి కరవు వాటిల్లినా అది చావదు’ అన్నాడు ఆస్ట్రియన్ రచయిత సైమన్ వీసెంతాల్. నాజీల మారణకాండ నుంచి తప్పించుకుని, బతికి బట్టకట్టిన వాడాయన. కరవు కాటకాలు కనుమరుగైతే తప్ప ప్రపంచంలో శాంతి సామరస్యాలు సాధ్యంకావు. అయితే, అలాంటి రోజు ఎప్పటికైనా వస్తుందా? మహాకవి శ్రీశ్రీ చెప్పినట్లు ‘నిజంగానే నిఖిలలోకం / నిండు హర్షం వహిస్తుందా?/ మానవాళికి నిజంగానే/ మంచికాలం రహిస్తుందా?’

ఉప్పందిందా? లేక నిప్పులేని పొగేనా?

కామెంట్



కరణ్ థాపర్

జూన్ 1న ఎగ్జిట్ ఫలితాలు వెల్లడవటానికి ముందు రోజు మే 31న జరిగిన షేర్ల కొనుగోళ్లు, అమ్మకాల విలువ ఆ ముందరి రోజు జరిగిన దానికి రెట్టింపు! ఈ మొత్తం కొనుగోళ్లలో 58 శాతం వాటా విదేశీ ఇన్వెస్టర్లదే. ఎగ్జిట్ పోల్స్ అన్నీ మోదీ ఘన విజయం సాధించబోతున్నారని ప్రకటించిన రోజుకు సరిగ్గా ముందు రోజే స్టాక్ మార్కెట్‌లో రెట్టింపు ట్రేడింగ్ జరగటం యాదృచ్ఛికమైతే కాదు. దీనివల్ల అసలు ఎన్నికల ఫలితాలు వెల్లడైన జూన్ 4న స్టాక్ మార్కెట్ కుప్పకూలి పోవటం, సాధారణ ఇన్వెస్టర్ల షేర్ల విలువ పాతాళానికి పడిపోవటం జరిగింది. ఆ రోజు స్టాక్ మార్కెట్‌కు వచ్చిన నష్టం అక్షరాలా 30 లక్షల కోట్ల రూపాయలు. అందుకే... ‘ఎగ్జిట్‌పోల్ స్టాక్ మార్కెట్ స్కామ్’ జరిగిందా అన్నది ప్రశ్న.


మే 31–జూన్ 4 మధ్య నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజి (ఎన్.ఎస్.ఇ)లో ఏదైనా అనుమానాస్పదమైన, ఆందోళన కలిగించే పరిణామం సంభవించిందా? సంభవించింది అని రాహుల్ గాంధీ అంటున్నారు. దానిపై దర్యాప్తు జరిపించాలని ఆయన కోరుతున్నారు. అయితే ఆయన అంటున్నది నిజమేనని మనమెలా చెప్పగలం? వాస్తవాలను పరిశీలించడం ద్వారా మాత్రమే. కనుక ఈ విషయమై ‘ఆల్ ఇండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్’ చైర్మన్ ప్రవీణ్ చక్రవర్తి వద్ద అందుబాటులో ఉన్న కొన్ని వివరాలను మీ ముందు ఉంచుతాను. ఇందుకు చక్రవర్తినే నేను ఎంచుకోవటానికి కారణం రాహుల్ అంటున్న దానికి, చక్రవర్తి చెబుతున్నది చాలా దగ్గరి ఏకీభావం కలిగి ఉన్నదని నేను అనుకోవటం.

మొదటిది– మే 31న ఎన్.ఎస్.ఇ.లో జరిగిన షేర్ల కొనుగోళ్లు, అమ్మకాల విలువ ఆ ముందటి రోజు మొత్తాని కంటే రెట్టింపు. పదేళ్ళ క్రితం 2014 మే నెలలో ఇలాంటిదే నరేంద్ర మోదీ తన తొలి మెజారిటీ సాధించినప్పుడు జరిగినప్పటికీ అలా జరగడం ‘‘చాలా అరుదు’’ అని చక్రవర్తి అంటారు. 2020లో ప్రపంచ ఆరోగ్య సంస్థ కరోనా వైరస్‌ను ప్రపంచ మహమ్మారిగా ప్రకటించినప్పుడు సైతం స్టాక్ మార్కెట్ కార్యకలాపాలు ఆ ముందరి రోజు కన్నా రెట్టింపు ఏమీ కాలేదు. 22 శాతం మాత్రమే పెరిగాయి.

రెండవది– ఎన్.ఎస్.ఇ. సొంత డేటా చెబుతున్న దానిని బట్టి 31న జరిగిన ‘‘మొత్తం షేర్ల కొనుగోళ్లలో 58 శాతం వాటాను ఫారిన్ ఇన్వెస్టర్లే (ఎఫ్ఐలు) కలిగి ఉన్నారు’’ అని చక్రవర్తి అంటున్నారు. ‘‘ఇది ఆశ్చర్యంగా ఉంది. ఎందుకంటే వారంలో ఆ ముందు వరకు ఎఫ్ఐలు అంత భారీ మొత్తంలో షేర్లను కొనటం, కొన్న వాటికి మించి అమ్మటం జరగలేదు’’ అని కూడా ఆయన అన్నారు.

మరి విదేశీ ఇన్వెస్టర్లను అంత భారీ మొత్తాలలో కొనిపించింది ఏమిటి? భారీగా కొనటం మాత్రమే కాదు, 31న వారు అంతే భారీగా అమ్మకాలు కూడా జరిపారన్న వాస్తవాన్ని చక్రవర్తి విస్మరించారు. బదులుగా ఆయన, ‘‘తర్వాతి రోజు ఏం జరిగిందన్న దానిని బట్టే ఆ ముందు రోజు జరిగిన దానిని వివరించగలం’’ అన్నారు. తర్వాతి రోజు అంటే ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు బయటికి వచ్చిన రోజు.

మే 31కి, జూన్ 1కి చక్రవర్తి పెట్టిన ఈ లంకె... ఎగ్జిట్ పోల్స్ ఫలితాల గురించి విదేశీ ఇన్వెస్టర్లకు ముందే తెలిసైనా ఉండాలి, లేదంటే వారికై వారు సర్వే జరిపించుకొని ఉండాలి అన్నదానిని సూచిస్తోంది.



ఆరోపణలు చేస్తున్న రాహుల్ గాంధీ

అయితే విదేశీ ఇన్వెస్టర్లు అంత భారీగా షేర్లు కొనటానికి ఈ రెండూ కాకుండా మూడో కారణం ఏదైనా ఉండి ఉంటుందా?

ఉంటుందనైతే చక్రవర్తి అనుకోవటం లేదు. ‘‘ఎగ్జిట్ పోల్స్ అన్నీ కూడా ఒకే రీతిన మోదీ అపారమైన విజయం సాధించబోతున్నారని ఫలితాలను వెల్లడించిన రోజుకు సరిగ్గా ముందు రోజే స్టాక్ మార్కెట్‌లో రెట్టింపు ట్రేడింగ్ అనే అత్యంత అరుదైన పరిణామం జరగటం అన్నది కేవలం యాదృచ్ఛికమైతే కాదు’’ అంటారాయన. కానీ అది యాదృచ్ఛికం ఎందుకు కాకూడదు? ఇందిరా గాంధీ తన మరణం గురించి మాట్లాడిన 24 గంటల తర్వాత ఆమె హత్య జరిగింది. అది యాదృచ్ఛికం మాత్రమే!

విషయాన్ని ఒకడుగు ముందుకు తీసుకెళదాం. విదేశీ ఇన్వెస్టర్లు మే 31న షేర్లు కొనుగోలు చేశారు. అయితే ఎగ్జిట్ పోల్స్ అనంతరం జూన్ 3న స్టాక్ మార్కెట్ రాకెట్‌లా పైకి దూసుకెళ్లింది. కాబట్టి అప్పుడు కనుక వారు ఆ షేర్లను అమ్ముకుని ఉంటే భారీగా లాభాలు వచ్చేవి. అలా చేయటంలోని నియమబద్ధత గురించే ఇప్పుడు చక్రవర్తి ప్రశ్నలు లేవనెత్తుతున్నారు.

ఇలాంటి ప్రశ్నలకు ఆయనైతే ఎలా సమాధానం ఇస్తారనే విషయంలో సందేహం లేదు. ‘‘సంఘటనల కాలక్రమం, స్టాక్ మార్కెట్ డేటాలను అనుసరించి... ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేయటానికి మాత్రమే కాకుండా, స్టాక్ మార్కెట్‌లను ఉపయోగించి లాభపడటానికి కూడా ఎగ్జిట్ పోల్స్ ఆయుధాలు అయ్యాయని ఎవరైనా తేలిగ్గా చెప్పేయొచ్చు. ప్రపంచంలోనే మొట్టమొదటి ‘ఎగ్జిట్ పోల్ స్టాక్ మార్కెట్ స్కామ్’ ఇండియాలో జరిగి ఉంటుంది’’ అంటారు చక్రవర్తి.

మీడియా నిర్వహించినవి కనుక ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు లీక్ అయ్యే అవకాశం ఉందనే విషయాన్ని పక్కనపెడదాం. ఒకవేళ విదేశీ ఇన్వెస్టర్లే తమ సొంతంగా ఎగ్జిట్ పోల్స్‌ని జరిపించుకొని ఉండి, ఆ ఫలితాలు కూడా మీడియా నిర్వహించిన ఫలితాల దిశనే సూచిస్తూ ఉండి, వాటి ఆధారంగా వాళ్లు షేర్లు కొని ఉంటే అప్పుడది నియమబద్ధం అవుతుందా? ఒకటే ప్రశ్న ఏమిటంటే... విదేశీ ఇన్వెస్టర్లు అంత ప్రయాసతో ఎగ్జిట్ పోల్స్ జరిపించుకొని ఉంటారా? నాకైతే సందేహమే.

సగటు భారతీయ పెట్టుబడిదారుల విషయానికి వద్దాం. మొదట, వారు విన్నది ఇదీ: నరేంద్ర మోదీ ‘ఎకనమిక్ టైమ్స్’తో (మే 23న) మాట్లాడుతూ, ‘‘నేను నమ్మకంగా చెప్పగలను, జూన్ 4న బీజేపీ రికార్డు స్థాయిలో సీట్లు గెలుచుకుంటుంది. స్టాక్ మార్కెట్ కూడా కొత్త రికార్డులకు చేరుకుంటుంది’’ అన్నారు. అంతకు ముందు హోంమంత్రి ‘ఎన్డీటీవీ’తో (మే 13న) మాట్లాడుతూ, ‘‘జూన్ 4 లోపు షేర్లు కొనమని మీకు చెబుతున్నాను. అవి అమాంతం పెరగబోతున్నాయి’’ అన్నారు.

ఆ సలహాలపై వారు షేర్లు కొని ఉంటే, జూన్ 4న ఎన్నికల ఫలితాల తర్వాత స్టాక్ మార్కెట్ కుప్పకూలి పోవటం, వారి షేర్ల విలువ పాతాళానికి పడిపోవటం చూశారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఆ రోజు స్టాక్ మార్కెట్‌కు వచ్చిన నష్టం రూ. 30 లక్షల కోట్లు.

దాంతో సాధారణ ఇన్వెస్టర్లు నష్టపోయారు. అయితే మూడు రోజుల తర్వాత, వారాంతంలో శుక్రవారం 7వ తేదీన స్టాక్ మార్కెట్ ముగిసే సమయానికి 4వ తేదీన వచ్చిన నష్టాన్ని భర్తీ చేసుకోవటం మాత్రమే కాదు, షేర్ల పెరుగుదల ఎన్నడూ లేనంతగా గరిష్ఠ స్థాయికి ఎగబాకింది. ఇక్కడ ఇన్వెస్టర్లకు వచ్చినదానికంటే పోయినది ఎక్కువ.

దీనర్థం ‘సమస్య’ విదేశీ ఇన్వెస్టర్లలో ఉందని! అది దర్యాప్తు జరిపించవలసినంత సమస్యా? భారతదేశంలోని వ్యక్తులు, సంస్థల తరఫున వారు షేర్లలో పెట్టుబడి పెట్టి ఉంటారని మీకు అనుమానంగా ఉంటే అప్పుడు దర్యాప్తు అవసరం కావచ్చు. మీకలాంటి అనుమానం లేదా? వాళ్లు తమకై తామే ఇన్వెస్ట్ చేసి ఉంటారని బహుశా మీకు అనిపిస్తోందా? అప్పుడైతే తదుపరి చర్య అవసరం అవుతుందా?

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల ‘మనసులోని మాట’లు తాజాగా ఇలా...!

ఉత్తి పుణ్యానికి...



ఇజ్రాయెల్, లెబనాన్‌ల మధ్య జరుగుతున్న విషాదాన్ని వర్ణించడానికి నేను మాటలు వెతుక్కుంటున్నాను. ఫాక్ లాండ్స్ యుద్ధాన్ని అర్జెంటీనా రచయిత బోర్హెస్ ‘ఇద్దరు బట్టతల వాళ్లు దువ్వెన కోసం కొట్లాడుకోవడం’ అని అభివర్ణించారు (అర్జెంటీనా, బ్రిటన్‌ల మధ్య జరిగింది). నేను అంత కంటే బాగా చెప్పలేను.

– ఎమీ దార్, ఇజ్రాయెల్ యాక్టివిస్ట్

వేటాడటం తగునా?



అరుంధతీ రాయ్‌ను వేటాడటం న్యాయం కాదు. ఆమె గొప్ప రచయిత్రి, తనకంటూ ఒక అభిప్రాయం కలిగివుండే హక్కు ఉంది. దశాబ్దం క్రితం ఆమె అన్నదాని మీద ఇప్పుడు కేసు పెట్టడంపై అంతర్జాతీయ గగ్గోలు రేగాలి.

– అమితవ్ ఘోష్, రచయిత

‘పని’ కాదు!



వ్యభిచారం చేయించేందుకు మహిళల్ని ఎందుకు బలవంతంగా అక్రమ రవాణా చేస్తారు? అదే ప్లంబర్లనో, ఫైర్ ఫైటర్లనో, వైద్యులనో ఎందుకు బలవంతంగా తరలించరు? ‘సెక్స్ వర్క్’ గురించి అదేం చెబుతోంది? మహిళల్ని మోసం చేసి, బలాత్కరించి దాన్ని చేయిస్తారనేగా?

– హన్నా బెర్రెల్లి, సంపాదకురాలు

పనిచేయాలా?



సీనియర్ సిటిజన్‌లా కనబడుతున్న ఒక పెద్దమనిషి నుంచి నా ‘స్విగ్గీ’ ఆర్డర్ తీసుకోవడం నన్ను మూగబోయేలా చేసింది. ఉపాధి హామీ పథకం కింద వచ్చే కూలీ కోసం వృద్ధులు ఎండలో పనిచేయడం గుర్తొచ్చింది. 70, 80 ఏళ్ల వృద్ధులు పనిచేస్తుంటే చూడటానికి బాధగా ఉంటుంది. వాళ్లకు సామాజిక భద్రత లేకపోవడం విషాదకరం.

– తారా కృష్ణమూర్తి, యాక్టివిస్ట్

అనడం ఆమోదనీయమా?



సైన్యం బలవంతంగా కశ్మీర్‌ను ఆక్రమించుకుందని అరుంధతీ రాయ్ చెప్పినట్టుగా ఆడియో, డాక్యుమెంటరీ సాక్ష్యాలున్నాయి. ఇది ఎలా ఆమోదనీయం? ఆమె మీద ఎందుకు చర్య తీసుకోకూడదు? దేశాన్ని ‘బనానా రిపబ్లిక్’ అని ఎందుకు అంటున్నారు?

– పల్లవీ ఘోష్, జర్నలిస్ట్

నెమ్మదిగా జరుగుతుంది!



జనాలు ఎప్పుడూ ఏదో ఒక టర్నింగ్ పాయింట్ వచ్చి మొత్తం మారిపోతుందని ఎదురు చూస్తుంటారు. అలాంటిది ఒకటి అంటూ ఉండదు. నెమ్మదిగా మరింత మరింత మెరుగు కావడమే ఉంటుంది.

– రాబర్ట్ గ్రీనీ, రచయిత

ఇన్ బాక్స్

వామపక్షాలకు నూతనోత్తేజం

పార్లమెంటు ఎన్నికలలో సీపీఐ (ఎమ్ఎల్) లిబరేషన్ గ్రాండ్ రీ ఎంట్రీ ఇచ్చింది. రెండు సీట్లు గెలుపొంది వామపక్ష శ్రేణులకు నూతనోత్తేజాన్ని కలిగించింది. బిహార్‌లోని అరా, కరాకట్ లోక్‌సభ స్థానాల నుండి లిబరేషన్ అభ్యర్థులు సుదామ ప్రసాద్, రాజారామ్ సింగ్‌లు విజయ బావుటా ఎగురవేశారు. భారత గడ్డపై ఫాసిస్టు శక్తుల పెరుగుదల అత్యంత ప్రమాదకరంగా పరిణమించిన నేపథ్యంలో ప్రతిపక్షాలను ఒకతాటిపైకి తెచ్చేందుకు లిబరేషన్ తన వంతు కృషి చేస్తూ ‘ఇండియా’ కూటమిలో భాగస్వామిగా మారింది. అరా, కరాకట్, నలందా, కొడర్మ సీట్లలో బరిలో నిలిచింది. నలందా నియోజకవర్గంలో గట్టి పోటీ ఇచ్చిన ప్రస్తుత ఎమ్మెల్యే సందీప్ సౌరభ్ రెండో స్థానంలో నిలిచారు. జార్ఖండ్‌లో కొడెర్మలో వినోద్ సింగ్ (బాగోదర్ ఎమ్మెల్యే) రెండో స్థానంలో నిలిచారు. బిహార్‌లో అజియాన్ అసెంబ్లీ నియోజకవర్గానికి ఉప ఎన్నిక జరుగగా దానిని లిబరేషన్ నిలబెట్టుకుంది. ఇక్కడ శివ్ ప్రకాష్ రంజన్ విజయం సాధించారు.

మొదట సాయుధ మార్గాన్ని అనుసరించిన లిబరేషన్ పార్టీ కాలక్రమంలో తన పంథాను మార్చుకుంది. ఇండియన్ పీపుల్స్ ఫ్రంట్ (ఐపీఎఫ్)ను ఏర్పాటు చేసి 1985 ఎన్నికల్లో తొలిసారిగా ఎన్నికల్లో పాల్గొంది. 1989 పార్లమెంటు, 1990 అసెంబ్లీ ఎన్నికలలో బరిలో నిలిచి ఆశ్చర్యకరమైన ఫలితాలు సాధించింది. 1989లో తొలిసారిగా రామేశ్వర ప్రసాద్‌ను అరా నియోజకవర్గం నుంచి పార్లమెంటుకి పంపింది. ఆ తర్వాత జయంతా రోంగ్పి అస్సాంలోని కర్బీ అంగ్లాంగ్ నుంచి పలుమార్లు పార్లమెంటుకు ప్రాతినిధ్యం వహించారు. సుదీర్ఘకాలం తర్వాత మళ్లీ ఇద్దరు ఎంపీలను బిహార్ నుంచి పార్లమెంట్‌కు పంపింది.


1995 అసెంబ్లీ ఎన్నికల నాటి నుండి సీపీఐ (ఎమ్ఎల్) లిబరేషన్ పేరుతో పోటీ చేస్తోంది. 2010 ఎన్నికల్లో తప్ప మినహా ఆ పార్టీ ప్రతినిధులు మిగిలిన అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచి తమ గళాన్ని వినిపిస్తూనే ఉన్నారు. గతంలో ఒంటరిగా పోటీ చేసి పదకొండు మంది సభ్యులను అసెంబ్లీకి పంపిన చరిత్ర లిబరేషన్‌కు ఉంది. జైలులో ఉండి శాసన సభకు గెలిచిన చరిత్రా ఉంది. 2020 బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో లిబరేషన్ అపూర్వ విజయాల్ని సొంతం చేసుకుంది. 19 స్థానాల్లో పోటీ చేసి 12 చోట్ల గెలిచింది. ఒక మహిళా ఎమ్మెల్సీ శాసన మండలిలో ప్రాతినిధ్యం కలిగి ఉంది. సీట్ల సంఖ్యలో తరుగుదల, పెరుగుదల ఉన్నప్పటికీ నికరమైన, స్థిరమైన ఓటు బ్యాంకు, బలమైన ప్రజా పునాది కలిగి ఉండటం విశేషం. జార్ఖండ్ రాష్ట్రంలోనూ ఎమ్మెల్యేల ప్రాతినిధ్యం సుదీర్ఘ కాలంగా ఉంది. గతంలో అస్సాం, పంజాబ్ రాష్ట్రాల్లో ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహించారు. 25 రాష్ట్రాలలో పార్టీ, ప్రజా సంఘాల నిర్మాణం కలిగి ఉంది.

‘రణవీర్ సేన’ లాంటి ప్రైవేటు సైన్యాలను ఎదుర్కొన్న వీరోచిత చరిత్ర లిబరేషన్‌ది. అణచివేతలపైనా, సామాజిక న్యాయం కోసం దశాబ్దాల తరబడి పోరాటాలు కొనసాగిస్తూ వస్తోంది. విద్య, వైద్యం, భూమిలేని పేదల కోసం, రైతుల హక్కుల కోసం, ప్రాజెక్టుల కోసం ఉద్యమాలు నడిపింది. నిరంతరం పేదల కోసం పోరాడిన సుదామ ప్రసాద్, రాజారామ్ సింగ్‌లు పేదల హక్కుల్ని కాపాడడం కోసం పార్లమెంట్‌లో తమ గళాన్ని బలంగా వినిపించబోతున్నారు.

– మామిండ్ల రమేష్ రాజా,
సీపీఐ (ఎమ్ఎల్) లిబరేషన్ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి | 78932 30218

ఇకపైన పొటాషియం ఉప్పు వాడకం?!

అభిప్రాయం



డా. కె.బి. గోపాలం

మానవ జీవితంలో ప్రాధాన్యం ఉన్న లవణం ఉప్పు (సోడియం క్లోరైడ్). దీన్ని ఆహారంలో తీసుకునే పరిమాణాన్ని బట్టి మన ఆరోగ్య పరిస్థితి ఆధారపడి ఉంటుందనేది ప్రచారంలో ఉన్న విషయం. ఒకప్పుడు అయోడిన్ అనే సూక్ష్మ పోషకం లోపం కారణంగా చాలామంది ఆరోగ్య సమస్యను ఎదుర్కొన్నందున అయోడిన్ కలిపిన ఉప్పును వాడుతూ ఆ సమస్య నుంచి బయటపడ్డారు. ఇప్పుడు మరో కొత్త విషయాన్ని కనుగొన్నారు. పొటాషియాన్ని తగినంతగా తీసుకోకపోవడం వల్ల బీపీ (బ్లడ్ ప్రెషర్) పెరుగుతున్నదనీ, అందువల్ల ఉప్పులో పొటాషియంను కలిపి తీసుకోవాల్సిన అవసరం ఉందనీ పరిశోధకుల సలహా.

ప్రజల్లో అయోడిన్ లోపాన్ని సరిదిద్దడానికి ప్రభుత్వపరంగా నిర్ణయాలు జరిగాయి. పరిశ్రమల వారు తగిన జాగ్రత్తలు తీసుకున్నారు. కనుక ప్రపంచంలో అందరికీ ఉప్పుతో పాటు అయోడిన్ కూడా అందింది. మొత్తం మీద ప్రపంచ వ్యాప్తంగా వస్తున్న ఒక ఆరోగ్య సమస్యకు అన్ని దేశాల వారూ కలిసి సమాధానం తెలుసుకుని అమలు చేయగలిగారు. మరి అదే విధంగా పొటాషియం లోపాన్ని తగ్గించడానికి ఇంతటి కృషి ప్రపంచవ్యాప్తంగా జరుగుతుందా?



మనకు తెలిసి హైపర్ టెన్షన్, లేదా అధిక రక్తపోటు అనేది పెద్ద ఆరోగ్య సమస్య. అసలు నిజానికి అనారోగ్యాలు, మరణాలకు ఇదే ఎక్కువగా కారణంగా ఉంటున్నది. అందుకు కారణం ఏమిటి అని వెతికితే ఉప్పు ఎక్కువగా తినడం అని తెలిసిపోయింది. ఇంకేముంది, అందరూ వీలైనంత తక్కువగా ఉప్పు తింటున్నారు. చాలామంది కారం కూడా తినడం లేదు. మొత్తానికి తిండి తీరు మారిపోయింది. ఇక్కడ ఒక చిన్న చిక్కు ఉన్నది. ఉప్పు ప్రభావం అందరి మీద ఉంటుంది అనడానికి లేదు. ప్రభావం కనిపించే 50 శాతం మందిలో మాత్రం అది సూటిగా తెలిసిపోతుంది. ఉప్పు ప్రభావం మీద జన్యుపరంగా వచ్చే లక్షణాల పాత్ర ఉందని తెలిసింది. పరిశోధకులు అంతా పూనుకుని ఈ విషయం గురించి ఎన్నో సంగతులను కనుగొన్నారు. ఇప్పుడు అందరూ పొటాషియం కలిపిన ఉప్పు తింటే ఈ బ్లడ్ ప్రెషర్ సమస్య తగ్గుతుందని అంటున్నారు. అంటే మనం తినే తిండి తీరు మరొకసారి మారిపోతుందన్నమాట.

ఏదో ఒక పేరున అందరూ సోడియం బాగా తింటున్నారు. అవసరం కన్నా ఎక్కువ తింటున్నారు. కనుక రక్తపోటు పెరుగుతున్నది. ఎవరికీ ప్రయత్నించి పొటాషియం తినడం అన్నది తెలియదు. శరీరానికి అవసరమైనంత పొటాషియం తినేవారు మొత్తం జనాభాలో 14 శాతం మాత్రమే ఉన్నారని పరిశోధకులు గుర్తించారు.

సోడియం పూర్తిగా తినకుండా ఉండడం కుదరదు. అదే సమయంలో శరీరంలో సోడియం – పొటాషియం ఉండవలసినంత ఉంటేనే ఆరోగ్యం బాగుంటుంది. ఈ సంగతి ఎవరికీ అంత వివరంగా తెలియదు. అంటే మరోసారి ప్రభుత్వాలు, పరిశ్రమల వారు పరిస్థితిని గుర్తించి పనిలోకి దిగవలసిన సమయం వచ్చింది. ఒకప్పుడు ఉప్పుతో కలిపి అయోడిన్ తిన్నట్లే, ఇప్పుడు ఉప్పుతోనూ, మరిన్ని రకాలుగానూ సోడియం బదులు పొటాషియం తీసుకోవాలి. ఈ మార్పు వస్తే వెంటనే బ్లడ్ ప్రెషర్ అంటే రక్త పోటు అనే సమస్యకు దానంతట అదే సమాధానం దొరుకుతుంది. కనుక ప్రస్తుతం మన పరిస్థితిని గుర్తించుకొని వెంటనే అదనంగా పొటాషియం తీసుకోవడం మొదలు పెట్టాలి. పరిశ్రమల వారు ఉప్పుతోనూ, తిండి పదార్థాలతోనూ పొటాషియం అదనంగా అందించే పరిస్థితి లేకపోతే ప్రభుత్వాలు రంగంలోకి దిగాలి.


రక్తపోటు పెరగడం ద్వారా వచ్చే ఆరోగ్య సమస్యలకు ప్రపంచం తల్లడిల్లిపోతున్నది. సోడియంతో పాటు పొటాషియం తిన్నందుకు రుచిలో ఎటువంటి తేడా కూడా రాదు. ఇది అందరూ గుర్తించవలసిన మరొక విషయం. సిడ్నీ (ఆస్ట్రేలియా)లో ఉన్న ‘జార్జ్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ గ్లోబల్ హెల్త్’ అనే సంస్థలో పనిచేస్తున్న బ్రూస్ నీల్ పొటాషియం వాడుక మంచిదని గట్టిగా చెబుతున్నారు.

ఇక్కడ గమనించవలసిన విషయాలు కొన్ని ఉన్నాయి. మనం తినే తిండిలో ఎంత పొటాషియం ఉంది అని గుర్తించడం కష్టం. అందరూ అవసరమైన దానికి తక్కువ తీసుకుంటున్నారు అన్నది మాత్రం నిజం. కనీసం 3.5 గ్రాముల పొటాషియం శరీరానికి అందాలి. అందుకోసం అందరూ పండ్లు ఎక్కువగా తినాలట! అన్నట్టు అరటిపళ్ళలో పొటాషియం ఎక్కువగా ఉంటుంది. బొప్పాయి పళ్లలో కూడా ఉంటుంది. ఏదో రకంగా పొటాషియం శరీరానికి అందే పద్ధతులు రావాలి. త్వరలోనే రక్తపోటు సమస్య తగ్గుతుందని పరిశోధకులు భరోసా ఇస్తున్నారు.

వ్యాసకర్త సైన్స్ విషయాల రచయిత | 98490 62055

మౌలిక విధులు

ఇస్లామ్ ధర్మంలోని ఐదు మౌలిక సూత్రాల్లో ‘హజ్’ కూడా ఒకటి. కలిమా, నమాజ్ , రోజా, జకాత్ , హజ్ అనే మౌలిక సూత్రాల్లో ఏ ఒక్క దాన్ని నమ్మక పోయినా విశ్వాసం పరిపూర్ణం కాదు. అందుకని ఈ ఐదు అంశాల పట్ల విశ్వాసం కలిగి ఉండాలి. ఇందులోని చివరి అంశం హజ్. హజ్రత్ ఇబ్రాహీం అలైహిస్సలాం, హజ్రత్ ఇస్మాయీల్ అలైహిస్సలాం మక్కాలో నిర్మించిన దైవ గృహ సందర్శనా ప్రక్రియను ‘హజ్’ అంటారు. హజ్ అనేది ఆర్థిక స్థోమత కలిగిన ప్రతి ముస్లిం జీవిత కాలంలో కనీసం ఒక్కసారైనా తప్పక ఆచరించాల్సిన విధి.



ఇది జిల్ హజ్జ్ నెల పదవ తేదీన మక్కాలో నిర్వహించబడుతుంది. అదేరోజు యావత్ ప్రపంచ ముస్లింలు ఈద్ జరుపుకొని ఖుర్బానీలు సమర్పిస్తారు. ఇస్లామీయ క్యాలండరులో ఇది చివరి నెల. దీని తరువాత కొత్త సంవత్సరం ప్రారంభమవుతుంది.

అందుకే ఈ నెలకు ఎనలేని ప్రాముఖ్యం ఏర్పడింది. ఈ నెలలోని మొదటి పదిరోజులూ చాలా ప్రాముఖ్యం కలిగినవి. ఈ దశకంలో దైవ కారుణ్యం కుండపోతగా వర్షిస్తూ ఉంటుంది. ఈ రోజుల్లో చేసే ప్రతి సత్కార్యమూ గొప్ప ప్రాముఖ్యాన్ని కలిగి దేవుని కృపకు పాత్రమవుతుంది. ఈ దినాల్లో చేసిన ఆరాధనలు ప్రీతికరమైనంతగా, మరే ఇతర దినాల్లో చేసిన ఆరాధనలు కూడా దైవానికి అంతగా ప్రీతికరం కావు. ఈరోజుల్లో పాటించే ఒక్కొక్క రోజా (ఉపవాసం)... ఏడాది మొత్తం పాటించే రోజాలకు సమానం. ‘అరఫా’ (జిల్ హజ్ నెల 9వ తేదీ) నాటి ఒక్క రోజా రెండు సంవత్సరాల పాపాలను ప్రక్షాళన చేస్తుంది. అరఫా రోజు సైతాన్ ఘోర పరాజయాన్ని చవిచూస్తాడు. అవమాన భారంతో చితికి పోతాడు.

‘అరఫా’ రోజు ‘లాయిలాహ ఇల్లల్లాహు వహదహూ లాషరీకలహు, లహుల్ ముల్కు వలహుల్ హందు వహువ అలాకుల్లి షయ్ ఇన్ ఖదీర్’ అనే దుఆ ఎక్కువగా పఠిస్తూ ఉండాలి. దీనితో పాటు ‘తహ్‌లీల్’ అంటే, ‘లాయిలాహ ఇల్లల్లాహ్’; ‘తక్బీర్’ అంటే, ‘అల్లాహు అక్బర్’; ‘తహ్ మీద్’ అంటే, ‘అల్ హందులిల్లాహ్’; ‘తస్ బీహ్’ అంటే, ‘సుబ్ హానల్లాహ్’ అని తరచుగా ధ్యానిస్తూ ఉండాలి. అరఫా రోజే కాకుండా ‘అయ్యామె తష్రీఖ్’లో కూడా అంటే, పండుగ తరువాతి మూడు రోజులూ (జిల్ హజ్ నెలలోని 11, 12, 13 తేదీలు) వీలైనంత అధికంగా ఈ వచనాలు పఠించాలి. కనుక ఈ సుదినాలను సద్వినియోగం చేసుకుంటూ పండుగ ముందు రోజు పాటించే ‘అరఫా’ ఉపవాసం పాటించి, సత్కార్యాలు ఆచరిస్తూ దైవకృపకు పాత్రులు కావడానికి ప్రయత్నించాలి. దైవం మనందరికీ సన్మార్గ పథం అనుగ్రహించుగాక!

– మదీహా అర్జుమండ్ (నేడు బక్రీద్)

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, జ్యేష్ఠ మాసం, తిథి: శు.ఏకాదశి తె.4.26 వరకు(తెల్లవారితే మంగళవారం), తదుపరి ద్వాదశి, నక్షత్రం: చిత్ర ప.12.35 వరకు, తదుపరి స్వాతి, వర్జ్యం: రా.6.40 నుండి 8.24 వరకు, దుర్ముహూర్తం: ప.12.27 నుండి 1.19 వరకు, తదుపరి ప.3.04 నుండి 3.56 వరకు, అమృతఘడియలు: తె.5.06 నుండి 6.50 వరకు(తెల్లవారితే మంగళవారం); రాహుకాలం: ఉ.7.30 నుండి 9.00 వరకు; యమగండం : ఉ.10.30 నుండి 12.00 వరకు; సూర్యోదయం: 5.29 ; సూర్యాస్తమయం: 6.32.

క్లుప్తంగా...

19న బాధ్యతలు చేపట్టనున్న పవన్‌కళ్యాణ్

సాక్షి, అమరావతి: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా పవన్‌కళ్యాణ్ ఈ నెల 19వ తేదీన బాధ్యతలు చేపట్టనున్నారని ఆయన రాజకీయ కార్యదర్శి హరిప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయనకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, ఆర్‌డబ్ల్యూఎస్, పర్యావరణ, అటవీ, శాస్త్రసాంకేతిక శాఖలు కేటాయించిన విషయం తెలిసిందే.

ఆర్టీపీపీలో తగ్గిన బొగ్గు నిల్వలు

2వ యూనిట్‌లో విద్యుత్ ఉత్పత్తి నిలుపుదల



ఆర్టీపీపీకి వస్తున్న బొగ్గు వ్యాగన్లు

ఎర్రగుంట్ల: వైఎస్సార్ జిల్లా ఎర్రగుంట్ల మండలంలోని రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టు(ఆర్టీపీపీ)లో బొగ్గు నిల్వలు అడుగంటాయి. మొత్తం 1,650 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం కలిగిన ఆర్టీపీపీలో ఆరు యూనిట్లు ఉన్నాయి. అన్ని యూనిట్లు రన్నింగ్‌లో ఉంటే ఒక రోజుకు సుమారు 21 మెట్రిక్ టన్నుల బొగ్గు అవసరం. బొగ్గు నిల్వలు తక్కువగా ఉండటంతో రెండో యూనిట్‌లో విద్యుత్ ఉత్పత్తిని నిలిపివేసి ఓవర్‌హాలింగ్ పనులు చేస్తున్నారు. ప్రస్తుతం 1, 3, 4, 5, 6 యూనిట్లు పనిచేస్తున్నట్లు ఆర్టీపీపీ సీఈ గౌరిపతి తెలిపారు. బొగ్గు నిల్వలు రెండు రోజులకు సరిపడా ఉన్నాయన్నారు. ఇక ఏ రోజుకు ఆ రోజు బొగ్గు నిల్వలు వస్తున్నాయని ఆయన చెప్పారు.

ఏనుగు దాడిలో రైతు మృతి



మృతుడు కన్నానాయక్ (ఫైల్)

రామకుప్పం(చిత్తూరు జిల్లా): మండలంలోని పీఎం తండా పరిధిలో ఏనుగు దాడి చేయడంతో రైతు మృతి చెందాడు. పీఎం తండాకు చెందిన కన్నా నాయక్(50) శనివారం రాత్రి పొలం వద్దకు వెళ్తుండగా ఏనుగు దాడి చేసింది. ఈ దాడిలో రైతు అక్కడికక్కడే మృతి చెందాడు. రైతు మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

నా జీవితం.. 'అందమైన పూలతోట' కాదు

జీవిక కోసం ఎన్నో ఉద్యోగాలు

- చివరకు బాలసాహిత్యమే ప్రపంచమైంది
- ఆ నవలతోనే జీవితానికో మలుపు
- కమర్షియల్ కాదలచుకోలేదు
- సీరియస్ సాహిత్యాన్నే రాశాను
- కేంద్ర సాహిత్య అకాడమీ బాలసాహిత్య అవార్డు గ్రహీత పి.చంద్రశేఖర అజాద్

తెనాలి: 'నా జీవితం అందమైన పూలతోట కాదు.. జీవనం కోసం ఎన్నెన్నో చిరుద్యోగాలు చేశాను. అన్నింటిలోను అత్తెసరు సంపాదనే. చివరకు రచనా వ్యాసంగమే బాలసాహిత్య ప్రపంచంలో నిలబెట్టింది. గుర్తింపువచ్చాక వెనుదిరిగి చూసుకోలేదు. కథలు, నవలికలు, నవలలు, టెలీఫిలింస్‌తో బిజీ అయ్యాను. కమ్యూనిస్టు నేపథ్యం ఉండటంతో కమర్షియల్ కాదలచుకోలేదు. సీరియస్ సాహిత్యాన్నే చేశాను. సామాజిక సమస్యలతో కూడిన ఇతివృత్తాలతోనే సాహిత్య సృజన చేశాను. ఇప్పుడీ అవార్డుకు ఎంపికవటం సంతోషంగా ఉంది..' కేంద్ర సాహిత్య అకాడమీ బాలసాహిత్య అవార్డుకు ఎంపికైన ప్రముఖ బాలసాహితీవేత్త, నవలా రచయిత, కాలమిస్ట్, టెలీఫిలింస్ కథ, మాటలు, స్క్రీన్‌ప్లే రచయిత పి.చంద్రశేఖర ఆజాద్ స్పందన ఇది. అవార్డు వచ్చిన నేపథ్యంలో ఆయన 'సాక్షి'తో మాట్లాడారు.

చంద్రశేఖర ఆజాద్ స్వస్థలం ఉమ్మడి గుంటూరు జిల్లా భట్టిప్రోలు మండల గ్రామం వెల్లటూరు. 1955 మే 24న జన్మించారు. తండ్రి పమిడిముక్కల లక్ష్మణరావు. అప్పట్లో కమ్యూనిస్టు యోధుడు. తెలంగాణ పోరాటంలో పాల్గొని జైలుకెళ్లారు. కొడుక్కి స్వాతంత్ర్యయోధుడు చంద్రశేఖర అజాద్ పేరు పెట్టారు. అజాద్‌కు ఏడేళ్ల వయసులోనే ఆయన మరణించారు. గుంటూరులోని సీపీఎం కార్యాలయం ఆయన పేరుతోనే ఉంటుంది. రేపల్లెలో ఇంటర్ వరకు చదివిన అజాద్.. ఆ మరుసటిరోజే తెనాలిలోని బావగారి హోటల్లో పనికి కుదిరాడు. ఏ ఉద్యోగంలోను ఎక్కువకాలం చేయలేదు. నవభారత్ టొబాకోలో కొంతకాలం, తర్వాత మరికొన్నింటిలో పనిచేశారు.

అపరాధ పరిశోధన.. నిలబెట్టింది

ఏదో ఒక ఉద్యోగం చేస్తూనే తనలోని భావాలను అక్షరాల్లోకి మార్చే ప్రయత్నం చేశారు అజాద్. వాటిని అప్పటి దినపత్రికలకు పంపేవారు. ఆరోజుల్లో 'అపరాధ పరిశోధన' మాసపత్రిక వచ్చేది. తన కథలు, నవలికలు పంపుతుండేవారు. 'ఆ పుస్తకమే




తనను రచయితగా నిలబెట్టింది..' అని అజాద్ గుర్తు చేసుకున్నారు. 'ఆ పత్రికకు 16–17 నవలికలు, 40కి పైగా కథలు రాశాను. అప్పట్లోనే కథకు రూ.75, నవలికకు రూ.125 నుంచి రూ.150 చొప్పున ఇచ్చేవారు. చేసే ఉద్యోగంతో నెలకు రూ.180 వరకు వచ్చేవి. అమ్మ విజయలక్ష్మి వాళ్లంతా తెనాల్లో ఉండేవారు. ఆ డబ్బులు తీసుకుని అమ్మను చూడ్డానికి వెళ్లేవాడిని..' అని చెప్పారు. తర్వాత ఆంధ్రప్రదేశ్ ట్రేడింగ్ కార్పొరేషన్‌లో చేరారు. రోజుకు రూ.10 వేతనం. సెలవులొస్తే అది కూడా ఉండేది కాదు. 1974లో పెళ్లయింది. భార్య, ఇద్దరు పిల్లలు. 1982 వరకు నెలకొచ్చే వేతనం ఏనాడు రూ.180కి మించలేదు.

అందమైన పూలతోటకు మొదటి బహుమతి

1983లో ఒక దినపత్రిక ఆధ్వర్యంలో నడుస్తున్న బాలల మాసపత్రిక బాలల నవలల పోటీని ప్రకటించింది. 'అందమైన పూలతోట' అనే నవలను రాసి పంపారు. తెలుగు బాలసాహిత్యంలో ఒక ప్రయోగాత్మకమైన ఆ నవలకు ప్రథమ బహుమతి, ఆరుద్ర భార్య రామలక్ష్మి రాసిన నవలకు ద్వితీయ బహుమతి వచ్చాయి. 'మహదానందం కలగటమే కాదు.. ఆ నవలతో నా జీవితం మలుపు తిరిగింది..' అన్నారు అజాద్. 'అప్పటికే యండమూరి వీరేంద్రనాథ్, యద్దనపూడి సులోచనారాణి వంటి రచయితలు సాహితీ ప్రపంచాన్ని ఏలుతున్నారు. నాలాంటి వర్ధమాన రచయితలకు ఖాళీలేదని అర్థమైంది. బాలసాహిత్యంలో అవకాశం ఉందనిపించటంతో అప్పట్నుంచి పిల్లలకోసం అంకితమయ్యాను..' అంటారు అజాద్. విజయవాడ నుంచి వెలువడే 'స్వాతి' మాసపత్రికలో అవకాశమిచ్చారు. 'మా హృదయం' పేరుతో పదేళ్లలోపు పిల్లలకు అమ్మ, నాన్నతో మొదలుకొని వారికి సంబంధించిన మొత్తం 50 అంశాలను వారి భాషలో రాసిన సీరియల్‌కు కూడా మంచి గుర్తింపు లభించింది. స్వాతి మాసపత్రికల్లో ఆ సీరియల్ ఆఖరిది. అప్పట్నుంచి రచనలు వేగం పుంజుకున్నాయి.

కట్‌చేస్తే.. ఇప్పటికి 85 నవలలు, 17 నవలికలు, 850కి పైగా కథలు రాశారు. కమ్యూనిస్టు నేపథ్యం కావటంతో సీరియస్ సాహిత్యమే చేశానంటారు అజాద్. సామాజిక అంశాలకు సంబంధించిన ఏదో ఒక సమస్యను చర్చించినవే అన్నీ. వందకుపైగా కథలు, 30కి పైగా నవలలు వివిధ బహుమతులు గెల్చుకున్నాయి. తెలిమబ్బుల ఛాయ, మనో ప్రస్థానం, నగరంలో వెన్నెల నవలలకు వరుసగా మూడేళ్లు ఆటా, తానా బహుమతులు లభించాయి.



కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించిన 'మాయాలోకం' బాలల కథల పుస్తకం

ఆకర్షించిన బుల్లితెర

మరోవైపు బుల్లితెర రంగం కూడా అజాద్‌ను ఆకర్షించింది. దూరదర్శన్‌లో 'జీవన తీరాలు' సీరియల్‌తో ఆరంభించి, రాధా మధు, లయ, అడగక ఇచ్చిన మనసు, ఎదురీత సీరియల్స్‌తో మొత్తం ఐదువేల ఎపిసోడ్లకు రచనా సహకారం అందించారు. సామాజిక, మానవ భావోద్వేగాలకు సంబంధించిన అన్నిరకాల సమస్యలను చర్చించారు. అజాద్ రచనా సహకారం అందించిన పాండవులు, అడవిపూలు, బోన్సాయ్, తమసోమా టెలీఫిలింస్‌కు మూడు స్వర్ణాలు, వెండి నంది వచ్చాయి. అడవిపూలు టెలీఫిలింకు కథ, స్క్రీన్‌ప్లే, సంభాషణలకుగాను వ్యక్తిగతంగా నంది బహుమతిని స్వీకరించారు. సరదా కోసం కొన్ని టెలీఫిలింస్, టీవీ సీరియల్స్‌లోను ఆయన నటించారు. ఉపాధికోసం గుంటూరు, ఒంగోలు, ఏలూరు, రాజమండ్రిలో ఉన్నపుడు కొన్ని సాంస్కృతిక సంస్థల నిర్వహణలోను పనిచేసిన ఆయన ప్రస్తుతం హైదరాబాద్‌లో స్థిరపడ్డారు.

విపరీత వ్యక్తులు, అహానికి రంగుండదు, ముక్తి పర్వం, దేవుడొచ్చాడు నవలలు కూడా గుర్తింపు పొందాయి. పిల్లల ప్రపంచం, నాన్నకో ఉత్తరం, మూడ్స్, ఎక్స్‌ప్రెషన్స్, ఇంప్రెషన్స్ పేరుతో దినపత్రికల్లో రాసిన కాలమ్స్ ప్రజాదరణ పొందాయి. గతంలో ఆంధ్రభూమి దినపత్రికలో వచ్చిన 'నగరంలో వెన్నెల' ఇప్పుడో సాహిత్య మాసపత్రికల్లో సీరియల్‌గా ఆరంభమైందని తెలిపారు అజాద్.

హైకోర్టుల్లో 331 న్యాయమూర్తుల పోస్టులు ఖాళీ

- జిల్లాలు, సబార్డినేట్ కోర్టుల్లో 5,342 పదవులు కూడా
- అలహాబాద్ హైకోర్టులో అత్యధికంగా 70 ఖాళీలు
- ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో 7
- భర్తీకి కేంద్ర న్యాయ శాఖ చర్యలు

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో 7, తెలంగాణ హైకోర్టులో 16 న్యాయమూర్తుల పదవులు ఖాళీగా ఉన్నాయని కేంద్ర న్యాయ మంత్రిత్వ శాఖ తెలిపింది. అలాగే ఆంధ్రప్రదేశ్‌లో జిల్లాలు, సబార్డినేట్ కోర్టుల్లో 84, తెలంగాణలో 115 న్యాయమూర్తుల పదవులు ఖాళీగా ఉన్నట్లు వెల్లడించింది. దేశంలో వివిధ రాష్ట్రాల హైకోర్టుల్లో ఈ ఏడాది ఫిబ్రవరి నాటికి 331 న్యాయమూర్తుల పోస్టులు ఖాళీగా ఉన్నాయని వివరించింది. అదేవిధంగా ఆయా రాష్ట్రాల్లోని జిల్లాలు, సబార్డినేట్ కోర్టుల్లో 5,432 న్యాయమూర్తుల పదవులు ఖాళీగా ఉన్నాయని పేర్కొంది. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టుతో పాటు హైకోర్టుల్లో ఖాళీగా ఉన్న న్యాయమూర్తుల పదవులను ఎప్పటికప్పుడు భర్తీ చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయని తెలిపింది. న్యాయమూర్తుల పదవీ విరమణ, రాజీనామాలు, పదోన్నతుల ద్వారా ఖాళీ అయిన పదవులను వీలైనంత త్వరగా భర్తీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించింది. ఇది నిరంతర ప్రక్రియని స్పష్టం చేసింది. దేశంలోని జిల్లాల కోర్టుల్లో న్యాయమూర్తుల పదవులను భర్తీ చేయాల్సిన బాధ్యత ఆయా రాష్ట్రాల హైకోర్టులతో పాటు రాష్ట్ర ప్రభుత్వంపై ఉంటుందని పేర్కొంది. నిబంధనల ప్రకారం.. జిల్లా, సబార్డినేట్ కోర్టుల్లో న్యాయమూర్తుల ఎంపిక, నియామకాల్లో కేంద్ర ప్రభుత్వానికి సంబంధం లేదని తెలిపింది. అలహాబాద్ హైకోర్టులో అత్యధికంగా 70 న్యాయమూర్తుల పదవులు ఖాళీగా ఉన్నాయని వెల్లడించింది. ఆ తర్వాత పంజాబ్, హరియాణా ఉమ్మడి హైకోర్టులో 29, బాంబే హైకోర్టులో 25, కలకత్తా, గుజరాత్ హైకోర్టుల్లో 21 చొప్పున ఖాళీలు ఉన్నట్లు కేంద్ర న్యాయ మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. అత్యధికంగా ఉత్తరప్రదేశ్‌లో జిల్లా, సబార్డినేట్ కోర్టుల్లో 1,250, గుజరాత్‌లో 535, బిహార్‌లో 467, తమిళనాడులో 334, రాజస్థాన్‌లో 300 న్యాయమూర్తుల పదవులు ఖాళీగా ఉన్నాయని తెలిపింది.

దుర్గమ్మ సేవలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి



జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రాకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఈవో రామారావు

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. వీరికి అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ప్రత్యేకదర్శన ఏర్పాట్లు చేశారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రాకు వేద పండితులు ఆశీర్వచనం పలుకగా, ఈవో కె.ఎస్.రామారావు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.

లక్ష్మీనృసింహుడి సన్నిధిలో జస్టిస్ మల్లికార్జునరావు



జస్టిస్ మల్లికార్జునరావుకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఏసీ సత్యనారాయణ

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుడిని ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లికార్జునరావు కుటుంబసమేతంగా ఆదివారం దర్శించుకున్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. తొలుత న్యాయమూర్తికి ఆలయ మర్యాదలతో ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్, స్థానాచార్య వింజమూరి రామరంగాచార్యులు, అర్చకుడు జి.రాజేష్ స్వాగతం పలికారు. పూజల అనంతరం అర్చకులు ఆశీర్వచనాలు పలుకగా, అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ స్వామివారి చిత్రపటం, లడ్డూ ప్రసాదం అందజేశారు.

శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు

తిరుమల: తిరుమల శ్రీవారిని కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అశోక్ ఎస్.కనిగి ఆదివారం దర్శించుకున్నారు. ఈయనకు ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనానంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు పలుకగా.. టీటీడీ అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు. శ్రీవారిని దర్శించుకున్న వారిలో ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్, డీజీ గోపీనాథ్ జెట్టి తదితరులు ఉన్నారు.



కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అశోక్ ఎస్ కనిగి

దుర్గగుడికి రికార్డు స్థాయిలో ఆదాయం

టికెట్లు, వివిధ సేవల రూపంలో ఆదివారం ఒక్కరోజే రూ.54.09 లక్షలు

ఇంద్రకీలాద్రి (విజయవాడపశ్చిమ): విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గగుడి దేవస్థానానికి ఆదివారం టికెట్లు, ఇతర సేవల ద్వారా అరకోటి రూపాయలకు పైగా ఆదాయం లభించిందని ఆలయ ఏఓ కె.ఎస్.రామారావు తెలిపారు. గడిచిన మూడు రోజులుగా దేవస్థానానికి భారీగా ఆదాయం సమకూరిందన్నారు. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు వివిధ టికెట్లు, సేవల ద్వారా రూ.54.09 లక్షల ఆదాయం లభించింది. కేవలం రూ.500 టికెట్ల విక్రయాల ద్వారా రూ.16.18 లక్షలు, రూ.300 టికెట్ల విక్రయాల ద్వారా రూ.8.26 లక్షలు, రూ.100 టికెట్ల విక్రయాల ద్వారా రూ.9.01 లక్షలు ఆదాయం లభించింది. ఇక కేశఖండనశాలలో 4,936 మంది తలనీలాలు సమర్పించారు. 68,749 అమ్మవారి లడ్డూలు విక్రయించారు. ఇక విరాళాల ద్వారా రూ.2.07 లక్షలు వచ్చాయి. శుక్ర, శనివారాల్లో టికెట్ల విక్రయం ద్వారా రూ.73.13 లక్షల మేర ఆదాయం సమకూరింది. ఈ వేసవి సెలవుల్లో ఆదివారం రికార్డు స్థాయిలో భక్తులు అమ్మవారిని దర్శించుకోగా, టికెట్ల విక్రయం ద్వారా అదే స్థాయిలో దేవస్థానానికి ఆదాయం సమకూరింది.

బంగారు హారం సమర్పణ

దుర్గమ్మకు ముంబైకి చెందిన భక్తులు అహిల్యా వసంతరావు పాటిల్ కుటుంబం బంగారు హారాన్ని కానుకగా సమర్పించింది.



ఆదివారం అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి వచ్చిన వీరు ఆలయ అధికారులను కలిసి సుమారు రూ.4 లక్షల విలువైన 59 గ్రాముల బంగారు హారాన్ని అందజేశారు. అమ్మవారి దర్శనం అనంతరం వేద పండితులు ఆశీర్వచనం పలు కగా, ఆలయ అధికారులు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.

శ్రీభోగ శ్రీనివాసమూర్తికి ప్రత్యేక సహస్ర కలశాభిషేకం

తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంలో శ్రీభోగ శ్రీనివాసమూర్తికి ప్రత్యేక సహస్ర కలశాభిషేకం ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం గరుడాళ్వార్ సన్నిధిలో శ్రీదేవి, భూదేవి సమేత మలయప్ప స్వామి వారు, శ్రీభోగ శ్రీనివాసమూర్తి, విష్వక్సేనులవారిని వేంచేపు చేశారు. శ్రీవారి మూలమూర్తికి ముందు గరుడాళ్వార్ సన్నిధిలో కౌతుకమూర్తి అయిన శ్రీమనవాళ పెరుమాళ్ (శ్రీ భోగ శ్రీనివాసమూర్తి) ఆయనకు అభిముఖంగా విష్వక్సేనులవారిని ఉంచారు. తర్వాత శ్రీవారి మూలమూర్తిని శ్రీభోగ శ్రీనివాసమూర్తికి కలుపుతూ దారం కట్టి అనుసంధానం చేశారు. అనగా శ్రీ భోగ శ్రీనివాసమూర్తికి నిర్వహించే అభిషేకాది క్రతువులు మూలమూర్తికి నిర్వహించినట్లు అవుతుంది. అనంతరం వేద పండితులు వేద పారాయణం చేయగా, అర్చక స్వాములు ప్రత్యేక సహస్ర కలశాభిషేకం నిర్వహించారు. ఆలయంలో ఏకాంతంగా జరిగిన ఈ కార్యక్రమంలో జేఈవో వీరబ్రహ్మం దంపతులు, ప్రధాన అర్చకుడు వేణుగోపాల్ దీక్షితులు పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 30 గంటలు: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూ కాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు అన్నీ నిండిపోయాయి. క్యూలైన్ నందకం వద్దకు చేరింది. శనివారం అర్ధరాత్రి వరకు 82,886 మంది స్వామివారిని దర్శించుకున్నారు. కానుకల రూపంలో హుండీలో రూ.4.09 కోట్లు సమర్పించారు. దర్శన టికెట్లు లేని భక్తులకు 30 గంటల్లో దర్శనం లభిస్తోంది.

న్యాయవాదులకు ఓర్పు, నేర్పు అవసరం

సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా



సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రాను సత్కరిస్తున్న ఏపీ బార్ కౌన్సిల్ సభ్యులు

తాడేపల్లిరూరల్: ఆధారాలను సేకరించడంలో న్యాయవాదులు ఓర్పు, నేర్పు కలిగి ఉండాలని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా సూచించారు. వడ్డేశ్వరంలోని కేఎల్ వర్సిటీలో ఏపీ బార్ కౌన్సిల్ ఆధ్వర్యాన మూడు రోజులుగా నిర్వహిస్తున్న న్యాయవాదుల అవగాహన సదస్సు ఆదివారం ముగిసింది. చివరి రోజు సదస్సుకు జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ భారతీయ న్యాయ సంహిత.. ఐపీసీని పోలి ఉందన్నారు. సైబర్ క్రైమ్, లింగ వివక్ష చట్టం, ఉగ్రవాద వ్యతిరేక చట్టాలలోని పలు సెక్షన్ల గురించి న్యాయవాదులకు అవగాహన కల్పించారు. ఆస్తి బదిలీ చట్టం, ఆస్తి హక్కు, నిర్దిష్ట ఉపశమన చట్టం, రిజిస్ట్రేషన్ చట్టం, మేథో సంపత్తి హక్కులు, ఎల్రక్టానిక్ ఆధారాలు, రాజ్యాంగ లక్ష్యాలను సాధించడంలో న్యాయవాది పాత్ర, డాక్యుమెంటేషన్ వంటి పలు అంశాల గురించి న్యాయవాదులకు వివరించారు. ఏపీ బార్ కౌన్సిల్ చైర్మన్ నల్లారి ద్వారకానాథ్‌రెడ్డి, కేఎల్‌యూ వీసీ డాక్టర్ జి.పార్థసారథివర్మ, ప్రో వైస్ చాన్సలర్లు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎస్.వెంకటరామ్, డాక్టర్ కె.రాజశేఖరరావు, రిజిస్ట్రార్ కె.సుబ్బారావు, న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గుంటూరు వైద్యుడికి అంతర్జాతీయ అవార్డు

వెన్నుముక సమస్యలపై పరిశోధనలకు గుర్తింపుగా 'ఈజిల్స్ ప్రైజ్'



అవార్డును చూపిస్తున్న డాక్టర్ జె.నరేష్‌బాబు

గుంటూరు మెడికల్: సీనియర్ స్పైన్ సర్జన్, గుంటూరులోని మల్లిక స్పైన్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ జె.నరేష్‌బాబుకు అంతర్జాతీయ అవార్డు లభించింది. ఇటలీలోని మిలాన్ నగరంలో గత నెల 30వ తేదీన అంతర్జాతీయ లంబార్ స్పైన్ అధ్యయన సంస్థ 50వ వార్షిక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న డాక్టర్ నరేష్‌బాబు.. వెన్నులోని డిస్క్‌లకు పోషక పదార్థాలు అందించే విధానాన్ని తాను ప్రయోగాత్మకంగా కనిపెట్టిన విషయాన్ని వివరించారు. ఇప్పటి వరకు ప్రపంచానికి తెలియని నూతన విషయాన్ని కనిపెట్టినందుకు ఆయనకు లంబార్ స్పైన్ అధ్యయన సంస్థ ప్రతిష్టాత్మక ఈజిల్స్ ప్రైజ్ అవార్డును అందజేయడంతోపాటు 20వేల అమెరికా డాలర్లను నగదు బహుమతిని ప్రదానం చేసింది. అంతర్జాతీయ యూరోపియన్ స్పైన్ జర్నల్‌లో డాక్టర్ నరేష్‌బాబు పరిశోధనా పత్రాన్ని ప్రముఖంగా ప్రచురించారు. ఈ విషయాలను ఆదివారం గుంటూరు కొత్తపేట ఓల్డ్ క్లబ్ రోడ్డులోని మల్లికా స్పైన్ సెంటర్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో డాక్టర్ నరేష్‌బాబు మీడియాకు వెల్లడించారు. నడుమునొప్పి, వెన్నునొప్పితో బాధపడుతున్న రోగులకు కేవలం పడుకోబెట్టి మాత్రమే కాకుండా కూర్చోబెట్టి, నిలబెట్టి ఎంఆర్ఐ స్కానింగ్ పరీక్షలు చేయటం ద్వారా తన ప్రయోగాలు విజయవంతంగా చేశానని వివరించారు.

వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుడి ఇంటి ప్రహరీ కూల్చివేత



సంతమాగులూరు (అద్దంకి): వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుని నిర్మాణంలో ఉన్న ఇంటి ప్రహరీని పొక్లెయినర్‌తో కూల్చివేసిన ఘటన బాపట్ల జిల్లా సంతమాగులూరు మండలంలోని ఏల్చూరులో ఆదివారం జరిగింది. బాధితుడు నాగరాజు అందించిన సమాచారం మేరకు..ఏల్చూరులో నివసిస్తున్న వల్లెపు నాగరాజు తన పూర్వీకుల నుంచి వచ్చిన కొండ పోరంబోకు స్థలంలో నివసిస్తున్నారు. ఏడాది క్రితం ఇదే గ్రామానికి చెందిన కుంచాల అంజయ్య కుమారులు కుంచాల శ్రీను సుబ్బారావు, మరికొందరు నాగరాజు నివసిస్తున్న స్థలం తమదని తహశీల్దార్ వద్దకు వెళ్లారు. ఆ సమయంలో తహశీల్దార్ సదరు స్థలం నాగరాజుకు చెందినదేనని విచారించి తేల్చి చెప్పి నాగరాజుకు పట్టా ఇచ్చారు. దీంతో నాగరాజు ఇంటిని నిర్మించుకోవడం ప్రారంభించాడు. 2 రోజుల క్రితం అంజయ్య కుమారులు ఆ ఇంటిని పగుల గొట్టేందుకు ప్రయత్నించగా నాగరాజు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు అడ్డుకోవడంతో అంజయ్య కుమారులు వెనక్కితగ్గారు. మళ్లీ శనివారం పొక్లెయినర్‌తో అంజయ్య కుమారులతో పాటు టీడీపీకి చెందిన కొందరు వచ్చి తన ఇంటి ప్రహరీని, గ్రానైట్ బండలను లేవదీసి నష్టపరిచి బెదిరించారని నాగరాజు వాపోయాడు. ఈ విషయమై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు చెప్పాడు.

టీటీడీ ఈవోగా శ్యామలరావు బాధ్యతల స్వీకరణ

- అనంతరం పలు విభాగాల తనిఖీ
- క్యూలైన్ల వద్ద పారిశుధ్యంపై తీవ్ర ఆగ్రహం
- భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యం ఇస్తామన్న ఈవో



టీటీడీ ఈవోగా బాధ్యతలు స్వీకరిస్తున్న శ్యామలరావు

తిరుమల: తిరుమల తిరుపతి దేవస్థానాల (టీటీడీ) కార్యనిర్వహణ అధికారి (ఈవో)గా జె.శ్యామలరావు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. టీటీడీ ఈవో (ఎఫ్‌ఏసీ) ఎ.వి.ధర్మారెడ్డి నుంచి బాధ్యతలు స్వీకరించిన ఆయన అనంతరం సతీమణితో కలిసి శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. తిరుమల ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాల దీక్షితులు ఆయనకు స్వామి విశిష్టతను తెలిపారు. దర్శనం అనంతరం ఈవోని వేద పండితులు ఆశీర్వదించి లడ్డూ ప్రసాదాలను అందజేశారు. దీనికిముందు సంప్రదాయాన్ని అనుసరించి ఈవో తొలిగా వరాహస్వామిని దర్శించుకుని క్యూ కాంప్లెక్స్ మీదుగా ఆలయంలోకి ప్రవేశించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ జేఈవోలు వీరబ్రహ్మం, గౌతమి, సీవీఎస్‌వో నరసింహకిషోర్, అధికారులు పాల్గొన్నారు.

భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తాం

హైందవుల పవిత్ర పుణ్యక్షేత్రం తిరుమల అని టీటీడీ ఈవో శ్యామలరావు తెలిపారు. ఆదివారం పదవీ బాధ్యతలు స్వీకరించిన అనంతరం శ్యామలరావు మీడియాతో మాట్లాడుతూ.. దేశవిదేశాల నుంచి శ్రీవారి దర్శనార్థం భారీస్థాయిలో భక్తులు తిరుమలకు వస్తుంటారన్నారు. ఈవోగా పనిచేసే భాగ్యం దక్కడం తన అదృష్టమని, స్వామి ఆశీస్సులతో ఈ మహాద్భాగ్యం దక్కిందని చెప్పారు. ఈ అవకాశాన్ని కల్పించిన సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు. టీటీడీలో మంచి పరిపాలన సాగేలా చర్యలు చేపడతామన్నారు. ప్రపంచవ్యాప్తంగా రిచెస్ట్ టెంపుల్ తిరుమల అని గుర్తు చేశారు. బాధ్యతగా విధులు నిర్వర్తిస్తానని చెప్పారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించి, శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తులు సంతోషంగా తిరుగుప్రయాణం అవ్వాలనే ప్రయత్నం చేస్తానన్నారు. ఆగమశాస్త్రం అనుసారం శ్రీవారి కైంకర్యాలు సక్రమంగా నిర్వహిస్తామని తెలిపారు. శ్రీవారి ఆలయ అభివృద్ధిపై సీఎం చంద్రబాబుకు ప్రత్యేకదృష్టి ఉందన్నారు. టీటీడీ నిధులు దుబారా కాకుండా సక్రమంగా వినియోగిస్తామని చెప్పారు. గతంలో అవకతవకలు జరిగి ఉంటే విచారణ చేపడతామన్నారు. అలాంటి చర్యలకు పాల్పడినవారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

నూతన ఈవో తనిఖీలు

టీటీడీ ఈవోగా బాధ్యతలు చేపట్టిన అనంతరం శ్యామలరావు పలు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. సర్వదర్శనం క్యూలైన్లను పరిశీలించి భక్తులతో మాట్లాడారు. క్యూలైన్‌లో భక్తులకు అందుతున్న సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. క్యూలైన్ల వద్ద పారిశుధ్యంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మొదటిరోజే టీటీడీ అధికారులకు చుక్కలు చూపించారు. క్యూలైన్ల వద్ద భక్తులకు అందించే తాగునీటిని పరిశీలించి ల్యాబ్‌కు పంపించాలని అధికారులకు సూచించారు. హెల్త్ విభాగంలో ఇద్దరు అధికారులకు మెమో జారీచేసే యోచనలో ఉన్నారు. తనిఖీల అనంతరం ఈవో మీడియాతో మాట్లాడుతూ.. క్యూలైన్లలో ఆహారం, తాగునీరు ఇస్తున్నామని చెప్పారు. నీటిలో కొంత మట్టిలాంటి పదార్థం ఉన్నట్లు గుర్తించామని, నీటిని ల్యాబ్ టెస్టింగ్‌కు పంపించామని తెలిపారు. క్యూలైన్‌లో పాలను సరిగ్గా ఇవ్వడం లేదని ఫిర్యాదు అందిందని చెప్పారు. దీనిపై విచారిస్తామన్నారు. కాలిబాటలో టికెట్లు ఇవ్వడం లేదని భక్తులు ఫిర్యాదు చేశారని, దీనిపై సమీక్ష నిర్వహిస్తామని తెలిపారు. క్యూలైన్ల పైన కూడా సమీక్షించి భక్తులకు మెరుగైన సౌకర్యం కల్పిస్తామని ఆయన చెప్పారు.

దాడులు, దౌర్జన్యాలు దారుణం

- మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

సాలూరు: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌లు రాష్ట్రంలో శాంతిభద్రతలు, అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని ఉపన్యాసాలిస్తున్నా.. క్షేత్రస్థాయిలో ప్రజలపై దాడులు–దౌర్జన్యాలు జరుగుతున్నాయని మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర విమర్శించారు. ఈ మేరకు ఆదివారం ఆయన సాలూరు పట్టణంలోని తన స్వగృహంలో మీడియాతో మాట్లాడారు. సాలూరు నియోజకవర్గంలోని పాచిపెంట మండల కేంద్రం దాసరివీధిలో నివాసం ఉంటున్న వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కన్వీనర్ అవుతు సాగర్‌రెడ్డిపై అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు కనకల సూర్యనారాయణ దాడిచేశాడని చెప్పారు. శనివారం సాయంత్రం సాగర్‌రెడ్డికి ఫోన్ చేసి నానా దుర్భాషలాడడంతో పాటు, ఆదివారం ఉదయం ఇంటికి వెళ్లి దౌర్జన్యం తీవ్రంగా గాయపరిచాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. అడ్డుకున్న సాగర్‌రెడ్డి భార్యను కూడా సూర్యనారాయణ కొట్టారని చెప్పారు. తీవ్రగాయాల పాలైన సాగర్‌రెడ్డి సాలూరు ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడని తెలిపారు.

హ్యాక్ చేయొచ్చు..!

ఎన్నికల్లో ఈవీఎంలను ఉపయోగించొద్దు ● స్పేస్ ఎక్స్, టెస్లా అధినేత ఎలాన్ మస్క్ సలహా

- ఇండియాలో ఈవీఎంలు సురక్షితమే
- కేంద్ర మాజీ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ స్పష్టీకరణ
- ఈవీఎంలు బ్లాక్‌బాక్సుల్లాంటివే: రాహుల్ గాంధీ
- ఎన్నికలను బ్యాలెట్ పేపర్లతోనే నిర్వహించాలి: అఖిలేష్



న్యూఢిల్లీ: ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (ఈవీఎం) పనితీరు, పారదర్శకతపై విస్తృతంగా చర్చ జరుగుతోంది. ఈవీఎంలలో నమోదైన ఫలితాలను సులభంగా తారుమారు చేయొచ్చని, ఎన్నికల్లో వీటిని ఉపయోగించకపోవడమే మంచిదని పలువురు నిపుణులు సూచిస్తున్నారు. స్పేస్ ఎక్స్, టెస్లా కంపెనీల యజమాని, ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ సైతం ఈవీఎంలపై స్పందించారు. ఈ మేరకు తాజాగా 'ఎక్స్'లో తన అభిప్రాయం వెల్లడించారు. ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల్లో వినియోగిస్తున్న ఈవీఎంల పనితీరుపై ఆందోళన వ్యక్తం చేశారు. ఈ యంత్రాలను హ్యాక్ చేసేందుకు ఆస్కారం ఉందన్నారు. మస్క్ అభిప్రాయాన్ని కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ మాజీ సహాయ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ ఖండించారు. భారత్‌లో ఉపయోగిస్తున్న ఈవీంఎలు పూర్తిగా సురక్షితమేనని తేల్చిచెప్పారు. దీనిపై మస్క్ ఘాటుగా స్పందించారు. ఏదైనా హ్యాక్ చేయొచ్చని పేర్కొన్నారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలపై కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ, సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్‌లు కూడా ఆదివారం స్పందించారు. ఈవీఎంలు ఎవరూ తనిఖీ చేయలేని బ్లాక్‌బాక్సుల్లాంటివేనని రాహుల్ గాంధీ స్పష్టంచేశారు. 'ఎక్స్'లో ఎలాన్ మస్క్ చేసిన పోస్టును తన 'ఎక్స్' ఖాతాల్లో రాహుల్ షేర్ చేశారు. ఈవీఎంల విశ్వసనీయతను అఖిలేష్ యాదవ్ ప్రశ్నించారు.

రిస్క్ చిన్నదైనా పరిణామం పెద్దదే



మనుషులు లేదా కృత్రిమ మేధ(ఏఐ)తో ఈవీఎంలను హ్యాక్ చేసేందుకు ఆస్కారం ఉంది. ఎన్నికల ప్రక్రియలో ఈవీఎంలను వాడొద్దు. ఎన్నికల నుంచి ఈ యంత్రాలను దూరంగా ఉంచాలి. ఈవీఎంలను హ్యాక్ చేసే రిస్క్ తక్కువగా ఉన్నప్పటికీ అది ముమ్మాటికీ హ్యాకింగే అవుతుంది. రిస్క్ చిన్నదైనా అది పెద్ద పరిణామానికి దారితీస్తుంది.

- ఎలాన్ మస్క్, స్పేస్ ఎక్స్, టెస్లా కంపెనీల అధినేత

ఈవీఎంలు పూర్తి సురక్షితం



పూర్తిగా సురక్షితమైన ఎలక్ట్రానిక్ పరికరాలను, డిజిటల్ హార్డ్‌వేర్‌ను ఎవరూ తయారు చేయలేరన్న సాధారణ అభిప్రాయం ప్రజల్లో ఉంది. అలా అనుకోవడం పొరపాటు. ఈవీఎంలపై ఎలాన్ మస్క్ వ్యక్తం చేసిన భయాందోళలు సమంజసం కాదు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను హ్యాక్ చేయడం అమెరికాతోపాటు ఇతర దేశాల్లో సాధ్యమవుతుందేమో గానీ ఇండియాలో ఎంతమాత్రం వీలుపడదు. ఇతర దేశాల్లో ఇంటర్నెట్‌తో అనుసంధానించిన ఓటింగ్ యంత్రాలను వాడుతుంటారు. ఇండియాలో అలాంటి పరిస్థితి లేదు. ఇంటర్నెట్‌తో కనెక్ట్ చేసినప్పుడు అవకతవకలు జరిగే అవకాశం ఉండొచ్చు. ఇండియాలో ఈవీఎంలకు ఇంటర్నెట్‌తో గానీ, బ్లూటూత్‌తో గానీ, వై–ఫైతోగానీ ఎలాంటి అనుసంధానం ఉండదు. ఇవి పూర్తిగా సురక్షితమైనవి. ఫ్యాక్టరీలో పోగ్రామ్ చేసిన ఈవీఎం కంట్రోలర్లను బయట రీప్రోగ్రామింగ్ చేయడం సాధ్యం కాదు. ఇండియాలో ఉపయోగిస్తున్న ఈవీఎంలు, వాటి భద్రత గురించి ఎలాన్ మస్క్‌కు ట్యూషన్ చెప్పడానికి నేను సిద్ధమే

- రాజీవ్ చంద్రశేఖర్, కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ మాజీ సహాయ మంత్రి

"ఏదైనా(ఏ ఎలక్ట్రానిక్ పరికరమైనా) హ్యాక్ చేయొచ్చు"
- రాజీవ్ చంద్రశేఖర్ వ్యాఖ్యలపై ఎలాన్ మస్క్ ప్రతిస్పందన

ఎన్నికల ప్రక్రియపై అనుమానాలున్నాయి



భారత్‌లో ఉపయోగిస్తున్న ఈవీఎంలు బ్లాక్‌బాక్సుల్లాంటివే. వాటిని తనిఖీ చేయడానికి ఎవరినీ అనుమతించరు. మన దేశంలో అమల్లో ఉన్న ఎన్నికల ప్రక్రియపై తీవ్ర ఆందోళనలు, అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వ్యవస్థల్లో జవాబుదారీతనం, పారదర్శకత లోపించినప్పుడు ప్రజాస్వామ్యం ఓ బూటకంగానే మిగిలిపోతుంది

- 'ఎక్స్'లో రాహుల్ గాంధీ

ఈవీఎంలకు స్వస్తి పలకాలి



టెక్నాలజీ అనేది సమస్యలను పరిష్కరించేలా ఉండాలి. అదే టెక్నాలజీ ఒక సమస్యగా మారినప్పుడు దాన్ని పక్కనపెట్టమే మంచిది. ఈవీఎంలను హ్యాక్ చేయొచ్చని నిపుణులు ఇప్పటికే నిరూపించారు. ప్రపంచవ్యాప్తంగా ఈవీఎంలపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఓటింగ్ యంత్రాలను హ్యాక్ చేస్తున్నట్లు సందేహాలున్నాయి. ఈవీఎం ట్యాంపరింగ్‌పై ప్రపంచ ప్రఖ్యాత టెక్నాలజీ నిపుణులు సైతం బహిరంగంగా ప్రకటనలు చేశారు. అలాంటప్పుడు మన దేశంలో ఈవీఎంలను బలవంతంగా ఉపయోగించాల్సిన అవసరం ఏమిటి? దీనిపై అధికార బీజేపీ సమాధానం ఇవ్వాలి. ఈవీఎంలకు స్వస్తి పలకాలి. భవిష్యత్తులో జరిగే ఎన్నికలను బ్యాలెట్ పేపర్లతోనే నిర్వహించాలి.

- 'ఎక్స్'లో అఖిలేష్ యాదవ్

దమ్ముంటే హ్యాక్ చేసి చూపించండి



ఎలాన్ మస్క్ గానీ, ఇంకెవరైనా గానీ ఈవీఎంలను హ్యాక్ చేయవచ్చని చెబుతున్న వ్యక్తులు భారత ఎన్నికల సంఘాన్ని సంప్రదించాలి. అక్కడ ఈవీఎంను తీసుకొని హ్యాక్ చేసి చూపించాలి. ఇదే మా చాలెంజ్. భారతదేశ ప్రజాస్వామ్యం గురించి రాహుల్ గాంధీ ఎందుకు ఎలాన్ మస్క్‌కు ఫిర్యాదు చేస్తున్నారు? మస్క్ ఏం చేయగలరు? ప్రపంచం ముందు కన్నీళ్లు పెట్టుకోవడం, భారతదేశ ప్రతిష్టను దిగజార్చడం కాంగ్రెస్ డీఎన్ఏలో ఒక భాగమా? వారసత్వ రాజకీయాలను ప్రజలు వరుసగా మూడోసారి తిరస్కరించారు. అయినా ఆ విషయం కాంగ్రెస్‌కు అర్థం కావడం లేదు?

- అమిత్ మాలవీయ, బీజేపీ ఐటీ విభాగం ఇన్‌చార్జి

మహా ఈవీఎం వివాదం

- ముంబై నార్త్‌వెస్ట్‌లో 48 ఓట్లతో నెగ్గిన శివసేన అభ్యర్థి
- మొబైల్ ఫోన్‌తో ఈవీఎంను హ్యాక్ చేశారనే ఆరోపణలు
- కౌంటింగ్ కేంద్రంలో డేటా ఎంట్రీ ఆపరేటర్ ఫోన్‌ను వాడిన వాయ్‌కర్ బంధువు
- ఫలితాన్ని ప్రభావితం చేశారని మిడ్–డే పత్రిక కథనం
- ఖండించిన రిటర్నింగ్ ఆఫీసర్
- ఈవీఎంలను తెరవడానికి ఓటీపీ అక్కర్లేదు
- డేటా ఎంట్రీ ఆపరేటర్ లాగిన్ కావడానికి మాత్రమే ఓటీపీ
- ఓట్లలో ఎలాంటి మార్పులకు అవకాశం లేదు
- మిడ్–డేపై పరువునష్టం కేసు

18వ లోక్‌సభ ఎన్నికల ఫలితాలు వెలువడిన జూన్ 4న అందరి దృష్టిని ఆకర్షించిన లోక్‌సభ స్థానం ముంబై నార్త్ వెస్ట్. ఎందుకంటే అక్కడ గెలుపొందిన శివసేన అభ్యర్థి రవీంద్ర వాయ్‌కర్‌కు వచ్చింది కేవలం 48 ఓట్ల ఆధిక్యం. ఈ సార్వత్రిక ఎన్నికల్లో ఇదే అత్యల్ప మెజారిటీ. ఇప్పుడు దానిచుట్టే రగడ మొదలైంది. వాయ్‌కర్‌కు అనుకూలంగా కౌంటింగ్ కేంద్రంలో ఉన్న ఆయన బంధువు మొబైల్ ఫోన్‌తో ఈవీఎంను హ్యాక్ చేశారనే వార్తా కథనం సంచలనం రేకెత్తిస్తోంది. ఈ కథనం క్లిప్పింగ్‌తో ఆరోపణలు మొదలయ్యాయి. అయితే ఈవీఎంలను హ్యాక్ చేయడానికి వీల్లేదని, వాటిని తెరవడానికి ఓటీపీ అవసరమే లేదని, బాహ్య వ్యవస్థలతో ఎలాంటి అనుసంధానం లేకుండా ఈవీఎంలు స్వతంత్రంగా పనిచేస్తాయని ముంబై నార్త్‌వెస్ట్ రిటర్నింగ్ ఆఫీసర్ వందనా సూర్యవంశీ చెప్పారు. అనధికారికంగా కౌంటింగ్ కేంద్రంలో డేటా ఎంట్రీ ఆపరేటర్ ఫోన్‌ను వాడిన వాయ్‌కర్ బంధువుపై కేసు నమోదైందని వెల్లడించారు.

ముంబై: ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్ (ఈవీఎం)లు బాహ్య ప్రపంచంతో ఎలాంటి అనుసంధానం, సాంకేతిక సంబంధాలు లేకుండా స్వతంత్రంగా పనిచేస్తాయని, సురక్షితమని ముంబై వాయువ్య లోక్‌సభ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి వందనా సూర్యవంశీ ఆదివారం తెలిపారు. సమాచార మార్పిడికి ఈవీఎంలలో ఎలాంటి ఏర్పాటు ఉండదని పేర్కొన్నారు. ఈవీఎంలను తెరవడానికి ఎలాంటి ఓటీపీ అవసరం లేదని, వాటిపై ఉండే బటన్‌ను నొక్కడం ద్వారా ఓట్ల లెక్కింపు జరుగుతుందని ఆమె వివరించారు. ముంబై నార్త్‌వెస్ట్‌లో శివసేన అభ్యర్థి రవీంద్ర వాయ్‌కర్ కేవలం 48 ఓట్లతో నెగ్గారు. రవీంద్ర వాయ్‌కర్ బంధువు మంగేష్ పాండిల్కర్ కౌంటింగ్ కేంద్రంలో ఈవీఎంకు అనుసంధానమైన మొబైల్ ఫోన్‌ను వాడారని, దీని ద్వారా ఈవీఎంను అన్‌లాక్ చేశారని, హ్యాక్ చేశారని మిడ్–డే పత్రిక ఒక కథనాన్ని ప్రచురించింది. దీనిపై రిటర్నింగ్ ఆఫీసర్ వందన స్పందిస్తూ.. 'ఈవీఎంలు సాంకేతికంగా లోపరహితమైనవి. బయటినుంచి ఏ ఇతర సాంకేతిక వ్యవస్థలపై ఆధారపడకుండా స్వతంత్రంగా పనిచేస్తాయి. వాటిని ప్రోగ్రామ్ చేయడం కుదరదు. వైర్‌లెస్‌గా, వైర్లను కనెక్ట్ చేసి సమాచార మార్పిడి చేయడానికి ఈవీఎంలలో ఎలాంటి ఏర్పాటు లేదు' అని తెలిపారు. రవీంద్ర వాయ్‌కర్ బంధువు మొబైల్ ఫోన్ ద్వారా ఈవీఎంను అన్‌లాక్ చేశారనే వాదనలను కొట్టిపారేశారు. ఇది శుద్ధ అబద్ధం. ఒక పత్రిక దీన్ని వ్యాపింపచేస్తోంది. మిడ్–డే పత్రికకు ఐపీసీ 499, 505 సెక్షన్ల కింద పరువునష్టం, అసత్య వార్తల ప్రచారానికి గాను నోటీసులు జారీచేశామని వందనా సూర్యవంశీ వెల్లడించారు. ముంబై నార్త్‌వెస్ట్‌లో శివసేన (యూబీటీ) అభ్యర్థి అమోల్ సజానన్ కీర్తికర్ గెలిచారని తొలుత వార్తలు వెలువడ్డాయి. అయితే రవీంద్ర వాయ్‌కర్ (శివసేన– షిండే) 48 ఓట్లతో గెలిచారని ఎన్నికల సంఘం ప్రకటించింది.

మేము గెలిచినందుకేనా ఈ సందేహాలు: ఏక్‌నాథ్ షిండే

ముంబై నార్త్‌వెస్ట్‌లో తమ (శివసేన) అభ్యర్థి రవీంద్ర వాయ్‌కర్ గెలిచినందుకే ఈవీఎంలపై అనుమానాలు రేకెత్తిస్తున్నారని మహారాష్ట్ర సీఎం ఏక్‌నాథ్ షిండే మండిపడ్డారు. ఈ ఒక్క నియోజకవర్గం ఫలితంపైనే ఎందుకు సందేహాలు లేవనెత్తుతున్నారు. రాష్ట్రంలోని మిగతా స్థానాల ఫలితాలపై ఎందుకు అనుమానాలు వ్యక్తం చేయడం లేదు? ఎందుకంటే ముంబై నార్త్‌వెస్ట్‌లో నా అభ్యర్థి వాయ్‌కర్ గెలిచారు. వారి అభ్యర్థి (శివసేన–యూబీటీ) ఓడిపోయారు.. అని షిండే వ్యాఖ్యానించారు. ప్రజా తీర్పు వాయ్‌కర్‌కు అనుకూలంగా ఉందన్నారు.

అది డాటా ఎంట్రీ ఆపరేటర్ మొబైల్


వందన

రవీంద్ర వాయ్‌కర్ బావమరిది మంగేష్ పాండిల్కర్ కాల్స్ చేయడానికి, అందుకోవడానికి కౌంటింగ్ కేంద్రంలో నిబంధనలకు విరుద్ధంగా డేటా ఎంట్రీ ఆపరేటర్ దినేశ్ గౌరవ్ ఫోన్ వాడారని రిటర్నింగ్ ఆఫీసర్ వందన వెల్లడించారు. కౌంటింగ్ కేంద్రంలో మొబైల్ వాడకూడదనే అధికారిక ఉత్తర్వులను ఉల్లంఘించినందుకు ఐపీసీ 188 సెక్షన్ కింద మంగేష్‌పై పోలీసు కేసు నమోదైంది. అలాగే దినేశ్ గౌరవ్‌పై కూడా కేసు నమోదైంది. డేటా ఎంట్రీ ఆపరేటర్ డేటాను పొందుపర్చడానికి మాత్రమే మొబైల్ ఫోన్‌ను వాడాలని, ఫోన్‌తో అవసరం తీరగానే సీనియర్ అధికారికి అప్పగించాలని, ఎల్లప్పుడూ మొబైల్ ఫోన్‌ను సైలెంట్ మోడ్‌లోనే పెట్టాలి. దినేశ్ ఈ నిబంధనలను పాటించలేదని ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. మొబైల్ ఫోన్‌కు వచ్చే వన్‌టైమ్ పాస్‌వర్డ్ (ఓటీపీ) ద్వారా డేటా ఎంట్రీ ఆపరేటర్.. సిస్టమ్‌లోకి లాగిన్ అవుతారు. డేటా ఎంట్రీ, ఓట్ల లెక్కింపు రెండు వేర్వేరు అంశాలు. కౌంటింగ్ ప్రక్రియకు, మొబైల్ ఫోన్ అనధికారిక ఉపయోగానికి ఎలాంటి సంబంధం లేదు. మొబైల్ ఫోన్ వాడకం దురదృష్టకర ఘటన, దీనిపై దర్యాప్తు జరుగుతోందని వందన వెల్లడించారు. 'అధునాతన సాంకేతిక ఫీచర్లు, గట్టి అధికారిక నిఘా ఉందని.. అందువల్ల ఓట్లను తారుమారు చేసే అవకాశమే లేదని చెప్పారు. ప్రతిదీ అభ్యర్థులు లేదా వారి ఏజెంట్ల ఎదుటే జరుగుతుందన్నారు. రవీంద్ర వాయ్‌కర్ గాని, ఓటమి పాలైన అమోల్ కీర్తికర్ గాని రీ కౌంటింగ్‌ను కోరలేదని తెలిపారు. చెల్లని పోస్టల్ బ్యాలెట్లను పునఃపరిశీలించాలని డిమాండ్ చేయగా.. తాము అది చేశామని వివరించారు. అధీకృత కోర్టు ఆదేశాలు ఉంటే తప్ప సీసీటీవీ ఫుటేజీని బయటపెట్టలేమని తెలిపారు.

ఫలితాన్ని నిలిపివేయాలి: పృథ్విరాజ్ చౌహాన్

ముంబై నార్త్‌వెస్ట్ నియోజకవర్గ ఫలితాన్ని నిలిపివేయాలని సీనియర్ కాంగ్రెస్ నేత, మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి పృథ్విరాజ్ చౌహాన్ ఆదివారం డిమాండ్ చేశారు. భారత ఎన్నికల సంఘం అన్ని పార్టీల సమావేశాన్ని ఏర్పాటు చేసి ఈ అంశాన్ని లోతుగా చర్చించాలని కోరారు. 'మొబైల్ ఫోన్ అనధికారిక వినియోగంపై దర్యాప్తు జరగాలి. ఎఫ్ఐఆర్‌ను బహిరంగపర్చలేదు' అని చౌహాన్ అన్నారు.

ఉక్రెయిన్‌లో శాంతికి ప్రాదేశిక సమగ్రతే ముఖ్య భూమిక

80 దేశాల ఉమ్మడి ప్రకటన

బెర్న్: ఉక్రెయిన్–రష్యా యుద్ధానికి ముగింపు పలికే దిశగా ఎలాంటి శాంతి ఒప్పందానికైనా ఉక్రెయిన్ ప్రాదేశిక సమగ్రతే ముఖ్య భూమిక అవుతుందని 80 దేశాలు తేల్చిచెప్పాయి. ఉక్రెయిన్ ప్రాదేశిక సమగ్రతను, సార్వభౌమత్వాన్ని తాము గౌరవిస్తున్నామని స్పష్టం చేశాయి. ఉక్రెయిన్‌లో శాంతి సాధన కోసం స్విట్జర్లాండ్‌లో రెండు రోజులపాటు జరిగిన సదస్సు ఆదివారం ముగిసింది. దాదాపు 100 దేశాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఆదివారం 80 దేశాల ప్రతినిధులు ఉమ్మడిగా ఒక ప్రకటన విడుదల చేశారు. భారత్ సహా కొన్ని దేశాలు ఈ ప్రకటనలో పాలుపంచుకోలేదు. తుది డాక్యుమెంట్‌పై సంతకం చేయలేదు. యుద్ధం మొదలైన తర్వాత స్వాధీనం చేసుకున్న ఉక్రెయిన్ భూభాగాలను వెనక్కి ఇచ్చేయాలని పలుదేశాలు రష్యాకు సూచించాయి. స్విట్జర్లాండ్ సదస్సు పట్ల ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ హర్షం వ్యక్తం చేశారు. తమ దేశంలో శాంతికి ఇదొక తొలి అడుగు అని అభివర్ణించారు. అయితే, ఈ సదస్సుకు రష్యా మిత్రదేశం చైనా హాజరుకాలేదు. రష్యాను ఆహ్వానించలేదు. భారత్ తరపున విదేశాంగ శాఖ కార్యదర్శి(పశ్చిమ) పవన్ కపూర్ హాజరయ్యారు.

గంగా నదిలో పడవ మునక.. నలుగురు గల్లంతు

పట్నా: బిహార్ రాష్ట్రం పట్నా జిల్లాలో గంగా నదిలో పడవ మునిగిన ఘటనలో నలుగురు గల్లంతయ్యారు. బర్హ్ సబ్ డివిజన్‌లోని ఉమానాథ్ గంగా ఘాట్ వద్ద ఆదివారం ఉదయం 9.15 గంటల సమయంలో ఈ విషాదం చోటుచేసుకుంది. పడవలో ఒకే కుటుంబానికి చెందిన 17 మంది ఉన్నట్లు పోలీసులు తెలిపారు. నది మధ్యలో ఉండగా పడవ బోల్తాపడి మునిగిందని, 13 మందిని రక్షించి, ఒడ్డుకు చేర్చామని సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్ శుభమ్ కుమార్ చెప్పారు. కనిపించకుండాపోయిన ముగ్గురు పురుషులు, ఒక మహిళ జాడ కోసం గాలింపు కొనసాగుతోందన్నారు.

ఉమ్మడి పౌరస్మృతి అమల్లోకి వస్తుందని ఆశిస్తున్నా: మేఘ్వాల్

కోల్‌కతా: దేశంలో ఉమ్మడి పౌరస్మృతి(యూసీసీ) అమల్లోకి వస్తుందని ఆశిస్తున్నట్లు కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్ చెప్పారు. ఇప్పటికే ఈ దిశగా కొన్ని రాష్ట్రాలు చర్యలు ప్రారంభించాయని గుర్తుచేశారు. ఆదివారం కోల్‌కతాలో మాట్లాడారు. బీజేపీ మేనిఫెస్టోలో యూసీసీని ప్రస్తావించామని ఆయన గుర్తు చేశారు.

బాబ్రీ కాదు.. 3 గోపురాల నిర్మాణం

- అయోధ్య పాఠ్యాంశం 2 పేజీలకు కుదింపు
- రథయాత్ర, కరసేవకులు, కూల్చివేత అంశాలు తొలగింపు
- గుజరాత్ అల్లర్ల అధ్యాయం సైతం
- ఎన్‌సీఈఆర్‌టీ 12 పొలిటికల్ సైన్స్ బుక్‌లో అనేక మార్పులు

న్యూఢిల్లీ : హేతుబద్ధీకరణ పేరుతో నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ (ఎన్‌సీఈఆర్‌టీ) పాఠ్య పుస్తకాల్లో పలు మార్పులు, చేర్పులు చేసిన సంగతి తెలిసిందే. అయితే 12వ తరగతి పొలిటికల్ సైన్స్ పుస్తకంలోనూ అనేక మార్పులు చేసింది. 'బాబ్రీ మసీదు' సహా అనేక కీలక అంశాలను, చాలా సమాచారాన్ని తొలగించింది.



తొలగింపులు అంశాలవారీగా..

- **'బాబ్రీ మసీదు' పదం తొలగింపు:** పాఠ్య పుస్తకంలోంచి బాబ్రీ మసీదు అనే పదాన్ని పూర్తిగా తొలగించింది. దాని స్థానంలో 'మూడు గోపురాల నిర్మాణం'ను చేర్చింది.
- **అయోధ్య అధ్యాయం తగ్గింపు:** నాలుగు పేజీలున్న అయోధ్య అధ్యాయాన్ని రెండు పేజీలకు తగ్గించింది. రథయాత్ర, కరసేవకుల పాత్ర, బాబ్రీ మసీదు కూల్చివేత, అనంతరం జరిగిన హింస, ఆ తరువాత బీజేపీ పాలిత ప్రాంతాల్లో విధించిన రాష్ట్రపతి పాలన అంశాలను తొలగించింది.
- **చారిత్రక వివరాల సవరణ:** బాబ్రీ మసీదుకు సంబంధించిన వివరాల్లో కూడా అనేక మార్పులు చేసింది. బాబ్రీ మసీదును 16వ శతాబ్దంలో మీర్ బాకీ నిర్మించినట్లుగా గత పుస్తకంలో ఉండగా.. 1528లో రాముడి జన్మస్థలంలో నిర్మించబడిన మూడు గోపురాల నిర్మాణంగా ఇప్పుడు పేర్కొన్నది. అంతేకాదు ఈ నిర్మాణంలో అనేక హిందూ చిహ్నాలు ఉన్నాయని, లోపలి, వెలుపలి గోడలపై శిల్పాలు ఉన్నాయని కొత్త పుస్తకం పేర్కొంది. హిందూ చిత్రాలు, విగ్రహాలను కూడా కొత్తగా ప్రస్తావించింది.
- **చట్టపరమైన, మతపరమైన కథనాల్లోనూ మార్పులు:** ఆలయంలో పూజలు చేసుకునేందుకు బాబ్రీ మసీదు నిర్మాణాన్ని తెరచి ఉంచాలని 1986 ఫిబ్రవరిలో ఫైజాబాద్ జిల్లా కోర్టు ఇచ్చిన తీర్పును పాత పుస్తకం వివరించగా, వాటన్నింటిని తొలగించి మూడు గోపురాల నిర్మాణం, తరువాత వచ్చిన మతపరమైన వైరుధ్యాలను కొత్త పుస్తకం క్లుప్తంగా ప్రస్తావించింది. వివాదాస్పద భూమి ఆలయానికే చెందుతుందంటూ 2019లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును మాత్రం కొత్త ఎడిషన్‌లో చేర్చింది.
- **వార్తాపత్రికల కటింగ్స్ తీసివేత:** పాత పుస్తకంలో వార్తాపత్రిక కథనాలకు సంబంధించిన అనేక ఛాయాచిత్రాలు ఉన్నాయి. వీటిలో డిసెంబర్ 7, 1992న 'బాబ్రీ మసీదు కూలివేత, కేంద్రం కళ్యాణ్ సింగ్ ప్రభుత్వాన్ని రద్దు చేసింది' అనే శీర్షికతో ప్రచురితమైన కథనం కూడా ఉంది. వీటన్నింటినీ తొలగించారు.
- **గుజరాత్ అల్లర్ల అధ్యాయం తొలగింపు:** ప్రజాస్వామ్య హక్కుల అధ్యాయం నుంచి గుజరాత్ అల్లర్ల ప్రస్తావనను పూర్తిగా తొలగించింది.


అల్లర్ల గురించి బోధించాల్సిన అవసరం లేదు — ఎన్‌సీఈఆర్‌టీ డైరెక్టర్



ద్వేషం, హింస బోధనాంశాలు కావని, పాఠశాల పాఠ్యపుస్తకాలు వాటిపై దృష్టి పెట్టకూడదని నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసర్చ్ అండ్ ట్రైనింగ్ (ఎన్‌సీఈఆర్‌టీ) చీఫ్ దినేష్ ప్రసాద్ సక్లానీ అన్నారు. గుజరాత్ అల్లర్లు, బాబ్రీ మసీదు కూల్చివేత గురించి బోధిస్తే పాఠశాల విద్యార్థులు హింసాత్మకంగా తయారవుతారని, అందుకే వాటిని పాఠ్యాంశాల్లోంచి తొలగించామని వెల్లడించారు. పాఠ్య పుస్తకాల్లో మార్పులు, బాబ్రీ మసీదు కూల్చివేత, తరువాత మతపరమైన హింసకు సంబంధించిన అంశాల తొలగింపులపై శనివారం ఓ వార్తా సంస్థతో ఆయన మాట్లాడారు. సమాజంలో విద్వేషాలను సృష్టించే విధంగా బోధనలు అవసరం లేదని, చిన్న పిల్లలకు అల్లర్ల గురించిన నేర్పించాల్సిన అవసరం లేదని, అది ఎందుకు జరిగిందో పెద్దయ్యాక వారే తెలుసుకుంటారని చెప్పారు. పాఠ్య పుస్తకాల్లోని అంశాలను కాషాయీకరణ చేశారనే ఆరోపణలను కొట్టి పారేశారు. రామజన్మభూమికి అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పునిస్తే దాన్ని పాఠ్యపుస్తకాల్లో ఎందుకు చేర్చకూడదని, పార్లమెంటు నూతన భవనాన్ని నిర్మించడం విద్యార్థులకు ఎందుకు తెలియకూడదని ఆయన ప్రశ్నించారు. చరిత్రను యుద్ధభూమిగా మార్చడానికి కాకుండా విద్యార్థులకు వాస్తవాలు తెలిసేలా బోధిస్తామన్నారు. పాఠ్యపుస్తకాల పునర్విమర్శ ప్రపంచవ్యాప్తంగా జరిగే అభ్యాసమని, ఏది మార్చాలన్నది సబ్జెక్ట్, బోధనా శాస్త్ర నిపుణులే నిర్ణయిస్తారని, తాను ఆ ప్రక్రియలో జోక్యం చేసుకోనని స్పష్టం చేశారు. ఎన్‌సీఈఆర్‌టీ పాఠ్య పుస్తకాల్లో 2014 నుంచి ఇప్పటివరకూ నాలుగు పర్యాయాలు మార్పులు చేశారు.

కశ్మీర్‌లో ఉగ్రవాదాన్ని అణచివేయండి

కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఆదేశం



న్యూఢిల్లీ: జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదాన్ని అణచివేయడం ద్వారా ఒక కొత్త ఒరవడి సృష్టించడానికి నరేంద్ర మోదీ ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా చెప్పారు. జమ్మూకశ్మీర్‌లో ఇటీవల వరుసగా ఉగ్రవాద దాడులు జరుగుతున్నాయి, పలువురు ముష్కరులతోపాటు భద్రతా సిబ్బంది సైతం మరణించారు. ఈ నేపథ్యంలో అమిత్ షా ఆదివారం భద్రతా దళాలతో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. తాజా పరిస్థితి గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదాన్ని కఠినంగా అణచివేయాలని ఆదేశించారు. కశ్మీర్ లోయలో చేపట్టిన జీరో–టెర్రర్ ప్రణాళికలతో మంచి ఫలితాలు వచ్చాయని, జమ్మూ డివిజన్‌లో సైతం అమలు చేయాలని సూచించారు. ఈ నెల 29వ తేదీ నుంచి అమర్‌నాథ్ యాత్ర ప్రారంభం కానుంది. ఈ యాత్రకు పటిష్టమైన భద్రత కల్పించాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందుజాగ్రత్త చర్యలు చేపట్టాలని అమిత్ షా ఆదేశించారు. యాత్ర విషయంలో అధికారుల సన్నద్ధతను సమీక్షించారు. ఈ సమావేశంలో జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్, జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా, ఆర్మీ చీఫ్ జనరల్ మనోజ్ పాండే, కేంద్ర హోంశాఖ కార్యదర్శి అజయ్ భల్లా, ఇంటెలిజెన్స్ బ్యూరో డైరెక్టర్ తపన్ డేకా, సీఆర్‌పీఎఫ్ డీజీ అనీష్‌దయాళ్ సింగ్ తదితరులు పాల్గొన్నారు. జమ్మూకశ్మీర్ పరిణామాలపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాలుగు రోజుల క్రితం సమీక్ష నిర్వహించిన సంగతి తెలిసిందే. జమ్మూకశ్మీర్‌లో ఇకపై ఉగ్రవాదులపై ఉక్కుపాదం మోపనున్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి.

టీడీపీ స్పీకర్ పదవికి పోటీ చేస్తే.. ఇండియా కూటమి మద్దతిస్తుంది

ముంబై: లోక్‌సభ స్పీకర్ పదవికి అధికార ఎన్డీఏ పక్షంలోని తెలుగుదేశం పార్టీ(టీడీపీ) పోటీ చేస్తే ప్రతిపక్ష ఇండియా కూటమి పార్టీలన్నీ మద్దతిచ్చే అవకాశముందని శివసేన(యూబీటీ) నేత సంజయ్ రౌత్ చెప్పారు. లోక్‌సభ స్పీకర్ పోస్టు చాలా కీలకమైందని, ఈ పదవి బీజేపీకి దక్కితే, ప్రభుత్వానికి మద్దతిచ్చే టీడీపీ, జేడీయూలతోపాటు చిరాగ్ పాశ్వాన్, జయంత్ చౌదరిలకు చెందిన పార్టీలను ముక్కలు చేస్తుందని ఆరోపించారు. బీజేపీని నమ్మి మోసపోయిన అనుభవం తమకు కూడా ఉందని రౌత్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'లోక్‌సభ స్పీకర్ పదవిని టీడీపీ కోరుతున్నట్లుగా విన్నాను. అదే జరిగితే, ఇండియా కూటమి ఈ విషయాన్ని చర్చిస్తుంది. మా భాగస్వామ్య పక్షాలన్నీ టీడీపీకి మద్దతిచ్చేందుకు ప్రయత్నిస్తాయి' అని చెప్పారు. నిబంధన ప్రకారం ప్రతిపక్ష పార్టీకి డిప్యూటీ స్పీకర్ పోస్టు కేటాయించాలన్నారు. లోక్‌సభ ఎన్నికల అనంతరం రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్(ఆర్ఎస్ఎస్) అగ్ర నేతలు బీజేపీపై చేసిన వ్యాఖ్యలపై సంజయ్ రౌత్.. గతంలో బీజేపీ చేసిన తప్పిదాలను ఆర్ఎస్ఎస్ సరిచేయాలనుకోవడం మంచి పరిణామమేనని పేర్కొన్నారు. జూన్ 7వ తేదీన పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో జరిగిన భేటీలో ప్రధాని మోదీ ఎన్డీఏ పార్లమెంటరీ పక్షం నేతగా, బీజేపీ పార్లమెంటరీ పార్టీ, లోక్‌సభలో బీజేపీ నేతగా ఎన్నికయ్యారని రౌత్ అన్నారు. 'బీజేపీ పార్లమెంటరీ పార్టీ సమావేశం ప్రత్యేకంగా జరగలేదు. అలా జరిగిన పక్షంలో నేత ఎవరనే ప్రశ్న ఉదయిస్తుంది, అప్పుడిక పరిణామాలు వేరుగా ఉంటాయి' అని అభిప్రాయపడ్డారు. మోదీ ఎన్డీఏ పార్లమెంటరీ పక్షం నేతగా మాత్రమే ఎన్నికవడం తీవ్రంగా పరిగణించాల్సిన అంశమని రౌత్ వ్యాఖ్యానించారు.

'నీట్'లో అక్రమాల ఆరోపణలు.. బిహార్ పోలీసుల దర్యాప్తు వేగవంతం

ప్రశ్నపత్రం లీక్ చేసిన వారి వద్ద ఆరు చెక్కులు స్వాధీనం

పట్నా: నీట్ ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారంలో బిహార్ పోలీసుల దర్యాప్తు మరింత పురోగతి సాధించింది. ఇప్పటికే ఈ కేసులో 13 మందిని అదుపులోకి తీసుకున్న బిహార్ ఆర్థిక నేరాల విభాగం(ఈఓయూ) పోలీసులు ఆరు చెక్కులను స్వాధీనం చేసుకున్నారు. ఒక్కో అభ్యర్థి నుంచి రూ.30 లక్షలు డిమాండ్ చేసిన మాఫియా ముఠా సభ్యులకు చెందాల్సినవిగా వీటిని భావిస్తున్నామని ఈఓయూ డీఐజీ మానవ్‌జీత్ సింగ్ ధిల్లాన్ ఆదివారం చెప్పారు. సంబంధిత బ్యాంకుల నుంచి ఆయా ఖాతాదారుల వివరాలను తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. అదేవిధంగా, పట్నాలో ప్రశ్నాపత్రాన్ని, జవాబులను అభ్యర్థులకు మాఫియా సభ్యులు వెల్లడించిన ఇంట్లో పాక్షికంగా కాల్చివేసిన ప్రశ్నాపత్రాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దీనిని ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపారు. ఎన్‌టీఏ నుంచి రిఫరెన్స్ ప్రశ్నాపత్రం కోరామని, అది అందాక రెండింటిని సరిపోల్చుతామని డీఐజీ చెప్పారు. ఇప్పటి వరకు పోలీసులు అరెస్ట్ చేసిన వారిలో 9 మంది అభ్యర్థులతోపాటు నలుగురు ఎగ్జామినర్లున్నారు. వీరంతా బిహారీలే. అదేవిధంగా, ఈ లీకేజీ వ్యవహారంతో సంబంధమున్నట్లు అనుమానిస్తున్న బిహార్‌కే చెందిన మరో ఏడుగురు, యూపీ, మహారాష్ట్రలకు చెందిన ఒక్కో అభ్యర్థికి కూడా పోలీసులు నోటీసులు పంపారు.

నీట్ ఒక కుంభకోణం: ఎంకే స్టాలిన్

చెన్నై: మెరిట్‌కు కొలమానంగా పేర్కొంటున్న నీట్ ఒక కుంభకోణం, ఈ పరీక్ష పేద విద్యార్థుల ప్రయోజనాలకు, సామాజిక న్యాయానికి విరుద్ధమని తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ పేర్కొన్నారు. ఇటువంటి విధానం అమలును నిలిపివేయాలని ఆదివారం ఆయన 'ఎక్స్'లో కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. 'నీట్ చుట్టూ ముసురుకున్న వివాదాలు, ఈ విధానంతో జరుగుతున్న అన్యాయాన్ని చెప్పకనే చెబుతోంది. సమాజంలో అణగారిన వర్గాల విద్యార్థుల అభ్యున్నతికి మరిన్ని దారులు తెరవడానికి బదులుగా వారికి నీట్ అవకాశాలను దూరం చేస్తోంది' అని ఆరోపించారు. 'కేంద్ర విద్యాశాఖ మంత్రి ఎన్‌టీఏను సమర్థిస్తున్నప్పటికీ వాస్తవం మరోలా ఉంది. గుజరాత్‌లో ఓఎంఆర్ షీట్లను ట్యాంపర్ చేసినట్లుగా వచ్చిన ఆరోపణలపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఇదంతా ఓ కుట్ర. నీట్ కోచింగ్ సెంటర్లు, ఫిజిక్స్ ఉపాధ్యాయుడు, ఓ స్కూల్ ప్రిన్సిపల్‌కు ఇందులో హస్తముంది. ఈ వ్యవస్థను మార్చాల్సిన అవసరముంది' అని స్టాలిన్ పేర్కొన్నారు.

విచారణ జరిపించాలి: కపిల్ సిబల్

న్యూఢిల్లీ: నీట్ అవకతవకల ఆరోపణల్లో నిగ్గు తేల్చేందుకు అధికారులతో కమిటీని నియమించాలని రాజ్యసభ సభ్యుడు, కేంద్ర మాజీ మంత్రి కపిల్ సిబల్ సుప్రీంకోర్టును కోరారు. భవిష్యత్తులో నీట్‌ను మరింత మెరుగ్గా నిర్వహించే అంశంపై రాష్ట్రాల అభిప్రాయాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. నీట్‌ను నిర్వహించే ఎన్‌టీఏ వ్యవస్థలోనే అవినీతి నెలకొన్న పరిస్థితుల్లో ప్రధాని మోదీ మౌనంగా ఉండటం ఏమాత్రం మంచిదికాదన్నారు. వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో నీట్‌లో అక్రమాలను ప్రముఖంగా ప్రస్తావించాలని సిబల్ అన్ని రాజకీయ పార్టీలను కోరారు.

దోషులుగా తేలితే ఎన్‌టీఏ అధికారులనూ వదలం

'నీట్' అవకతవకల ఆరోపణలపై కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్

న్యూఢిల్లీ: నీట్ యూజీ–2024 పరీక్ష పారదర్శకంగా జరిగిందని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన పునరుద్ఘాటించారు. అవకతవకలకు బాధ్యులుగా తేలితే ఉన్నతాధికారులపైనా కఠిన చర్యలుంటాయని పేర్కొన్నారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు 1,563 మంది అభ్యర్థులకు మళ్లీ పరీక్ష పెడతాం. పేపర్ లీకేజీ మాత్రం జరగలేదు. రెండు పరీక్ష కేంద్రాల్లో అక్రమాలు జరిగినట్లు గుర్తించాం. ఈ అంశాన్ని ప్రభుత్వం తీవ్రమైందిగా పరిగణిస్తోంది. దోషులుగా తేలితే నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) ఉన్నతాధికారులను సైతం వదలం. తప్పుచేసిన వారిపై కఠినచర్యలుంటాయి' అని మంత్రి చెప్పారు.

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
సోమవారం : 17 : జూన్ : 2024

రంగుల విల్లు



ఆదివారం బెంగళూరులో పలుచోట్ల జల్లులు పడ్డాయి. ఈ సందర్భంగా నయన మనోహరంగా విరిసిన ఇంద్రధనస్సు

న్యూస్‌రీల్

ముత్తు తాళమ్మ తేరు వేడుక



మైసూరు: జిల్లాలోని సాలిగ్రామ తాలూకాలోని చిక్కకొప్పలు గ్రామంలో ఆదిశక్తి ముత్తు తాళమ్మ దేవతా రథోత్సవం వేలాదిమంది భక్తుల మధ్య ఘనంగా జరిగింది. చిక్కకొప్పలు గ్రామంలో సుమారు 11 సంవత్సరాల తరువాత ఈ తేరును నిర్వహించడం విశేషం. ఉదయమ 6 గంటల నుంచి ముత్తుతాళమ్మ దేవాలయంలో పూజలు, హోమాలు సాగించారు. తరువాత అర్చకులు మంజునాయక ఉత్సవమూర్తిని అలంకరించి తేరులో ప్రతిష్టించి ఊరేగించారు.

గంజాయి విక్రేతలకు జైలుశిక్ష

శివమొగ్గ: శివమొగ్గ నగరంలోని ఒక గంజాయి కేసులో పట్టుబడిన నలుగురు యువకులకు కోర్టు 10 ఏళ్ల కఠిన జైలు శిక్ష విధించింది. శివమొగ్గ ఇందిరానగరలో ఉండే దౌలత్ (27), ముజీబ్ (27), షోహెబ్ (24), మహ్మద్ జఫుల్లా (24) నిందితులు. తలా రూ. లక్ష జరిమానా కూడా విధించారు. చెల్లించని పక్షంలో మరో ఏడాది అదనంగా జైలుశిక్ష అనుభవించాలని జడ్జి రాధా మంజునాథ్ నాయక్ ఆదేశించారు. 2021 డిసెంబరులో వీరు ఒడిశా నుంచి గంజాయిని తెచ్చారు. అది తెలిసి తుంగా నగర సీఐ దీపక్ ఎం.ఎస్, పోలీసులు దాడి చేయగా ఇన్నోవా కారులో 21 కేజీల గంజాయి లభించింది. నలుగురినీ అరెస్టు చేసి విచారణ సాగించారు. నేరం రుజువు కావడంతో ఈ నెల 15న జడ్జి తీర్పు వెలువరించారు.

టీబీ డ్యామ్‌లో పెరిగిన నీటి ప్రవాహం



తుంగభద్ర డ్యాం

హొసపేటె: తుంగభద్ర డ్యాం ఎగువన భారీగా వర్షాలు కురుస్తుండటంతో ప్రస్తుతం రిజర్వాయర్‌లో ఏడు టీఎంసీలకు పైగా నీరు నిల్వ ఉంది. జిల్లాలో వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండటంతో డ్యామ్‌లో నీటి ప్రవాహం పెరిగింది. ప్రస్తుతం నీటినిల్వ 7 టీఎంసీలకు చేరుకొంది. గత ఏడాది తీవ్ర వర్షాభావం కారణంగా రిజర్వాయర్ పూర్తిగా ఎండిపోయిన విషయం తెల్సిందే. తాజా కురుస్తున్న వర్షాలతో నెమ్మదిగా డ్యామ్‌లోకి నీరు వచ్చి చేరుతోంది. ఈ ఆనకట్ట ద్వారా లక్షలాది ఎకరాలకు నీరు అందుతుంది. ప్రస్తుతం డ్యాంలో నీటి మట్టం 1583.03 అడుగులు, ఇన్‌ఫ్లో 1619 క్యూసెక్కులు ఉందని డ్యాం అధికారులు తెలిపారు.

ప్రజలు తిరగబడే రోజు వస్తుంది: కుమార

మండ్య: రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న దుర్మార్గపు పరిపాలన పైన ప్రజలు తిరగబడే రోజు వస్తుందని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్.డి. కుమారస్వామి అన్నారు. ఆదివారం మండ్య జిల్లాలోని నాగమంగళ తాలూకాలోని ఆదిచుంచనగిరి క్షేత్రంలో నిర్మలానందనాథ స్వామిని కలిశారు. కాల భైరవేశ్వర స్వామికి పూజలు చేసి మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి చాలా అధ్వాన్నంగా మారిందని, గ్యారెంటీ పథకాల కోసం డబ్బులు లేక పెట్రోల్, డీజిల్, మద్యం ధరలను పెంచారని ఎద్దేవా చేశారు. తరువాత ఆయన మండ్యలోని కలెక్టరేటు పక్కన తన కార్యాలయానికి వెళ్లి పూజలు చేశారు. రాష్ట్రంలో గ్యారంటీ పథకాల పేరుతో రాష్ట్ర ప్రజలను లూటీ చేస్తున్నారని దుయ్యబట్టారు. పెట్రో ధరల పెంపు వల్ల సామాన్య ప్రజలు ఇబ్బందులు పడతారన్నారు. సరుకుల రవాణాపైన అధిక భారం పడి ధరలు పెరుగుతాయన్నారు. దీనివల్ల రైతులు కూడా నష్టపోతారని అన్నారు. పెట్రో ధరలను వెంటనే తగ్గించాలని అన్నారు.

ఎన్‌సీసీ క్యాంపులో కలుషితాహారం



శివమొగ్గ: శివమొగ్గ నగరంలో ఉన్న సహ్యాద్రి కాలేజీలో ఎన్‌సీసీ క్యాంప్‌లో కలుషితాహారం తిని 9 మంది విద్యార్థులు అనారోగ్యం పాలయ్యారు. కళాశాలలో ఆదివారం ఎన్‌సిసి క్యాంప్‌ను నిర్వహించారు. సుమారు 400 మందికి పైన విద్యార్థులు హాజరైనారు. మధ్యాహ్నం భోజనం ఆరగించినవారిలో 9 మందికి వాంతులు, విరేచనాలు మొదలయ్యాయి. దీంతో వారిని మెగ్గాన్ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతున్నారని, ఎలాంటి ప్రమాదం లేదని వైద్యులు తెలిపారు. అపరిశుభ్ర పరిస్థితుల్లో వంట వండడమే కారణమని తెలుస్తోంది.

సంక్షోభంలో శాండల్‌వుడ్

- తీవ్ర వివాదాల్లో నటీనటులు
- ఈ ఏడాది పెద్ద హిట్టు కరువు
- గత వైభవం అడియాసేనా?







ఇటీవల హత్య కేసులో చిక్కుకున్న హీరో దర్శన్, నటి పవిత్రగౌడ

సాక్షి, బెంగళూరు: కన్నడ చలనచిత్ర పరిశ్రమ శాండల్‌వుడ్ ప్రస్తుతం గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటోంది. ఒకవైపు ప్రేక్షకులు థియేటర్లకు ముఖం చాటేస్తుండడంతో వాటిని మూసేయాల్సిన దుస్థితి తలెత్తింది. మరోవైపు నటీనటుల జీవితాల్లో సంక్షోభాలు ఏర్పడుతున్నాయి. హీరో హీరోయిన్లే కాకుండా కొన్ని సినీ నిర్మాణ సంస్థలు, నిర్మాతలు పలు వివాదాల్లో చిక్కుకుంటూ శాండల్‌వుడ్‌కు ఏమైంది అనేలా తయారయ్యారు. హత్యలు, విడాకులు, కుమ్ములాటలతో చందనసీమ నలిగిపోతోంది. ఒకప్పుడు కన్నడ కంఠీరవ రాజ్‌కుమార్, రెబెల్ స్టార్ అంబరీష్, సాహససింహ విష్ణువర్ధన్, శంకర్‌నాగ్ వంటి మహామహులతో విరాజిల్లిన శాండల్‌వుడ్ ఇప్పుడు సంక్షోభాన్నే చవిచూస్తోంది.

థియేటర్లు వెలవెల

ఈ ఏడాది ప్రారంభం నుంచి కన్నడ కళాకారులు, సాంకేతిక నిపుణులు వ్యక్తిగత జీవితాలతో పాటు అనేక నెగెటివ్ వార్తలతో చిత్రపరిశ్రమ నిత్యం వార్తల్లో నిలుస్తోంది. గడిచిన ఆరునెలల్లో వందకు పైగా సినిమాలు విడుదల కాగా అందులో భారీ స్థాయిలో హిట్ అయిన సినిమా ఒక్కటీ లేకపోవడం చందనవనాన్ని కలవరపరుస్తోంది. అంతేకాకుండా నేటితరం ప్రేక్షకులు థియేటర్లకే రావడం లేదు. అలాగే సినిమాలను ఏ టీవీ చానెల్ కానీ, ఓటీటీ సంస్థలు కానీ కొనుగోలు చేయడం లేదని కన్నడ నిర్మాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పులి మీద పుట్రలా దర్శన్ వంటి బడా హీరోలు హత్య కేసుల్లో ఇరుక్కోవడంతో చిత్రపరిశ్రమ ఇబ్బందుల్లో పడింది. రేణుకాస్వామి అనే వ్యక్తి హత్య కేసులో చాలెంజింగ్ స్టార్, నటుడు దర్శన్, నటి పవిత్ర, మరో 12 మందికి పైగా అనుచరులు అరెస్టు అయ్యారు. ఒక స్టార్ నటుడు హత్య కేసులో భాగం కావడం ఇంతవరకు జరగలేదు.

గోవాలో నిర్మాతల గొడవ

ఇటీవల కన్నడ ఫిల్మ్ చాంబర్ అధ్యక్షుడు ఎన్‌ఎం సురేశ్‌తో పాటు తదితర చిత్రరంగ ముఖ్యులు గోవాకు వెళ్లారు. కొందరు అక్కడ గొడవ పడ్డారు. ఈ గొడవలో నిర్మాత గణేశ్‌పై దాడి కూడా జరిగింది.



కాపురాల్లో కలతలు

శాండల్‌వుడ్‌లోని ప్రముఖులు ఇటీవల ఒక్కొక్కరే విడాకుల పేరుతో రచ్చకెక్కుతున్నారు. రియాల్టీ షో కలసికట్టుగా కనిపించిన చందన్ శెట్టి-నివేదిత ఆ తర్వాత ప్రేమ, పెళ్లి అంటూ చకచకా తమ నిజజీవితంలో అడుగులు వేశారు. అయితే మూణ్నాళ్ల ముచ్చటే అన్నట్లు పెళ్లి అయిన మూడేళ్లకే వీరిద్దరూ విడిపోతామని కోర్టును ఆశ్రయించడం ఆశ్చర్యానికి గురిచేసింది. ఇద్దరికీ పొసగక విడాకులకు సిద్ధమయ్యారు. కన్నడ కంఠీరవ దివంగత నటుడు డాక్టర్ రాజ్‌కుమార్ కుటుంబంలో కూడా విడాకుల ఉదంతం వెలుగు చూసింది. కొన్నేళ్ల క్రితం ప్రేమించి, ఇంట్లో పెద్దలను ఒప్పించి యువ రాజ్‌కుమార్, శ్రీదేవీ పెళ్లి చేసుకున్నారు. వీరిద్దరి మధ్య కలతలు రావడంతో విడిపోతామని శ్రీదేవి ప్రకటించింది. శాండల్‌వుడ్‌లో పెద్ద ఇంటిగా పేరుగాంచిన రాజ్‌కుమార్ కుటుంబంలో విడాకుల పేరు వినిపించడం కలకలం రేపింది. మరో స్టార్ నటుడు దునియా విజయ్ సంసారంలో కూడా అలజడులతో సాగుతోంది. ఇటీవల ఆయన దాఖలు చేసిన విడాకుల కేసును న్యాయస్థానం కొట్టివేసింది. మొదటి భార్య నాగరత్నకు విడాకులు ఇవ్వకుండానే కీర్తి గౌడను దునియా విజయ్ మరో పెళ్లి చేసుకున్నాడు.

పవిత్రగౌడ ఇంట్లో సోదాలు

- దుస్తులు, చెప్పులు సీజ్

దొడ్డబళ్లాపురం: రేణుకాస్వామి హత్య కేసులో మొదటి నిందితురాలిగా ఉన్న పవిత్రగౌడ ఇంట్లో పోలీసులు సోదాలు చేశారు. ఆర్‌ఆర్ నగరలో ఉన్న పవిత్రగౌడ ఇంటికి ఆమెను, ఆమె అనుచరుడు పవన్‌ను తీసుకెళ్లారు. హత్య జరిగాక పవిత్ర నేరుగా ఇంటికి వెళ్లిపోయింది, ఆ రోజు ఆమె ధరించిన దుస్తులు, దాడికి ఉపయోగించిన చెప్పును స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో నిందితుడు అయిన పవిత్రగౌడ మేనేజర్ దేవరాజును పోలీసులు అరెస్టు చేశారు. హత్య జరిగిన షెడ్ వద్దకు పవిత్రగౌడతో కలిసి దేవరాజు కూడా వెళ్లాడని దర్యాప్తులో తేలడంతో శనివారం అర్ధరాత్రి అతన్ని అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్నారు. రేణుకాస్వామిపై మొదట దాడి చేసింది పవిత్ర అని తెలిసింది. రేణుకాస్వామి ఉంగరం, చైన్ తదితరాలను నిందితులు లాక్కున్నట్లు పోలీసులు తెలిపారు.

దర్శన్‌ను కలిసిన నిందితులు

రేణుకాస్వామి మృతదేహం లభించగానే లొంగిపోవాలని డీల్ కుదుర్చుకున్న నిందితులు లొంగిపోవాలా, లేక కొన్ని రోజులు వేచి చూడాలా అనే మీమాంసలో పడిపోయారు. దీనిపై మైసూరులో ఒక హోటల్‌లో ఉన్న దర్శన్ వద్దకు వెళ్లి చర్చించారని విచారణలో తేలింది. దీంతో పోలీసులు సదరు హోటల్లో కూడా మహజర్ చేయవచ్చని తెలుస్తోంది.

కరెంటు షాకిచ్చి..

రేణుకాస్వామికి కరెంట్ షాక్ ఇచ్చి హింసించినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. హత్య తరువాత ఆ పరికరాన్ని బెంగళూరు-మైసూరు హైవేలో విసిరేశారు. దీంతో పోలీసులు విజయనగర ప్రాంతంలో హైవేలో పరికరం కోసం గాలింపు చేపట్టారు.

సీఐ గిరీష్ నియామకం

రేణుకాస్వామి కేసును దర్యాప్తు చేస్తున్న బృందంలోకి సీఐ గిరీష్ నియమితులయ్యారు. ఎన్నికల సమయంలో కామాక్షిపాళ్య పోలీస్‌స్టేషన్‌కు తాత్కాలిక సీఐ గిరీష్ బదిలీపై వచ్చారు. తరువాత అక్కడే రేణుకాస్వామి హత్య వెలుగు చూసింది. దర్శన్ అరెస్టు సమయంలో గిరీష్‌ను మళ్లీ సీకే అచ్చుకట్టు పోలీస్‌స్టేషన్‌కు పంపించారు. అయితే కేసు విచారణకు అవసరమని గిరీష్‌ను తనిఖీ అధికారిగా నియమించారు.

లౌకిక వాదానికే కట్టుబడి ఉంటాం

- మాధవానంద ప్రభువులకు సీఎం నివాళి



మాధవానంద ప్రభువుల సమాధికి నమస్కరిస్తున్న సిద్ధు

హుబ్లీ: ఓట్లు రాక పోయిన లౌకిక వాదానికే కట్టుబడి ఉంటామని సీఎం సిద్ధరామయ్య తెలిపారు. ఆదివారం విజయపుర జిల్లా షాడక్షణ తాలూకా ఇంచగేరి గ్రామంలో నిర్వహించిన నిరాజయోగ సమర్థసద్గురు మాధవానంద ప్రభువు దేవస్థానం జాతికి అంకితం, కళసరోహణ, 44వ వర్ధంతి సప్తాహ కార్యక్రమాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. కుల వ్యవస్థ వల్ల బ్రిటీషర్లు ఈ దేశాన్ని పాలించారు. ఈ దేశానికి వ్యాపారం చేసుకోవడానికి వచ్చి ఇక్కడే ఇక్కడే మకాం వేశారన్నారు. అప్పట్లో సుమారు 560 సంస్థానాలు ఉండేవన్నారు. ఆయా అధిపతులందరూ పరస్పరం వాదులాడుకొనేవారన్నారు. దీంతో మన కుల వ్యవస్థ చాలా బలంగా నాటుకుందన్నారు. ఈ కుల వ్యవస్థ ద్వారా బ్రహ్మణులు, క్షత్రియులు, వైశ్యులకు అన్ని సౌకర్యాలు కల్పించారన్నారు. విద్య, ఆస్తి అన్ని వారివే అన్నారు. శూద్రులకు ఎటువంటి సదుపాయాలు లేవన్నారు. దీంతో బ్రిటీషర్లు ఈ దేశాన్ని పాలించడం సులువు అయిందన్నారు. మాధవానంద స్వామి దీన్ని తెలుసుకొనే లౌకిక వాద తత్వాన్ని అలవరుచుకున్నారన్నారు. దీంతో ఆయన సదా పూజ్యనీయులు అయ్యారన్నారు. బసవణ్ణ కూడా లౌకిక వాదతత్వాన్నే ప్రతిపాదించారన్నారు. 12వ శతాబ్దంలో బసవాది శరణులు చెప్పిన సందేశాలనే 20వ శతాబ్దంలో మాధవనంద స్వామి బోధించారన్నారు. మనిషి మనిషిలాగా ఉండాలన్నారు. పరస్పరం ప్రేమ అప్యాయతలతో గౌరవించుకోవాలన్నారు. మంత్రి ఎంబీ పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కోసం వెళ్తే ఊపిరే పోయింది

- కువైట్ అగ్ని ప్రమాదంలో కలబుర్గివాసి మృతి



విజయ్‌కుమార్ మృతదేహం వద్ద బంధువుల రోదనలు

హుబ్లీ: పేదరికంలో పుట్టినా, కుటుంబం బాగా బతకాలనే తపనతో కువైట్‌లో ఉపాధి కోసం వెళ్లిన కలబుర్గి జిల్లా నివాసి విజయ్‌కుమార్ ప్రసన్న అక్కడే కన్నుమూశాడు. ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో అసువులు బాశాడు. అలంద తాలూకా సరసంబ గ్రామవాసి విజయ్ ప్రసన్న (40) పదేళ్ల నుంచి కువైట్‌లో ట్రక్ డ్రైవర్‌గా పని చేస్తూ కుటుంబానికి డబ్బు పంపిస్తూ ఉండేవాడు. అప్పుడప్పుడు వచ్చి కుటుంబంతో, మిత్రులతో గడిపి వెళ్లేవాడు.

రెండేళ్ల తరువాత వచ్చేస్తానని

పేదరికంలో పెరిగిన ఆయనకు భార్యతో పాటు ఓ కుమార్తె, ఇద్దరు మగబిడ్డలు ఉన్నారు. తనను నమ్ముకున్న వారికి మంచి భవిష్యత్తు ఇవ్వాలన్న ఆశతో ఎంతో కష్టమైనా కువైట్‌లో ఉంటూ పనిచేసేవాడు. గత ఏడాది స్వగ్రామానికి వచ్చి వెళ్లిన విజయ్‌కుమార్.. రెండేళ్ల తర్వాత కువైట్ వదిలి వచ్చేస్తానని కుటుంబానికి మాటిచ్చాడు. మంగాఫ్ ప్రాంతంలోని భవనంలో జరిగిన అగ్నిప్రమాదంలో 47 మంది భారతీయులు సజీవదహనం అయిన సంగతి తెలిసిందే. వారిలో విజయ్ ప్రసన్న కూడా ఉన్నాడని తెలిసి కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరయ్యారు. ఆదివారం మృతదేహం తిరిగి రాగా భార్య పిల్లలు, బంధువుల రోదనలు మిన్నంటాయి. అలంద ఎమ్మెల్యే పాటిల్, ఇతర పెద్దలు పరామర్శించి ధైర్యం చెప్పారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఆర్థిక సహాయం అందేలా ప్రయత్నిస్తానని ఎమ్మెల్యే తెలిపారు.

తుమకూరు- రాయదుర్గం రైలుమార్గం త్వరలో పూర్తి



కేంద్రమంత్రి సోమణ్ణ స్వాగత ర్యాలీ

తుమకూరు: తుమకూరు- రాయదుర్గం రైల్వే పథకానికి తుమకూరు జిల్లాలో సుమారు 11 కిలోమీటర్ల రైలుమార్గం పొడవునా భూ స్వాధీనం పెండింగ్‌లో ఉంది, దానిని పూర్తి చేసి 2026 లోగా పథకాన్ని ప్రజలకు అప్పగిస్తామని కేంద్ర జలశక్తి, రైల్వే సహాయశాఖ మంత్రి వి.సోమన్న చెప్పారు. ఆదివారం ఆయన తన నియోజకవర్గమైన తుమకూరు నగరానికి వచ్చారు. ఓ కళ్యాణ మండపంలో బీజేపీ, జేడీఎస్ కార్యకర్తలతో కృతజ్ఞతా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2010-11లో తుమకూరు-రాయదుర్గం రైలు మార్గం పథకం మొదలైందని, ఆంధ్రప్రదేశ్‌లో పనులు పూర్తి చేసి రైలు ప్రయాణాలు కూడా జరుగుతున్నాయని తెలిపారు. కానీ తుమకూరు జిల్లాలో పనులు ఇంకా పూర్తి కాలేదని, కొన్నిచోట్ల భూస్వాధీనం జరగాల్సి ఉందని చెప్పారు. ఆ పనులను ముగించి పథకాన్ని అందుబాటులోకి తెస్తామన్నారు. ఈ సందర్భంగా ఆయన భారీ ర్యాలీగా చేరుకున్నారు.

తల్లిని కొట్టాడని హత్య

బనశంకరి: తల్లిని కొట్టాడని ఆమె ప్రియున్ని కుమారుడు హత్యచేశాడు. ఈ ఘటన నగరంలో పరప్పన అగ్రహార పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం జరిగింది. కూడ్లులోని సాయిమెడోస్ లేఔట్ సుభాష్ చంద్రబోస్ రోడ్డులో కృష్ణోజీరావ్ (37) అనే వ్యక్తితో కలిసి రాజేశ్వరి అనే మహిళ నిర్మాణంలో దశలోని మొదటి అంతస్తులో నివాసం ఉంటుంది. శనివారం కృష్ణోజీరావ్‌కు కూలి డబ్బు అందింది. డబ్బు పంపకాలపై ఇద్దరి మధ్య గొడవ జరిగింది. ఈ సమయంలో రాజేశ్వరి కుమారుడు శివకుమార్ (20) వచ్చాడు, తన తల్లిని కొడతావా అని కృష్ణోజీరావ్‌పై కట్టెతో దాడి చేసి చంపాడు. కట్టడ యజమాని సురేశ్ ఫిర్యాదుతో పోలీసులు చేరుకుని నిందితున్ని అరెస్టు చేశారు.

అసెంబ్లీని కుదువ పెడతారు: అశోక్

శివాజీనగర: సిద్ధరామయ్య ఔట్ గోయింగ్ ముఖ్యమంత్రి, వెళ్లేటప్పుడు ఆయన విధానసౌధను తాకట్టుపెట్టి వెళ్లవచ్చునేమోనని బీజేపీ పక్ష నాయకుడు ఆర్.అశోక్ ఆరోపించారు. ఆదివారం విధానసౌధలో విలేకరులతో మాట్లాడిన ఆయన, లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్‌కు ఓటు వేయలేదని ధరలు పెంచారు. ప్రభుత్వం పాపర్ అయింది. కమీషన్ కొల్లగొట్టేందుకు డబ్బు లేదు. కార్పొరేషన్ ఆఫీసును తాకట్టు పెట్టేందుకు ప్లాన్ చేస్తున్నారు. ఈ ప్రభుత్వం ఇంకో ఏడాది ఉంటే విధానసౌధనూ కుదువ పెడుతుందని దుయ్యబట్టారు. ధరల పెరుగుదలపై ధర్నాలు చేస్తాం. ప్రజలు కూడా పాల్గొనాలని కోరారు. ఆర్థిక శాఖ పూర్తిగా అధ్వాన్నంగా తయారైంది. డిప్యూటీ సీఎం డీ.కే.శివకుమార్ కాంగ్రెస్ ఎమ్మెల్యేలపై దౌర్జన్యం చేస్తున్నారని ఆరోపించారు.





గజ విలాసం

వర్షాలు రావడం, అడవుల్లో పచ్చదనం వ్యాప్తితో వన్యప్రాణులు ఉల్లాసంగా ఉంటున్నాయి. ఆదివారం మైసూరు జిల్లాలో బండీపుర అరణ్యంలో ఏనుగుల విహారం (ఇన్‌సెట్) చెట్టుపై చిరుత మకాం

మహిళ పరువుకు హాని చేయరాదు

- నిందితునిపై కేసు కొట్టివేతకు
- హైకోర్టు నో

శివాజీనగర: నగరంలో మెజెస్టిక్ మరుగుదొడ్డి, బస్టాండ్‌ల గోడలపై మహిళ మొబైల్ నంబర్‌ను రాసి కాల్ గర్ల్ గా పేర్కొన్న వ్యక్తిపై దాఖలైన కేసును రద్దు చేయడానికి హైకోర్టు నిరాకరించింది. వివరాలు.. చిత్రదుర్గకు చెందిన అల్లాబక్ష పటేల్ అనే వ్యక్తి ఓ మహిళపై కోపంతో ఆమె ఫోన్‌నంబరును దుష్ప్రచారం చేశాడు. బాధితురాలు ఫిర్యాదు చేయడంతో పోలీసులు విచారించి అతనిపై కేసు నమోదు చేశారు. ఈ కేసును రద్దు చేయాలని నిందితుడు అర్జీ వేయగా, జస్టిస్ నాగప్రసన్న ధర్మాసనం విచారించింది. మహిళ గౌరవాన్ని అవమానించే ఉద్దేశంతో చిన్నదైనా, పెద్దదైనా నేరం నేరమే. నేటి డిజిటల్ యుగంలో శారీరక హాని చేయాల్సిన అవసరం లేదు. సామాజిక మాధ్యమాల్లో అవమానకర వ్యాఖ్యలు, వీడియోలు, చిత్రాల ద్వారా మహిళకు హాని చేయబడుతోంది. అందుచేత ఇటువంటి కేసులను రద్దు చేయడానికి అంగీకరించం. బహిరంగంగా మహిళపై ఇటువంటి నీచమైన వ్యాఖ్యలను చేయడం సబబు కాదు అని జడ్జి ఆ పిటిషన్‌ను కొట్టివేశారు.

ప్రజల పక్షాన తీర్పులు ఇవ్వాలి


- రిటైరు కాగానే పెద్ద పదవులు వస్తున్నాయి
- న్యాయ రంగంపై సుప్రీం రిటైర్డు జడ్జి గోపాలగౌడ వ్యాఖ్యలు
- కావేరి వివాదంపై పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణలో ప్రముఖులు

శివాజీనగర: న్యాయమూర్తులు ఎలాగ తీర్పులు ఇస్తున్నారు, ఆ తీర్పుల తరువాత ఎలా గవర్నర్, ప్రభుత్వంలోని వివిధ పదవుల్లోకి నియమితులు అవుతున్నారు అనేది దేశ ప్రజలకు తెలుసునని సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ వీ గోపాలగౌడ అన్నారు. ఆదివారం నగరంలోని గాంధీ భవన్‌లో రిటైర్డ్ ఐపీఎస్ అధికారి సీ.చంద్రశేఖర్ రచించిన కావేరి వివాదం గురించి చారిత్రక వివరణ అనే పుస్తకావిష్కరణలో ఆయన పాల్గొని మాట్లాడారు. పశ్చిమ బెంగాల్ సింగూర్ కేసులో తాను ఇచ్చిన తీర్పు జాతీయ స్థాయి దృష్టిని ఆకర్షించింది, తాను రిటైరయ్యాక ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తమ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ అధ్యక్షునిగా చేస్తానని తెలిపారు, నేను ఆ ప్రతిపాదనను తిరస్కరించాను అని గోపాలగౌడ చెప్పారు. లాభం పొందాలని ఎప్పుడూ తీర్పులు ఇవ్వలేదన్నారు. తీర్పులను ఇచ్చిన తరువాత లోకాయుక్త, గవర్నర్ అవుతున్నారు. ఇలా ఇటువంటి పదవులకు వెళ్తున్నారనేది అందరికీ తెలిసిపోయిందని పేర్కొన్నారు. న్యాయమూర్తులు పుస్తకాలకు పరిమితం కారాదు. ప్రజల సమస్యలను అర్థం చేసుకోవాలి. అర్హత ఆధారంగా తీర్పు ఇవ్వాలి. సామాన్య ప్రజలు, అణచివేతకు సరైన వర్గాల గురించి యోచించాలని తెలిపారు. ఈ సందర్భంగా గతంలో కావేరి న్యాయమండలి తీర్పులు, రాష్ట్ర ప్రభుత్వ వైఖరి తదితరాల గురించి తన అనుభవాలను ఏకరువు పెట్టారు. అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వానికి సుప్రీం న్యాయమూర్తిగా తాను భుజమిచ్చి అండగా నిలిచానని పేర్కొన్నారు.

కావేరి నది (ఫైల్)



ప్రజలకు కావేరిపై అవగాహన లేదు

గత సెప్టెంబర్‌లో కావేరి జల గురించి వివాదంపై చర్చ కోసం ముఖ్యమంత్రి సిద్దరామయ్య భేటీని ఏర్పాటు చేశారు. కావేరి విషయంలో వాదించేందుకు న్యాయవాదుల కోసం రూ.142 కోట్లు ఖర్చు చేశారు. ఈ సొమ్ముతో మరో ఆనకట్ట నిర్మించవచ్చు కదా అని తాను సీఎంకు చెప్పానని గోపాలగౌడ తెలిపారు. ఇప్పుడు ఈ విషయాన్ని మరోసారి చర్చించాలన్నారు. కావేరి వివాదం గురించి ఈ పుస్తకం చక్కగా వివరించిందన్నారు. బెంగళూరులో కావేరి నీటిని తాగుతున్నా కావేరి వివాదం గురించి అవగాహన లేనివారు ఉన్నారు. ఈ దేశంలో విద్యార్థి వర్గం తప్పుదారి పడుతోందని ఆయన విచారం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీ.కే.శివరాం, నాడోజ డబ్ల్యూ పీ కృష్ణ, దినేశ్ అమీన్ మట్టు, రైతు నేతలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మందిరాలు అవసరం

రాయచూరు రూరల్: ప్రజలు ప్రార్థనలు చేసుకోవడానికి మందిరాలు అవసరమని సిరవార జిల్లా రెవరెండ్ సూపర్‌వైజర్ సతీష్ కుమార్ అభిప్రాయపడ్డారు. ఆదివారం దేవదుర్గ తాలూకా బొమ్మనాళలో రాష్ట్ర సర్కార్ క్రైస్తవ సముదాయ అభివృద్ధి మండలి నుండి రూ.50 లక్షలతో నిర్మించనున్న చర్చి నిర్మాణానికి భూమిపూజ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో యాదగిరి కళాశాల ప్రిన్సిపాల్ జయపాల్, వెంకట సింగ్, చంద్రశేఖర్, రాజు, జయశీల, ప్రకాశ్, యెస్సు, దేవపుత్ర, డేవిడ్, బెంజమిన్, రవి, శాంతరాజు తదితరులు పాల్గొన్నారు.

కమనీయం.. ఖాద్రీశుని కల్యాణోత్సవం


ప్రత్యేక అలంకరణలో ఖాద్రీశుడు

కదిరి టౌన్: శ్రీదేవి భూదేవి సమేత శ్రీఖాద్రీశుని కల్యాణోత్సవం కమనీయంగా సాగింది. కదిరి నరసింహస్వామి ఆలయంలోని కల్యాణమండపంలో ఆదివారం అర్చకులు సంతోష్‌కుమార్ స్వామివారిని వివిధ రకాల పూలతో ప్రత్యేకంగా అలకంరించి, పూజలు చేశారు. సంప్రదాయబద్ధంగా శాస్త్రోక్తంగా మంత్రోచ్చారణల మధ్య మేళతాళలతో అంగరంగ వైభవంగా శ్రీవారి కల్యాణోత్సవం నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

చేగువేరా జయంతి


చేగువేరా చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: విప్లవ కెరటం చేగువేరా జయంతిని సీఐటీయూ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శనివారం హట్టి పట్టణంలో సీఐటీయూ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో అర్జెంటీనా విప్లవకారుడు చేగువేరా జయంతి కార్యక్రమంలో సభ్యులు మాట్లాడుతూ చేగువేరా సమాజానికి చేసిన సేవలు మరువరానివన్నారు. కార్యక్రమంలో అమరేష్, వెంకటేష్, నింగప్ప, రాజరత్నం, నాగరాజ్, వినయ్, యశవంత్, నజీర్, ఫక్రుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

యోగా శిబిరం



విజయపుర(బెంగళూరు గ్రామీణ): విజయపుర పట్టణంలో ఉన్న ఎవర్‌గ్రీన్ పాఠశాల ఆవరణలో శ్రీ పతంజలి యోగా శిక్షణ సమితి ఆధ్వర్యంలో ఆదివారం యోగా చింతన శిబిరాన్ని నిర్వహించారు. నిపుణులు సుందరాచార్య పాల్గొని ప్రారంభించారు. పెద్ద సంఖ్యలో బాల బాలికలు యోగ సాధన చేశారు.

ఇంధన ధర పెంపునకు కారణ ఉంది

శివాజీనగర: రాష్ట్ర ఆదాయం తగ్గుతోందని, అభివృద్ధి, గ్యారెంటీల అమలుకు నిధులు అవసరముందని, అందుచేత ఇంధన ధర పెంచినట్లు మంత్రి ఎం.బి.పాటిల్ తెలిపారు. తమిళనాడు, ఇతర రాష్ట్రాలతో పోలిస్తే రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ ధర తక్కువగా ఉందన్నారు. ఎవరిపైనా అవసరంగా భారం వేయలేదన్నారు. నరేంద్ర మోదీ బాధ్యతలు చేపట్టిన తర్వాత గ్యాస్ సిలిండర్ ధర పెరిగిందని, దానిని ఎందుకు ప్రశ్నించటం లేదని ఆయన అన్నారు. కేంద్రంలో యూపీఏ పాలన ఉన్నప్పుడు విద్యుత్ ధర తక్కువగా ఉండేదన్నారు.

బెళగావిలో అబార్షన్ల దందా


శిశువు మృతదేహం, నిందితుడు గఫూర్

సాక్షి, బళ్లారి: ఇటీవల బెంగళూరు- మండ్య జిల్లాలో పెద్దఎత్తున భ్రూణ హత్యల బాగోతాలు బయటపడిన వైనం మరువకముందే, బెళగావి జిల్లాలో విచ్చలవిడిగా అబార్షన్లు చేస్తున్న ఒక నకిలీ వైద్యుని ఉదంతం బట్టబయలైంది. బెళగావిలోని కిత్తూరులో ఆర్ఎంపీ అబ్దుల్ గఫూర్ అబార్షన్ల దందా కొనసాగిస్తున్నాడు. కిత్తూరు తాలూకా తిగడోలి గ్రామంలోని ఫాం హౌస్‌లో ఆడ శిశువు శవం లభ్యమైంది. దీంతో పోలీసులు గఫూర్ సహాయకునిగా ఉన్న రోహిత్‌ను అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టగా మరిన్ని సంగతులు వెలుగుచూశాయి. తిగడోలి గ్రామంలోని గఫూర్ ఫాంహౌస్‌లో ఓ శిశువు మృతదేహం లభ్యమైంది. గత కొన్ని సంవత్సరాలుగా వీరిద్దరూ గుట్టుగా అబార్షన్లు సాగిస్తున్నట్లు తేలింది. ఫాంహౌస్‌లో రోహిత్ సమక్షంలో విచారణ చేస్తున్నారు. గర్భం వద్దనుకున్నవారి నుంచి పెద్దమొత్తంలో డబ్బు తీసుకుని గర్భవిచ్ఛిత్తి చేసేవారమని తెలిపారు.

ఊపందుకుంటున్న వ్యవసాయం



జిల్లా వ్యాప్తంగా వ్యవసాయ పనులు జోరందుకున్నాయి, ఓ ప్రాంతంలో దుక్కిదున్ని సాగుకు సిద్ధం చేస్తున్న దృశ్యం

- విత్తన ప్రక్రియ ప్రారంభం
- జిల్లాలో 40 మి.మీ వర్ష పాతం నమోదు
- ఖరీఫ్ సీజన్‌పైనే రైతుల ఆశలు

సాక్షి,బళ్లారి: గత ఏడాది తీవ్ర వర్షాభావంతో పెట్టిన పంటలు చేతికందక, చేసిన అప్పులు తీరక అన్నదాతలు తీవ్రంగా నష్టపోయారు. అయితే జూన్‌లో కురుస్తున్న వర్షాలతో అన్నదాతల్లో ఆశలు మొలకెత్తుతున్నాయి. దీంతో దుక్కులు దున్నడం ప్రారంభించారు. జిల్లాలో దాదాపు ఐదు లక్షలు ఎకరాలు వ్యవసాయయోగ్యమైన భూమి ఉండగా, ఇందులో నీటిపారుదలు భూములు అంటే తుంగభద్ర ఆయకట్టుతో పాటుతో పాటు బోరు, బావులు కింద ఉన్న వ్యవసాయ భూములు దాదాపు మూడు లక్షలు 50 వేలు ఎకరాలు భూమి ఉండగా, మిగిలిన ఒకటిన్నర లక్ష ఎకరాలు భూమి వర్షాధారిత భూములు. సండూరు, బళ్లారి తాలూకాల్లో వర్షాధారిత భూములు అధికంగా ఉండటంతో ఆయా తాలూకాల్లో ముందుగా సేద్యం పనులు పూర్తి చేసిన రైతన్నలు విత్తనాలు విత్తే కార్యక్రమాన్ని ప్రారంభించారు. వర్షాధారిత భూముల్లో వేరుశనగ, జొన్న తదితర సాగు మొదలు పెట్టారు. రెండు రోజులు నుంచి జోరు వాన కురవడంతో భూమి పూర్తిగా తడిసిముద్దయింది. గురువారం ఉదయం నుంచి చల్లని వాతావరణం ఉండటంతో వ్యవసాయ పనులు చేసుకుందుకునే రైతన్నలకు అనువైన వాతావరణం ఏర్పడింది. ఈ ఏడాది లక్ష్యానికి తగ్గట్టుగా జిల్లాలో ఐదు లక్షలు ఎకరాల్లో విత్తనసాగు, వరినాట్లు వేసేందుకు రైతన్నలకు అనుకూలమైన వాతావరణం ఏర్పడటంతో ముందుగా విత్తనాలు, ఎరువులు సిద్ధం చేసినట్లు వ్యవసాయ జిల్లాధికారి మల్లికార్జున సాక్షికి తెలిపారు. తుంగభద్ర ఆయకట్టు ప్రాంతంలో వరినాట్లు వేసే రైతులకు విత్తనాలు వద్దుతో, వర్షాధారిత భూముల్లో సాగు చేసే రైతులకు కూడా కంది, జొన్న, సజ్జ, ఆయా ప్రాంతాలకు విత్తనాలు సిద్ధం చేసి, ఆయా వ్యవసాయ కేంద్రాల్లో ఉంచామన్నారు.

జిల్లా వ్యాప్తంగా 40 మి.మీ :

ఈవారంలో జిల్లా వ్యాప్తంగా సరాసరి 40 మిల్లిమీటర్లు వర్షపాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. బళ్లారి తాలూకా 18 మి.మీ, సండూరు 16, సిరుగుప్ప 45, కురుగోడు 37, కంప్లి 32 మి.మీ నమోదు కావడంతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు.

ఇంధన ధరల పెంపుపై నిరసన


పెట్రోల్, డీజిల్ ధరలను ఖండిస్తూ చిక్కమగళూరులో కొబ్బరి చిప్పను చేతిలో పట్టుకొని ధర్నా చేస్తున్న బీజేపీ నేతలు

బనశంకరి: రాష్ట్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ ధరలు పెంచడంపై సర్వత్రా నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. పెట్రోల్ పై రూ.3 , డీజిల్‌పై రూ.3.50 పెంచుతూ ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాలు అమలులోకి వచ్చాయి. కాగా ఇప్పటికే నిత్యావసరాల ధరల మోతతో అల్లాడుతున్న ప్రజలకు తాజాగా ఇంధన ధరల పెంపు పుండుపై కారం చల్లినట్లైంది. ఇంధన ధరల పెంపుతో సహజంగా సరుకురవాణా సేవలపై తీవ్రప్రభావం చూపుతుంది. దీంతో నిత్యావసర వస్తువుల ధరలు కూడా పెరగనున్నాయి. గతంలో కేంద్రం ఇంధన, గ్యాస్ ధరల పెంచింది. ఆ సమయంలో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఉద్యమించింది. అనంతరం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ ధరల పెంపును అడ్డం పెట్టుకొని కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించింది. జీఎస్టీ పరిధిలో లేని ఇంధన విక్రయంతో రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రప్రభుత్వానికి సమానంగా ఆదాయం వస్తుంది. పెట్రోల్‌పై గతంలో సుమారు 26 శాతం ట్యాక్స్ ఉండగా ప్రస్తుతం 29.84 శాతానికి పెరిగింది. డిజిల్‌పై ట్యాక్స్ 14.14 శాతం నుంచి 18.44 శాతానికి పెంచారు. దీంతో సుమారు రూ. 2 నుంచి రూ.3 వేల కోట్ల ఆదాయం వస్తుంది. లోక్‌సభ ఎన్నికలకు ముందు కేంద్రం పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించింది. లోక్‌సభ ఫలితాలు వెలువడగానే కేంద్ర ప్రభుత్వం ధరలను సమీక్షిస్తుందని అంచనా. అయితే అంతకు ముందే రాష్ట్ర ప్రభుత్వం ట్యాక్స్ పెంచేసింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వంపై ప్రజల్లో ఆగ్రహం వ్యక్తమౌతుంది. రాజకీయ కారణాల కోసం గ్యారంటీల అమలు చేసి వాటి భారం తమపై మోపుతున్నారని ప్రజలు ఆక్రోశిస్తున్నారు. కాగా ఇంధన ధరల పెంపును నిరసిస్తూ ఆదివారం చిక్కమగళూరులో బీజేపీ ఎమ్మెల్సీ సీటీ రవి, జిల్లా అధ్యక్షుడు మధుకుమార్ రాజ్ అరస్ నేతృత్వంలో కార్యకర్తలు ఉద్యమించారు.


జీవాలతో కిటకిటలాడుతున్న మార్కెట్

● జనసంద్రమైన మార్కెట్

చింతామణి: సోమవారం బక్రీద్‌ను పురస్కరించుకొని ఆదివారం పట్టణంలోని మార్కెట్‌లో గొర్రెలు, పొట్టేళ్ల విక్రయాలు జోరుగా సాగాయి. గ్రామీణ ప్రాంతాలనుంచి రైతులు పొట్టేళ్లను తీసుకొచ్చి విక్రయించారు. ముస్లింలు పెద్ద సంఖ్యలో వచ్చి పొట్టేళ్లను కొనుగోలు చేశారు.

రూ.1.50 కోట్లతో అభివృద్ధి పనులు


ఎమ్మెల్యే ఎస్.ఎన్.సుబ్బారెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

బాగేపల్లి: గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు తదితర మౌలిక సదుపాయాలక కోసం రూ.1.50 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు ఎమ్మెల్యే ఎస్.ఎన్. సుబ్బారెడ్డి తెలిపారు. తాలుకాలోని తిమ్మంపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని వివిద గ్రామాల్లో మంచినీటి పథకాల ప్లాంట్ల ఏర్పాటుకు ఆదివారం ఆయన భూమిపూజ చేశారు. ప్రతి గ్రామంలో రోడ్లు, మంచినీరు, విద్యుత్ తదితర సదుపాయాలు కల్పిస్తామన్నారు. అనంతరం గ్రామస్తులు ఎమ్మెల్యేను సన్మానించారు.

అంగన్‌వాడీ కేంద్రం ప్రారంభం

అదేవిధంగా తాలూకాలోని గోళూరులో మార్వెల్ టెక్నాలజీస్ సంస్థ సీఎస్ఆర్ నిధులతో ఏర్పాటు చేసిన హైటెక్ అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎమ్మెల్యే సుబ్బారెడ్డి ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కంపెనీలు ముందుకు రావాలన్నారు.

ఆవులకు గ్రాసం అందజేత


గ్రాసాన్ని అందిస్తున్న మహదేవయ్య, స్వామీ జపానంద

పావగడ: తాలూకాలోని వద్రేవు గ్రామంలో ఆచారం ప్రకారం దేవునికి వదిలేసిన సుమారు 160 ఆవులతో పాటు రైతుల ఆవులు మేత దొరకక బక్కచిక్కిపోయాయి. ఈ నేపథ్యంలో స్వామీ జపానంద వినతి మేరకు తుమకూరుకు చెందిన పారిశ్రామిక వేత్త, ప్రాణి దయా ప్రచార సంఘం అధ్యక్షుడు సీవీ మహదేవయ్య రూ.50 వేల విలువైన గ్రాసాన్ని ఆదివారం పంపిణీ చేశారు. ఆకలితో అలమటిస్తున్న ఆవులు పశు గ్రాసాన్ని ఆవురావురుమంటూ మేశాయి. స్వామీ జపానంద మాట్లాడుతూ అక్కడక్కడా స్వల్పంగా వర్షాలు కురిసి గడ్డి మొలిచినా ఆవుల పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. వద్రేవు గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు దాత మహదేవయ్యను అడిగిన వెంటనే గ్రాసాన్ని పంపిణీ చేయడం అభినందనీయమన్నారు.

వాహనాలు ఢీ, వ్యక్తికి తీవ్ర గాయాలు


ప్రమాద దృశ్యం

మాలూరు: ద్విచక్ర వాహనం, క్యాంటర్ పరస్పరం ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన ఘటన తాలూకాలోని కోడిహళ్లి గేట్ వద్ద ఆదివారం చోటు చేసుకుంది. అరళేరి గ్రామానికి చెందిన మునియప్ప క్షతగాత్రుడు. మునియప్ప తన గ్రామం నుంచి కోడిహళ్లి రహదారి నుంచి తన దిచ్చక్ర వాహనంలో వస్తున్న సమయంలో ఎదురుగా వస్తున్న క్యాంటర్ వాహనం ఢీకొంది. మునియప్ప తీవ్రంగా గాయపడడంతో ఆయన్ను స్థానికులు మాలూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం హోసకోటకు తరలించారు. మాలూరు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.


శ్రీ రామ్ అగమన్ నృత్య రూపకం

అలరించిన ‘సాయి ప్రేమ వాహిని’

ప్రశాంతి నిలయం: సత్యసాయి సేవలో తరించిన అనుభవాలను కళ్లకు కడుతూ సాయి యూత్ బృందం సాయి ప్రేమ వాహిని పేరుతో నిర్వహించిన నాటిక భక్తులను రంజింపజేసింది. పర్తియాత్రలో భాగంగా పుట్టపర్తికి విచ్చేసిన సత్యసాయి భక్తులు ఉదయం సత్యసాయి మహాసమాధి చెంత నాటిక నిర్వహించారు. సత్యసాయి బోధనల మేరకు చేపట్టిన సేవా కార్యక్రమాలపై చక్కటి సందేశాన్నిస్తూ నిర్వహించిన నాటిక భక్తులను అలరించింది. సాయంత్రం మధ్యప్రదేశ్ బాలవికాస్ చిన్నారులు శ్రీ రామ అగమన్ పేరుతో నృత్య రూపకం నిర్వహించారు. సత్యసాయి తన స్వహస్తాలతో రాసిన రామకథ రసవాహినిలోని ఘట్టాలను చక్కటి నృత్య భంగిమలతో నృత్యరూపకం నిర్వహించి భక్తులను మైమరపించారు.


సాయి ప్రేమవాహిని నాటికలోని ఒక ఘట్టం

కోలారు వార్తలు...

వైభవంగా ఆలయ ప్రతిష్టాపన


పాల్గొన్న ఎమ్మెల్యే మంజునాథ్

కోలారు: తాలూకాలోని బెళమారనహళ్లి గ్రామ పంచాయతీ పరిధిలోని గుట్టహళ్లి గ్రామంలో ఆదివారం కరగదమ్మ దేవి ఆలయ ప్రతిష్టాపనా మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ప్రతిష్టాపనా కార్యక్రమాన్ని పురస్కరించుకుని దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిపారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కొత్తూరు మంజునాథ్ అమ్మవారి కృపా కటాక్షాల వల్ల జిల్లాలలో ఉత్తమంగా వానలు కురిసి పంటలు బాగా పండి ప్రజలు సుభిక్షంగా ఉండాలని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డికె శివకుమార్ నేతృత్వంలోని రాష్ట్రం ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. ఈ సందర్భంగా విధాన పరిషత్ సభ్యుడు ఎంఎల్ అనిల్‌కుమార్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సీసంద్ర గోపాలగౌడ, పీఎల్‌డీ బ్యాంకు మాజీ అధ్యక్షుడు చంజిమలె రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పెరుగుతున్న టమాటా ధరలు


మార్కెట్‌కు తీసుకువచ్చిన టమాటాలు

కోలారు: టమాటాలు మళ్లీ మోత మోగిస్తున్నాయి. డిమాండ్‌కు తగిన స్థాయిలో సరుకు అందుబాటులో లేకపోవడంతో ధరలు పెరిగాయి. మార్కెట్‌లో టమాటాలు అధిక ధరలు పలుకుతుండటంతో రైతులు జాక్‌పాట్ కొడుతున్నారు. పట్టణంలోని ఏపీఎంసీ మార్కెట్‌లో ఆదివారం 15 కిలోల టమాటా బాక్స్ ధర రూ. 850లకు విక్రయిస్తున్నారు. మార్కెట్‌లో టమాటాలు ధరలు అధికంగా ఉన్నా దిగుబడి మాత్రం తక్కువగా ఉంది. టమాటాలకు సుసి రోగం తగలడం వల్ల దిగుబడి తగ్గిందని రైతులు చెబుతున్నారు. ధరలు బాగున్నా దిగుబడి తక్కువగా ఉండడంతో రైతులు లాభం పొందలేక పోతున్నారు.

అగ్నివీర్‌లకు ఘనంగా వీడ్కోలు


అగ్నివీర్‌లకు వీడ్కోలు పలుకుతున్న దృశ్యం

కోలారు: సైన్యంలోకి ఎంపికైన ఐదుగురు అగ్నివీర్ అభ్యర్థులను ఆదివారం ఘనంగా సన్మానించారు. నగరంలోని జయనగర్లో ఉన్న అంబేడ్కర్ పిల్లల ఉద్యానవనంలో వీరికి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా సైన్యంలోకి ఎంపికైన బాలాజీ, వినయ్, నాగరాజ ప్రసాద్, పవన్, శ్రీనివాస్‌లు మాట్లాడుతూ తాము అగ్నివీర్‌కు ఎంపిక కావడానికి సహకారం అందించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. కోలారు క్రీడా సంఘంలో ఉత్తమ శిక్షణ లభించడం వల్లనే తాము అగ్నివీర్‌కు ఎంపికయ్యామన్నారు. కోలారు క్రీడాసంఘానికి కృతజ్ఞతలు తెలిపారు. భారత సేవాదళ జిల్లా అధ్యక్షుడు గణేష్ మాట్లాడుతూ... దేశ సేవ చేసే సౌభాగ్యం అందరికి లభించదని. సైన్యంలో చేరి దేశానికి సేవలు అందించడానికి దేశానికి గర్వకారణమన్నారు. యువకులకు ఉచిత శిక్షణ నందించి వారు సైన్యంలో చేరడానికి అవకాశం కల్పించిన కోలారు క్రీడా సంఘం సామాజిక సేవ శ్లాఘనీయమన్నారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారి వందేమాతరం సోమశేఖర్, శిక్షకుడు కృష్ణమూర్తి, సురేష్‌బాబు, పురుషోత్తమ తదితరులు పాల్గొన్నారు.

యోగాతో ఉత్తమ ఆరోగ్యం


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

కోలారు: మానసిక, శారీరక రుగ్మతలను రూపుమాపి వికాసాన్ని కలిగించేదే యోగా అని జిల్లా స్కౌట్స్ అండ్ గైడ్స్ ముఖ్య కమిషనర్ కెవి శంకరప్ప తెలిపారు. ఆదివారం నగరంలోని మహిళా సమాజ పాఠశాల సదాశివ స్మారక భవనంలో జిల్లా స్కౌట్స్ అండ్ గైడ్స్ సంస్థ, జిల్లా ఆయుష్ శాఖ, నిరంతర యోగాభ్యాస కేంద్రం, రోటరీ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి యోగా కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు, యువకులు తమ ఆహార అలవాట్లలో మార్పులు చేసుకోవాలి. అప్పుడే ఉత్తమ ఆరోగ్యం పొందడానికి సాధ్యమన్నారు. రోగాలు వచ్చినప్పుడు ఆస్పత్రికి వెళ్లడం కంటె రోగాలు రాకుండా చూసుకోవడమే ఉత్తమమన్నారు. ప్రతినిత్యం ఓ గంటసేపు వ్యాయామం, యోగా, ధ్యానంతో ఎంతో ఆరోగ్యం కలుగుతుందన్నారు. యోగా మానవ జీవితంలో ఒక భాగమన్నారు. కార్యక్రమంలో మహిళా సమాజ పాఠశాల పాలనాధికారి, కోలారు తాలూకా స్కౌట్స్ అండ్ గైడ్స్ సంస్థ అధ్యక్షురాలు నవీనా, ఆయుష్ శాఖ డాక్టర్ బసవరాజ్ తదితరులు పాల్గొన్నారు.

పొగాకు ఉత్పత్తులను నిషేధించాలి


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

కోలారు: పొగాకు ఉత్పత్తులను నిషేధించడానికి ప్రతి ఒక్కరు కంకణ బద్ధులు కావాలని సీనియర్ సివిల్ న్యాయమూర్తి సునీల్ ఎస్ హొసమని తెలిపారు. ఆదివారం నగరంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన పొగాకు ఉత్పత్తుల నిషేధంపై అవగాహన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఆరోగ్యవంత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరు చేతులు కలపాలన్నారు. పొగాకు ఉత్పత్తిదారులు, విక్రయదారులు తప్పనిసరిగా కోట్పా చట్టాలను పాటించాలి. పబ్లిక్ ప్రాంతాలలో ధూమపానం చేయడం పూర్తిగా నిషేధమన్నారు. మైనర్లకు పొగాకు ఉత్పత్తులను విక్రయిస్తే నేరమన్నారు. పొగాకు ఉత్పత్తులను సేవించడం వల్ల కలిగే అనర్థాలను విద్యార్థులతో పాటు ప్రతి ఒక్కరికి అవగాహన కలిగించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎమ్ఎన్ అంబేడ్కర్, ఎన్ఎస్ఎస్ విభాగం సంచాలకుడు డాక్టర్ రంగనాథయ్య, డాక్టర్ గోపాల, రోవర్స్ సంచాలకుడు డాక్టర్ సుబ్రమణి తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహార ఆవశ్యకతను తెలియజేయాలి


సర్టిఫికెట్లు అందజేస్తున్న దివ్యాశివనారాయణ్

గౌరిబిదనూరు: పౌష్టికాహారం ఆవశ్యకతను పిల్లలకు తెలియాల్సిన బాధ్యత తల్లి తండ్రులపై ఉందని అరుణ ఆస్పత్రి వైద్యురాలు డాక్టర్ జమున అన్నారు. నృత్యంలో శిక్షణ పొందుతున్న పిల్లలకు ఉత్తమ పౌష్టికాహారం అందించే క్రమంలో వంటల తయారీపై వారి తల్లిదండ్రులకు ఆదివారం పట్టణంలోని డాక్టర్ హెచ్.ఎన్. కళాభవన్‌లో పోటీలు ఏర్పాటు చేశారు. ప్రతిభ చూపిన వారికి సర్టిఫికెట్లు అందజేసి మాట్లాడారు. పిల్లలకు పౌష్టికాహారం అందజేయడం వల్ల వారు ఆరోగ్యంగా, దృఢంగా తయారవుతారన్నారు. జడ్జీలుగా సుప్రీత, శ్రీకాంత్, భవ్య వీరేశ్ వ్యవహరించారు. నృత్య ఉపాధ్యాయురాలు దివ్యాశివనారాయణ్, భాగ్యశ్రీ,హరిప్రియ పాల్గొన్నారు.

కరగం నారాయణ అయ్యంగార్ మృతి


కరగం నారాయణ అయ్యంగార్ (ఫైల్)

మండ్య : మండ్య జిల్లా మేలుకోటెలోని శ్రీ చెలువనారాయణ స్వామి ఆలయ ప్రథమ స్థానికులు కరగం నారాయణ అయ్యంగార్(82) వయో సహజ అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం సాయంత్రం మృతి చెందారు. ఆదివారం మేలుకొటెలో శ్రీవైష్ణవ సాంప్రదాయ పద్ధతిలో, చెలువనారాయణ మాలె మర్యాదలతో అంత్యక్రియలు నిర్వహించారు. చెలువనారాయణ స్వామి ఆలయంలో ప్రథమ స్థానికుడిగా, పారుపత్తె దారుడిగా సుదీర్ఘ కాలం ఆయన పని చేశారు. రాష్ట్ర అవార్డును కూడా పొందారు. విశ్రాంత ప్రధానోపాధ్యాయులైన ఈయన జక్కనహళ్లి మేలుకొటె చిట్టినహళ్లితోపాటు అనేక గ్రామాల్లో ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగారు.

హింస, క్రౌర్యానికి దూరంగా ఉండాలి


అవార్డులు అందజేసిన దృశ్యం

తుమకురు : హింస, క్రౌర్యం, అసమానత్వం వంటి వాటిని మన దరిదాపుల్లోకి రాకుండా చూసుకోవాలని కేంద్ర విభాగం పోలీసు అధికారి (ఐజీపీ) డాక్టర్ రవికాంతెగౌడ అన్నారు. తుమకురులోని కన్నడ భవనంలో ఆదివారం వీచి సాహిత్య సంస్థ తరఫున పలువురికి అవార్డులు ప్రదానం చేసి మాట్లాడారు. జీవితంలో హింస ఒక భాగమైందని ఆవేదన వ్యక్తం చేశారు. శాంతియుత జీవనానికి ప్రతి ఒక్కరూ అలవాటు పడాలన్నారు.

క్లుప్తంగా

కేంద్ర పథకాలతో జిల్లాను అభివృద్ధి చేయండి



మాట్లాడుతున్న కేంద్ర మంత్రి కుమారస్వామి

మండ్య: కేంద్ర ప్రభుత్వ పథకాలను వినియోగించుకొని జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించాలని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమలశాఖ మంత్రి హెచ్.డి కుమార స్వామి అధికారులకు సుచించారు. కలెక్టరేట్‌లో ఆయన జిల్లాస్థాయి అధికారులతో సమావేశమై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందని, వాటిని లబ్ధిదారులకు చేరవేయాలన్నారు. అన్ని విషయాల్లో మండ్య జిల్లా వెనుకబడిందన్నారు. రాష్ట్రాల అభివృద్ధికి కేంద్రం ప్రవేశపెట్టిన పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తే జిల్లా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. ఇందు కోసం అధికారులు శ్రద్ధతో పనిచేయాలన్నారు.

ఇంధన ధరల పెంపుపై భగ్గుమన్న బీజేపీ



ధర్నా చేస్తున్న బీజేపీ కార్యకర్తలు

దొడ్డబళ్లాపురం: రాష్ట్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ ధరలు పెంచడంపై బీజేపీ భగ్గుమంది. సర్కార్ తీరును ఎండగడుతూ ఆందోళనకు దిగింది. చిక్కమగళూరులో ఆదివారం మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సీటీ రవి ఆధ్వర్యంలో బీజేపీ యువ మోర్చా కార్యకర్తలు చెవిలో పూలు, చేతిలో చిప్పలు పెట్టుకుని వినూత్నంగా ధర్నా చేపట్టారు. గతంలో బీజేపీ అధికారంలో ఉండగా కాంగ్రెస్ నేతలు స్కూటర్ శవయాత్ర చేశారని, ఇప్పుడు కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఇంధన ధరలు తగ్గిస్తే రాష్ట్రంలో కాంగ్రెస్ పెంచిందన్నారు. ఇప్పుడు స్కూటర్ వవయాత్ర చేస్తారా అంటూ సీటీ రవి ప్రశ్నించారు. గ్యారంటీల అమలు కోసం తిప్పలు పడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలపై అనేక రూపాల్లో భారం మోపోతోందన్నారు. ఇందన ధరలను తగ్గించాలని, లేదంటే కాంగ్రెస్ అధికారం నుండి వైదొలగాలని డిమాండ్ చేశారు.

ఘనంగా మారెమ్మ తల్లి గ్రామోత్సవం



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మంజుల

కృష్ణరాజపురం: బెంగళూరు నగరం మహదేవపుర నియోజకవర్గం కుందలహళ్లి కాలనీలో ఆదివారం మారెమ్మ అమ్మవారి గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి విశేష అలంకరణ, పూజలు నిర్వహించారు. మహదేవపుర ఎమ్మెల్యే మంజులతోపాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి మంచి పంటలు పండి ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.

గ్రేటర్ బెంగళూరు ఏర్పాటే లక్ష్యం



ప్లాన్‌ను పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం డీకే శివకుమార్

కృష్ణరాజపురం: తమ ముందున్న లక్ష్యం, ప్రభుత్వ కర్తవ్యం బెంగళూరు నగరాన్ని గ్రేటర్ బెంగళూరుగా మార్చడమేనని, ఇందులో బెంగళూరు గ్రామీణ జిల్లాలోని హొసకోటెను కూడా చేర్చుతామని డిప్యూటీ సీఎం డి.కే.శివకుమార్ తెలిపారు. హొసకోటె, దొడ్డబళ్లాపుర రోడ్డులో ఉన్న చెత్త నిర్వహణ కేంద్రాన్ని ఆదివారం ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే శరత్ బచ్చేగౌడతో కలిసి విలేకరులతో మాట్లాడారు. హొసకోటెలోని నందగుడిలో సుమారు 18,500 ఎకరాల్లో టౌన్‌షిప్ నిర్మాణానికి రాజేంద్ర బోళన్‌తో పాటు కొంత మంది సీనియర్ అధికారులతో కలిసి పరిశిలించామన్నారు. త్వరలోనే గ్రేటర్ బెంగళూరులో హొసకోటె పట్టణం చేరుతుందన్నారు. దీంతో హొసకోటె మరింత అభివృద్ధి చెందుతుందన్నారు.

తల్లి సమాధి వద్ద తనయుడి ఆత్మహత్య

మైసూరు: తల్లి సమాధి వద్ద తనయుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన పిరియా పట్టణ తాలూకా మాకనహళ్లిలో జరిగింది. శివరాజ్ అనే వ్యక్తికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఇతను మద్యానికి బానిసయ్యాడు. దీంతో రోజూ కుటుంబంలో గొడవలు జరుగుతున్నాయి. దీంతో తన తల్లి సమాధి వద్దకు వెళ్లి విషం తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పిరియా పట్టణ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

ఆధ్యాత్మిక పరిమళం.. ప్రకృతి సోయగం

- టిబెట్ తర్వాత బైలకుప్పెలో కొలువైన అతి పెద్ద బౌద్ధారామం
- హోరెత్తించే జలపాతాలు
- ఆకర్షిస్తున్న కూర్గ్ అందాలు



కనువిందు చేస్తున్న అబ్బే జలపాతం



బైలకుప్పెలోని బౌద్ధారామం

బనశంకరి: ప్రకృతి సోయగాలు, ఆధ్యాత్మికతతో పర్యాటకులకు చక్కటి అనుభూతిని ఇస్తోంది కూర్గ్. కొండ ప్రాంతమైన కూర్గ్‌ను ఇండియాలోని స్కాట్‌లాండ్, కర్ణాటక కశ్మీర్‌గా పిలుస్తారు. ఈ ప్రాంతాన్ని ఎందరో రాజవంశీయులు పరిపాలించినట్లు చారిత్రక ఆధారాలు కూడా ఉన్నాయి. పొగమంచు దాచుకుని దోబూచులాడే అడవిఅందాలు హనీమూన్ జంటలకు ఎంతో బాగుంటుంది. వీకెండ్స్‌లో గడపటానికి ఒకటిరెండురోజులు సెలవుల్లో ఆనందంగా ఎంజాయ్‌చేయడానికి వచ్చేవారికి ఒక చక్కటి ప్రదేశం.

చూడాల్సిన ప్రదేశాలు

కూర్గ్‌లో ప్రధానంగా చూడాల్సిన ప్రదేశాలు అబ్బే ఫాల్స్, మడికేరికోట, మల్లల్లిఫాల్స్, టిబెట్ బంగారు దేవాలయం, ట్రెక్కింగ్ చేసేవారికి పుష్పగిరి ఫాల్స్, కోటిబెట్ట, నిషానిమోటి అనుకూలం. ఇక్కడ జూలై, సెప్టెంబర్ మధ్య జలపాతాల హోరు తప్పకుండా చూడాల్సిందే. అలాగే ఇక్కడి మాన్‌సూన్ సీజన్ సాహస ప్రియులకు చాలా అనుకూలం. ఈసమయంలో రివర్ రాఫ్టింగ్ చేయవచ్చు.

దక్షిణాదిలోనే అతిపెద్ద టిబెట్ సెటిల్‌మెంట్

కూర్గ్ సమీపంలో బైలకుప్పె అనే ప్రాంతం ఉంది. ఇది దక్షిణాదిలోనే అతిపెద్ద టిబెట్ సెటిల్‌మెంట్(టిబెట్ దేశీయులు) నివాస స్థలం. ఇది మడికేరి నుంచి 40 కిలోమీటర్ల దూరంలో ఉంది. టిబెట్ తరువాత టిబెటియన్లకు ఇది అతిపెద్ద ఆధ్యాత్మిక ప్రాంతం. బైలకుప్పెలోని అతి పెద్ద బౌద్ధాలయం ఇటు భక్తులను, పర్యాటకులను ఆకర్షిస్తుంది. ఈ అలయంలో బంగారంతో చేసిన విగ్రహాలు ఉండటంతో దీన్ని గోల్డెన్ టెంపుల్ అని పిలుస్తారు. ఇక్కడ టిబెట్ స్థావరాలే కాకుండా ఇక్కడ ప్రసిద్ధ నాంద్రోల్లింగ్ మొనాస్టరీ చూడవచ్చు. గోల్డెన్ టెంపుల్‌లో మూడు రాగి, బంగారుపూత కలిగిన బుద్ధుడి విగ్రహాలు ఉన్నాయి. ఈ సముదాయం ఇంకా ఇతర దేవాలయాలు కూడా నిలయం.

ప్రార్థనా చక్రాలు తిప్పవచ్చు

బలంకలిగి భక్తి ఉన్నవారు అక్కడ ఉన్న ప్రార్థనా చక్రాలు తిప్పవచ్చు. ఈ చక్రాలపై ప్రార్థనా గీతాలు ఉంటాయి. ఈ చక్రాలను తిప్పితే కష్టాలు తొలగిపోతాయని చెబుతారు. ఫొటోగ్రఫీ ఇష్టపడేవారికి ఇది ఒక అద్భుతమైన ప్రదేశం. గోల్డెన్ టెంపుల్, టిబెట్ సన్యాసులు, షాపింగ్ కాంప్లెక్స్, హ్యాండి క్రాఫ్ట్స్ స్టోర్స్, టిబెటియన్‌కాలనీలు, టిబెటియన్ వంటలను కెమెరాల్లో బంధించవచ్చు. టిబెట్ రెస్టారెంట్లను సాయంత్రం 7 గంటలకు మూసివేస్తారు.ఈ లోపు టిబెట్ ఆహారాలు రుచి చూడాలి. నాంద్రోల్లింగ్ మొనాస్టరీ సమీపంలో రెండు ఇండియన్ రెస్టారెంట్లు ఉండగా ఇవి రాత్రి 9గంటలవరకు తెరిచి ఉంటాయి.

బైలకుప్పెకు ఇలా వెళ్లాలి.

బైలకుప్పె బెంగళూరు నుంచి కూర్గ్ వెళ్లే మార్గంలో ఉంది. బస్సులు, ఇతర వాహనాల్లో రోడ్డుమార్గంలో ప్రయాణించవచ్చు. బెంగళూరు నుంచి సుమారు 5 గంటలు, మంగళూరు నుంచి రెండున్నర గంటల ప్రయాణం. బెంగళూరుకు 214 కిలోమీటర్ల దూరంలో ఉంది. బైలకుప్పె తర్వాత ఇక్కడ ఇంకా మైసూరు, కూర్గ్, కుశాలనగర, కావేరినిసర్గ ధామం, దుబారే ఎలిఫెంట్‌క్యాంప్ లాంటి ప్రదేశాలు చూడవచ్చు.



గౌతమబుద్ధుడి విగ్రహాలు



బౌద్ధారామంలో కష్టాలు తీర్చే చక్రం



కూర్గ్‌లో మంచు కప్పుకున్న పర్వతశ్రేణి



హిల్‌స్టేషన్‌పైకి దారి

వీధి శునకాల స్వైర విహారం



కుక్క కరవడంతో చేతిపై గాయం





చికిత్స పొందతున్న గ్రామస్తులు

- 15 మందికిపైగా గాయాలు

తుమకూరు: తుమకూరు జిల్లా శిరా తాలూకా తావరెకెరె, లక్ష్మి సాగర గ్రామంలో వీధి శునకాలు స్వైర విహారం చేశాయి. రోడ్లపై కనిపించినవారందరిపై దాడి చేసి కరిచాయి. చేతులు, కాళ్లకు ఇతర శరీర భాగాల్లో బలమైన గాయాలయ్యాయి. గుండప్ప, బిందు, రెణుకారాధ్య,లక్ష్మమ్మ, మంజునాథ్, మంజమ్మ, రత్నమ్మ, రమేష్, లక్ష్మీకాంత్, మాద్దక్కనహళ్లి దేవరాజు, గొల్లరహట్టి రమేషం, హర్షిణి, పాండురంగప్ప తదితర 15 మంది బాధితులు పలు ఆస్పత్రుల్లో చేరి చికిత్స పొందుతున్నారు. ఈ గ్రామంతోపాటు పక్క గ్రామాల్లో కూడా శునకాల బెడద తీవ్రంగా ఉంది. ప్రజలు ఇళ్ల నుంచి బయటకి రావడానికి జంకుతున్నారు. గుంపులుగా వచ్చి రోడ్లపై వెళ్లేవారిపై దాడి చేస్తున్నాయి. అధికారులు స్పందించి కుక్కల బెడదనుంచి రక్షించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బీబీఎంపీని విభజిస్తే కన్నడిగుల ఉనికికే ప్రమాదం


బనశంకరి: పాలనాదృష్టితో చూస్తే బృహత్ బెంగళూరు మహా నగరపాలికెను విభజన సరికాదని కర్ణాటక రక్షణావేదిక అధ్యక్షుడు టీఏ.నారాయణగౌడ పేర్కొన్నారు. ఆదివారం ఆయన నగరంలో విలేకరులతో మాట్లాడారు. బెంగళూరు నగరం వలసలతో నిండిపోయిందని, దీంతో నగర భౌగోళిక సామాజిక, సాంస్కృతిక స్వరూపం మారుపోతుందన్నారు. మూలనివాసులైన కన్నడిగుల ఉనికికే ప్రమాదకరంగా మారడంతో పాటు ఆర్థిక అసమానత, సామరస్యానికి భంగం కలుగుతుందన్నారు. నగరాన్ని 5 పాలికెలుగా విభజనచేస్తే కన్నడిగులు ఎక్కడికి వెళ్లాలని ప్రశ్నించారు. బెళగావి మహానగర పాలికె చరిత్ర కళ్లారా చూస్తుండగా ఇలాంటి పరిస్థితి బెంగళూరు మహానగరానికి అవసరమా ? అని ఆయన ప్రశ్నించారు. దీనికి బదులు బీబీఎంపీ 8 వలయాలకు నిధులు కేటాయించి మూలభూతసౌకర్యాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తే పరిపాలన వికేంద్రీకరణ ఉద్దేశం నెరవేరుతుందన్నారు. ఇలాంటి వ్యవస్థను బృహత్ ముంబై మహానగర పాలికే చేపట్టగా విజయవంతమైందన్నారు. బీబీఎంపీ విభజన కన్నడిగులు హితాసక్తికి విరుద్ధంగా ఉందని, ప్రభుత్వం ఈ ప్రస్తావనను విరమించాలని టీఏ. నారాయణగౌడ డిమాండ్ చేశారు.

యువకుడు ఆత్మహత్య

మైసూరు: కడుపు నొప్పి తాళలేక యువుకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన చామరాజనగర జిల్లా కొళ్లెగాల పట్టణంలోని న్యాయవాది రామయ్య లేఔట్‌లో చోటుచేసకుంది. ఇక్కడ నివాసం ఉంటున్న మహ్మద్ ఆఫ్రీది(19) అనే యువకుడు కొంతకాలంగా కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. అనేక ఆస్పత్రుల్లో చూపించినా నయం కాలేదు. దీంతో నిద్ర మాత్రలు మింగి అస్వస్థతకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు అతన్ని ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కొళ్లెగాల పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

మిస్టరీ వీడిన మహిళ అదృశ్యం కేసు

- డబ్బు వసూలు కోసం విజయపురకు వెళ్లగా హత్య



హతురాలు మమత (ఫైల్)

శివమొగ్గ: విజయపురకు వెళ్తానని చెప్పి అదృశ్యమైన శివమొగ్గ నగరానికి చెందిన మమతా శ్రీధర్ అనే మహిళ చివరకు హత్యకు గురైంది. డబ్బు వసూలు కోసం వెళ్లగా తెలిసిన వ్యక్తే ఆమెను హత్య చేసి మృతదేహాన్ని నదిలో పడేసినట్లు పోలీసుల విచారణలో తేలింది. వివరాలు... శివమొగ్గ నగరంలోని కోటె పోలీస్‌స్టేషన్ పరిధిలోని విద్యానగర 4వ క్రాస్‌లో నివాసం ఉంటున్న మమతా శ్రీధర్(48) టైలర్‌గా పనిచేస్తోంది. విజయపురకు వెళ్తానని ఈనెల 2వ తేదన ఇంటి నుంచి బయల్దేరిన ఆమె గమ్యానికి చేరుకోలేదు. తిరిగి ఇంటికీ రాలేదు. ఫోన్ కూడా స్విచ్ఛాఫ్ అని సమాధానం వచ్చింది. దీంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫోన్ లోకేషన్ విజయపుర జిల్లా బిళగి తాలూకాలో చూపించింది. రేవణ సిద్దయ్య(27) అనే యువకుడి వద్ద ఫోన్ ఉన్నట్లు గుర్తించారు. అతన్ని అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టగా మమతను హత్యచేసినట్లు వెల్లడించాడు. మమతకు రేవణ సిద్దయ్య ఫోన్‌లో పరిచయమైనట్లు, అనేకసార్లు అతనికి డబ్బు కూడా పంపినట్లు విచారణలో తేలింది. డబ్బు కోసం జూన్ 2న రాగా 4వ తేదీన మమతను కృష్ణానది వద్దకు తీసుకెళ్లి హత్య చేసి మృతదేహాన్ని నదిలో పడేసినట్లు నిందితుడు వెల్లడించినట్లు పోలీసులు తెలిపారు.

హోసూరు వార్తలు..

ఇంట్లో చోరీ

క్రిష్ణగిరి: దుండగులు ఇంటి తాళాలు పగులగొట్టి నగలు దోచుకెళ్లిన ఘటన బర్గూరు పరిధిలో చోటు చేసుకొంది. వివరాల మేరకు క్రిష్ణగిరి జిల్లా బర్గూరు సమీపంలోని గుట్టప్పనాయకనూరు గ్రామానికి చెందిన తిరుమూర్తి (47)., ఇతని కొడుకు ఊత్తంగేరిలోని హాస్టల్లో ఉంటూ 10వ తరగతి చదువుతున్నాడు. రెండు రోజుల క్రితం హాస్టల్లో ఉన్న కొడుకును చూసేందుకు తిరుమూర్తి వెళ్లాడు. ఈ సమయంలో దుండగులు ఇంటి తాళాలు పగులగొట్టి 12 పొనన్ల బంగారు నగలు, రూ. 5 వేల విలువ చేసే వెండినగలను దోచుకెళ్లారు. బర్గూరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

అమ్మాయి కిడ్నాప్, ఒకరి అరెస్టు

హోసూరు: ఇంటి నుంచి బయటకెళ్లిన అమ్మాయిని కిడ్నాప్ చేసిన ఘటనలో బంధువును పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాల మేరకు క్రిష్ణగిరి సమీపంలోని అమ్మన్‌తీర్థం గ్రామానికి చెందిన కూలికార్మికుడి 17 ఏళ్ల కూతురు అదే ప్రాంతంలోని ప్రభుత్వ పాఠశాలలో ప్లస్‌టూ చదువుతోంది. గత రెండు రోజుల క్రితం ఇంటి నుంచి బయటకెళ్లిన బాలికను బంధువు శక్తివేల్ కిడ్నాప్ చేశాడు. ఈ ఘటనపై విద్యార్థిని తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని శక్తివేల్ (33)ను అరెస్ట్ చేసి అతనిపై పోక్సో కేసు నమోదు చేశారు. నిందితున్ని క్రిష్ణగిరి జైలుకు తరలించారు.

బైక్ ప్రమాదంలో కార్మికుడు మృతి



మృతుడు ధనుంజయ

పెనుకొండ: పెనుకొండ పట్టణ సమీపంలో రైల్వే ఓవర్‌బ్రిడ్జి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ధనుంజయ (34) అనే కార్మికుడు బెంగళూరులోని బాప్టిస్ట్ ఆసుపత్రిలో ఆదివారం తెల్లవారు జామున మరణించినట్లు పోలీసులు తెలిపారు. తమిళనాడుకు చెందిన ధనుంజయ పెనుకొండలోని కియా కార్ల సంస్థ అనుబంధ కర్మాగారంలో పని చేస్తున్నాడు. శనివారం రాత్రి 11 గంటల ప్రాంతంలో విధులు ముగించుకుని బైక్‌లో తన గదికి వెళ్తూ తిమ్మాపురం సమీపంలోని రైల్వే ఓవర్‌బ్రిడ్జి వద్ద ఓ ఇంటిని ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ధనుంజయను స్థానికులు బెంగళూరు బాప్టిస్ట్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించాడు.

జానపద విద్వాంసురాలు జయలక్ష్మీ సీతాపుర మృతి

మైసూరు: కన్నడ ప్రముఖ జానపద విద్వాంసురాలు డాక్టర్ జయలక్ష్మి సీతాపుర(70) కన్నుమూశారు. మైసూరు నగరంలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా ఆదివారం గుండెపోటు వచ్చి మృతి చెందారు. మండ్య జిల్లా పాండవపుర తాలూకా సీతాపురానికి చెందిన ఆమె జేఎస్ఎస్ న్యాయ కళాశాలలో అధ్యాపకురాలిగా పనిచేశారు. మైసూరు వి.విలో జానపద విభాగంలో ఎంఏ చేశారు. తర్వాత పరిశోధన సహాయకురాలుగా విధులు నిర్వహించారు. కన్నడలో ప్రసిద్ధి చెందిన జానపద మహా కావ్యాలపై పీహెచ్‌డీ చేసి డాక్టరేట్ పొందారు. భర్త డాక్టర్ రాజశేఖర్, ఇద్దరు పిల్లలు విదేశాల్లో ఉన్నారు. గత వారం బెంగళూరు నుంచి కారులో వస్తుండగా వాహనం ప్రమాదానికి గురైంది. గాయపడిన ఆమెను మైసూరులోని ఆస్పత్రికి తరలించగా గుండెపోటు వచ్చి కన్నుమూశారు.

రోడ్డు గుంతలతో ప్రమాదాలు



రోడ్డుపై బోల్తాపడిన బైక్

కెలమంగలం: కెలమంగలం- హోసూరు రహదారిపై ప్రైవేట్ వ్యక్తులు పైప్‌లైన్ ఏర్పాటు కోసం రోడ్డును తవ్వి కంకర వేయడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని ప్రజలు తెలిపారు. రాయకోట నుంచి హోసూరు వరకు రోడ్డు విస్తరణ పనులు జోరుగా సాగుతున్నాయి. దీంతో వాహనాలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. దీనికి తోడు ఓ వ్యక్తి రోడ్డుపై అడ్డంగా తవ్వి పైప్ లైన్ వేసుకుని అలాగే వదలి వేయడంతో గొయ్యి ఏర్పడింది. ఆ మార్గంలో వెళ్లే ద్విచక్రవాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారని తెలిపారు. గుంతను మూసివేయాలని వాహనదారులు డిమాండ్ చేశారు.

నిందితుడిని పట్టించిన ప్లాస్టిక్ ముక్కలు



ప్రమాదానికి కారణమైన బస్సు, స్వాధీనం చేసుకున్న ప్లాస్టిక్ ముక్కలు

దొడ్డబళ్లాపురం: పాదచారి మృతికి కారణమైన డ్రైవర్‌ను ప్లాస్టిక్ ముక్కలు పట్టించిన సంఘటన మడికేరిలో చోటుచేసుకుంది. నిందితుడిని కేఎస్ఆర్టీసీ బస్సు డ్రైవర్ కేఆర్ నగర్‌కు చెందిన క్రిష్టేగౌడగా గుర్తించారు. గోణికొప్ప పోలీసులు తెలిపిన మేరకు... మూడు రోజులక్రితం పొన్నంపేట తాలూకా పల్లేరి వద్ద కూలీ కార్మికుడు యరవరనోంజ(45) రోడ్డుప్రమాదంలో మృతిచెందాడు. పరిశీలనకు వెళ్లిన పోలీసులకు ఎరుపు రంగులో పగిలిన ప్లాస్టిక్ ముక్కలు కనిపించాయి. దర్యాప్తులో అది కేఎస్ఆర్టీసీ బస్సు ఇండికేటర్ ముక్కగా తేలింది. ఆ ముక్కతోనే దర్యాప్తు చేసిన పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి బస్సును పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

డీసీఎం పదవిపై ఆసక్తి లేదు

శివాజీనగర: రాష్ట్రంలో మూడు డీసీఎం పదవులు సృష్టించే విషయమై మంత్రులైన కృష్ణబైరేగౌడ, సతీశ్ జార్కిహొళి స్పందించారు. ఇంతకు ముందు మూడు డీసీఎం స్థానాలను సృష్టించాలని ఒత్తిడి ఉండేదని, అయితే ప్రస్తుతం ఉప ముఖ్యమంత్రి పదవి కావాలని తాను కోరలేదని ప్రజా పనుల శాఖ మంత్రి సతీశ్ జార్కిహొళి తెలిపారు. బెళగావిలో ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. గ్యారంటీ పథకాలను స్తంభింపజేయాలని కాంగ్రెస్ ఎమ్మెల్యేల డిమాండ్‌ను విలేకరులు ప్రస్తావించగా గ్యారెంటీలను నిలిపి వేయడం లేదని సీఎం స్పష్టం చేశారన్నారు. గ్యారెంటీల అమలుకు నిధుల కొరత లేదన్నారు. లోకసభ ఎన్నికల్లో బెళగావిలో ఓటమి, చిక్కోడిలో గెలుపుపై నివేదికను అధిష్టానం కోరిందన్నారు. బెళగావి సాంబ్రా విమానాశ్రయంలో మీడియాతో మాట్లాడిన రెవెన్యూమంత్రి కృష్ణబైరేగౌడ... డీసీఎం పదవి సృష్టించే విషయం పార్టీ వేదికపై చర్చ జరగాలన్నారు. మీరు డీసీఎం పదవిని ఆకాంక్షిస్తున్నారా అని పాత్రికేలు అడగ్గా మీ వద్ద మాట్లాడితే మీరు డీసీఎం చేస్తారా? అని ఎదురు ప్రశ్నించారు. మీరు, మేము మాట్లాడితే ఏం ప్రయోజనమని హాస్యంగా మాట్లాడారు.

ఏనుగుల సంచారంతో గుబులు

క్రిష్ణగిరి: కర్ణాటక, ఆంధ్ర సరిహద్దు వేపనపల్లి అటవీ ప్రాంతంలో పది ఏనుగులు మకాం వేశాయి. ఏనుగులు రెండు గుంపులుగా విడిపోయి ఆ ప్రాంతంలో సంచరిస్తుండడంతో స్థానిక ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. మహారాజగడ అటవీ ప్రాంతం నుంచి బయటకొచ్చిన 10 ఏనుగులు విడిపోయి ఆంధ్ర సరిహద్దు అటవీ ప్రాంతంలో 7 ఏనుగులు, కే.కొత్తూరు అటవీ ప్రాంతంలో 3 ఏనుగులు సంచరిస్తున్నట్లు స్థానిక ప్రజలు అటవీశాఖాధికార్లకు సమాచారం అందజేశారు. అటవీ శాఖాధికార్లు చేరుకొని ఏనుగుల సంచారంపై నిఘా పెట్టారు. అటవీ ప్రాంత గ్రామాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, పొలాల వద్దకు కాపలా వెళ్లరాదని తెలిపారు.

నదిలో మునిగి ఇద్దరు మృత్యువాత

హోసూరు: వదిన అస్థికలను నదిలో కలిపేందుకెళ్లిన ఇద్దరు యువకులు నీటిలో మునిగి మృతి చెందిన ఘటన కావేరిపట్టణం పరిధిలో చోటు చేసుకొంది. వివరాల మేరకు ధర్మపురి జిల్లా మొరప్పూరు గ్రామానికి చెందిన హరీష్ భార్య తమిళరసి. ఆమె 11 రోజుల క్రితం చనిపోయింది. ఆమె అస్థికలను నదిలో కలిపేందుకు ఆదివారం పోచ్చంపల్లి సమీపంలోని మంజమేడు వద్ద ప్రవహిస్తున్న దక్షిణ పెన్నా నదికెళ్లారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కార్తీక్ (23), జయరాజ్ (23)లు నదిలో స్నానం చేస్తూ ఆకస్మాత్తుగా లోతైన ప్రదేశానికెళ్లి నీటిలో మునిగి ప్రాణాలు కోల్పోయారు. పోచ్చంపల్లి పోలీసులు, ఫైర్ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని ఇద్దరి మృతదేహాలను బయటకు తీసి ఆస్పత్రికి తరలించారు. వరుస విషాద సంఘటనలతో కుటుంబీకులకు కన్నీరు మున్నీరయ్యారు.

బస్టాండా, పార్కింగ్ ప్రదేశమా?



బస్టాండులో విచ్చలవిడిగా నిలిపిన వాహనాలు

- కెలమంగలంలో ప్రజలకు ఇబ్బందులు

కెలమంగలం: అది పేరుకే బస్టాండు కానీ, అక్రమ పార్కింగ్ ప్రదేశంగా మారింది. ప్రయాణికులు కాలు పెట్టడానికి స్థలం లేనంతగా బస్టాండు మొత్తం వాహనాలు నిలిపి ఉంటాయి. దీనికి అడ్డుకట్ట వేయలేరా? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. వివరాలు... రోజూ ఎక్కువ సంఖ్యలో ప్రైవేట్, ప్రభుత్వ బస్సులు వచ్చి వెళుతున్న కెలమంగలం బస్టాండు ద్విచక్రవాహనాలు, ఇతర వాహనాల పార్కింగ్ ప్రాంతంగా మారిపోయిందని స్థానికులు ఆరోపించారు. వివరాలు.. ఇక్కడి నుంచి హోసూరు, బెంగళూరు ప్రాంతాల్లోని పరిశ్రమలకు, వ్యాపార, ఉద్యోగ నిమిత్తం వేలాది మంది వెళుతుంటారు. పనుల మీద ఇతర ప్రాంతాలకెళ్లే వారు కెలమంగలం బస్టాండుకు వెళ్లి అక్కడ తమ బైక్‌లు, కార్లను నిలిపి బస్సులు ఎక్కి వెళ్లిపోతారు. పెద్దసంఖ్యలో వాహనాలను బస్టాండులో పార్కింగ్ చేయడంతో బస్సులు నిలిపేందుకు స్థలం ఉండదు.

బస్సులు మిస్సయి ఇబ్బందులు

ఇతర ప్రాంతాల నుంచి బస్టాండుకు చేరుకొన్న బస్సులు నిలబడకుండా అలాగే వెళ్లిపోతున్నాయి. దీని వల్ల ప్రయాణికులు బస్సులను మిస్సవుతుంటారు. ఈ అక్రమ పార్కింగ్ సమస్యను పరిష్కరించాలని ప్రయాణికులు కోరుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. బస్టాండులో బస్సులు మాత్రమే పార్కింగ్ చేసేందుకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు.



ఇష్టానుసారంగా పార్కింగ్ చేసిన వాహనాలు

క్లుప్తంగా...

వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై టీడీపీ నేత దాడి

పాయకాపురం (విజయవాడ రూరల్): ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని 63వ డివిజన్ వడ్డెర కాలనీలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త రేపన యేసుపై టీడీపీ నేత కుంచాల వెంకటేశ్వరావు దాడి చేశాడు. ఎన్నికల నేపథ్యంలో వారిద్దరి మధ్య గొడవ జరిగింది. దానిని దృష్టిలో పెట్టుకొని వడ్డెర కాలనీలోని సుబ్బారావు కొట్టు వద్దకు తనను వెంకటేశ్వరావు దంపతులు పిలిచిమరీ ఆదివారం దాడి చేశారని యేసు ఆరోపించారు. గాయపడిన యేసు నున్న రూరల్ పోలీస్‌స్టేషన్‌లో వెంకటేశ్వరావు తనపై దాడి చేసినట్లు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.

వైఎస్సార్‌సీపీ సర్పంచ్ ఇంటిపై పెట్రోల్‌తో దాడి


కాలిపోయిన ఇంటి డోర్ కర్టెన్

చక్రాయపేట: వైఎస్సార్ జిల్లా పులివెందుల నియోజకవర్గంలోని చక్రాయపేట మండలం చక్రాయపేట గ్రామ సర్పంచ్ (వైఎస్సార్‌సీపీ) హర్షాద్ అయూబ్‌బాషా ఇంటిపై శనివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారు. ఇంటి తలుపులు ఇనుపవి కావడంతో ఎలాంటి నష్టం వాటిల్లలేదు. హర్షాద్ తెలిపిన వివరాల మేరకు..శనివారం తాను కుటుంబ సభ్యులతో కలసి ఇంటిలో నిద్రిస్తుండగా అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు కర్రలతో ఇంటి తలుపులు బాదుతూ ఈలలు కేకలు వేశారన్నారు. తాను భయభ్రాంతులకు గురై ఇంటిలోంచి బయటకు రాకపోవడంతో తలుపులపై పెట్రోల్ చల్లి నిప్పు పెట్టారన్నారు. దీంతో డోర్ కర్టెన్ కాలిపోయిందన్నారు. తలుపులు బాదుతున్న శబ్దానికి ఇరుగు పొరుగు వారు నిద్రలేచి రావడంతో దుండగులు పారిపోయారని చెప్పారు. మంటలను ఆర్పి వేశారన్నారు. తనకు ఎవరూ శత్రువులు లేరని, అయినా నాయింటి పైకి వచ్చి దాడి చేయడంతో భయంగా ఉందన్నారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చక్రాయపేట ఎస్‌ఐ వినోద్‌కుమార్ తెలిపారు.

ఆర్బీకే ప్రహరీ కూల్చివేత

ప్రభుత్వ స్థల ఆక్రమణకు టీడీపీ నేతల యత్నం



రేణిగుంట/ఏర్పేడు: తిరుపతి జిల్లా ఏర్పేడు మండలం గుండ్లకండ్రిగలో ఆదివారం టీడీపీ నేతలు గత ప్రభుత్వం నిర్మించిన రైతు భరోసా కేంద్రం (ఆర్బీకే) ప్రాంగణంలోని ప్రహరీని జేసీబీతో కూల్చి నేలమట్టం చేశారు. గ్రామంలో గత ప్రభుత్వం గ్రామ పరిధిలో ఉన్న 50 సెంట్ల ప్రభుత్వ స్థలంలో ఆర్బీకేను నిర్మించింది. ఈ ప్రాంగణంలోనే రైతుల సౌకర్యార్థం పంట ఉత్పత్తుల నిల్వ కోసం గోడౌన్ నిర్మాణానికి రెవెన్యూ అధికారులు స్థలం కేటాయిస్తూ మ్యాపింగ్ చేసి ఇచ్చారు. దీంతో 50 సెంట్ల స్థలానికి గ్రామ సర్పంచ్ కలవగుంట జయముని ప్రహరీగోడ నిర్మాణానికి పూనుకున్నారు. అప్పట్లోనే ఆ స్థలంపై కన్నేసిన గ్రామానికి చెందిన కొందరు టీడీపీ నేతలు ప్రహరీ గోడ నిర్మాణం చేయకుండా అడ్డుకున్నారు. రైతులు వారిపై తిరగబడడంతో కోర్టులో కేసు వేశారు. కోర్టు కూడా టీడీపీ నేతలకు వ్యతిరేకంగా తీర్పు ఇవ్వడంతో ప్రహరీగోడ నిర్మాణం పూర్తి చేశారు. తాజాగా టీడీపీ అధికారంలోకి రావడంతో ఆదివారం జేసీబీని తీసుకొచ్చి ప్రహరీని కూల్చేశారు. ఈ ఘటనపై సర్పంచ్ ఏర్పేడు పోలీసులకు, తహశీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. ఘటనపై విచారించి చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

వైఎస్సార్‌సీపీ నేతకు చెందిన షెడ్డు ధ్వంసం


సరిపల్లిలో మండపాటి శ్రీదేవికి చెందిన షెడ్డును ధ్వంసం చేసిన దృశ్యం

కొయ్యలగూడెం: ఏలూరు జిల్లా కొయ్యలగూడెం మండలం సరిపల్లిలో మరోమారు కూటమి శ్రేణులు తెగబడ్డారు. వైఎస్సార్‌సీపీ నేత, పీఏసీఎస్ అధ్యక్షురాలు మండపాటి శ్రీదేవికి చెందిన షెడ్డును ధ్వంసం చేశారు. గ్రామ సమీపంలోని వంక బొత్తప్పగూడెం జంక్షన్‌లో ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న వైఎస్సార్ స్మారక స్థూపాన్ని ధ్వంసం చేశారు. రూ.5 లక్షలతో వైఎస్సార్ విగ్రహాన్ని పోలవరం ప్రాజెక్ట్ నమూనాతో భగీరథ భవన్ స్మారక మందిరాన్ని నిర్మించగా.. దాన్ని సైతం నష్టపరిచారని, ఎదురుగా ఉన్న 4 సింహాలను ధ్వంసం చేశారు.

మహిళా వలంటీర్‌పై దాడి

చంపాడులో టీడీపీ కార్యకర్తల బరితెగింపు

- ఆమె ఇంటిపై రాళ్లు రువ్వి అంతు చూస్తామంటూ పోస్టర్
- పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోని వైనం

వేమూరు: గ్రామ వలంటీర్‌పై టీడీపీ కార్యకర్తలు మహిళలతో దాడి చేయించి కొట్టిన ఘటన బాపట్ల జిల్లా వేమూరు మండలం చంపాడులో ఆదివారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. ఎస్సీ మాదిగ వర్గానికి చెందిన పమిడిపాగుల జ్యోతి అనే మహిళ గ్రామ వలంటీర్‌గా పని చేస్తోంది. వలంటీర్లపై కూటమి నేతల అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా ఎన్నికల ముందు ఆమె రాజీనామా చేశారు. కాగా.. ఎన్నికల్లో గెలిచాక టీడీపీ కార్యకర్తలు జ్యోతిని లక్ష్యంగా చేసుకుని వేధించటం మొదలుపెట్టారు. నాలుగు రోజుల క్రితం గుర్తు తెలియని వ్యక్తులు ఆమె ఇంటిపై ఇటుక రాళ్లతో దాడి చేశారు. 'మీ వైఎస్సార్‌సీపీ పార్టీ గెలవాలని ఓట్లు వేయించి తెగపాకులాడావుగా గొప్ప వాలంటీరు. ఇప్పుడు మాది రాజ్యం. నీ అంతు చూస్తాం. జై టీడీపీ, జై కూటమి' అంటూ ఆ ఇంటి గోడపై పోస్టర్ అతికించారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకుండాపోయింది. మరుసటి రోజునుంచి స్కూల్‌కెళ్తున్న జ్యోతి పిల్లలను దూషిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం సాయంత్రం బజారు నుంచి ఇంటికెళ్తున్న జ్యోతిపై కొందరు మహిళలతో టీడీపీ నాయకులు దాడి చేయించి కొట్టించారు. కిందపడిపోయిన జ్యోతిని వేమూరు పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు. అక్కడ ఆమె స్పృహ కోల్పోవటంతో 108 అంబులెన్స్‌లో తెనాలిలోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న వైఎస్సార్‌సీపీ వేమూరు ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు హుటాహుటిన వేమూరు పోలీస్ స్టేషన్‌కు వెళ్లి జ్యోతిని పరామర్శించారు. నాలుగు రోజుల క్రితం ఆమె ఇంటిపై రాళ్లురువ్వి పోస్టర్ అతికించినట్లు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేయకపోవటంపై పోలీసులను ప్రశ్నించారు. ఆ కేసుతో పాటు ఆదివారం జరిగిన దాడిపై కేసులోనూ ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేస్తేనే పోలీస్ స్టేషన్ నుంచి వెళతానని పట్టుబట్టారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఇంటిపై జరిగిన రాళ్ల దాడిపై ఎఫ్‌ఐఆర్ తర్వాత ఇస్తామని ఎస్‌ఐ నాగరాజు వెల్లడించారు. వరికూటి అశోక్‌బాబు మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ఎక్కడైనా వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులపై దాడులకు పాల్పడితే సహించబోమన్నారు. కార్యకర్తలు ధైర్యంగా ఉండాలని, తనతోపాటు పార్టీ అండగా ఉంటుందని చెప్పారు.


అంబులెన్స్‌లో తరలిస్తున్న జ్యోతిని పరామర్శిస్తున్న వరికూటి అశోక్‌బాబు

వైఎస్సార్‌సీపీ నేతపై దాడి..


గాయపడిన బంగారు బాబు

వేటపాలెం: బాపట్ల జిల్లా వేటపాలెం మండల పరిధిలోని బచ్చులవారిపాలెంలో వైఎస్సార్‌సీపీ నేత బచ్చుల బంగారు బాబు పై టీడీపీ కార్యకర్తలు దాడికి పాల్పడ్డారు. బాధితుడు తెలిపిన వివరాల మేరకు..గ్రామంలో శనివారం రాత్రి గంగమ్మ తల్లి కొలుపులు జరుగుతున్నాయి. అదే అదునుగా గ్రామంలో టీడీపీకి చెందిన ప్రధాన నాయకుడు వారి అనుచరులు నలుగురికి మద్యం తాగించి బంగారుబాబుపై దాడికి తెగబడ్డారు. దీంతో బంగారుబాబు తలకు తీవ్రగాయం అయ్యింది. అక్కడే ఉన్న కొంతమంది మహిళలు దాడిని అడ్డుకోవడంతో అతడిని వదిలేశారు. కాగా, బంగారుబాబు వైఎస్సార్‌సీపీ తరఫున గ్రామంలో ప్రచారం చేసి ఓట్లు వేయించాడు. టీడీపీ చెందిన ఒక నాయకుడు గ్రామంలో టీడీపీ తరఫున పోటీ చేసిన మన సామాజిక వర్గం నాయకుడు కొండయ్యకు గ్రామం మొత్తం ఓట్లు వేద్దామని బంగారు బాబును అడిగారు. అందుకు అతను ఒప్పుకోకపోగా వైఎస్సార్‌సీపీని వీడే ప్రసక్తే లేదని స్పష్టంగా చెప్పాడు. దాన్ని దృష్టిలో ఉంచుకొని గ్రామంలో టీడీపీ ఓట్లు చీలుస్తావా అని చెప్పి వారికి సంబంధించిన కొంత మందికి మద్యం తాగించి బంగారు బాబుపై దాడి చేయించాడు. తనను చంపేస్తామని బెదిరింపులకు పాల్పడుతున్నారని బాధితుడు వాపోయాడు. తనకు, తన వర్గం వారికి రక్షణ కల్పించాలని కోరుతూ వేటపాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

వైఎస్సార్ విగ్రహం ధ్వంసం


పడిపోయిన వైఎస్సార్ విగ్రహం

క్రోసూరు: పల్నాడు జిల్లా క్రోసూరు మండలం నాగవరంలో దివంగత సీఎం డాక్టర్ వైఎస్సార్ విగ్రహాన్ని ధ్వంసం చేయడంతోపాటు రోడ్డు నిర్మాణం కోసం వేసిన శిలాఫలకం దిమ్మెను కొందరు గుర్తు తెలియని వ్యక్తులు శనివారం అర్ధరాత్రి ధ్వంసం చేశారు. ఎస్‌ఐ ఎం.షఫీ తెలిపిన వివరాలు..గ్రామంలోని బొడ్రాయిసెంటర్‌లో రాజీవ్‌గాంధీ, వంగవీటి రంగా, వైఎస్సార్ విగ్రహాలు ఒకే దిమ్మెపై ఉన్నాయి. వైఎస్సార్ విగ్రహాన్ని కొందరు గుర్తుతెలియని వ్యక్తులు దిమ్మెపై తొలగించి ఊరిబయటకు తీసుకెళ్లి పడేశారు. గ్రామంలో రెడ్డిగూడెం నుంచి దొడ్లేరు వరకు రూ.6.30 కోట్లతో నిర్మించేందుకు శంకుస్థాపన చేసి శిలాఫలకం ఏర్పాటు చేయగా దాన్ని కూడా ధ్వంసం చేశారు. పోలీసులు గ్రామానికి చేరుకుని కేసు నమోదు చేసి విగ్రహాన్ని తరలించిన ఘటనలో ఉపయోగించిన ట్రాక్టర్‌ను, ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. గ్రామంలో పోలీసులు పికెట్ ఏర్పాటు చేశారు.

ఎమ్మెల్యేను వాటేసుకున్న డీఎస్పీ

ఎస్పీకి ఫిర్యాదు చేసిన మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి


ఎమ్మెల్యే థామస్‌ను వాటేసుకుంటున్న నగరి డీఎస్పీ నరసింహమూర్తి

సాక్షి టాస్క్‌ఫోర్స్: నగరి డీఎస్పీ నరసింహమూర్తి అత్యుత్సాహం ప్రదర్శించారు. జీడీ నెల్లూరు ఎమ్మెల్యే వీఎం థామస్ ఆదివారం కార్వేటి నగరంలోని పార్టీ కార్యాలయానికి చేరుకోగా.. నగరి డీఎస్పీ అత్యుత్సాహంతో ఎమ్మెల్యేను వాటేసుకోవడం చూసిన వారంతా అవాక్కయ్యారు. ఈ విషయమై మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి మాట్లాడుతూ.. పోలీస్ అధికారులు అధికార పార్టీకి దాసోహమై అత్యుత్సాహాన్ని చూపుతున్నారని మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి శత్రువులుగా ఉంటూ వచ్చిన పోలీసులు టీడీపీకి అమ్ముడుపోవడం దారుణమన్నారు. పోలీసు అధికారులా లేక టీడీపీ కార్యకర్తలా అని ప్రశ్నించారు. దీనిపై ఎస్పీకి ఫిర్యాదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

వైఎస్సార్‌సీపీ ఓటమి తట్టుకోలేక ఇద్దరి మృతి


సాయికుమార్ (ఫైల్)


మృతుడు ముస్కు చెన్నయ్య(ఫైల్)

నరసరావుపేటరూరల్ : ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఓటమిని జీర్ణించుకోలేక ఆ పార్టీ అభిమానులు ప్రాణాలు విడుస్తున్నారు. ఆదివారం ఇద్దరు గుండె పోటుతో మృతిచెందారు. నరసరావుపేట రూరల్ మండలం జొన్నలగడ్డకు చెందిన ముస్కు చెన్నయ్య(72) పెయింటర్. వైఎస్సార్ అంటే అభిమానం. వైఎస్సార్‌సీపీని స్థాపించిన నాటి నుంచి పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవాడు. ఈ నెల 4వ తేదీ ఎన్నికల ఫలితాల తర్వాత చెన్నయ్య మనోవేదనకు గురయ్యాడు. శనివారం ఇంట్లో గుండెపోటుతో మృతిచెందాడు. సహజత్వాన్ని ప్రతిబింబించేలా వైఎస్ జగన్ చిత్రాలను వేసేవాడు. చెన్నయ్య మృతిపై మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, స్థానిక పార్టీ నేతలు సంతాపం తెలిపారు.

శ్రీకాకుళం జిల్లాలో..

కోటబొమ్మాళి: శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళి మండలం పాకివలసకు చెందిన జలుమూరు సాయికుమార్(25) ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇటీవల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఓడిపోవడంతో తీవ్ర మనోవేదన లోనయ్యాడు. ఈ నేపథ్యంలో ఆదివారం గుండెపోటుకు గురై ఇంట్లోనే ప్రాణాలు విడిచాడు. సాయికుమార్‌కు భార్య శ్రావణి, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

కనపర్రులో వైఎస్సార్ విగ్రహం ధ్వంసానికి యత్నం

నాదెండ్ల : పల్నాడు జిల్లా నాదెండ్ల మండలం కనపర్రులో వైఎస్సార్ విగ్రహాన్ని ధ్వంసం చేసేందుకు టీడీపీ శ్రేణులు యత్నించాయి. స్థానికులు వారించడంతో వైఎస్సార్ విగ్రహానికి టీడీపీ కండువాలు కప్పారు. గ్రామంలో ఆదివారం టీడీపీ శ్రేణులు విజయోత్సవ ర్యాలీ నిర్వహించాయి. ఈ సందర్భంలో కేసానుపల్లి రోడ్డులో ఉన్న మహానేత వైఎస్సార్ విగ్రహం ధ్వంసానికి ఆ పార్టీ కార్యకర్తలు యత్నించారు. కాగా.. విజయోత్సవ ర్యాలీలో 30 పొట్టేళ్లకు మెడలో మద్యం సీసాలు కట్టి గ్రామంలో ఊరేగించారు. పూజల అనంతరం వాటిని బలిచ్చారు.


కనపర్రులో వైఎస్సార్ విగ్రహానికి టీడీపీ కండువాలు కప్పుతున్న ఆ పార్టీ శ్రేణులు

వైఎస్సార్‌సీపీ నాయకుడు టిప్పర్‌కు నిప్పు

- పూర్తిగా కాలిపోయిన వాహనం
- వైఎస్సార్ జిల్లాలో టీడీపీ నేతల దౌర్జన్యం


కొత్తగంగిరెడ్డిపల్లె వద్ద మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

పెండ్లిమర్రి : తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడంతో గ్రామాల్లో ఆ పార్టీ శ్రేణులు రెచ్చిపోతున్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులకు తెగబడుతున్నారు. వైఎస్సార్ జిల్లా పెండ్లిమర్రి మండలం కొత్తగంగిరెడ్డిపల్లె గ్రామ పంచాయతీలో ఆదివారం వారు పేట్రేగిపోయారు. సోగాల్‌పల్లె గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు దేరంగుల శ్రీనివాసులుకు చెందిన టిప్పర్‌కు కొత్తగంగిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు నర్రెడ్డి కిషోర్‌కుమార్‌రెడ్డి అనుచరులు నిప్పుపెట్టారు. ఈ టిప్పర్ వేంపల్లె వద్ద ఉండగా టీడీపీ నేతలు డ్రైవర్‌పై దాడిచేసి టిప్పర్ అద్దాలు పగలగొట్టారు. కొత్తగంగిరెడ్డిపల్లె గ్రామ సమీపంలోని పొలాల వద్దకు తీసుకొచ్చి టిప్పర్‌కు నిప్పు పెట్టారని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. సంఘటనా స్థలాన్ని కడప డీఎస్పీ షరీఫ్, సీఐ నాగరాజు, ఎస్‌ఐ హరిప్రసాద్‌లు పరిశీలించారు. సోగాల్‌పల్లె గ్రామంలో పోలీసు పికెట్ ఏర్పాటుచేశారు.

మాజీ మంత్రి జోగి రమేష్ ఇంటిపై రాళ్లదాడి


జోగి రమేష్ ఇంటి వద్ద కానిస్టేబుల్‌పై దాడికి తెగబడుతున్న నిందితులు

సాక్షి ప్రతినిధి, విజయవాడ: మాజీ మంత్రి జోగి రమేష్ ఇంటిపై టీడీపీ, జనసేన కార్యకర్తలు ఆదివారం మధ్యాహ్నం రాళ్ల దాడి చేశారు. దీంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. కారులో వచ్చిన ముగ్గురు వ్యక్తులు ఇబ్రహీంపట్నం ఫెర్రీ రోడ్డులోని జోగి రమేష్ ఇంటివద్ద ఆదివారం మధ్యాహ్నం రెక్కీ నిర్వహించారు. అనంతరం జోగి రమేష్ ఇంటివద్ద సెక్యూరిటీ సిబ్బంది ఒక్కరే ఉన్నట్టు నిర్ధారణకు వచ్చిన ఆ ముగ్గురు తమ వెంట తెచ్చుకున్న రాళ్లతో జోగి రమేష్ ఇంటిపై దాడికి తెగబడ్డారు. అప్రమత్తమైన కానిస్టేబుల్ వారిని అడ్డుకుని పట్టుకునేందుకు ప్రయత్నించగా.. కానిస్టేబుల్‌ను సైతం బెదిరిస్తూ అతడిపైనా దాడికి యత్నించారు. దాడి చేస్తున్న సమయంలో ఆ ముగ్గురు వ్యక్తులు టీడీపీ, జనసేనకు మద్దతుగా వ్యాఖ్యలు చేయడంతోపాటు జోగి రమేష్ కుటుంబంపై బూతు పురాణం అందుకున్నట్టు స్థానికులు చెబుతున్నారు. ఈ క్రమంలో స్థానికులు ఒక్కొక్కరిగా అక్కడికి చేరుతున్న క్రమంలో ఆ ముగ్గురూ అక్కడి నుంచి కారులో పరారయ్యారు. కారులో మారణాయుధాలు సైతం ఉన్నట్టు స్థానికులు పేర్కొన్నారు. ఈ ఘటనపై జోగి రమేష్ వ్యక్తిగత సిబ్బంది ఫిర్యాదు మేరకు ఇబ్రహీంపట్నం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. జోగి రమేష్ ఇంటిపై టీడీపీ, జనసేన గూండాలు దాడిచేసే అవకాశం ఉందని పోలీసులకు ఇంటెలిజెన్స్ సమాచారం ఉన్నా భద్రత కల్పించకపోవడం దుర్మార్గమని వైఎస్సార్‌సీపీ నాయకులు పేర్కొన్నారు. దాడికి తెగబడిన టీడీపీ, జనసేన గూండాలను పోలీసులు వెంటనే గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరారు.

ఒంగోలులో ఆగని టీడీపీ దౌర్జన్యాలు

- టీవీ మెకానిక్ షాప్‌ను ధ్వంసం చేసిన టీడీపీ కార్యకర్తలు
- వైఎస్సార్‌సీపీ బీసీ నేత ఇంటిపై దాడి


బాషా మెకానిక్ షాపులో టీవీలను ధ్వంసం చేసిన టీడీపీ శ్రేణులు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: ఒంగోలులోని వైఎస్సార్‌సీపీకి చెందిన బీసీ నాయకుడి ఇంటి మీద టీడీపీ శ్రేణులు రాళ్లు రువ్వారు. టీవీ మెకానిక్ షాపు మీద దాడి చేసి టీవీలను పగులగొట్టారు. బాధితులు తెలిపిన వివరాల మేరకు...నగరానికి చెందిన షేక్ ఖాదర్ బాషా కర్నూలు రోడ్డులోని వర్మా గ్రాండ్ ఎదురుగా టీవీ మెకానిక్ షాపు నిర్వహిస్తున్నారు. ఆయన సంతనూతలపాడు వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా ఇన్‌చార్జిగా వ్యవహరించారు. 5 రోజుల నుంచి కొందరు అపరిచిత వ్యక్తులు ప్రతి రోజూ షాపు దగ్గరకు వచ్చి బాషా కోసం విచారించి వెళుతున్నారు. ఆదివారం ఆయన తన బంధువు వంశీని షాపులో కూర్చోబెట్టి భోజనానికి వెళ్లారు. ఆ సమయంలో అక్కడకు వచ్చిన అపరిచిత వ్యక్తులు షాపులోని టీవీలను పగులగొట్టి వంశీపై కర్రలతో దాడి చేశారు. చంద్రబాబు జై, టీడీపీ జై అని నినాదాలు ఇవ్వాలని ఒత్తిడి చేశారు. బాషాను చంపుతామని,ఆయనను వదిలిపెట్టేది లేదని హెచ్చరించి వెళ్లారు. సమాచారం తెలిసిన వెంటనే తాను ఫిర్యాదు చేసేందుకు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లగా సీఐ బయటకు వెళ్లారని, రాత్రికి రమ్మని స్టేషన్ ఇన్‌చార్జి చెప్పినట్లు బాషా తెలిపారు. తనతో పాటుగా కానిస్టేబుల్‌ను పంపించారని, ఆయన వచ్చి విధ్వంసానికి సంబంధించిన ఫొటోలు తీసుకుని వెళ్లారని చెప్పారు. ఈ దాడిలో రూ.1.50 లక్షల విలువైన టీవీలు ధ్వంసమయ్యాయని చెప్పాడు.

శివాలయం కమిటీ సభ్యుడి ఇంటిపై..

ఒంగోలుకి చెందిన కొమ్మనబోయిన నాగేశ్వరరావు కొత్తపట్నం బస్టాండ్ సెంటర్‌లో శివాలయం కమిటీ సభ్యుడిగా వ్యవహరిస్తుంటారు. వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ నగర అధ్యక్షుడిగా కూడా పనిచేశారు. మరాఠిపాలెంలోని ఆయన నివాసంపై శనివారం అర్ధరాత్రి టీడీపీ కార్యకర్తలు దాడి చేశారు. ఆ సమయంలో నాగేశ్వరరావు ఇంట్లో నిద్రపోతున్నారు. ఇరుగుపొరుగు వారు గట్టిగా కేకలేయడంతో టీడీపీ కార్యకర్తలు పారిపోయారు. టీడీపీకి చెందిన పెరుగు చిరంజీవి, మరో ఇద్దరు వ్యక్తులు ఈ విధ్వంసానికి పాల్పడినట్లు బాధితుడు టూ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నాగేశ్వరరావు ఫిర్యాదుపై దర్యాప్తు చేస్తున్నామని, ఇంకా కేసు నమోదు చేయలేదని సీఐ జగదీష్ చెప్పారు.

గృహసారథిపై టీడీపీ నేతల దాష్టీకం

- తలపై బలంగా కొట్టడంతో గాయాలపాలు
- బాధితుడి చిన్నాన్న, పెదనాన్నలపై కూడా కర్రలతో దాడి
- ఏలూరు జిల్లాలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన


సుమంత్‌ను ఆస్పత్రికి తీసుకెళ్తున్న దృశ్యం

కుక్కునూరు: ఏలూరు జిల్లా కుక్కునూరు మండలంలోని శ్రీధరవేలేరు పంచాయతీలోని శ్రీధర గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ గృహసారథి మద్దెల సుమంత్‌పై ఈ నెల 6న టీడీపీ నేతలు దాడి చేసిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం..వైఎస్సార్‌సీపీ అభిమాని అయిన సుమంత్ శ్రీధర గ్రామ సచివాలయ పరిధిలో వైఎస్సార్‌సీపీ గృహసారథిగా వ్యవహరిస్తున్నారు. ఇటీవల సుమంత్ రోడ్డు ప్రమాదానికి గురికాగా కొద్దిరోజుల క్రితం ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ చేశారు. ఈ నెల 6న తన తండ్రితో కలిసి సుమంత్ ఆస్పత్రికి వెళ్లివస్తుండగా గ్రామంలోని ఎస్సీ కాలనీ వద్ద ఓ చిన్నారి వీరి మోటార్‌సైకిల్‌కు అడ్డుగా వచ్చింది. చిన్నపిల్లను రోడ్డుపైకి పంపవద్దని అక్కడ ఉన్న వారికి హితవు చెప్పి సుమంత్ వెళ్లిపోయాడు. అదేరోజు సాయంత్రం తన తండ్రిని తీసుకుని మరోమారు మోటార్‌సైకిల్‌పై సుమంత్ వెళుతుండగా అదే ఎస్సీ కాలనీ వద్ద నరేష్, సతీష్, సాయి అనే వ్యక్తులు వీరి వాహనాన్ని ఆపి చిన్న పాప విషయంలో ఎందుకు తిట్టారంటూ సుమంత్‌పై దాడి చేశారు. సుమంత్ తండ్రి వారి కాళ్లావేళ్లా పడినా ఏ మాత్రం పట్టించుకోకుండా సుమంత్ తలపై కొట్టడంతో అతడికి తీవ్రగాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన సుమంత్‌ను కుటుంబసభ్యులు భద్రాచలం ఆస్పత్రికి తీసుకువెళ్లారు. విషయం తెలుసుకుని సుమంత్‌ను చూసేందుకు వెళుతున్న ఆయన చిన్నాన్న మద్దెల సత్యనారాయణ, పెద్దనాన్న మద్దెల వెంకట నారాయణలను టీడీపీకి చెందిన పఠాన్ యూసఫ్‌ఖాన్, పఠాన్ అయూబ్‌ఖాన్ అటకాయించి కర్రలతో దాడి చేసి గాయపర్చారు. సుమంత్ కుటుంబసభ్యులు దాడి ఘటనలపై కుక్కునూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వెళ్లగా దాడి చేసిన వారే అట్రాసిటీ కేసు పెట్టారని, ఇరు వర్గాలపై కేసులు నమోదు చేయాల్సి ఉంటుందని ఎస్‌ఐ చెప్పి అక్కడి నుంచి పంపించి వేశారు. స్థానిక టీడీపీ నేత అండతోనే ఇదంతా జరిగిందని, టీడీపీ నాయకుల ద్వారా తమకు ప్రాణహాని ఉందని బాధితులు ఆదివారం మీడియా వద్ద వాపోయారు. తమ కుటుంబానికి ఏమైనా జరిగితే అందుకు టీడీపీ నాయకులదే బాధ్యత అని చెప్పారు.

రోడ్డుకు అడ్డంగా గోతులు తవ్వించిన టీడీపీ నేత

అడ్డుకున్న మహిళపై దాడి


జేసీబీ సాయంతో రోడ్డుకు అడ్డంగా గోతులు తవ్వుతున్న టీడీపీ నాయకుడు అప్పలరాజు

శ్రీరంగరాజపురం : చిత్తూరు జిల్లా శ్రీరంగరాజపురం మండలం పీవీ పురం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు అప్పలరాజు జేసీబీతో రోడ్డుకు అడ్డంగా గోతులు తవ్వించిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. అదే గ్రామానికి చెందిన నీలమ్మ, ఆమె కుమారుడు అడ్డుకోవడంతో ఆమెపై దాడి చేయించి గాయపరిచారు. బాధితురాలు నీలమ్మ మాట్లాడుతూ.. పీవీ పురంలో 38 సెంట్ల ప్రభుత్వ బండిదారి భూమి ఉందని తెలిపింది. ఈ దారిగుండానే రైతులు తమ పొలాలకు వెళ్లేవారు. ఈ భూమిని టీడీపీ నాయకుడు అప్పలరాజు ఆక్రమించుకోగా.. గతంలో గ్రామస్తులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దార్, మండల సర్వేయర్, పోలీసుల సమక్షంలో సర్వే చేయించి ప్రభుత్వ భూమిగా గుర్తించి రైతుల సౌకర్యార్థం బండి రహదారిగా ఏర్పాటు చేశారు. ఆదివారం టీడీపీ నాయకుడు అప్పలరాజు తన అనుచరులతో కలిసి జేసీబీతో రోడ్డుకు అడ్డంగా గోతులు తవ్వడంతో నీలమ్మ అడ్డుకుంది. దీంతో అప్పలరాజు తన అనుచరులతో నీలమ్మ, ఆమె కుమారుడిపై దాడి చేయించి గాయపరిచారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ రాజాకుళ్లాయప్ప ఘటనా స్థలాన్ని పరిశీలించారు. తనకు, తన కుటుంబ సభ్యులకు అప్పలరాజు నుంచి ప్రాణహాని ఉందని, తమకు రక్షణ కల్పించాలని బాధితురాలు నీలమ్మ కోరింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆక్రమణల పేరుతో పేదల ఇళ్ల కూల్చివేత

శ్రీకాళహస్తిలో రెండు రోజులుగా విధ్వంసం


భవనాలను జేసీబీతో కూల్చుతున్న రెవెన్యూ అధికారులు


శ్రీకాళహస్తి (చిత్తూరు జిల్లా): శ్రీకాళహస్తికి సమీపంలోని రాజీవ్ నగర్‌లో 2 రోజులుగా విధ్వంసకాండ కొనసాగుతోంది. శనివారం ఇళ్ల నిర్మాణానికి పేదలు వేసిన 27 పునాదులను తవ్వేసిన అధికారులు..నిర్మించిన మరో 24 ఇళ్లను ఆదివారం కూల్చివేశారు. పేదలు అడ్డుకుంటున్నా..జేసీబీలు పెట్టి కూలదోశారు. పట్టణానికి సమీపంలోని రాజీవ్‌నగర్ కాలనీలో వైఎస్సార్ హయాంలో 3,000 మంది పేదలకు ఇళ్లు నిర్మించుకోవడానికి స్థలాలు సేకరించి ప్లాట్లను కేటాయించారు. అదే స్థలంలో టిడ్కో ఇళ్ల పేరుతో టీడీపీ హయాంలో 6,000 ఇళ్లకు అపార్ట్‌మెంట్లు నిర్మాణం చేపట్టారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత మరో 2,000 ఇళ్లు జగనన్న కాలనీ పేరుతో అభివృద్ధి చేశారు. టీడీపీ ప్రభుత్వం వచ్చిన వెంటనే రోడ్డు పక్కన పేదలు నిర్మించుకున్న ఇళ్లను, పునాదులను ఆక్రమిత భూములుగా చూపుతూ వైఎస్సార్‌సీపీ వారు ఎక్కువగా ఉన్నారనే దురుద్దేశంతో కక్ష సాధింపులకు పాల్పడుతున్నారు. ఏ ఈ విధమైన నోటీసులు లేకుండా తొట్టంబేడు తహశీల్దారు శివరాముడు ఆధ్వర్యంలో ధ్వంసం చేస్తున్నారు. ఏడాది ముందు నుంచి నిర్మాణాలు జంరుగుతున్నా ప్రభుత్వం మారిందన్న సాకుతో కూల్చివేస్తున్నారు. దీనివెనుక శ్రీకాళహస్తి టీడీపీ ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి హస్తం ఉందని, ఆయన ప్రోద్బలంతోనే కూల్చివేస్తున్నారని పేదలు ఆరోపిస్తున్నారు. అక్రమ కట్టడాలు అయితే కరెంటు మీటర్లను ఎందుకు ఇచ్చారని బాధితులు ప్రశ్నిస్తున్నారు.

వైఎస్సార్‌సీపీకి ఓటు వేశారని దంపతులపై దాడి

బైక్, ఆటోలను ధ్వంసం చేసిన టీడీపీ కార్యకర్తలు


టీడీపీ కార్యకర్తలు ధ్వంసం చేసిన ఆటో

తోటపల్లిగూడూరు: శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా సర్వేపల్లి నియోజకవర్గంలో టీడీపీ కార్యకర్తల అరాచకం హద్దు మీరుతోంది. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి వేటు వేశామని టీడీపీ కార్యకర్తలు తనపై దాడి చేసినట్లు తోటపల్లిగూడూరు మండలం కోడూరు పంచాయతీకి చెందిన ముచ్చింగారి నరసయ్య ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుడి కథనం మేరకు... కోడూరు పంచాయతీ వెంకటేశ్వరపాళెంకి చెందిన నరసయ్య, శాంతి దంపతులు వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి ఓటు వేశారని వీరిపై స్థానిక టీడీపీ కార్యకర్తలు కక్ష పెంచుకున్నారు. శనివారం రాత్రి పామంజి రఘు, అక్కంగారి చిన్న నాగూరు, ఆవుల గణేష్ తదితరులు నరసయ్య దంపతులపై దాడికి దిగారు. వారి నివాసంపై దాడి చేసి ఆటో, బైక్‌లను ధ్వంసం చేశారు. బాధితులు ఆదివారం పోలీసులకు తమకు జరిగిన అన్యాయాన్ని వివరించారు. తమపై దాడికి పాల్పడిన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.



నేడు బక్రీద్

పరిపూర్ణ ఆరాధన హజ్జ్

ఇస్లామ్ ధర్మం ఐదు మౌలిక సూత్రాలపై ఆధారపడి ఉంది. ఇందులో ఏ ఒక్కదాన్ని విస్మరించినా విశ్వాసం పరిపూర్ణం కాదు. మొట్టమొదటిది సృష్టికర్త ఒక్కడే అన్న విశ్వాసం. రెండవది నమాజ్, మూడవది రోజా, నాల్గవది జకాత్, ఐదవది హజ్జ్. దైవ విశ్వాస ప్రకటనకు ఇవి ఆచరణాత్మక సాక్ష్యాలు. ఒక మనిషి విశ్వాసి/ ముస్లిమ్ అనడానికి రుజువులు. అన్ని ఆరాధనలకూ 'హజ్జ్' ఆత్మ వంటిది. ఆర్థిక స్థోమత కలిగిన ప్రతి ముస్లింపై హజ్ విధిగా నిర్ణయించడం జరిగింది. అందుకని ఆర్థిక స్థోమత కలిగినవారు జీవిత కాలంలో కనీసం ఒక్కసారైనా కాబా సందర్శన యాత్ర చేయడం తప్పనిసరి. ఈ'హజ్' జిల్ హజ్ మాసం పదవ తేదీన అరేబియా దేశంలోని మక్కా నగరంలో జరుగుతుంది. ఆ రోజే ప్రపంచంలోని ముస్లింలంతా పండుగ జరుపుకుంటారు. అదే 'ఈదుల్ అజ్ హా'. దీన్ని బక్రీద్ పండుగ అని, ఈదె ఖుర్బాన్ అని కూడా అంటారు. 'హజ్జ్ 'ఒక విశ్వజనీన, విశ్వ వ్యాపిత ఆరాధన. ఇందులో శ్రీమంతులు, నిరుపేదలు, తెల్లవారు, నల్లవారు, అరబ్బులు, అరబ్బేతరులు అన్న భేద భావం మచ్చుకు కూడా కనిపించదు. 'మానవులంతా ఒక్కటే' అన్న విశ్వమానవతా భావంతో అందరూ ముక్తకంఠంతో అల్లాహ్‌ను కీర్తిస్తూ, ఆయన ఘనతను, ఔన్నత్యాన్ని కొనియాడుతూ భక్తిపారవశ్యంతో తాదాత్మ్యం చెందడమే హజ్ యాత్రలోని పరమార్థం.

మక్కా నగర ఆవిర్భావం

మక్కానగర ఆవిర్భావం దాదాపు ఐదువేల సంవత్సరాలకు పూర్వం జరిగింది. కొండలూ కోనల నడుమ, ఎలాంటి వనరులూ లేకుండా నిర్మానుష్యంగా పడి ఉన్న ఎడారి ప్రాంతంలో మహనీయ హజ్రత్ ఇబ్రాహీం అలైహిస్సలాం తన ధర్మపత్ని హజ్రత్ హాజిరా అలైహిస్సలాంను, తనయుడు ఇస్మాయీల్ అలైహిస్సలాంను వదిలేసి వెళ్ళిపోతారు. అప్పుడు, శ్రీమతి హాజిరా, 'అదేమిటీ.. నన్నూ, నాబిడ్డను ఇలా ఒంటరిగా వదిలేసి వెళ్ళిపోతున్నారేమిటీ.?'అని ప్రశ్నించగా...,'ఇది దైవాజ్ఞ.' అని మాత్రమే చెప్పి, అల్లాహ్‌పై అచంచల విశ్వాసంతో కనీసం వెనుదిరిగైనా చూడకుండా వెళ్ళిపోతారు హజ్రత్ ఇబ్రాహీం అలైహిస్సలాం.

కనీసం నాలుక తడుపుకోడానికి సైతం చుక్క నీరులేని ఆఎడారి ప్రదేశంలో చిన్నారి ఇబ్రాహీం దాహానికి తాళలేక గుక్కపట్టి ఏడుస్తున్న క్రమంలో ఆయన కాలి మడమలు రాసుకుపోయిన చోట అల్లాహ్ ఆజ్ఞతో అద్భుతమైన నీటి ఊట ఉబికింది. 'జమ్ జమ్ 'అనే పేరుగల ఆ పవిత్ర జలంతో తల్లీ తనయులు తమ దాహం తీర్చుకున్నారు. ఆ నీరే 'ఆబెజమ్ జమ్' పేరుతో ప్రసిద్ధి గాంచింది. ఆనాడు కేవలం రెండు ప్రాణాలకోసం వెలసిన ఆ జలం ఈనాడు హజ్ యాత్ర నిమిత్తం మక్కావెళ్ళే లక్షలాదిమంది ప్రజలతో పాటు, స్థానికులకూ నిరంతరం సమృద్ధిగా సరఫరా అవుతూ, యాత్రికులందరూ తమ తమ స్వస్థలాలకు తీసుకు వెళుతున్నా ఏమాత్రం కొరత రాకుండా తన మట్టాన్ని యథాతథంగా ఉంచుకోవడం అల్లాహ్ ప్రత్యక్ష మహిమకు నిదర్శనం. ఆ నాటి ఆ నిర్జీవ ఎడారి ప్రాంతమే ఈనాడు అత్యద్భుత సుందర మక్కానగరంగా రూపుదిద్దుకొని విశ్వవ్యాప్త ముస్లిం ప్రజానీకానికి పవిత్ర పుణ్యక్షేత్రంగా భాసిల్లుతోంది. తరువాత కొంతకాలానికి అల్లాహ్ ఆదేశం మేరకు



తఖ్వా ప్రధానం

దేవుని ఏకత్వానికి ప్రతీకగా నిలిచిన హజ్జ్‌ను సకల ఉపాసనా రీతులు ఇముడ్చుకున్న పరిపూర్ణ దైవారాధన అని కూడా చెప్పకోవచ్చు. హజ్రత్ ఇబ్రాహీం అలైహిస్సలాం తన కుమారుడు ఇస్మాయీల్ (అ)తో కలిసి నిర్మించిన కాబా గృహ సందర్శనలో ఉపాసనా, ఆరాధనా రీతులన్నీ పరిపూర్ణతను సంతరించుకున్నాయి. యాత్ర, నిరాడంబర సాధు వస్త్రధారణ, దైవప్రార్థన, వ్రతనిష్ఠ, ఖుర్బానీ ఇవన్నీ సమన్వయం చెంది, ఒకేచోట కేంద్రీకృతమై, ఏకైక ప్రభువు సన్నిధిలో, హజ్ ఆరాధనలో ప్రదర్శితమవుతాయి. అందుకని కాబా గృహ సందర్శనార్థం చేసే హజ్జ్ వల్ల ఉపాసనా రీతులన్నిటినీ ఆచరించి దైవానుగ్రహం పొందినట్లే అవుతుంది. ఈ కారణంగానే ముస్లిం స్త్రీ పురుషులందరూ జీవితకాలంలో కనీసం ఒక్కసారైనా హజ్ చేయాలని అభిలషిస్తారు. ఆ మహాభాగ్యంకోసం ఉవ్విళ్ళూరుతూ ఉంటారు.

హజ్రత్ ఇబ్రాహీం అలైహిస్సలాం మక్కాకు తిరిగొచ్చి కుటుంబాన్ని కలుసుకొని, తనయుడు ఇస్మాయీల్ సహాయంతో 'కాబా' ను నిర్మించారు. చతుస్రాకారంలో ఉన్న ఆ రాతికట్టడాన్ని హజ్రత్ ఇబ్రాహీం, హజ్రత్ ఇస్మాయీల్ అలైహిముస్సలాంలు అల్లాహ్‌కు సమర్పించుకున్నారు. దీంతో కాబా దైవగృహంగా పేరుపొందింది.

అలౌకికానందం

మక్కా చేరగానే ప్రతి హాజీ (యాత్రికుడు) కాబావైపు పరుగులు తీస్తాడు. పవిత్ర కాబాను చూడగానే భక్తులు పొందే ఆనంద పారవశ్యాలు వర్ణనాతీతం. ఒకానొక అలౌకిక ఆనందంతో, భక్తిపారవశ్యంతో కాబా చుట్టూ ఏడుసార్లు ప్రదక్షిణ చేస్తారు. దీన్ని'తవాఫ్' అంటారు. ప్రతి తవాఫ్ లోనూ హాజీలు కాబాగోడలో అమరి ఉన్న 'హజ్రె అస్వద్ ' (నల్లనిశిల) ను ముద్దాడడానికి ప్రయత్నిస్తారు. దైవ గృహమైన కాబాకు సమీపంలో క్రీ. శ. 570 లో ముహమ్మద్ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం జన్మించారు. కనుక భక్తులు ఆ జ్ఞాపకాలనూ నెమరు వేసుకుంటారు. 'జమ్ జమ్ 'బావిలోని పవిత్ర జలాన్ని తనివి తీరా సేవిస్తారు. తరువాత సఫా, మర్వా కొండల మధ్య 'సయీ'చేస్తారు. దీని తరువాత కొన్నిరోజులు ఎవరి నివాసాల్లో వారు దైవచింతన, నమాజులతో కాలం గడిపి, 'జిల్ హజ్ 'మాసం ఎనిమిదవ తేదీన 'మినా' గ్రామం వెళ్ళి ఒక రోజంతా అక్కడ ఉంటారు. తొమ్మిదవ తేదీన ప్రపంచం నలుమూలలనుండీ వచ్చిన హాజీలంతా 'అరఫాత్ 'మైదానంలో గుమిగూడి దైవకారుణ్యాన్ని అభిలషిస్తూ ప్రార్థనలు చేస్తారు. ఈ సందర్భంలోనే ఆనాడు ముహమ్మద్ ప్రవక్త (స) అశేష భక్తజనాన్ని ఉద్దేశించి తమ అంతిమ సందేశం వినిపించారు. అందుకని భక్తులు ఆ మహనీయుడు నిలిచిన ప్రదేశాన్ని కూడా దర్శించి పులకించి పోతారు. సూర్యాస్తమయానికి తిరుగు ప్రయాణం ప్రారంభించి'ముజ్దలఫా' దగ్గర రాత్రి మజిలీ చేస్తారు. అక్కడే మగ్రిబ్, ఇషా నమాజులు కలిపి సామూహికంగా చేస్తారు.


మదీనా

సాధారణంగా మక్కాను దర్శించుకున్న యాత్రికులు మదీనాను కూడా సందర్శిస్తారు. మదీనా మక్కాకు రెండువందల మైళ్ళ దూరంలో ఉంది. ముహమ్మద్ ప్రవక్త (స) మక్కా నుండి మదీనాకు వలసవెళ్ళి అంతిమ దినాలు అక్కడే గడిపారు. మస్జిదెనబవి సందర్శనకు, హజ్జ్ కు ఎలాంటి సంబంధం లేకపోయినా అది ఇస్లామీయ జగత్తుకు జీవనాడి లాంటిది. ప్రవక్త మసీదు సందర్శన సున్నత్. కనుక దూరతీరాలనుండి వచ్చిన భక్తులు మస్జిదె నబవిని కూడా సందర్శించి, నమాజులు చేసి తమ యాత్ర సఫలమైందని భావిస్తారు. ఈ విధంగా ఒక హాజీ అన్ని నియమాలను పాటిస్తూ, అల్లాహ్ ఏకత్వానికి ప్రతీకగా నిలిచిన పవిత్రకాబా గృహాన్ని సందర్శిస్తాడు. యాత్రాక్రమంలో అతనికి అడుగడుగునా హజ్రత్ ఇబ్రాహీం అలైహిస్సలాం, హజ్రత్ ఇస్మాయీల్ అలైహిస్సలాం గార్ల సహనశీలత, త్యాగనిరతి, పాపభీతి, వాగ్దానపాలన, దైవాదేశపాలన లాంటి అనేక సుగుణాలను ఒంటబట్టించుకుంటాడు. అంతేకాదు, ఇంకా మరెన్నో సుగుణాలను మానవుల్లో జనింపజేసి మానవ సమానత్వానికి, విశ్వమానవ సౌభ్రాతృత్వానికి పూలబాటలుపరిచి, వారి ఇహపర సాఫల్యానికి హామీగా నిలుస్తుంది హజ్జ్ . ఇదే కాబా గృహ సందర్శనాయాత్ర అసలు పరమార్థం. అల్లాహ్ మనందరికీ ఈ విషయాలను అర్థం చేసుకొని, ఆచరించే సద్బుద్ధిని ప్రసాదించాలని కోరుకుందాం.

– యండి. ఉస్మాన్ ఖాన్

సినిమా

తంగలాన్ రెడీ



● విక్రమ్

విక్రమ్ హీరోగా నటించిన పీరియాడికల్ యాక్షన్ మూవీ 'తంగలాన్'. ఈ మూవీ థియేటర్స్‌కు వచ్చేందుకు సిద్ధం అవుతోంది. కోలార్ గోల్డ్ ఫీల్డ్స్ నేపథ్యంలో వాస్తవ ఘటనల ఆధారంగా పా. రంజిత్ ఈ సినిమాకు దర్శకత్వం వహించారు. స్టూడియో గ్రీన్, నీలమ్ ప్రొడక్షన్స్‌పై కేఈ జ్ఞానవేల్ రాజా ఈ చిత్రం నిర్మించారు. కాగా 'తంగలాన్' సినిమాను తొలుత ఈ ఏడాది జనవరిలో రిలీజ్ చేయాలనుకున్నారు కానీ కుదర్లేదు. ఆ తర్వాత ఏప్రిల్‌కు వాయిదా వేశారు. ఏప్రిల్‌లోనూ 'తంగలాన్' థియేటర్స్‌కు రాలేదు. అయితే తాజాగా ఈ మూవీని ఆగస్టులో రిలీజ్ చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారని కోలీవుడ్ సమాచారం. మాళవికా మోహనన్ హీరోయిన్‌గా నటించిన ఈ సినిమాలో పార్వతీ తిరువోతు, పశుపతి, హరికృష్ణన్, అన్బుదురై కీలక పాత్రల్లో నటించారు. ఈ సినిమాకు జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందించారు.

సితారే జమీన్ పర్ పూర్తి

ఆమీర్‌ఖాన్ హీరోగా నటించి, నిర్మించిన తాజా చిత్రం 'సితారే జమీన్ పర్'. జెనీలియా హీరోయిన్‌గా నటించారు. ఆర్ఎస్ ప్రసన్న దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ తాజాగా పూర్తయింది. ఈ విషయాన్ని సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు ఆర్ఎస్ ప్రసన్న. అంతేకాదు.. 'సితారే జమీన్ పర్' సినిమాని ఈ డిసెంబరులో విడుదల చేయాలనుకుంటున్నారట మేకర్స్. ఆమీర్‌ఖాన్ నటించిన 'తారే జమీన్ పర్' (2007) సినిమాకు సీక్వెల్‌గా 'సితారే జమీన్ పర్' తెరకెక్కుతోందట. ఆ సినిమాలో ఓ బాలుడిలో స్ఫూర్తి నింపే పాత్ర చేశారు ఆమీర్‌ఖాన్. అయితే 'సితారే జమీన్ పర్' లో ఆమీర్‌ఖాన్ పాత్రను పిల్లలే మోటివేట్ చేస్తారని, ఇదే ఈ సినిమా బేసిక్ స్టోరీ అనే టాక్ బాలీవుడ్‌లో వినిపిస్తోంది.



● ఆమీర్‌ఖాన్

నా గమనం.. నిత్య రణం!

'ఒక నేనే... నాకు చుట్టూ నేనే.. ఒకడైనా.. ఒంటరోణ్ణి కానే... ధీరుడినే.. యోధుడినే...' అంటూ మొదలవుతుంది 'కల్కి 2898 ఏడీ' సినిమాలోని 'భైరవ' యాంథమ్. ప్రభాస్ హీరోగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో రూపొందిన సైంటిఫిక్ అండ్ ఫ్యూచరిస్టిక్ ఫిల్మ్ 'కల్కి 2898 ఏడీ'. అమితాబ్ బచ్చన్, కమల్‌హాసన్, దీపికా పదుకొనె, దిశాపటానీ ఇతర లీడ్ రోల్స్‌లో నటించారు. సి.అశ్వినీదత్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 27న విడుదల కానుంది. ఈ మూవీలోని 'భైరవ' యాంథమ్ ఆడియోను ఆదివారం విడుదల చేశారు మేకర్స్. పూర్తి వీడియో సాంగ్ నేడు విడుదలవుతోంది. సంతోష్ నారాయణన్ సంగీతం అందించిన ఈ పాటకి రామజోగయ్యశాస్త్రి, కుమార్ లిరిక్స్ అందించారు. 'నాకు నేనే కర్త..కర్మ..క్రియ..ఒక నేనే వేల సైన్యమయ్యా...నా గమనం.. నిత్య రణం.. కణ కణ కణం..అనుచర గణం..'' అంటూ సాగే 'భైరవ' యాంథమ్‌ను పంజాబీ నటుడు–సింగర్ దిల్జీత్ సింగ్, దీపక్ బ్లూ, సంతోష్ నారాయణన్ పాడారు.



● ప్రభాస్

వేటాడితే ఎలా ఉంటుందో చూపిద్దాం!



నందితా శ్వేత

'ఈ బంగ్లాలో ఒక అమ్మాయిని చంపేశారు.. ఆ అమ్మాయే దెయ్యంగా మారి అందర్నీ చంపేస్తోందని కథలు కథలుగా చెప్పుకుంటున్నారు' అనే డైలాగ్‌తో 'ఓఎమ్‌జీ'(ఓ మంచి ఘోస్ట్) సినిమా ట్రైలర్ ఆరంభమైంది. నందితా శ్వేత, 'వెన్నెల' కిషోర్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'ఓఎమ్‌జీ'. శంకర్ మార్తాండ్ దర్శకత్వం వహించారు. మార్క్‌సెట్ నెట్‌వర్క్స్ బ్యానర్‌పై డా. అబినికా ఇనాబతుని నిర్మించిన ఈ మూవీ ఈ నెల 21న ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈ సందర్భంగా చిత్రం ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. 'అందరి సమస్యలు వేరే అయినా వాటికి పరిష్కారం మాత్రం డబ్బు', 'ఇప్పటి వరకు ఆటాడితే ఎలా ఉంటుందో చూశారు.. ఇప్పుడు వేటాడితే ఎలా ఉంటుందో చూపిద్దాం' వంటి డైలాగులు ట్రైలర్‌లో ఉన్నాయి. ''హారర్, కామెడీ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన ఈ చిత్రంలో సూపర్ నేచురల్, థ్రిల్లింగ్ ఎలిమెంట్స్ కూడా ఉన్నాయి. అనూప్ రూబెన్స్ సంగీతం ఈ చిత్రానికి మేజర్ అస్సెట్ కానుంది. మా సినిమా ప్రేక్షకులను నవ్వించడంతో పాటు భయపెడుతుంది'' అని చిత్రబృందం పేర్కొంది. రఘుబాబు, 'షకలక' శంకర్, నాగినీడు, 'బాహుబలి' ప్రభాకర్, నవమి గాయక్ ఇతర పాత్రల్లో నటించిన ఈ చిత్రానికి కెమెరా: ఐ ఆండ్రూ.



నటి ఐశ్వర్య(నటుడు అర్జున్ కుమార్తె), నటుడు ఉమాపతిల(నటుడు, దర్శకుడు తంబిరామయ్య కుమారుడు) వివాహ రిసెప్షన్ చెన్నైలో ఘనంగా జరిగింది. ఈ నెల 11న కుటుంబ సభ్యులు, బంధువులు, అత్యంత సన్నిహితుల సమక్షంలో ఐశ్వర్య, ఉమాపతిల వివాహం జరిగిన సంగతి తెలిసిందే. కాగా చెన్నైలోని లీలా ప్యాలెస్‌లో వీరి వివాహ రిసెప్షన్‌ని గ్రాండ్‌గా నిర్వహించారు. ఈ వేడుకకి తమిళనాడు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎమ్‌కే స్టాలిన్‌తో పాటు సినీ ప్రముఖులు రజనీకాంత్, ఉపేంద్ర, విజయ్ సేతుపతి, శివ కార్తికేయన్, శంకర్, ప్రభుదేవా, లోకేష్ కనకరాజ్, సత్యరాజ్, రోజా, కుష్బూ, స్నేహ తదితరులు హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు.

సస్పెన్స్ థ్రిల్లర్

సుగి విజయ్, మౌనిక మగులూరి జంటగా నటించిన హారర్ అండ్ సస్పెన్స్ థ్రిల్లర్ మూవీ 'రా.. రాజా'. బి. శివప్రసాద్ స్వీయ దర్శకత్వంలో నిర్మించిన ఈ చిత్రం త్వరలోనే విడుదల కానుంది. ఈ మూవీ టీజర్‌ను హీరో 'అల్లరి' నరేశ్ విడుదల చేసి, మాట్లాడుతూ– ''రా..రాజా' టీజర్ చాలా ఆసక్తిగా ఉంది. ఈ సినిమాలో నటించిన 24 మంది పాత్రల ముఖాలు కనిపించవు. కృత్రిమ మేధస్సును వినియోగిస్తున్న ఈ జనరేషన్‌లో కూడా ఇలాంటి చిత్రం చేయడం ఓ కొత్త ప్రయోగమే. ఈ సినిమా కొత్త ట్రెండ్ సెట్ చేస్తుందనిపిస్తోంది'' అన్నారు. ఈ సినిమాకు సంగీతం: శేఖర్ చంద్ర, కెమెరా: రాహుల్ శ్రీవాత్సవ్.



● బి.శివప్రసాద్, 'అల్లరి' నరేశ్

ఫ్యామిలీ ఎంటర్‌టైనర్

కన్నడలో సూపర్ హిట్ సాధించిన 'దియా' మూవీ ఫేమ్ పృథ్వీ అంబార్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'చౌకీదార్'. ఈ మూవీకి 'రథావర్' మూవీ ఫేమ్ చంద్రశేఖర్ బండియప్ప దర్శకత్వం వహిస్తున్నారు. విద్యాశేఖర్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై కల్లహళ్లి చంద్రశేఖర్ నిర్మిస్తున్నారు. కన్నడతో పాటు ఇతర భాషల్లోనూ రూపొందుతోన్న ఈ చిత్రానికి 'చౌకీదార్' అనే టైటిల్ ఖరారు చేశారు. ఈ మూవీ టైటిల్‌ని కన్నడ నటుడు 'రోరింగ్ స్టార్' శ్రీమురళి రిలీజ్ చేసి, చిత్రయూనిట్‌కి అభినందనలు తెలిపారు. ''చౌకీదార్' టైటిల్‌ను బట్టి మాస్ మూవీ అనుకోవద్దు.. ఫ్యామిలీ ఎంటర్‌టైనర్. తన ప్రతి సినిమాని సరికొత్త కథతో తెరకెక్కిస్తారు చంద్రశేఖర్ బండియప్ప. 'చౌకీదార్' కూడా వైవిధ్యంగా ఉంటుంది. ఈ చిత్రానికి సంబంధించిన ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలోనే ప్రకటిస్తాం'' అన్నారు మేకర్స్. ఈ చిత్రానికి సచిన్ బస్రూర్ సంగీతం అందిస్తున్నారు.



● శ్రీమురళి, పృథ్వీ అంబార్

నిమ్మకూరు మాస్టారు షురూ

ప్రముఖ సంగీత దర్శకుడు మాధవపెద్ది సురేష్ చంద్ర మనవడు శ్యామ్ సెల్వన్ హీరోగా పరిచయం అవుతున్న చిత్రం 'నిమ్మకూరు మాస్టారు'. నటుడు రాజేంద్ర ప్రసాద్ టైటిల్ రోల్ చేస్తున్నారు. అముదేశ్వర్ దర్శకత్వంలో జేఎమ్ సినీ ఫ్యాక్టరీ పతాకంపై జేఎమ్ ప్రదీప్ రెడ్డి నిర్మిస్తున్న ఈ మూవీ ఆదివారం హైదరాబాద్‌లో ప్రారంభం అయింది. ఈ ప్రారంభోత్సవానికి తెలంగాణ రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శ్యామ్ సెల్వన్‌పై చిత్రీకరించిన ముహూర్తపు సన్నివేశానికి పొన్నం ప్రభాకర్ క్లాప్ కొట్టారు. మాధవపెద్ది సురేష్ చంద్ర సంగీతం అందిస్తున్న ఈ చిత్రంలోని అన్ని పాటలకు జొన్నవిత్తుల సాహిత్యం అందిస్తున్నారు. ''మా కుటుంబంలోని ఐదో తరానికి చెందిన నా మనవడు శ్యామ్ సెల్వన్ హీరోగా పరిచయం కావడం గర్వంగా ఉంది'' అన్నారు మాధవపెద్ది సురేష్ చంద్ర. ''నిమ్మకూరు మాస్టారు' వంటి గొప్ప చిత్రం నిర్మించే అవకాశం లభించడం అదృష్టంగా భావిస్తున్నాను'' అన్నారు జేఎమ్ ప్రదీప్. ''ఈ నెల 25 నుంచి రాజమండ్రిలో రెగ్యులర్ షూటింగ్ మొదలవుతుంది'' అన్నారు అముదేశ్వర్. ఈ చిత్రానికి కెమెరా: ఏడీ కరుణ్.



● శ్యామ్ సెల్వన్, మాధవపెద్ది సురేష్ చంద్ర



ఆంధ్రప్రదేశ్ స్కేటర్ జెస్సీకి పసిడి పతకం

సాక్షి, విజయవాడ: వరల్డ్ స్కేట్ ఓసియానియా ఆర్టిస్టిక్ రోలర్ స్కేటింగ్ పోటీల్లో భాగంగా పసిఫిక్ కప్ ఓపెన్ టోర్నీలో ఆంధ్రప్రదేశ్ అమ్మాయి మాత్రపు జెస్సీ రాజ్ పసిడి పతకాన్ని సొంతం చేసుకుంది. న్యూజిలాండ్‌లో జరిగిన ఈ టోర్నీలో విజయవాడకు చెందిన 13 ఏళ్ల జెస్సీ ఇన్‌లైన్ ఫ్రీ స్కేటింగ్ లేడీస్ క్యాడెట్ విభాగంలో విజేతగా నిలిచింది. తన స్కేటింగ్ విన్యాసాలతో ఆకట్టుకున్న జెస్సీ మొత్తం 31.98 పాయింట్లతో అగ్రస్థానాన్ని దక్కించుకుంది. నాలుగేళ్ల క్రితం స్కేటింగ్ లో అడుగు పెట్టిన జెస్సీ జాతీయస్థాయి పోటీల్లో ఒక స్వర్ణం, ఒక రజతం, మూడు కాంస్యాలు గెలిచింది.

తెలంగాణ అథ్లెట్ సాయికిరణ్‌కు స్వర్ణం



దుద్యాల్: జాతీయ యూత్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణకు చెందిన అల్వాల్ సాయికిరణ్ పురుషుల షాట్‌పుట్ ఈవెంట్‌లో విజేతగా నిలిచాడు. ఛత్తీస్‌గఢ్‌లో ఆదివారం జరిగిన ఈవెంట్‌లో వికారాబాద్ జిల్లా దుద్యాల్ మండలం హస్నా బాద్ గ్రామానికి చెందిన 18 ఏళ్ల సాయికిరణ్ ఇనుప గుండును 18.36 మీటర్ల దూరం విసిరాడు. గచ్చిబౌలి స్టేడియంలో 'ద్రోణాచార్య' అవార్డు గ్రహీత, కోచ్ నాగపురి రమేశ్ వద్ద సాయికిరణ్ శిక్షణ తీసుకుంటున్నాడు.

స్మృతి సూపర్ సెంచరీ



స్మృతి మంధాన

- తొలి వన్డేలో భారత మహిళల గెలుపు
- 143 పరుగులతో దక్షిణాఫ్రికా చిత్తు
- ఆశా శోభనకు నాలుగు వికెట్లు



ఆశా శోభన

బెంగళూరు: సొంతగడ్డపై దక్షిణాఫ్రికాతో వన్డే సిరీస్‌లో భారత మహిళల క్రికెట్ జట్టు శుభారంభం చేసింది. ఆదివారం చిన్నస్వామి స్టేడియంలో జరిగిన తొలి వన్డేలో భారత్ 143 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికాపై ఘన విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత్ 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 265 పరుగులు చేసింది. ఓపెనర్, వైస్ కెప్టెన్ స్మృతి మంధాన (127 బంతుల్లో 117; 12 ఫోర్లు, 1 సిక్స్) మెరుపు సెంచరీతో చెలరేగింది. వన్డేల్లో స్మృతికి ఇదో ఆరో శతకం కాగా... భారత గడ్డపై మొదటిది కావడం విశేషం. ఒకదశలో భారత్ 99/5తో కష్టాల్లో నిలిచింది. అయితే లోయర్ ఆర్డర్‌లో దీప్తి శర్మ (48 బంతుల్లో 37; 3 ఫోర్లు), పూజ వస్త్రకర్ (42 బంతుల్లో 31 నాటౌట్; 3 ఫోర్లు) స్మృతికి సహకరించారు. 5 వికెట్లు చేజార్చుకున్న తర్వాత కూడా భారత మహిళల బృందం 166 పరుగులు జోడించగలగడం తమ వన్డే చరిత్రలోనే అత్యధిక కావడం ప్రస్తావనాంశం. అనంతరం దక్షిణాఫ్రికా 37.4 ఓవర్లలో 122 పరుగులకే కుప్పకూలింది. సూన్ లూస్ (58 బంతుల్లో 33; 4 ఫోర్లు), సినాలో జఫ్తా (27 నాటౌట్), మరిజాన్ కాప్ (24) కొద్ది సేపు ప్రతిఘటించగలిగారు. కెరీర్‌లో తొలి వన్డే ఆడిన కేరళకు చెందిన లెగ్ స్పిన్నర్ ఆశా శోభన (4/21) ప్రత్యర్థిని పడగొట్టగా... దీప్తి శర్మకు 2 వికెట్లు దక్కాయి. అతి పెద్ద వయసులో (33 ఏళ్ల 92 రోజులు) భారత్ తరఫున వన్డేల్లో అరంగేట్రం చేసిన ప్లేయర్‌గా ఆశా శోభన నిలిచింది. రెండో వన్డే బుధవారం ఇదే వేదికపై జరుగుతుంది.



హ్యారీ బ్రూక్

ఆస్ట్రేలియా గెలుపు ఇంగ్లండ్ సూపర్-8కు...

ఆసీస్ చేతిలో ఓడిన స్కాట్లాండ్ ● ఇంగ్లండ్‌కు కలిసొచ్చిన అదృష్టం

నమీబియాతో ఇంగ్లండ్ చివరి లీగ్ మ్యాచ్... కచ్చితంగా గెలవడంతో పాటు మరోవైపు ఆస్ట్రేలియా చేతిలో స్కాట్లాండ్ ఓడితేనే రన్‌రేట్ లెక్కలతో ముందుకు వెళ్లే అవకాశం. భారీ వర్షంతో మ్యాచ్ ఆలస్యం కావడంతో ఇంగ్లండ్ గుండెల్లో రాయి పడింది. రద్దయినా ఇంగ్లండ్ ఇంటికే! గంట, రెండు గంటలు, మూడు గంటలు... చివరకు వాన ఆగడంతో 11 ఓవర్ల మ్యాచ్... కానీ మళ్లీ వర్షం రాకతో మరో ఓవర్ కుదింపు... 10 ఓవర్ల ఛేదనలో నమీబియాకు విజయావకాశం ఉన్నట్లు కనిపించినా ఆఖరికి ఇంగ్లండ్‌దే పైచేయి అయింది. ఇక తర్వాతి మ్యాచ్ ఫలితం కోసం ఎదురుచూపులు! 'ఇంగ్లండ్ లీగ్ దశలో నిష్క్రమించడం మాకు మేలు చేస్తుందనుకుంటే ఆఖరి మ్యాచ్‌లో స్కాట్లాండ్‌కు సహకరిస్తాం' అంటూ హాజల్‌వుడ్ చేసిన వివాదాస్పద వ్యాఖ్యల నేపథ్యంలో ఆస్ట్రేలియా ఎలా ఆడుతుందనేది ఆసక్తి రేకెత్తించింది. తక్కువ స్కోర్ల ఈ టోర్నీలో స్కాట్లాండ్ పటిష్ట ప్రత్యర్థిపై అనూహ్యంగా 180 పరుగులు చేసేసింది. ఛేదనలో ఒకదశలో ఆసీస్ స్కోరు 60 పరుగులకు 3 వికెట్లు! స్టొయినిస్, హెడ్ ఆదుకున్నా... చివరి 7 ఓవర్లలో 89 పరుగులు చేయాల్సిన స్థితిలో స్కాట్లాండ్ గెలుపు ఆశలు... కానీ ఆసీస్ తమ అసలు స్థాయిని ప్రదర్శించి మెరుపు ఆటతో 40 బంతుల్లో 94 పరుగులు రాబట్టింది...స్కాట్లాండ్ ఆటగాళ్ల నిర్వేదం... ఇంగ్లండ్ శిబిరంలో సంబరాలు!

నార్త్ సౌండ్: డిఫెండింగ్ చాంపియన్ ఇంగ్లండ్ తమ పరువు నిలబెట్టుకుంది. టి20 ప్రపంచకప్ గ్రూప్ దశలోనే నిష్క్రమించే ప్రమాదాన్ని దాటి ఎట్టకేలకు సూపర్-8 దశకు అర్హత సాధించింది. కీలక సమయంలో మెరుగైన ఆటను ప్రదర్శించడంతో పాటు అదృష్టం కూడా ఆ జట్టుకు కలిసొచ్చింది. పాయింట్ల పరంగా స్కాట్లాండ్‌తో సమానంగా (5) సమానంగా నిలిచినా... మెరుగైన రన్‌రేట్ కారణంగా ఇంగ్లండ్ ముందంజ వేసింది. గ్రూప్ 'బి'లో తమ చివరి మ్యాచ్‌లో డక్‌వర్త్ లూయిస్ పద్ధతి ప్రకారం ఇంగ్లండ్ 41 పరుగుల తేడాతో నమీబియాపై ఘన విజయం సాధించింది. వర్షం కారణంగా 10 ఓవర్లకు కుదించిన ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ 5 వికెట్ల నష్టానికి 122 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' హ్యారీ బ్రూక్ (20 బంతుల్లో 47 నాటౌట్; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు), బెయిర్‌స్టో (18 బంతుల్లో 31; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించారు. అనంతరం నమీబియా విజయ లక్ష్యాన్ని డక్‌వర్త్ లూయిస్ పద్ధతి ప్రకారం 10 ఓవర్లలో 126 పరుగులుగా నిర్దేశించారు. అయితే నమీబియా 10 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 84 పరుగులకే పరిమితమైంది. మైకేల్ వాన్ లింగెన్ (29 బంతుల్లో 33; 1 ఫోర్, 3 సిక్స్‌లు), డేవిడ్ వీస్ (12 బంతుల్లో 27; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), నికోలస్ డావిన్ (16 బంతుల్లో 18; 1 ఫోర్, 1 సిక్స్) పోరాడినా లాభం లేకపోయింది.

గ్రాస్ ఐలెట్: మాజీ చాంపియన్ ఆస్ట్రేలియా టి20 ప్రపంచకప్ గ్రూప్ 'బి'లో సంపూర్ణ ఆధిపత్యంతో లీగ్ దశను ముగించింది. ఆడిన 4 మ్యాచ్‌లలోనూ ఆ జట్టు విజయం సాధించింది. ఆదివారం జరిగిన పోరులో ఆసీస్ 5 వికెట్ల తేడాతో స్కాట్లాండ్‌ను ఓడించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన స్కాట్లాండ్ 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 180 పరుగులు చేసింది. మెక్‌ములెన్ (34 బంతుల్లో 60; 2 ఫోర్లు, 6 సిక్స్‌లు) అర్ధ సెంచరీ సాధించగా... కెప్టెన్ రిచీ బెరింగ్టన్ (31 బంతుల్లో 42 నాటౌట్; 1 ఫోర్, 2 సిక్స్‌లు), జార్జ్ మున్సే (23 బంతుల్లో 35; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు) రాణించారు. అనంతరం ఆస్ట్రేలియా 19.4 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 186 పరుగులు సాధించి గెలిచింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' స్టొయినిస్ (29 బంతుల్లో 59; 9 ఫోర్లు, 2 సిక్స్‌లు), హెడ్ (49 బంతుల్లో 68; 5 ఫోర్లు, 4 సిక్స్‌లు) హాఫ్ సెంచరీలు నమోదు చేశారు. డేవిడ్ వార్నర్ (1), కెప్టెన్ మిచెల్ మార్ష్ (8), మ్యాక్స్‌వెల్ (11) విఫలం కాగా... స్టొయినిస్, ట్రవిస్ హెడ్ నాలుగో వికెట్‌కు 44 బంతుల్లో 80 పరుగులు జోడించి జట్టును గెలుపు దిశగా నడిపించారు. చివర్లో విజయానికి 26 పరుగుల దూరంలో స్టొయినిస్ వెనుదిరిగినా... టిమ్ డేవిడ్ (14 బంతుల్లో 24 నాటౌట్; 2 ఫోర్లు, 1 సిక్స్) చెలరేగి మరో 2 బంతులు మిగిలి ఉండగానే మ్యాచ్‌ను ముగించాడు.



స్టొయినిస్

ఆర్చరీలో భారత్‌కు ఒలింపిక్ బెర్త్

క్వాలిఫయింగ్ టోర్నీలో భజన్ కౌర్‌కు స్వర్ణం



భజన్ కౌర్

అంటాల్యా (టర్కీ): మహిళల ఆర్చరీ రికర్వ్ వ్యక్తిగత విభాగంలో భారత్‌కు పారిస్ ఒలింపిక్స్ బెర్త్ ఖరారైంది. చివరి క్వాలిఫయింగ్ టోర్నీలో భాగంగా ఆదివారం జరిగిన ఈవెంట్‌లో భారత ఆర్చర్ భజన్ కౌర్ స్వర్ణ పతకం సాధించడంతోపాటు ఒలింపిక్ బెర్త్‌ను అందించింది. ఫైనల్లో భజన్ కౌర్ 6-2 (28-26, 29-29, 29-26, 29-29)తో మొబీనా ఫలా (ఇరాన్)పై విజయం సాధించింది. భారత స్టార్ ఆర్చర్ 'ట్రిపుల్ ఒలింపియన్' దీపిక కుమారి నిరాశ పరిచింది. నేరుగా మూడో రౌండ్ మ్యాచ్ ఆడిన ప్రపంచ మాజీ నంబర్‌వన్ దీపిక 4-6 (28-26, 27-25, 23-26, 24-25, 27-29)తో యెలాగుల్ రమజనోవా (అజర్‌బైజాన్) చేతిలో ఓడిపోయింది. భారత్‌కే చెందిన అంకిత 4-6 (27-27, 27-28, 29-27, 27-27, 28-29)తో మొబీనా ఫలా (ఇరాన్) చేతిలో పరాజయం పాలైంది. ఇప్పటికే పురుషుల వ్యక్తిగత విభాగంలో ధీరజ్ బొమ్మదేవర భారత్‌కు ఒలింపిక్ బెర్త్‌ను అందించాడు. ఫలితంగా పారిస్ ఒలింపిక్స్‌లో భారత్ మిక్స్‌డ్ విభాగంలోనూ పోటీపడే అవకాశాన్ని దక్కించుకుంది.

పాకిస్తాన్ చచ్చీ చెడి...

3 వికెట్లతో ఐర్లాండ్‌పై విజయం

లాడర్‌హిల్ (ఫ్లోరిడా): పేలవ ఆటతో 'సూపర్-8' అవకాశాలు కోల్పోయిన పాకిస్తాన్ చివరి లీగ్ మ్యాచ్‌లోనూ అతి కష్టమ్మీద నెగ్గి టి20 వరల్డ్ కప్‌ను ముగించింది. ఆదివారం జరిగిన గ్రూప్ 'ఎ' చివరి లీగ్ మ్యాచ్‌లో పాక్ 3 వికెట్ల తేడాతో ఐర్లాండ్‌పై విజయం సాధించింది. టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఐర్లాండ్ 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 106 పరుగులు చేసింది. గారెత్ డెలానీ (19 బంతుల్లో 31; 1 ఫోర్, 3 సిక్స్‌లు) టాప్ స్కోరర్ కాగా, జోష్ లిటిల్ (18 బంతుల్లో 22 నాటౌట్; 2 ఫోర్లు, 1 సిక్స్) ఫర్వాలేదనిపించాడు. పాక్ బౌలర్లలో ఇమాద్ వసీమ్, షాహిన్ అఫ్రిది చెరో 3 వికెట్లు పడగొట్టగా... ఆమిర్‌కు 2 వికెట్లు దక్కాయి. అనంతరం పాక్ 18.5 ఓవర్లలో 7 వికెట్లకు 111 పరుగులు చేసి గెలిచింది. ఒకవైపు జట్టు వరుసగా వికెట్లు కోల్పోయినా... కెప్టెన్ బాబర్ ఆజమ్ (34 బంతుల్లో 32 నాటౌట్; 2 ఫోర్లు) చివరి వరకు నిలవగా, 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' షాహిన్ అఫ్రిది (5 బంతుల్లో 13 నాటౌట్; 2 సిక్స్‌లు) జట్టును గట్టెక్కించాడు.

టి20 ప్రపంచకప్‌లో నేడు

బంగ్లాదేశ్ X నేపాల్
వేదిక: కింగ్స్‌టౌన్; ఉదయం గం. 5 నుంచి
నెదర్లాండ్స్ X శ్రీలంక
వేదిక: గ్రాస్ ఐలెట్; ఉదయం గం. 6 నుంచి
న్యూజిలాండ్ X పాపువా న్యూగినీ
వేదిక: ట్రినిడాడ్; రాత్రి గం. 8 నుంచి
స్టార్ స్పోర్ట్స్, హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

'యూరో'లో ఇటలీ శుభారంభం



బస్తోని

డార్ట్‌మండ్ (జర్మనీ): యూరో కప్ ఫుట్‌బాల్ టోర్నీలో ఇటలీ జట్టు శుభారంభం చేసింది. అల్బేనియాతో జరిగిన గ్రూప్ 'బి' తొలి మ్యాచ్‌లో ఇటలీ 2-1తో గెలిచింది. ఆట మొదలైన 23 సెకన్లకే అల్బేనియా ప్లేయర్ బజ్రామి గోల్ చేయడంతో చేశాడు. 64 ఏళ్ల ఈ టోర్నీ చరిత్రలో అత్యంత వేగంగా నమోదైన గోల్ ఇదే కావడం విశేషం. తొలి నిమిషంలో గోల్ సమర్పించుకున్న ఇటలీ వెంటనే తేరుకుంది. 11వ నిమిషంలో బస్తోని... 16వ నిమిషంలో బరెల్లా ఒక్కో గోల్ చేయడంతో ఇటలీ 2-1తో ఆధిక్యంలోకి వెళ్లింది. హాంబర్గ్‌లో జరిగిన గ్రూప్ 'డి' మ్యాచ్‌లో నెదర్లాండ్స్ జట్టు 2-1తో పోలాండ్‌ను ఓడించగా... స్టుట్‌గార్ట్‌లో డెన్మార్క్, స్లొవేనియా జట్ల మధ్య గ్రూప్ 'సి' మ్యాచ్ 1-1తో 'డ్రా' అయింది.

భవిత

విద్య, ఉద్యోగ సమాచారం

ఎన్‌పీసీఐఎల్, ముంబైలో 58 అసిస్టెంట్ గ్రేడ్-1 పోస్టులు

ముంబైలోని న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(ఎన్‌పీసీఐఎల్).. వివిధ విభాగాల్లో అసిస్టెంట్ గ్రేడ్-1 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 58
» పోస్టుల వివరాలు: అసిస్టెంట్ గ్రేడ్-1(హెచ్ఆర్)-29, అసిస్టెంట్ గ్రేడ్-1 (ఎఫ్-ఎ)-17, అసిస్టెంట్ గ్రేడ్-1(సి-ఎంఎం)-12.
» అర్హత: కనీసం 50% మార్కులతో ఏదైనా బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. వయసు: 25.06.2024 నాటికి 21 నుంచి 28 ఏళ్ల మధ్య ఉండాలి.
» పే స్కేల్: నెలకు రూ.38,250.
» ఎంపిక విధానం: రాతపరీక్ష, టైప్ రైటింగ్ టెస్ట్, కంప్యూటర్ ప్రొఫీషియన్సీ టెస్ట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది: 05.06.2024
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:25.06.2024
» వెబ్‌సైట్: https://npcilcareers.co.in

జేఎన్ఏఎఫ్ఏ యూనివర్శిటీ, హైదరాబాద్‌లలో బీఎఫ్ఏ, బీడిజైన్ కోర్సుల్లో ప్రవేశాలు

హైదరాబాద్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్(జేఎన్ఏఎఫ్ఏ) యూనివర్శిటీ.. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి జేఎన్ఏఎఫ్ఏయూ, అనుబంధ కళాశాలల్లో బ్యాచిలర్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్, బ్యాచిలర్ ఆఫ్ డిజైన్ కోర్సుల్లో ప్రవేశాలకు ఫైన్ ఆర్ట్స్ అండ్ డిజైన్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్(ఎఫ్ఏడీఈఈ)ని నిర్వహిస్తోంది.

కోర్సులు, సీట్ల వివరాలు

» బీఎఫ్ఏ(అప్లైడ్ ఆర్ట్ అండ్ విజువల్ కమ్యూనికేషన్)-50 సీట్లు.
» బీఎఫ్ఏ(పెయింటింగ్)-35 సీట్లు.
» బీఎఫ్ఏ(స్కల్‌ప్చర్)-20 సీట్లు.
» బీఎఫ్ఏ(యానిమేషన్ అండ్ వీఎఫ్ఎక్స్)-60 సీట్లు. » బీఎఫ్ఏ(ఫోటోగ్రఫీ అండ్ విజువల్ కమ్యూనికేషన్)-50 సీట్లు.
» బీడిజైన్(ఇంటీరియర్ డిజైన్)-60 సీట్లు.
» కోర్సు వ్యవధి: నాలుగేళ్లు.
» అర్హత:ఇంటర్మీడియట్ లేదా తత్సమానం ఉత్తీర్ణత

ముఖ్య సమాచారం

» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తు చివరితేది: 04.07.2024.
» రూ.2000 ఆలస్య రుసుముతో దరఖాస్తులకు చివరితేది: 10.07.2024.
» ప్రవేశ పరీక్ష తేదీలు: 20-21.07.2024
» వెబ్‌సైట్: https://jnafauadmissions.com

మేటి సంస్థల్లో ప్రవేశాలకు.. జోసా

» ఐఐటీలు, నిట్‌ల్లో అడ్మిషన్స్ ప్రారంభం
» ఆన్‌లైన్ విధానంలో జోసా కౌన్సెలింగ్
» మెయిన్స్, అడ్వాన్స్‌డ్ ఉత్తీర్ణులకు అర్హత
» ఆరు రౌండ్లలో కౌన్సెలింగ్, సీట్ల కేటాయింపు
» జూన్ 20న తొలి విడత కేటాయింపు

జేఈఈ-మెయిన్స్, అడ్వాన్స్‌డ్‌ల్లో అర్హత సాధించిన విద్యార్థులు ఐఐటీ, ఎన్ఐటీల్లో ప్రవేశాలకు సర్వం సిద్ధమైంది. జోసా(జాయింట్ సీట్ అలోకేషన్ అథారిటీ) ఆన్‌లైన్ కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. అభ్యర్థులు చేయాల్సిందల్లా.. తమకు ఆసక్తి ఉన్న బ్రాంచ్‌లు, ఇన్‌స్టిట్యూట్స్ ప్రాథమ్యాలను అప్రమత్తంగా పేర్కొనడమే! దాని ఆధారంగా.. ఆటోమేటిక్‌గా సీట్ అలాట్‌మెంట్ జరుగుతుంది. ఈ నేపథ్యంలో..జోసా-2024 కౌన్సెలింగ్ ప్రక్రియ, ఇన్‌స్టిట్యూట్స్, సీట్లు, అర్హతలు తదితర వివరాలు..

దేశ వ్యాప్తంగా ఉన్న ఐఐటీలు, ఎన్ఐటీలు, ట్రిపుల్ ఐటీలు, సీఎఫ్‌టీఐలలో బీటెక్, ఇంటిగ్రేటెడ్ బీటెక్+ఎంటెక్ తదితర ప్రోగ్రామ్‌లతో ప్రవేశానికి ఉమ్మడి ప్రవేశ విధానమే.. జోసా కౌన్సెలింగ్. ఈ ఏడాది 23 ఐఐటీలు, 32 ఎన్ఐటీలు సహా మొత్తం 121 ఇన్‌స్టిట్యూట్స్‌లో సీట్ల భర్తీకి కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఐఐటీల్లో ప్రవేశాలకు జేఈఈ అడ్వాన్స్‌డ్, నిట్‌లు తదితర ఇన్‌స్టిట్యూట్స్‌లో అడ్మిషన్స్‌కు జేఈఈ మెయిన్ ర్యాంకు ఆధారంగా ప్రవేశం కల్పిస్తారు.

రిజిస్ట్రేషన్ తప్పనిసరి

జోసా ఆన్‌లైన్ కౌన్సెలింగ్ ప్రక్రియలో పాల్గొనే జేఈఈ మెయిన్, అడ్వాన్స్‌డ్ ఉత్తీర్ణులు తప్పనిసరిగా.. జోసా వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకుని తమ వివరాలు పొందుపరచాలి. ఆ తర్వాత తమ ఆసక్తి మేరకు కోర్సు, ఇన్‌స్టిట్యూట్ ప్రాథమ్యాలను ఆన్‌లైన్‌లోనే పేర్కొనాల్సి ఉంటుంది. ఇలా ప్రాథమ్యాలను పేర్కొనడాన్నే ఛాయిస్ ఫిల్లింగ్ అని పిలుస్తారు. ఆన్‌లైన్‌లో ప్రాథమ్యాలను పేర్కొన్న తర్వాత.. విద్యార్థులు ఎంచుకున్న కోర్సు, ఇన్‌స్టిట్యూట్.. అందుబాటులో ఉన్న సీట్ల ఆధారంగా సీటు కేటాయింపు జరుగుతుంది.

ఉదాహరణకు.. ఒక విద్యార్థి మొదటి ప్రాథమ్యంగా ఐఐటీ-ముంబైలోని సీఎస్ఈ బ్రాంచ్‌ను, రెండో ప్రాథమ్యంగా ఐఐటీ-ఢిల్లీలోని సీఎస్ఈ బ్రాంచ్‌ను ఎంచుకుంటే.. ఆ విద్యార్థి పొందిన ర్యాంకు ఆధారంగా ఐఐటీ-ముంబైలో సీటు లభించకపోతే.. ఐఐటీ-ఢిల్లీలోని సీటుకు పరిగణనలోకి తీసుకుంటారు.ఇలా అడ్వాన్స్‌డ్ ఉత్తీర్ణులు మొత్తం 23 ఐఐటీల్లో తమకు ఆసక్తి ఉన్న కోర్సు, ప్రాథమ్యాలను వరుస క్రమంలో పేర్కొనాల్సి ఉంటుంది.

రిజిస్ట్రేషన్ టు ఛాయిస్ ఫిల్లింగ్

జోసా ప్రక్రియలో భాగంగా విద్యార్థులు ముందుగా జోసా వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకుని, లాగిన్-ఐడీ, పాస్‌వర్డ్‌లను క్రియేట్ చేసుకోవాలి. ఆ తర్వాత అందుబాటులో ఉన్న ఇన్‌స్టిట్యూట్‌లు, ప్రోగ్రామ్‌లు, సీట్లను బేరీజు వేసుకుంటూ.. తమ ఆసక్తికి అనుగుణంగా ప్రాథమ్యాలను పేర్కొనాలి. ఇలా ఆన్‌లైన్‌లో నిర్దేశిత గడువు తేదీలోగా ఛాయిస్ ఫిల్లింగ్ పూర్తి చేసిన విద్యార్థులకు.. ముందుగా వారిచ్చిన ప్రాథమ్యాల ఆధారంగా మాక్ సీట్ అలొకేషన్ (నమూనా సీటు కేటాయింపు) వివరాలను అందుబాటులో ఉంచుతారు. ఫలితంగా విద్యార్థులు ఇచ్చిన ఆప్షన్ల ఆధారంగా సీటు వచ్చే అవకాశం ఉన్న ఇన్‌స్టిట్యూట్‌లు, బ్రాంచ్‌ల వివరాలు తెలుస్తాయి. మాక్ సీట్ అలొకేషన్ జాబితాను బేరీజు వేసుకున్న విద్యార్థులు..

తమ ర్యాంకుకు ఇంకా మంచి ఇన్‌స్టిట్యూట్‌లో సీటు వస్తుందనుకుంటే.. తమ ఆప్షన్లను మార్చుకునే వెసులుబాటు కూడా కల్పిస్తారు. ఇలా.. రెండు సార్లు మాక్ సీట్ అలొకేషన్ జాబితాను అందుబాటులో ఉంచనున్నారు. మాక్ సీట్ అలొకేషన్ చూసుకుని ఆప్షన్లను మార్చుకునేందుకు గడువు ఇస్తారు. ఆ తర్వాత సీట్ల కేటాయింపు ప్రక్రియ ప్రారంభమవుతుంది.

ఆరు రౌండ్లలో కౌన్సెలింగ్


- జోసా కౌన్సెలింగ్ ప్రక్రియ మొత్తం ఆరు రౌండ్లలో జరుగుతుంది. అభ్యర్థులు మొదటి రౌండ్ నుంచి ఆరో రౌండ్ వరకు కౌన్సెలింగ్‌లో పాల్గొనొచ్చు.
- మొదటి రౌండ్‌లో లభించిన సీటు, ఇన్‌స్టిట్యూట్‌పై ఆసక్తి లేకపోతే ఇతర ఇన్‌స్టిట్యూట్‌లకు తమ దరఖాస్తును పరిగణించే విధంగా.. తదుపరి రౌండ్లలో కౌన్సెలింగ్‌లో పాల్గొనే అవకాశం ఉంది. ఇందుకోసం ఫ్రీజ్, ఫ్లోట్, స్లైడ్‌లను ఎంచుకోవచ్చు.
- **ఫ్రీజ్:** విద్యార్థులు తొలి రౌండ్‌లోనే తమకు సీటు లభించిన ఇన్‌స్టిట్యూట్, ప్రోగ్రామ్‌తో సంతృప్తి చెందితే ఫ్రీజ్ ఆప్షన్‌ను ఎంపిక చేసుకోవాలి. దీంతో తదుపరి రౌండ్లకు విద్యార్థుల ఛాయిస్‌లను పరిగణనలోకి తీసుకోరు. తొలిదశలో సీటు లభించిన ఇన్‌స్టిట్యూట్‌లోనే సీట్ యాక్సెప్టెన్స్ తెలియజేయాల్సి ఉంటుంది.
- **ఫ్లోట్:** మొదటి రౌండ్‌లో వచ్చిన సీటు నచ్చకపోతే.. మరింత మంచి ఇన్‌స్టిట్యూట్ లేదా బ్రాంచ్ కోసం ఫ్లోటింగ్ ఆప్షన్‌ను ఎంపిక చేసుకోవచ్చు. ఫలితంగా ఆ విద్యార్థి ప్రాథమ్యాలను మిగతా రౌండ్లకు పరిగణనలోకి తీసుకుంటారు.
- **స్లైడ్:** మొదటి రౌండ్‌లోనే నిర్దిష్టంగా ఒక ఇన్‌స్టిట్యూట్‌లో ఒక బ్రాంచ్‌లో సీటు వచ్చిన విద్యార్థి.. అదే ఇన్‌స్టిట్యూట్‌లో మరో బ్రాంచ్‌లో సీటు కోరుకుంటే.. స్లైడింగ్ ఆప్షన్‌ను ఎంపిక చేసుకోవాలి. ఇలా ఫ్లోటింగ్, స్లైడింగ్ ఆప్షన్‌లు పేర్కొనడం వల్ల అభ్యర్థులకు చివరగా కేటాయించిన సీట్లే ఖరారవుతాయి. తొలిదశలో లేదా అంతకుముందు దశల్లో వచ్చిన సీట్లు రద్దవుతాయి.

ఆన్‌లైన్‌లో సీటు కేటాయింపు

జోసా ఆన్‌లైన్ కౌన్సెలింగ్ ప్రక్రియలో పాల్గొన్న విద్యార్థులు ఎంచుకున్న ప్రాథమ్యాలు, పొందిన ర్యాంకు ఆధారంగా ఆన్‌లైన్‌లోనే సీటు కేటాయిస్తారు. జోసా ప్రక్రియలో పాల్గొన్న విద్యార్థులు తమకు కేటాయించిన సీటుకు యాక్సెప్టెన్స్ ఇవ్వకపోతే సీటు రద్దవుతుంది. మొత్తం ఆరు రౌండ్లలో జరిగే సీటు అలొకేషన్ ప్రక్రియలో భాగంగా.. ప్రతి రౌండ్ సీట్ అలొకేషన్ తర్వాత నిర్దిష్ట గడువు తేదీలోగా సీటు లభించిన ఇన్‌స్టిట్యూట్‌కు ఆన్‌లైన్ రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుంది. ఇలా రిపోర్ట్ చేయకపోతే సీటు రద్దవుతుంది.

యాక్సెప్ట్, విత్‌డ్రా అవకాశం

జోసా ఆన్‌లైన్ కౌన్సెలింగ్‌లో యాక్సెప్ట్, విత్ డ్రా అవకాశం ఉంది. సీట్లు లభించిన విద్యార్థులు.. ప్రతి రౌండ్ తర్వాత సీటు యాక్సెప్టెన్స్ లేదా ఉపసంహరణ విషయాన్ని స్పష్టం చేయాలి. మొత్తం ఆరు రౌండ్ల కౌన్సెలింగ్‌లో అయిదో రౌండ్ వరకే ఉపసంహరణ అవకాశం ఉంటుంది. అంటే.. అయిదో రౌండ్ సీట్ అలొకేషన్‌ను చూసుకుని అప్పుడు మాత్రమే ఉపసంహరణ అవకాశాన్ని వినియోగించుకోవచ్చు. చివరి రౌండ్ (ఆరో రౌండ్)లో ఈ ఉపసంహరణ అవకాశం ఉండదు.



సీట్ యాక్సెప్టెన్స్ ఫీజు

జోసా కౌన్సెలింగ్ విధానంలో సీటు పొందిన అభ్యర్థులు తప్పనిసరిగా సీట్ యాక్సెప్టెన్స్ ఫీజును చెల్లించాలి. దీన్ని కూడా ఆన్‌లైన్ విధానంలో నెట్ బ్యాంకింగ్ లేదా డెబిట్ కార్డ్ లేదా ఎస్‌బీఐ ఈ-చలాన్ రూపంలో మాత్రమే చెల్లించాలి. ఐఐటీల్లో సీటు పొందిన జనరల్ కేటగిరీ విద్యార్థులు రూ.35 వేలు; ఎస్‌సీ, ఎస్‌టీ, పీడబ్ల్యూడీ విద్యార్థులు రూ.17,500 వేలు చొప్పున యాక్సెప్టెన్స్ ఫీజు చెల్లించాలి. తర్వాత దశలో చివరగా తాము ప్రవేశం పొందిన ఇన్‌స్టిట్యూట్‌కు అనుగుణంగా అకడమిక్ ఫీజులు చెల్లించాల్సి ఉంటుంది. ఈ అకడమిక్ ఫీజుల్లోంచి అప్పటికే చెల్లించిన యాక్సెప్టెన్స్ ఫీజును మినహాయిస్తారు.

వినూత్న కోర్సులు

ఐఐటీల్లో సీఎస్ఈ, ఈసీఈ, ఈఈఈ, మెకానికల్, సివిల్, మెటలర్జికల్ వంటి కోర్సులతోపాటు ఏఐ అండ్ ఎంఎల్, డేటా సైన్స్, డేటా అనలిటిక్స్ వంటి ప్రోగ్రామ్‌లు కూడా అందుబాటులో ఉంటున్నాయి. వీటితోపాటు ఇటీవల కాలంలో పలు ఐఐటీలు మెడ్‌టెక్ కోర్సులను సైతం అందిస్తున్నాయి. బయోటెక్నాలజీ, బయోమెడికల్ ఇంజనీరింగ్, బయోసైన్స్ వంటి కోర్సులు ఉన్నాయి.

వేల సంఖ్యలో సీట్లు

- 23 ఐఐటీల్లో 17,740 సీట్లు.
- 32 ఎన్ఐటీల్లో 24, 229 సీట్లు.
- 26 ట్రిపుల్ ఐటీల్లో 8,546 సీట్లు.
- కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని 40 ఇతర సాంకేతిక ఇన్‌స్టిట్యూట్స్‌లో 9,402.

జోసా- 2024.. ముఖ్య తేదీలు

- **జూన్ 10:** జోసా వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్, ఛాయిస్ ఫిల్లింగ్ ప్రక్రియ ప్రారంభం.
- **జూన్ 15:** మాక్ సీట్ అలొకేషన్(సీట్ల కేటాయింపు నమూనా జాబితా)-1 విడుదల. (జూన్ 14 రాత్రి పది గంటల వరకు అభ్యర్థులు పేర్కొన్న ప్రాథమ్యాల ఆధారంగా దీన్ని విడుదల చేస్తారు.)
- **జూన్ 17:** మాక్ సీట్ అలొకేషన్ (సీట్ల కేటాయింపు నమూనా జాబితా)-2 విడుదల. (ఈ జాబితాను జూన్ 16 సాయంత్రం అయిదు గంటల వరకు పేర్కొన్న ప్రాథ్యమాల ఆధారంగా వెల్లడించనున్నారు).
- **జూన్ 18:** ఛాయిస్ ఫిల్లింగ్, క్యాండిడేట్ రిజిస్ట్రేషన్ చివరి తేదీ.
- **జూన్ 19:** వివరాల పునస్సమీక్ష, పరిశీలన.
- **జూన్ 20:** మొదటి రౌండ్ సీట్ల కేటాయింపు.
- **జూన్ 20-24:** మొదటి రౌండ్‌లో సీట్లు పొందిన విద్యార్థులు ఆన్‌లైన్‌లో రిపోర్టింగ్ చేయాలి. అదే విధంగా యాక్సెప్టెన్స్ ఫీజును చెల్లించాలి. నిర్దేశిత డాక్యుమెంట్లను అప్‌లోడ్ చేయాలి.
- **జూన్ 27:** రెండో దశ సీట్ల కేటాయింపు
- **జూన్ 27- జూలై 1:** రెండో రౌండ్‌లో సీట్లు పొందిన విద్యార్థులు ఆన్‌లైన్ రిపోర్టింగ్, ఫీజు పేమెంట్, డాక్యుమెంట్ల అప్‌లోడ్. అదే విధంగా.. రెండో రౌండ్‌లో పొందిన సీటు విషయంలో ఉపసంహరణ లేదా కౌన్సెలింగ్ ప్రక్రియ నుంచి విరమించుకునే అవకాశం.
- **జూలై 4:** మూడో రౌండ్ సీట్ల కేటాయింపు.
- **జూలై 4-8:** మూడో రౌండ్ సీట్ల కేటాయింపునకు సంబంధించి ఆన్‌లైన్ రిపోర్టింగ్, ఫీజు పేమెంట్, డాక్యుమెంట్ అప్‌లోడ్.
- **జూలై 5:** మూడో రౌండ్ తర్వాత సీటు ఉపసంహరణ లేదా కౌన్సెలింగ్ ప్రక్రియ నుంచి ఉపసంహరణ.
- **జూలై 10:** నాలుగో రౌండ్ సీట్ల కేటాయింపు.
- **జూలై 10-15:** నాలుగో రౌండ్‌కు సంబంధించి ఆన్‌లైన్ రిపోర్టింగ్, ఫీజు పేమెంట్, డాక్యుమెంట్ అప్‌లోడ్.
- **జూలై 11-15:** నాలుగో రౌండ్ తర్వాత సీటు ఉపసంహరణ లేదా కౌన్సెలింగ్ నుంచి ఉపసంహరణ అవకాశం.
- **జూలై 17:** అయిదో రౌండ్ సీట్ల కేటాయింపు. ఐఐటీల్లో సీట్ల కేటాయింపునకు సంబంధించి అయిదో రౌండ్‌ను చివరి రౌండ్‌గా పేర్కొన్నారు.
- **జూలై 17-22:** అయిదో రౌండ్‌కు సంబంధించి ఆన్‌లైన్ రిపోర్టింగ్, డాక్యుమెంట్ అప్‌లోడ్, ఫీజు పేమెంట్.
- **జూలై 17-23:** ఎన్ఐటీ+ సిస్టమ్ పేరుతో ఎన్ఐటీల్లో సీట్ల కేటాయింపు రౌండ్.
- **జూలై 24-జూలై 26:** ఎన్ఐటీ + సిస్టమ్ విధానంలో పొందిన సీటుకు సంబంధించి ఆన్‌లైన్ రిపోర్టింగ్, ఫీజు చెల్లింపు.
- పూర్తి వివరాలకు వెబ్‌సైట్: https://josaa.nic.in

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు		
సెన్సెక్స్	▲ 182	76,993
నిఫ్టీ	▲ 67	23,466

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు			
నాస్‌డాక్	17,689	▲	21
డోజోన్స్	38,589	▽	58
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,147	▽	17
డాక్స్	18,002	▽	264
హాంగ్‌సెంగ్	3,033	▲	4
నికాయ్	38,815	▲	94

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్


ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	83.09	84.11
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	105.06	107.62
€	యూరో	ఎస్‌బీఐ	88.82	91.18
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	52.62	53.78
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	54.11	56.04
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	59.40	64.08
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.37	22.93
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.85	23.63
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.40	12.47

ఒకరికి రెండు పాలసీలు.. క్లెయిమ్ ఎలా?

హెల్త్ ఇన్సూరెన్స్ ప్రాధాన్యం గురించి ఎంత చెప్పినా తక్కువే. ఇటీవలి కాలంలో వేతన జీవుల్లో చాలా మంది రెండు హెల్త్ పాలసీలు తీసుకునేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. దీనివల్ల అదనపు ప్రయోజనాలు కూడా ఉన్నాయి. కొన్ని క్లిష్ట పరిస్థితుల్లో చికిత్స వ్యయం బీమా కవరేజీని మించిపోయే ప్రమాదం ఉంటుంది. అలాంటి సందర్భాలను ఒకటికి మించిన పాలసీలతో సులభంగా గట్టెక్కొచ్చు. కానీ, ఒకటి కంటే ఎక్కువ పాలసీలు ఉంటే క్లెయిమ్ ఎలా చేయాలనే విషయంలో చాలా మంది అయోమయాన్ని ఎదుర్కొంటూ ఉంటారు. ఈ విషయంలో నిపుణుల సూచనలు అందించే కథనమిది.

- ఆస్పత్రి బిల్లు పాలసీ పరిధి దాటినప్పుడే..
- ముందుగా ఒక పాలసీ కిందే క్లెయిమ్
- అది పరిష్కారమైన తర్వాత రెండో దానికి చాన్స్
- నగదు రహితం లేదా రీయింబర్స్‌మెంట్
- ఆస్పత్రిలో చేరితే రెండు సంస్థలకూ చెప్పాల్సిందే



గతంలో వేరు..

ఒక వ్యక్తికి ఒకటికి మించిన బీమా సంస్థల నుంచి హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీలు ఉంటే, క్లెయిమ్ మొత్తాన్ని ఆయా సంస్థలు సమానంగా భరించాలనే నిబంధన లోగడ ఉండేది. 2013లో దీన్ని బీమా రంగ నియంత్రణ, అభివృద్ధి సంస్థ (ఐఆర్‌డీఏఐ) తొలగించింది. దీంతో ఇప్పుడు ఒకటికి మించిన హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీలు కలిగి ఉన్నా కానీ, పాలసీదారు తనకు నచ్చిన చోట లేదంటే రెండు సంస్థల వద్దా క్లెయిమ్ దాఖలు చేసుకోవచ్చు.

ఒకరికి ఎన్ని ప్లాన్లు?

అసలు ఒకటికి మించి హెల్త్ పాలసీలు ఎందుకు? అనే సందేహం రావచ్చు. ఒక్కొక్కరి అవసరాలే దీన్ని నిర్ణయిస్తాయి. ప్రైవేటు రంగంలో పనిచేసే వారికి పనిచేస్తున్న సంస్థ నుంచి గ్రూప్ హెల్త్ కవరేజీ సాధారణంగా ఉంటుంది. ఉన్నట్టుండి ఉద్యోగం నుంచి తప్పుకోవాల్సి వచ్చినా లేదంటే ఉద్యోగం కోల్పోయిన సందర్భాల్లో.. తిరిగి ఉపాధి లభించేందుకు కొంత సమయం పట్టొచ్చు. కంపెనీలు కల్పించే గ్రూప్ హెల్త్ కవరేజీ.. ఉద్యోగానికి రాజీనామా చేయడంతోనే ముగిసిపోతుంది. అందుకే వ్యక్తిగతంగా మరో ప్లాన్ కలిగి ఉంటే, ఉద్యోగం లేని సమయంలోనూ ఉపయోగపడుతుంది. వైద్య చికిత్సల వ్యయాలు గణనీయంగా పెరిగిపోతున్న తరుణంలో రెండు ప్లాన్లను కలిగి ఉండడం మంచి నిర్ణయమే అవుతుంది. లేదంటే బేస్ ప్లాన్ ఒకటి తీసుకుని, దానిపై మరింత మెరుగైన కవరేజీతో సూపర్ టాపప్ ప్లాన్ జోడించుకోవడం మరొక మార్గం.



క్లెయిమ్ ఎలా?

రెండు ప్లాన్లు కలిగిన వారు ఆస్పత్రిలో చేరిన తర్వాత రెండు బీమా సంస్థలకు తప్పనిసరిగా సమాచారం అందించాలి. ఒకటికి మించిన సంస్థల నుంచి హెల్త్ ఇన్సూరెన్స్ ప్లాన్లు కలిగి ఉంటే, అప్పుడు ముందుగా ఒక బీమా సంస్థకు ప్రతిపాదనలు పంపిస్తే సరిపోతుంది. నగదు రహిత, రీయింబర్స్‌మెంట్ మార్గాల్లో దేనినైనా వినియోగించుకోవచ్చు. క్లెయిమ్ మొత్తం ఒక హెల్త్ ప్లాన్ కవరేజీ దాటనప్పుడు ఒక బీమా సంస్థ వద్దే దరఖాస్తు చేసుకుంటే సరిపోతుంది. కానీ, ఒక పాలసీ కవరేజీకి మించి ఆస్పత్రి బిల్లు వచ్చినప్పుడు, రెండో బీమా సంస్థ వద్ద మిగిలిన మొత్తాన్ని క్లెయిమ్ చేసుకోవాలి. అంతే కానీ, ఒకేసారి ఒకే క్లెయిమ్‌ను రెండు సంస్థల వద్ద దాఖలు చేసేందుకు అవకాశం లేదు. ఉదాహరణకు రూ.5 లక్షల చొప్పున రెండు ప్లాన్లు ఉన్నాయని అనుకుందాం. ఆస్పత్రి బిల్లు రూ.7 లక్షలు వచ్చింది. అప్పుడు తొలుత ఒక సంస్థ వద్ద క్లెయిమ్ దాఖలు చేయాలి. అక్కడి నుంచి వచ్చిన చెల్లింపులు మినహాయించి, అప్పుడు మిగిలిన మొత్తానికి రెండో బీమా సంస్థ నుంచి పరిహారం కోరాలి. ఒక పాలసీలో రూమ్‌రెంట్ పరంగా పరిమితులు ఉండి, దానివల్ల క్లెయిమ్ పూర్తిగా రాని సందర్భాల్లోనూ.. మిగిలిన మొత్తాన్ని రూమ్‌రెంట్ పరిమితులు లేని మరో పాలసీ కింద క్లెయిమ్ చేసుకోవచ్చు. కొన్ని పాలసీల్లో రూమ్ రెంట్, కొన్ని చికిత్సలకు పరిమితులు ఉంటాయి. ముఖ్యంగా గ్రూప్ హెల్త్ ప్లాన్లలో ఇవి చూడొచ్చు. అలాంటప్పుడు రూ.5 లక్షల కవరేజీ ఉన్నప్పటికీ పూర్తి మొత్తం రాకపోవచ్చు. ఉదాహరణకు రూ.7లక్షల ఆస్పత్రి బిల్లుకు సంబంధించి రూ. 5 లక్షల గ్రూప్ పాలసీలో రూ.4 లక్షలే క్లెయిమ్ కింద వచ్చిందని అనుకుంటే.. అప్పుడు మిగిలిన రూ. 3 లక్షలను రెండో పాలసీ కింద రీయింబర్స్‌మెంట్ కోరవచ్చు. ఒక బీమా సంస్థ క్లెయిమ్ దరఖాస్తును తిరస్కరించినా, రెండో బీమా సంస్థను సంప్రదించవచ్చు. వేతన జీవులు పనిచేసే సంస్థ నుంచి గ్రూప్ హెల్త్ ప్లాన్, వ్యక్తిగతంగా ఫ్యామిలీ ఫ్లోటర్ లేదా ఇండివిడ్యువల్ ప్లాన్ కలిగి ఉన్నప్పుడు.. మొదట గ్రూప్ హెల్త్ ప్లాన్ నుంచి క్లెయిమ్‌కు వెళ్లడం మంచి ఆప్షన్. గ్రూప్ హెల్త్ ప్లాన్‌లో క్లెయిమ్ సెటిల్‌మెంట్ సులభంగా ఉంటుంది. క్లెయిమ్ మొత్తం ఒక బీమా పాలసీ కవరేజీ పరిధిలోనే ఉంటే ఒక్క సంస్థ వద్దే క్లెయిమ్‌కు పరిమితం కావాలి. దీనివల్ల రెండో ప్లాన్‌లో నో క్లెయిమ్ బోనస్ నష్టపోకుండా చూసుకోవచ్చు.



నగదు రహిత చికిత్స

బీమా సంస్థ నెట్‌వర్క్ పరిధిలోని అన్ని ఆస్పత్రుల నుంచి నగదు రహిత చికిత్స తీసుకోవచ్చు. ఏ ఆస్పత్రిలో అయినా నగదు రహిత చికిత్సకు బీమా సంస్థలు నేడు అవకాశం కల్పిస్తున్నాయి. కాకపోతే ఆస్పత్రి నిషేధిత జాబితాలో లేని వాటికే ఈ సదుపాయం పరిమితమని గుర్తుంచుకోవాలి. రెండు ప్లాన్లలోనూ నగదు రహిత చికిత్సకు వెళ్లొచ్చు. కానీ, ఒక సంస్థ నుంచే నగదు రహిత క్లెయిమ్‌కు ఆస్పత్రులు ప్రాధాన్యం ఇస్తుంటాయి. మిగిలిన మొత్తం కోసం రీయింబర్స్‌మెంట్ విధానానికి వెళ్లాలని సూచిస్తుంటాయి. అలాంటప్పుడు నగదు రహిత విధానంలో గరిష్ఠ పరిమితి మేరకే ఒక బీమా సంస్థ నుంచి చెల్లింపులు లభిస్తాయి. అప్పుడు మిగిలిన మొత్తాన్ని సొంతంగా చెల్లించి, దాన్ని రాబట్టుకునేందుకు రెండో బీమా సంస్థను సంప్రదించాలి. దీనికోసం మొదట క్లెయిమ్ చేసిన బీమా సంస్థ నుంచి 'క్లెయిమ్ సెటిల్‌మెంట్ సమ్మరీ' తీసుకోవాలి. అలాగే, హాస్పిటల్ బిల్లులు, చికిత్సకు సంబంధించి అన్ని పత్రాల ఫొటో కాపీలను సర్టిఫై (అటెస్టేషన్) చేసి ఇవ్వాలని మొదటి బీమా సంస్థను కోరాలి. వీటితో రెండో బీమా సంస్థ వద్ద రీయింబర్స్‌మెంట్ క్లెయిమ్ దరఖాస్తు దాఖలు చేసుకోవాలి. రెండు బీమా సంస్థల వద్ద రీయింబర్స్‌మెంట్ విధానంలో క్లెయిమ్ చేసుకోవాలన్నా సరే.. మొదట ఒక సంస్థ వద్ద క్లెయిమ్ దాఖలు చేయాల్సి ఉంటుంది. ఇందుకోసం ఆస్పత్రి నుంచి అన్ని బిల్లుల కాపీలు, డిశ్చార్జ్ సమ్మరీ, ల్యాబ్ రిపోర్ట్‌లు తీసుకుని బీమా సంస్థకు సమర్పించాలి. క్లెయిమ్ ఆమోదం అనంతరం, క్లెయిమ్ సెటిల్‌మెంట్ సమ్మరీతోపాటు, అన్ని డాక్యుమెంట్ల ఫొటో కాపీలతో రెండో సంస్థ వద్ద రీయింబర్స్‌మెంట్ క్లెయిమ్ దాఖలు చేసుకోవాల్సి ఉంటుంది. రీయింబర్స్‌మెంట్ క్లెయిమ్ దాఖలుకు కాలపరిమితి ఉంటుంది. ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయిన తర్వాత 15–30 రోజులు దాటకుండా క్లెయిమ్ దాఖలు చేసుకోవాలి.

రీయింబర్స్‌మెంట్‌కు కావాల్సిన డాక్యుమెంట్లు

డిశ్చార్జ్ సమ్మరీ, నగదు/కార్డు ద్వారా చెల్లింపులకు సంబంధించి రసీదులు, ల్యాబ్ రిపోర్ట్‌లు, వైద్యులు రాసిచ్చిన ప్రిస్క్రిప్షన్లు, ఎక్స్‌రే ఫిల్మ్‌లు, క్లెయిమ్ సెటిల్‌మెంట్ సమ్మరీ.

ఏడాదిలో ఎన్ని క్లెయిమ్‌లు?

ఏడాదిలో ఎన్ని క్లెయిమ్‌లు అన్న దానితో సంబంధం లేకుండా, గరిష్ఠ బీమా కవరేజీ పరిధిలో ఎన్ని విడతలైనా పరిహారం పొందొచ్చు. కొన్ని బీమా సంస్థలు క్లెయిమ్‌ల సంఖ్య పరంగా పరిమితులు విధించొచ్చు. కనుక పాలసీ వర్డింగ్స్ డాక్యుమెంట్‌ను తప్పకుండా చదివి ఈ సందేహాన్ని నివృత్తి చేసుకోవాలి.

రెండు రకాల పాలసీలు

హెల్త్ ఇన్సూరెన్స్ సాధారణంగా రెండు రకాలు. ఇండెమ్నిటీ ఒక రకం అయితే, ఫిక్స్‌డ్ బెనిఫిట్‌తో కూడినవి రెండో రకం. ఇండెమ్నిటీ పాలసీలు ఆస్పత్రిలో చేరి తీసుకునే చికిత్సలతోపాటు.. ఎంపిక చేసిన డేకేర్ ప్రొసీజర్స్ (చికిత్స తర్వాత అదే రోజు విడుదలయ్యేవి)కు మాత్రమే కవరేజీ ఇస్తాయి. ఇక క్రిటికల్ ఇల్‌నెస్ పాలసీలను ఫిక్స్‌డ్ బెనిఫిట్ పాలసీలుగా చెబుతారు. ఇందులో కేన్సర్, గుండె జబ్బులు, మూత్ర పిండాల వైఫల్యం, కాలేయ వైఫల్యం తదితర తీవ్ర వ్యాధుల్లో ఏదైనా నిర్ధారణ అయిన వెంటనే నిర్ణీత పరిహారాన్ని బీమా సంస్థలు ఒకే విడత చెల్లించేస్తాయి. కనుక క్లెయిమ్ విషయంలో ఈ రెండింటి పరంగా గందరగోళం అక్కర్లేదు. ఇండెమ్నిటీ ప్లాన్, క్రిటికల్ ఇల్‌నెస్ ప్లాన్ రెండూ కలిగిన వారు.. ఏదైనా తీవ్ర వ్యాధి (క్రిటికల్ ఇల్‌నెస్) బారిన పడినప్పుడు ఇండెమ్నిటీ ప్లాన్ కింద కవరేజీ పొందొచ్చు. అలాగే, వ్యాధి నిర్ధారణ పత్రాలతో క్రిటికల్ ఇల్‌నెస్ ప్లాన్ కింద క్లెయిమ్ దాఖలు చేసి పూర్తి ప్రయోజనాన్ని అందుకోవచ్చు. దీనివల్ల ఆయా వ్యాధులకు సంబంధించి ఎదురయ్యే భారీ వ్యయాలను తట్టుకోవడం సాధ్యపడుతుంది.

టాపప్, సూపర్ టాపప్ ప్లాన్లు

ఇక హెల్త్ ఇన్సూరెన్స్‌లో టాపప్, సూపర్ టాపప్ ప్లాన్లు కూడా ఉంటాయి. ఇందులో సూపర్ టాపప్ ఎక్కువ అనుకూలం. ఇవి డిడక్టిబుల్ క్లాజుతో వస్తాయి. ఉదాహరణకు రూ.5 లక్షల కవరేజీతో హెల్త్ ఇన్సూరెన్స్ ప్లాన్ తీసుకున్న వారు, రూ.50 లక్షల సూపర్ టాపప్ ప్లాన్ కూడా జోడించుకున్నారని అనుకుందాం. ఆస్పత్రి బిల్లు మొదటి రూ.5 లక్షలు దాటిన తర్వాతే సూపర్ టాపప్ ప్లాన్ కింద కవరేజీ పొందగలరు. రూ.50 లక్షల వరకు బిల్లు ఎంత వచ్చినా సరే.. మొదటి రూ.5 లక్షలకు సూపర్ టాపప్‌లో పరిహారం రాదు. దాన్ని సొంతంగా భరించడం లేదంటే బేస్ ప్లాన్ నుంచి కవరేజీ తీసుకోవాల్సి ఉంటుంది. నేరుగా రూ.50 లక్షల బేస్ ఇండెమ్నిటీ ప్లాన్‌తో పోల్చితే.. రూ.5–10 లక్షల మేర బేస్ ప్లాన్ తీసుకుని, 50 లక్షలకు సూపర్ టాపప్ తీసుకోవడం వల్ల ప్రీమియం భారం కొంత తగ్గుతుంది.



డెట్ ఫండ్సా.. ఫిక్స్‌డ్ డిపాజిట్లా..?



Q & A

ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రిసెర్చ్

డెట్ మ్యుచువల్ ఫండ్స్‌తో పోలిస్తే స్మాల్ ఫైనాన్స్ బ్యాంకుల్లో ఫిక్సిడ్ డిపాజిట్లు సురక్షితంగానే ఉంటాయా? డెట్ ఫండ్స్‌లో ఉండే అదనపు ప్రయోజనాలు ఏమిటి?

– రాంబాబు, వైజాగ్

చెప్పాలంటే ఒక రకంగా రెండూ సురక్షితమైనవే. అయితే, డైవర్సిఫికేషన్ ప్రయోజనాలు ఉండటం వల్ల డెట్ మ్యుచువల్ ఫండ్స్ మరికాస్త ఎక్కువగా సురక్షితమైనవిగా పరిగణిస్తారు. అంటే, దానర్థం స్మాల్ ఫైనాన్స్ బ్యాంకుల్లో డిపాజిట్లు రిస్కులతో కూడుకున్నవని కాదు. ఈ బ్యాంకులు రిజర్వ్ బ్యాంక్ ఆజమాయిషీలో ఉంటాయి. నిర్దిష్టమైన ప్రమాణాలు పాటిస్తేనే వాటికి లైసెన్సులు లభిస్తాయి. వీటిలో రూ. 5 లక్షల వరకు డిపాజిట్లకు డిపాజిట్ ఇన్సూరెన్స్ అండ్ క్రెడిట్ గ్యారంటీ కార్పొరేషన్ (డీఐసీజీసీ) నుంచి బీమా భద్రత కూడా ఉంటుంది. ఇక డెట్ ఫండ్స్ విషయానికొస్తే వాటిలోనూ ప్రయోజనాలు ఉంటాయి. అవేమిటంటే, డైవర్సిఫికేషన్: మీరు ఒక రూ. 5 లక్షలు డెట్ ఫండ్‌లో పెట్టారనుకోండి. దీన్ని సదరు ఫండ్ 50 వేర్వేరు డెట్ సాధనాల్లో ఇన్వెస్ట్ చేస్తుంది. ఒకవేళ ఏదో ఒక సాధనం డిఫాల్ట్ అయినా కూడా మీ పోర్ట్‌ఫోలియోపై నామమాత్రంగా 3–4 శాతం మేర మాత్రమే ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉంటుంది. రెండోది, ట్యాక్స్ ప్రయోజనాలు: ఫిక్స్‌డ్ డిపాజిట్లకు భిన్నంగా మ్యుచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్‌మెంట్‌ను అమ్మినప్పుడు మాత్రమే పన్నులు చెల్లించాల్సి ఉంటుంది. కానీ ఎఫ్‌డీలపై పోగుపడిన వడ్డీపై ఏటా ట్యాక్స్ వర్తిస్తుంది. మూడోది.. లిక్విడిటీ: డెట్ ఫండ్స్‌లో మరింత ఎక్కువ లిక్విడిటీ ఉంటుంది. ఎఫ్‌డీల్లాగా నిర్దిష్ట వ్యవధికి కమిట్ కావాల్సిన అవసరం ఉండదు. ముందస్తుగా విత్‌డ్రా చేసుకుంటే పెనాల్టీని ఎదుర్కొనాల్సిన అవసరం లేకుండా మీ పెట్టుబడులను ఎప్పుడైనా విత్‌డ్రా చేసుకోవచ్చు. అయితే, డెట్ ఫండ్స్‌తో రాబడులకు గ్యారంటీ అంటూ ఉండదు. కానీ స్మాల్ ఫైనాన్స్ బ్యాంకుల్లో ఎఫ్‌డీలపై రాబడికి మాత్రం హామీ ఉంటుంది.

నేను యాక్సిస్ మిడ్ క్యాప్, యాక్సిస్ బ్లూచిప్, మిరే అసెట్ ట్యాక్స్ సేవర్‌లో గత 1–2 ఏళ్ల నుంచి ఇన్వెస్ట్ చేస్తున్నాను. రాబడులు కూడా సంతృప్తికరంగానే ఉన్నాయి. కానీ, కొన్ని కంపెనీలు 100–200 శాతం దాకా రాబడులు ఇచ్చాయి. ఇలాంటప్పుడు అధిక రాబడుల కోసం ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేయాలా లేదా నేరుగా షేర్లలోనే ఇన్వెస్ట్ చేయాలా?

– సురేష్, కరీంనగర్

ఈ మూడు ఫండ్స్ కూడా మంచివే. అయితే, మీకు రావాల్సిన రాబడుల్లో మూడింట రెండొంతుల వాటా యాక్సిస్ ఫండ్‌తో ముడిపడి ఉంది. ఒకవేళ ఈ ఫండ్ హౌస్ విషయంలో ఏవైనా తేడాలు వస్తే ఆ మేరకు మీ రాబడులపైనా ప్రభావం పడొచ్చు. కాబట్టి యాక్సిస్‌కి సంబంధించి ఏదో ఒకదాన్ని అట్టే పెట్టుకుని మీ పోర్ట్‌ఫోలియోలో మూడో ఫండ్ కోసం ఇతరత్రా ఏదైనా మరో ఫండ్‌హౌస్‌ను ఎంచుకుంటే డైవర్సిఫికేషన్ మెరుగ్గా ఉండవచ్చు. రిస్కులూ కొంత తగ్గవచ్చు. ఇక నేరుగా షేర్లలో ఇన్వెస్ట్ చేస్తే వచ్చే రాబడులను, ఫండ్స్‌లో పెట్టుబడులు పెట్టడంతో పోల్చి చూడలేం. ఒకవేళ ఫండ్ పనితీరును చూడాలంటే దానికి సమానమైన ఇండెక్స్‌తో పోల్చి చూడాలి. ఉదాహరణకు మిడ్ క్యాప్ ఫండ్ పనితీరును మిడ్ క్యాప్ ఇండెక్స్‌తో పోల్చి చూడొచ్చు. మరోవైపు, పెట్టుబడుల పోర్ట్‌ఫోలియోలో డైవర్సిఫికేషన్ ముఖ్యం. మీరు ఏదో ఒకటో రెండో సంస్థల షేర్లలో ఇన్వెస్ట్ చేస్తే సరిపోదు. వైవిధ్యాన్ని పాటించాలంటే కనీసం 10–20 కంపెనీల్లో ఇన్వెస్ట్ చేయాల్సి ఉంటుంది. ఇలా చేయడం వల్ల రాబడులు కొంత తగ్గొచ్చు కానీ రిస్కు కూడా తగ్గుతుంది. కచ్చితంగా 200 శాతం రాబడినిస్తుందనే కంపెనీ షేరును గుర్తించి, పట్టుకోవడమూ కష్టం. ఒకవేళ నిజంగానే ఏదైనా కంపెనీ 200 శాతం రిటర్ను ఇస్తోందంటే.. అది చాలా తక్కువ వ్యవధిలోనే ఏకంగా 60–70 శాతానికి పైగా పడిపోయి ఉండొచ్చు. రిటైల్ ఇన్వెస్టరుకు ఇలాంటి పతనాలు చాలా ఆందోళన కలిగిస్తాయి. డైవర్సిఫికేషన్ ప్రయోజనాల కోసం మ్యుచువల్ ఫండ్‌లను ఎందుకు ఎంచుకోవచ్చంటే, ఇవి ఏదో 1–2 కంపెనీల స్టాక్స్‌లో మాత్రమే ఇన్వెస్ట్ చేయడం కాకుండా కాస్త విస్తృతంగా ఇన్వెస్ట్ చేయడం వల్ల రిస్కులు తగ్గే అవకాశం ఉంటుంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

17-6-2024	
విశాఖ	500–00
చిత్తూరు	573–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	475–00
విజయవాడ	480–00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	490–00
వరంగల్	492–00
రిటైల్ ధర	5.50

కనిష్ట శ్లాబు వారికి ఐటీ ఊరట కల్పించాలి

- రాబోయే బడ్జెట్‌లో పరిశీలించాలి...
- కేంద్రానికి సీఐఐ ప్రెసిడెంట్ సంజీవ్ పురి విజ్ఞప్తి



న్యూఢిల్లీ: ద్రవ్యోల్బణం అధికంగా ఉన్న నేపథ్యంలో తక్కువ స్థాయి శ్లాబ్‌లో ఉన్న ఆదాయపు పన్ను చెల్లింపుదారులకు ఊరట కల్పించే అంశాన్ని బడ్జెట్‌లో పరిశీలించాలని పరిశ్రమల సమాఖ్య సీఐఐకి కొత్త ప్రెసిడెంట్‌గా ఎన్నికైన సంజీవ్ పురి కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. భూ, కార్మిక, విద్యుత్, వ్యవసాయ రంగ సంస్కరణలన్నింటిని అమలు చేసేందుకు కేంద్రం, రాష్ట్రాల మధ్య ఏకాభిప్రాయ సాధన కోసం సంస్థాగత వేదికను ఏర్పాటు చేయాలని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రధాని నరేంద్ర మోదీ మూడో దఫా ప్రభుత్వం సంస్కరణలను అమలు చేయడానికి సంకీర్ణ రాజకీయాలనేవి అడ్డంకులు కాబోవని భావిస్తున్నట్లు పురి చెప్పారు. ఇప్పటికే రెండు విడతల్లో విధానాలను విజయవంతంగా అమలు చేయడం, దేశ ఎకానమీ మెరుగ్గా రాణిస్తుండటం వంటి అంశాలు తదుపరి సంస్కరణలను వేగవంతం చేసేందుకు దన్నుగా ఉండగలవని ఆయన పేర్కొన్నారు.

ఫండ్ స్ట్రీట్

బరోడా బీఎన్‌పీ పారిబా మాన్యుఫాక్చరింగ్ ఫండ్

దేశ తయారీ రంగ వృద్ధి అవకాశాలను ఇన్వెస్టర్లు అందిపుచ్చుకునేందుకు వీలు కల్పించేలా బరోడా బీఎన్‌పీ పారిబా మ్యుచువల్ ఫండ్ కొత్తగా మాన్యుఫాక్చరింగ్ ఫండ్‌ను ఆవిష్కరించింది. ఈ న్యూ ఫండ్ ఆఫర్ (ఎన్‌ఎఫ్‌వో) జూన్ 24న ముగుస్తుంది. నేరుగా తయారీ కార్యకలాపాల్లో నిమగ్నమైన సంస్థలు, దిగుమతుల స్థానాన్ని భర్తీ చేసే లక్ష్యం గలవి, ఎగుమతులు చేసేందుకు ఏర్పడ్డవి, దేశీయంగా కొత్త తయారీ ప్లాంట్లలో ఇన్వెస్ట్ చేసేవి, కొత్త టెక్నాలజీ అభివృద్ధికి తోడ్పడేవి అయిన లిస్టెడ్ తయారీ సంస్థల్లో ఈ ఫండ్ ఇన్వెస్ట్ చేస్తుంది. దేశ జీడీపీలో తయారీ రంగ వాటాను 17 శాతం నుంచి 25 శాతానికి పెంచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో ఈ విభాగానికి గణనీయంగా వృద్ధి అవకాశాలు ఉన్నాయని బరోడా బీఎన్‌పీ పారిబా మ్యుచువల్ ఫండ్ సీఈవో సురేష్ సోని తెలిపారు.

ఆదిత్య బిర్లా సన్ లైఫ్ క్వాంట్ ఫండ్

ఆదిత్య బిర్లా సన్ లైఫ్ ఏఎంసీ కొత్తగా క్వాంట్ ఫండ్‌ను ఆవిష్కరించింది. ఇది జూన్ 24న ముగుస్తుంది. క్వాంట్ ఫండ్‌కి సంబంధించి సంస్థ స్వయంగా రూపొందించిన క్వాంటిటేటివ్ మోడల్ ఆధారంగా లార్జ్, మిడ్ క్యాప్ కేటగిరీ స్టాక్స్‌ను వివిధ ప్రమాణాల ప్రకారం వడబోస్తారు. చివరికి కొన్ని షేర్లను ఎంపిక చేసి, వాటిలో ఇన్వెస్ట్ చేస్తారు. పెట్టుబడుల పోర్ట్‌ఫోలియో ఇటు మనిషి అటు మెషిన్ పర్యవేక్షణలో ఉండటం వల్ల ఈ విధానంలో భావోద్వేగాల కారణంగా జరిగే తప్పిదాలకు ఆస్కారం తక్కువని, రిస్కు మేనేజ్‌మెంట్ మెరుగ్గా ఉంటుందని సంస్థ ఎండీ ఎ. బాలసుబ్రమణియన్ తెలిపారు.

స్టాక్స్ వ్యూ

సైయెంట్ డీఎల్‌ఎం	జేఎమ్ ఫైనాన్షియల్	కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 690 టార్గెట్: రూ. 887



ఎందుకంటే: ఐటీ కంపెనీ సైయెంట్ ఏర్పాటు చేసిన సైయెంట్ డీఎల్‌ఎం ప్రధానంగా డిజైన్ ఆధారిత తయారీ సొల్యూషన్లు అందిస్తోంది. గత ఆర్థిక సంవత్సరం(2023–24) చివరి త్రైమాసికం(క్యూ4)లో అంచనాలకు అనుగుణమైన ఫలితాలు ప్రకటించింది. వెరసి గతేడాది జనవరి–మార్చి (క్యూ4)లో మొత్తం ఆదాయం 30 శాతం జంప్‌చేసి రూ. 360 కోట్లను తాకింది. ఇందుకు 78 శాతం వార్షిక వృద్ధి సాధించిన రక్షణ రంగ విభాగం, 52 శాతం పురోగతి అందుకున్న ఏరోస్పేస్ బిజినెస్ ప్రధానంగా దోహదం చేశాయి. 26 శాతం ఎగసిన మెడికల్ విభాగం సైతం మద్దతిచ్చినప్పటికీ.. ఇండస్ట్రియల్ వెర్టికల్ 57 శాతం క్షీణతను చవిచూసింది. త్రైమాసికవారీగా (క్యూ3తో పోలిస్తే) 15 శాతం వెనకడుగు వేసింది. అయితే స్థూల మార్జిన్లు 0.3 శాతం బలపడి 23.9 శాతానికి చేరాయి. ఇందుకు ఆదాయ మిక్స్‌లో మార్పులు తోడ్పాటునిచ్చాయి. కానీ నిర్వహణ లాభ (ఇబిటా) మార్జిన్లు దాదాపు 1 శాతం నీరసించాయి. ప్రధానంగా టీమ్ నిర్మాణంపై పెట్టుబడులు ప్రభావం చూపాయి. కొత్త లోగో (కంపెనీ)లను జత కలుపుకోవడం, గ్లోబల్ సానుకూలతలు, విలువ జోడింపు సర్వీసుల పెంపు వంటి అంశాలు కంపెనీకి బలాన్నిస్తున్నాయి. అధిక మార్జిన్ల విభాగంలో విస్తరణ, ఎగుమతుల వాటా పుంజుకోవడం తదితర అంశాలతో మార్జిన్లు మెరుగుపడనున్నాయి. ఐపీవో నిధులను కంపెనీ ఇకపై వినియోగించుకునేందుకు వీలుంది. ఈ నేపథ్యంలో రెండేళ్ల (2025–26) కాలానికి కంపెనీ ఆదాయం వార్షికంగా 31 శాతం, ఇబిటా 43 శాతం, నికర లాభం 60 శాతం చొప్పున వృద్ధి చెందగలవని భావిస్తున్నాం. ఇబిటా లాభ మార్జిన్లు 9.6 శాతం, 11.1 శాతం స్థాయిలో నమోదుకావచ్చని అంచనా.

ఎస్‌బీఐ లైఫ్	బీఎన్‌పీ పారిబా	కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 1,467 టార్గెట్: రూ. 2,450



ఎందుకంటే: బీమా రంగ కంపెనీ ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ గతేడాది (2023–24) చివరి త్రైమాసికం (క్యూ4)లో యాజమాన్య అంచనాలకు అనుగుణమైన ఫలితాలు ప్రకటించింది. జనవరి–మార్చి (క్యూ4)లో 28.1 శాతం వీఎన్‌బీ మార్జిన్లు సాధించింది. త్రైమాసికవారీగా ఇవి దాదాపు యథాతథం కాగా.. హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ 0.2 శాతం, ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ 2.1 శాతం చొప్పున మార్జిన్లు నీరసించాయి. అయితే వార్షికంగా చూస్తే ఎస్‌బీఐ లైఫ్ మార్జిన్లు 2 శాతం క్షీణించాయి. ఇందుకు ప్రధానంగా యులిప్ వైపు ప్రొడక్టులలో మార్పులు చేపట్టడం ప్రభావం చూపింది. నాన్ పార్, రక్షణ మిక్స్ బిజినెస్ వెనకడుగు వేయడం కూడా మార్జిన్ల క్షీణతకు కారణమైంది. ఇక ఏపీఈ వార్షికంగా 17 శాతం వృద్ధిని అందుకోవడం.. హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ నమోదు చేసిన 8 శాతం క్షీణతతో పోలిస్తే పటిష్టమనే చెప్పవచ్చు. అధిక బేస్ నేపథ్యంలోనూ ఐపీఆర్‌యూ 9.6 శాతం పురోగతి సాధించడం సైతం ప్రోత్సాహకరమే. కాగా.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024–25)లో ఏపీఈ గతేడాది స్థాయిలో అంటే 17 శాతం వార్షిక వృద్ధిని అందుకోగలదని యాజమాన్యం అంచనా వేస్తోంది. గతేడాది వీఎన్‌బీ 9.5 శాతం వార్షిక వృద్ధి మా అంచనా 13 శాతాని కంటే బాగా తక్కువ కాగా.. ఇందుకు 0.9 శాతం మార్జిన్ల క్షీణత, అధిక సింగిల్ ప్రీమియం యాన్యుటీ మిక్స్ ప్రభావం చూపాయి. అయితే ఈ ఏడాది మార్జిన్లు బలపడగలవని కంపెనీ భావిస్తోంది. యులిప్‌ల నుంచి వ్యక్తిగత రక్షణ (ప్రొటక్షన్), నాన్‌పార్ వైపు దృష్టి పెట్టడం కలసి రాగలదని పేర్కొంటోంది. నియంత్రణ సంబంధిత నిబంధనల్లో సవరణలు, యాజమాన్య నిర్మాణంలో కంపెనీ పనితీరుపై ప్రభావం చూపగల మార్పులు వంటి అంశాలు కీలక రిస్కులుగా పరిగణించవచ్చు.

గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు వివిధ బ్రోకరేజీ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

మెరైన్ హోంగార్డ్ సాహసం

- అలల్లో చిక్కుకున్న కుటుంబాన్ని కాపాడిన షేక్ మస్తాన్



సింగరాయకొండ: అలల ఉధృతిలో చిక్కుకున్న కుటుంబాన్ని మెరైన్ హోంగార్డ్ కాపాడిన సంఘటన ఆదివారం ప్రకాశం జిల్లా పాకల బీచ్‌లో చోటుచేసుకుంది. మెరైన్ ఏఎస్సై పి.వెంకటేశ్వర్లు కథనం ప్రకారం.. కనిగిరికి చెందిన మూలకంటి వెంకటేశ్వర్లు కేబుల్ డిష్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నారు. ఆదివారం కావడంతో భార్య అను, పదేళ్ల కుమార్తెతో కలిసి సముద్ర స్నానానికి వచ్చారు. ఆ సమయంలో అలల ఉధృతి బాగా ఉండటంతో వీరు ముగ్గురు అలల తాకిడికి బయటకు రాలేక తీవ్ర ఇబ్బంది పడ్డారు. దీన్ని గమనించిన ఏఎస్సై వెంకటేశ్వర్లు వెంటనే హోం గార్డు షేక్ మస్తాన్‌ను అప్రమత్తం చేయడంతో అతను వెళ్లి ఆ ముగ్గురిని కాపాడి ఒడ్డుకు చేర్చారు. ఆదివారం కావడంతో పాకల తీరం పర్యాటకులతో సందడిగా మారింది.

ప్రజలందరికీ మెరుగైన వైద్య సేవలే లక్ష్యం

- రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రజలందరికీ మెరుగైన వైద్య సేవలు అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. ఆయన మంత్రిగా వెలగపూడిలోని సచివాలయంలో ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సత్యకుమార్ మాట్లాడుతూ పీహెచ్‌సీల నుంచి అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని చెప్పారు. ఆశా, ఏఎన్‌ఎం, విలేజ్ క్లినిక్స్ ద్వారా గ్రామస్థాయిలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా చూస్తామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 18 ఏళ్లలోపు పిల్లలు, విద్యార్థులకు స్క్రీనింగ్ చేపట్టడానికి సంబంధించిన ఆర్‌బీఎస్‌కే ఫైలుపై తొలి సంతకం చేసినట్లు వివరించారు. క్యాన్సర్ నియంత్రణ చర్యల్లో భాగంగా ప్రజలకు వ్యాధిపై అవగాహన కల్పించడంతోపాటు ప్రాథమిక దశలోనే గుర్తించడం కోసం స్క్రీనింగ్ కార్యక్రమం నిర్వహణకు సంబంధించిన ఫైలుపై రెండో సంతకం పెట్టానని తెలిపారు.

డీసీయూబీ డిపాజిటర్ల ఆందోళన

- బ్యాంక్ లావాదేవీలు నిలిపివేయాలని రెండేళ్ల క్రితమే ఆర్బీఐ ఆదేశాలు
- డిపాజిటర్ల కన్నీటిపర్యంతం
- 6 నెలలు ఓపిక పడితే ఆర్బీఐ నిబంధనలను సడలిస్తుందంటున్న సీఈఓ



విద్యాధరపురం బ్రాంచి వద్ద సమావేశమైన డిపాజిటర్లు

భవానీపురం (విజయవాడ పశ్చిమ): విజయవాడలోని దుర్గా కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ (డీసీయూబీ)లో డిపాజిట్ చేసిన వారి పరిస్థితి ఆందోళనకరంగా మారింది. కాలపరిమితి ముగిసినా డిపాజిట్లను తిరిగి ఇవ్వకపోవడంతో డిపాజిటర్లు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎవరికి చెప్పుకోవాలో తెలియని స్థితిలో కన్నీటి పర్యంతం అవుతున్నారు. రుణాలు తీసుకున్న వారినుంచి రావాల్సిన మొండి బకాయిలు వసూలు చేయకపోవడంతో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డీసీయూబీ లావాదేవీలను నిలిపివేస్తూ 2022 జూలై 29న ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో విజయవాడ విద్యాధరపురం నాలుగు స్తంభాల సెంటర్‌లో గల డీసీయూబీ బ్రాంచి వద్ద పలువురు డిపాజిటర్లు ఆదివారం సమావేశమయ్యారు. దాదాపు 92 ఏళ్ల చరిత్ర గల ఈ బ్యాంక్‌తో 40–50 అనుబంధం ఉన్నవారు రూ.6 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు డిపాజిట్లు చేశారు. వారికి సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు మద్దతుగా నిలిచారు. డిపాజిటర్లలో ఒకరైన ఎస్.లక్ష్మీకనకదుర్గ కుమారుడు సత్యకుమార్ మాట్లాడుతూ.. ఇక్కడ డిపాజిట్ చేసిన వారిలో అంతా 50–60 ఏళ్లు పైబడిన వారేనని తెలిపారు. ఓ మహిళ తన కుమార్తె వివాహం నిమిత్తం రూ.7 లక్షలు డిపాజిట్ చేసిందని, ఆ మొత్తం తిరిగి ఇవ్వకపోవడంతో ఆమె పరిస్థితి దయనీయంగా మారిందని వివరించారు. బ్యాంక్ సిబ్బంది డిపాజిటర్లు ఏమైనా అడిగితే దురుసుగా వ్యవహరిస్తున్నారని వాపోయారు. రుణాలు తీసుకున్న ఖాతాదారుల నుంచి రావల్సిన బకాయిలను వసూలు చేయలేక డిపాజిట్లను తిరిగి ఇవ్వకపోవడం దుర్మార్గమన్నారు.

6 నెలల్లో కొలిక్కి రావచ్చు

బ్యాంక్‌లో పేరుకుపోయిన మొండి బకాయిల కారణంగా ఆర్బీఐ లావాదేవీలను నిలిపివేస్తూ ఆదేశాలిచ్చిందని బ్యాంక్ సీఈఓ బంకా శ్రీనివాసరావు తెలిపారు. డిపాజిటర్లు ఇబ్బందులు పడుతున్న మాట వాస్తవమేనని.. మొండి బకాయిలు ఉన్నవారి ఆస్తులను స్వాధీనం చేసుకుని వేలం ద్వారా వసూలు చేయాలని ఆర్‌బీఐ ఆదేశించిందన్నారు. డిపాజిటర్లకు చెల్లించాల్సిన మొత్తం రూ.40 కోట్ల నుంచి రూ.50 కోట్ల వరకుఉండగా.. మొండి బకాయిలు రూ.240 కోట్ల నుంచి రూ.250 కోట్ల వరకు ఉన్నాయన్నారు. డిపాజిటర్లు మరో 6 నెలలు ఓపిక పడితే అంతా సర్దుకుంటుందని, ఆర్బీఐ నిబంధనలను సడలించవచ్చన్నారు. అప్పుడు మెచ్యూర్ అయిన డిపాజిట్లను తిరిగి చెల్లిస్తామని, ఆందోళన చెందవద్దన్నారు.

జూలైలో జీశాట్–ఎన్2 ప్రయోగం

సూళ్లూరుపేట(తిరుపతి జిల్లా): భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో), భారత అంతరిక్ష వాణిజ్య విభాగానికి చెందిన న్యూ స్పేస్ ఇండియా లిమిటెడ్ సంస్థ సహకారంతో జూలై నెలాఖరులో జీశాట్-ఎన్2 (జీశాట్-20) అనే ఉపగ్రహాన్ని ప్రయోగించనున్నారు. సుమారు ఐదు టన్నుల బరువు (4,700 కిలోలు) కలిగిన ఈ ఉపగ్రహాన్ని స్పేస్ ఎక్స్ సంస్థకు చెందిన ప్రయోగ వేదిక నుంచి ఫాల్కన్ రాకెట్ ద్వారా ప్రయోగించేందుకు సిద్ధమవుతున్నారు. దేశంలోని మారుమూల రాష్ట్రాల్లో అన్ని ప్రాంతాలకు బ్రాండ్‌బ్యాండ్, ఇన్-ఫ్లైట్ సేవలను అందించేందుకు ఇస్రోలోని ప్రొఫెసర్ యూఆర్ రావు శాటిలైట్ సెంటర్‌లో ఈ ఉపగ్రహాన్ని తయారుచేశారు. ఈ ఉపగ్రహం భూమికి 36 కిలోమీటర్ల ఎత్తులోని భూస్థిర కక్ష్యలో ఉండి 15 ఏళ్లపాటు సేవలు అందించే విధంగా రూపొందించారు. ఇది పూర్తిస్థాయి కమ్యూనికేషన్ ఉపగ్రహం కావడం విశేషం. ఇప్పటివరకు పంపిన కమ్యూనికేషన్ శాటిలైట్స్ ఒక ఎత్తయితే ఈ జీశాట్-ఎన్2 ఉపగ్రహం మాత్రమే ఒక ఎత్తు అని ఇస్రో పేర్కొంది. ఇప్పటికే ఉపగ్రహాన్ని రూపొందించి క్లీన్‌రూంలో పరీక్షలు పూర్తిచేశారు.



జీశాట్-ఎన్2 ఉపగ్రహానికి క్లీన్‌రూంలో పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

వైబ్రేషన్ పరీక్షలను కూడా విజయవంతంగా నిర్వహించారు. ఇస్రోకి ఇది వాణిజ్యపరమైన ప్రయోగం కావడం విశేషం.

బంగాళాఖాతంలో ఆవర్తనం

- రెండురోజులు విస్తారంగా వానలు
- విస్తరించనున్న రుతుపవనాలు

సాక్షి, విశాఖపట్నం: నైరుతి బంగాళాఖాతంలో పశ్చిమ మధ్య బంగాళాఖాతానికి ఆనుకుని ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. ఇది సముద్రమట్టానికి 3.1 కిలోమీటర్ల నుంచి 7.6 కిలోమీటర్ల ఎత్తువరకు విస్తరించి ఉంది. దీని ప్రభావంతో రానున్న రెండురోజులు రాష్ట్రంలో విస్తారంగా వానలు కురవనున్నాయి. అనేకచోట్ల తేలికపాటి వర్షాలు, కొన్నిచోట్ల మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) తెలిపింది. సోమవారం అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, కాకినాడ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, నంద్యాల, శ్రీసత్యసాయి, వైఎస్సార్, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో, మంగళవారం అల్లూరి, శ్రీసత్యసాయి, వైఎస్సార్, తిరుపతి, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి, వైఎస్సార్, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో వర్షాలకు ఆస్కారం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ వివరించింది. అదే సమయంలో ఉరుములు, మెరుపులతో పాటు పిడుగులు పడే ప్రమాదం ఉందని, గంటకు 30–40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని పేర్కొంది. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు కాకినాడలో అత్యధికంగా 8.3 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది.

పుట్టగొడుగు @ 5 కిలోలు



కుందుర్పి: పుట్టగొడుగులు సాధారణంగా చాలా చిన్నగా ఉంటాయి. పది పుట్టగొడుగులు కలిపినా 500 గ్రాములు బరువు ఉండవు. కానీ, అనంతపురం జిల్లా కుందుర్పి మండలం జానంపల్లిలో రైతు వడ్డే హనుమంత రాయుడు వ్యవసాయ పొలంలో ఆదివారం ఐదు కిలోల బరువు ఉన్న పుట్టగొడుగు లభించింది. సహజసిద్ధంగా భూమిలో నుంచి ఈ పుట్టగొడుగు బయటకు వచ్చింది. ఇంత పెద్ద పుట్టగొడుగుని తానెప్పుడూ చూడలేదని రైతు హనుమంత రాయుడు చెప్పాడు. పరిశోధన కోసం ఆ పుట్టగొడుగును మండల వ్యవసాయాధికారి మహేష్‌కు రైతు అప్పగించాడు. దాన్ని కళ్యాణదుర్గంలోని కృషి విజ్ఞాన కేంద్రానికి తరలించారు.

భారీ వర్షంతో విమానాల రాకపోకలకు అంతరాయం

విమానాశ్రయం (గన్నవరం): భారీ వర్షం కారణంగా గన్నవరం విమానాశ్రయంలో ఆదివారం విమానాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. బెంగళూరు నుంచి ఇండిగో విమానం షెడ్యూల్ ప్రకారం సాయంత్రం 6.20 గంటలకు గన్నవరం రావాల్సి ఉంది. అయితే విజయవాడ పరిసర ప్రాంతానికి చేరుకునే సమయంలో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం ప్రారంభమైంది. వాతావరణం అనుకూలించకపోవడంతో సుమారు గంట పాటు విమానం గాలిలోనే చక్కర్లు కొట్టింది. ఎట్టకేలకు 7.30 గంటల సమయంలో వర్షం తగ్గుముఖం పట్టడంతో పైలెట్లు విమానాన్ని సురక్షితంగా ల్యాండ్ చేశారు. ల్యాండింగ్ సమయంలో ఇబ్బందులు ఎదురవడంతో ప్రయాణికులు సైతం భయాందోళనకు గురయ్యారు. భారీ వర్షం కారణంగా ముంబై వెళ్లాల్సిన ఎయిరిండియా విమానం కూడా 20 నిమిషాలు ఆలస్యంగా 7.32 గంటలకు బయలుదేరివెళ్లింది.

పిడుగుపాటుకు ఇద్దరు గొర్రెల కాపర్ల మృతి



మృతిచెందిన కామేశ్వరి, సుంకన్న

తుగ్గలి/అల్లూరి జిల్లా నెట్‌వర్క్: ప్రాణ భయంతో బండరాయి కింద దాక్కున్నా మృత్యువు వదిలిపెట్టలేదు. పిడుగుపాటు రూపంలో ప్రాణాలు తీసింది. కర్నూలు జిల్లా తుగ్గలి మండలం రామలింగాయపల్లిలో ఆదివారం రాత్రి ఈ దారుణం జరిగింది. గ్రామానికి చెందిన ఈశ్వరయ్య, ఎరుకల కామేశ్వరి(32), ఉలిగుత్తి సుంకన్న (40) గొర్రెలు కాసేందుకు వెళ్లారు. ఆదివారం సాయంత్రం పెద్ద ఎత్తున ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. ఆ సమయంలో చెన్నంపల్లి చెరువు సమీపంలో ఉన్న కాపరులు బండరాయి కింద తలదాచుకున్నారు. అప్పుడే ఒక్కసారిగా పిడుగు పడటంతో కామేశ్వరి, సుంకన్న అక్కడికక్కడే మృతిచెందారు. ఈశ్వరయ్య సొమ్మసిల్లి పడిపోయాడు. మృతుల కుటుంబసభ్యులు, గ్రామస్తులు ఘటనాస్థలానికి వెళ్లి వీరిని గుర్తించారు. ఈశ్వరయ్యను చికిత్స నిమిత్తం పత్తికొండ ఆస్పత్రికి తరలించారు. కామేశ్వరికి భర్త, కుమారుడు, కుమార్తె, సుంకన్నకు భార్య సుంకమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలోని పలు ప్రాంతాల్లో శని, ఆదివారాల్లో భారీవర్షం కురవడంతో పాటు పిడుగుల మోత మోగింది. పిడుగుపాటుకు గురై వేర్వేరు ప్రాంతాల్లో 26 మూగజీవాలు మరణించాయి. హుకుంపేట మండలం సూకురులో 13 పశువులు, దేవీపట్నం మండలం ఇందుకూరుపేటలో 10 మేకలు, గొర్రెలు, చింతపల్లి మండలం, కిటుముల పంచాయతీ, లక్కవరంలో రెండు పశువులు, ఒక మేక మృతి చెందాయి.

జల్లి ఫిష్‌ల దాడి.. 30 మందికి గాయాలు

సాక్షి, చెన్నై: బీచ్‌లో సందర్శకులపై జల్లి ఫిష్‌లు దాడి చేశాయి. ఈ ఘటనలో 30 మంది గాయపడ్డారు. దీంతో అదియమాన్ బీచ్‌లో కలకలం రేగింది. వివరాల్లోకి వెళితే... తమిళనాడులోని రామనాథపురం జిల్లా సముద్రతీరంలో పలు బీచ్‌లు ఉన్న విషయం తెలిసిందే. దీన్లో అదియామన్ బీచ్ కూడా ఒకటి. ఆదివారం సెలవు రోజు కావడంతో పెద్ద ఎత్తున సందర్శకులు బీచ్‌కు తరలి వచ్చారు. సముద్రంలో స్నానం చేస్తూ సందడి చేశారు. ఈ సమయంలో హఠాత్తుగా వందలాదిగా జల్లి ఫిష్‌లు సముద్ర స్నానం చేస్తున్న వారిపై దాడి చేశాయి. పలువురి కాళ్లు, చేతులను కరిచాయి. దీంతో దద్దుర్లు రావడం, మంట అధికమవ్వడం, దురద వంటి సమస్యలతో 30 మంది ఆస్పత్రి పాలయ్యారు. ఈ సమాచారంతో ఆ బీచ్‌లో కలకలం రేగింది. సముద్రంలో దిగేందుకు జనం భయపడ్డారు. సమాచారం అందుకున్న అధికారులు ఈ వ్యవహారంపై దర్యాప్తు చేపట్టారు.



పనస పండు మోయకుండా బంధువు ఇంటికి వెళ్తే ఉద్దానంలో మహా నేరం. పనస తొన తినిపించకుండా నేస్తం అని చెప్పుకోవడం అక్కడ ఇంకా పాపం. పనస పొట్టు కూర గురించి మాట్లాడకుండా, పనస కాయ బిర్యానీ రుచి చూడకుండా ఉద్దానం గడప దాటడం అసాధ్యం. అందులోనూ ఇది పనస సీజన్. చుట్టాలింటికి వెళ్తూ ఓ ఖర్జూర పనసనైనా బహుమతిగా ఇవ్వకపోతే ఇక్కడి వారు అవమానంగా ఫీలైపోతారు. అధికారుల వద్దకైనా, నాయకుల దగ్గరికైనా పనస తీసుకెళ్తే పనైపోతుందని అంటుంటారు.



పనసపై మనసు


- రుచిలో ఖర్జూర పనసే రారాజు
- ఖరీదైన బహుమతికి ప్రతిరూపం
- జిల్లాలో 1200 ఎకరాల్లో పనస సాగు
- వర్షాలు లేకపోవడంతో తగ్గిన దిగుబడి

ఇచ్ఛాపురం రూరల్:

ఏప్రిల్, మే, జూన్.. ఉద్దానమంతా పనస సువాసనతో నిండిపోయే సీజన్ ఇది. కోటలో ఉండే కోటీశ్వరుడు నుంచి గుడిసెలో ఉన్న పేదవాడికి సైతం అందుబాటులో ఉండే ఏకైక పండు ఈ పనస. ఖరీదైన బహుమతికి ప్రతి రూపంగా పనస పండును పిలుస్తారు. మన జిల్లాలో సుమారు 1200 ఎకరాల్లో సాగు చేసే ఈ పనస చెట్లను కొబ్బరి తోటల్లో, ఖాళీ ప్రదేశం ఉంటే ఇంటి పెరట్లలో విరివిగా పెంచుతారు.

పనసలో పలు రకాలు

జిల్లాలో ఖర్జూరం, కర్పూరం, బురద, నిత్య పనస



కూరల్లో విరివిగా ఉపయోగించే పనస పిక్కలు



పనస కాయలు

రకాలను రైతులు పండిస్తుంటారు. పనసలో రారాజు ఖర్జూరం రకం పనస. ఈ పండులో చిన్నచిన్న తొనలు పెళుసుగా ఉంటాయి. ఇవి చాలా తియ్యగా ఉంటూ అధిక మొత్తంలో పీచును కలిగి ఉంటాయి. వాణిజ్య పరంగా ముఖ్యమైనవి. సైజును బట్టి ఈ పండు ధర వంద రూపాయల నుంచి ఐదు వందల రూపాయల వరకు విక్రయిస్తారు. ఇందులో తేనె ఖర్జూరం పనస పండు మరింత ఖరీదు ఉంటుంది. ఇక కర్పూరం, బురద, నిత్య పనసగా పిలిచే వీటిని ప్రస్తుతం రైతులు పక్వానికి చేరకుండానే పిందె దశలో విక్రయిస్తుంటారు. ఈ పనస పిందెలను కూరల్లోకి అధికంగా వినియోగిస్తుండటంతో దళారులు రైతుల వద్ద చెట్టు రూపంలో బేరం చేసి తీసుకుంటారు. పనస పండిన తర్వాత ఎక్కువ రోజులు నిలువ ఉండవు. అయితే వీటిని 11 నుంచి 13 డిగ్రీల ఉష్ణోగ్రతల వద్ద నిల్వ ఉంచితే 3 నుంచి 6 వారాల వరకు ఉంటాయి. పండ్లతో పాటు పనస కాయ పైతొక్క తీసి లోపలి భాగాన్ని చిన్నచిన్న ముక్కలుగా కోసి కూర చేస్తారు. దీన్ని పనస పొట్టు కూర అంటారు. ఇండియాతో పాటు నేపాల్, బంగ్లాదేశ్, శ్రీలంక, ఇండోనేషియా, కంబోడియా వియత్నాం దేశాల వారు పనసను వంటల్లో విరివిగా వాడతారు. ఇవేగాక పనస తొనలోని విత్తనాలు(పనస పిక్కలు)ను నిప్పుల మీద కాల్చుకుని తినడం, కూరలు, బిర్యానీలలో వాడడం కూడా ఇక్కడ రివాజు. ప్రస్తుతం ఉద్దానం ప్రాంతం నుంచి బరంపురం, కటక్, భువనేశ్వర్, కటక్‌పూర్, కోల్‌కతా, బిలాయి వంటి ప్రాంతాలకు వ్యాపారులు తరలిస్తుంటారు.

ఆరోగ్యపరంగా..

ఆరోగ్య పరంగా పనసలో పోషకాల గని ఉందంటారు వైద్య నిపుణులు. పనసలో పిండి పదార్థాలు, చక్కెరలు, పీచు పదార్థాలు పుష్కలంగా ఉంటాయి. అంతే కాకుండా విటమిన్–ఎ, బి1, బి2, బి3, బి5, బి6, బి9, సీ,ఈతో పాటు కాల్షియం, ఐరన్, సోడియం, పొటాషియం, ఫాస్ఫరస్, మెగ్నీషియం, మాంగనీస్, జింక్ వంటి ఖనిజాలు పుష్కలంగా ఉంటాయి. జీర్ణశక్తిని మెరుగుపరిచి, మలబద్ధకాన్ని నివారించే గుణం దీనిలో అధికంగా ఉందని, పొటాషియం ఎక్కువగా ఉన్నందున రక్తపోటును తగ్గిస్తుందని, వ్యాధి నిరోధక శక్తిని మెరుగుపరుస్తుందని వైద్యులు చెబుతుంటారు.

ఉల్లికిపాటు

- కిలో రూ.50కి చేరిక
- మున్ముందు మరింత పెరిగే అవకాశం
- కూరగాయలదీ అదే దారి
- టమాటా కిలో రూ.80



సాక్షి, విశాఖపట్నం, తుమ్మపాల: ఉల్లిపాయలతో పాటు కూరగాయల ధరలకు రెక్కలొచ్చాయి. ఇవి సామాన్యుడికి అందనంత ఎత్తులో విహరిస్తున్నాయి. రోజురోజుకూ వీటి ధరలు పెరుగుతూ కొనాలంటేనే జనం భయపడే పరిస్థితులొచ్చాయి. ఉల్లి, కాయగూరల ధరలు అడ్డూ అదుపు లేకుండా పరుగులు పెడుతుండడంతో మున్ముందు ఇంకెంతగా ఎగబాకుతాయోనన్న ఆందోళన వ్యక్తమవుతోంది. నెల రోజుల క్రితం వరకు కిలో రూ.20కి మించని ఉల్లి క్రమంగా రూ.25కి చేరుకుంది. అలా పెరుగుతూ ఇప్పుడు అనకాపల్లి రైతు బజారులో రూ.40కి, రిటైల్ మార్కెట్‌లో రూ.50కి చేరింది. ఉల్లిపాయలు అధికంగా కర్నూలు, మహారాష్ట్ర నుంచి వస్తుంటాయి. ప్రస్తుతం మహారాష్ట్రలో వర్షాభావ పరిస్థితులతో ఉల్లి ఉత్పత్తి ఆశాజనకంగా లేదు. దీంతో అక్కడ వ్యాపారులు నిల్వ చేసి కృత్రిమ కొరత సృష్టిస్తున్నారని చెబుతున్నారు. అలాగే కర్నూలులో ఉల్లి పంట చేతికి రావడానికి మరో రెండు నెలలైనా పడుతుందని అంటున్నారు. అందువల్ల వినియోగానికి సరిపడినంత ఉల్లిపాయలు లభ్యం కాకపోవడంతో వీటి ధర పెరుగుతూ వస్తోంది. ఉల్లి అంటేనే ఉలిక్కిపడే స్థాయికి చేరుకోనుంది. రానున్న రోజుల్లో ఉల్లి రేటు మరింత పెరగవచ్చని, ఆగస్టు వరకు పెరుగుదల కొనసాగవచ్చని వ్యాపారులు పేర్కొంటున్నారు. ఈ పరిస్థితుల్లో రాయితీపై ఉల్లిని సరఫరా చేయాలని వినియోగదారులు కోరుతున్నారు.

కొరలు చాస్తున్న కూరగాయలు



ఇక కూరగాయల ధరలు కోరలు చాస్తున్నాయి. కొన్నాళ్ల క్రితం అందుబాటులో ఉన్న వీటి రేట్లు ఇప్పుడు అదుపు తప్పుతున్నాయి. కారుచౌకగా దొరికే దొండకాయలు, బెండకాయలు, వంకాయలు, బరబాటీలు వంటివి కూడా కొండెక్కి కూర్చున్నాయి. అనకాపల్లి రిటైల్ మార్కెట్లో కిలో దొండ రూ.50, బెండ రూ.60, వంకాయలు రూ.40, బీరకాయలు రూ.90, బంగాళాదుంపలు రూ.40, అల్లం రూ.220 చొప్పున విక్రయిస్తున్నారు. రైతు బజార్లలో కిలోపై రూ.5–15 తక్కువగా అమ్ముతున్నారు. అయినప్పటికీ సామాన్య, ప్రజానీకానికి ఈ ధరలు ఎంతో భారంగా పరిణమిస్తున్నాయి. దీంతో ఇన్నాళ్లూ కిలో కొనుగోలు చేసిన వారు అరకిలో, అరకిలో కొనే వారు పావు కిలోకు పరిమితమవుతున్నారు.

అనకాపల్లిలో ధరవరలు

(కిలో రూ.లలో)

కూరగాయ	రైతుబజార్	రిటైల్
ఉల్లిపాయలు	40	50
టమాటా	60	80
బంగాళదుంప	30	40
బీరకాయలు	40	60
బెండకాయలు	40	60
దొండకాయలు	40	50
అల్లం	180	220
కాప్సికమ్	80	100

ఠారెత్తిస్తున్న టమాటా..



మరోవైపు టమాటా ధరలు ఠారెత్తిస్తున్నాయి. నెల క్రితం కిలో రూ.20కి మించని వీటి ధర ప్రస్తుతం రూ.80కి పైనే ఉంది. కూరల్లో రుచి కోసం టమాటాలను విరివిగా వాడుతుంటారు. దీంతో వీటికి అలవాటు పడిన వారు ధర పెరిగినా ఎంతో కొంత కొనుగోలు చేస్తున్నారు. టమాటా పంట ఎక్కువగా రాయలసీమలోని మదనపల్లి, పుంగనూరు, బెంగళూరు శ్రీనివాసపురం ప్రాంతాల నుంచి వ్యాపారులు కొనుగోలు చేసి తెస్తుంటారు. గతంలో మండుటెండలు, వడగాడ్పులు, ప్రస్తుతం వర్షాల వల్ల అక్కడ టమాటా పంట దెబ్బతిని దిగుబడి తగ్గిందని, దీంతో రేట్లు పెరిగాయని వ్యాపారులు చెబుతున్నారు. పైగా ఈ టమాటాలు అంత నాణ్యంగానూ ఉండడం లేదు. ప్రస్తుత పరిస్థితిని బట్టి రానున్న రోజుల్లో వీటి ధర మరింత పెరిగే అవకాశం ఉందని టమాటా వ్యాపారి జూరెడ్డి శ్రీనివాసరావు 'సాక్షి'కి చెప్పారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22.Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943

క్లుప్తంగా

మందిరాలు అవసరం

రాయచూరు రూరల్: ప్రజలు ప్రార్థనలు చేసుకోవడానికి మందిరాలు అవసరమని సిరవార జిల్లా రెవరెండ్ సూపర్‌వైజర్ సతీష్ కుమార్ అభిప్రాయపడ్డారు. ఆదివారం దేవదుర్గ తాలూకా బొమ్మనాళలో రాష్ట్ర సర్కార్ క్రైస్తవ సముదాయ అభివృద్ధి మండలి నుండి రూ.50 లక్షలతో నిర్మించనున్న చర్చి నిర్మాణానికి భూమిపూజ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో యాదగిరి కళాశాల ప్రిన్సిపాల్ జయపాల్, వెంకట సింగ్, చంద్రశేఖర్, రాజు, జయశీల, ప్రకాశ్, యెస్సు, దేవపుత్ర, డేవిడ్, బెంజమిన్, రవి, శాంతరాజు తదితరులు పాల్గొన్నారు.

మానవీయ విలువలు పెంచుకోవాలి


పురస్కాలు అందజేసిన దృశ్యం

రాయచూరు రూరల్: సమాజంలో విద్యార్థులు మానవీయ విలువలను పెంచుకోవాలని వ్యక్తిత్వ వికాస శిక్షణ అధికారి గిరిధర్ పూజార్ పేర్కొన్నారు. శనివారం కన్నడ భవనంలో వేదాంత కళాశాల, ప్రభుత్వ ఉద్యోగుల సంఘం, కన్నడ సాహిత్య పరిషత్ ఆధ్వర్యంలో 2023–24లో కన్నడ భాషలో అధిక మార్కులతో పాసైన పదవ తరగతి విద్యార్థుల సన్మాన కార్యక్రమంలో మాట్లాడారు. పచ్చని నగరం, ప్లాస్టిక్ నిర్మూలనకు విద్యార్థులు ప్రచారం చేయలన్నారు. కార్యక్రమంలో కసాప అధ్యక్షుడు వెంకటేష్, రాకేష్ రాజల బండి, మహంతేష్, ప్రభులింగ, చంద్రశేఖర్‌రెడ్డి, యంకప్ప, మల్లేష, శాంత, రాజప్ప గౌడ, రావుత్ రావ్, విజయ, రాజా శంకర, రేఖ తదితరులు పాల్గొన్నారు.

చేగువేరా జయంతి


చేగువేరా చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: విప్లవ కెరటం చేగువేరా జయంతిని సీఐటీయూ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శనివారం హట్టి పట్టణంలో సీఐటీయూ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో అర్జెంటీనా విప్లవకారుడు చేగువేరా జయంతి కార్యక్రమంలో సభ్యులు మాట్లాడుతూ చేగువేరా సమాజానికి చేసిన సేవలు మరువరానివన్నారు. కార్యక్రమంలో అమరేష్, వెంకటేష్, నింగప్ప, రాజరత్నం, నాగరాజ్, వినయ్, యశవంత్, నజీర్, ఫక్రుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

రిమ్స్ అధికారులను సస్పెండ్ చేయాలి

రాయచూరు రూరల్: రాయచూరు ప్రభుత్వ వైద్యకీయ కళాశాలలో విధులు నిర్వహిస్తున్న (రిమ్స్) అధికారులను సస్పెండ్ చేయాలని మాదిగ దండోరా జిల్లా సంచాలకులు నరసింహులు డిమాండ్ చేశారు. కళాశాలలో అవినీతి, అక్రమాలు జరిగాయని, కళాశాల, ఆస్పత్రి ఒక్కటే కావడంతో రిమ్స్‌లో విధులు నిర్వహించే వైద్యులు సొంతంగా క్లినిక్‌లు, నర్సింగ్ హోమ్‌లు నిర్వహిస్తున్నా ఉన్నతాధికారులు మౌనంగా ఉంటున్నారని, వైద్యుల నుంచి మామూళ్లు పుచ్చుకుని ఉదాసీనంగా వ్యవహరిస్తున్న అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు అధికారికి వినతిపత్రం అందజేశారు.

లారీ-కారు ఢీ, ఇద్దరి దుర్మరణం

రాయచూరు రూరల్: లారీ- కారు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం పాలైన ఘటన శనివారం రాత్రి కలబుర్గి జిల్లాలో చోటు చేసుకుంది. మృతులను యాదగిరి జిల్లాధికారి కార్యాలయంలో విధులు నిర్వహించే ఎఫ్‌డీసీ శాంతయ్య స్వామి (34), కంప్యూటర్ ఆపరేటర్ లోకేష్ (35)లుగా పోలీసులు గుర్తించారు. ఈ ప్రమాదం విజయపుర-కలబుర్గి రహదారిలో జరిగినట్లు అదనపు ఏఎస్పీ బిందురాణి తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

యోగాపై ఖైదీలకు అవగాహన


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా జైలులో ఖైదీలకు యోగా శిక్షకుడు తిమ్మప్ప యోగాపై అవగాహన కల్పించారు. జిల్లా జైలులో జిల్లాధికార యంత్రాంగం, పతంజలి యోగా ఆధ్వర్యంలో యోగా వల్ల కలిగే ప్రయోజనాలు, శారీరక దృఢత్వాన్ని వివరించారు. ఈ సందర్భంగా జైలు సూపరింటెండెంట్ అందాని, వైద్యుడు బసవరాజ్ పుండలిక, భాగ్యశ్రీ పాల్గొన్నారు.

రౌడీషీటర్ దారుణ హత్య

హుబ్లీ: విజయపుర్ జిల్లాలో కాల్పుమోత మళ్లీ మొదలైంది. రౌడీషీటర్‌ను కాల్చి చంపారు. జిల్లాలోని షాడక్షణ పట్టణం నివరిగి రోడ్డు వద్ద ఈ ఘటన జరిగింది. రౌడీషీటర్ అశోక్‌ను దారుణంగా చంపారు. పెరోల్‌పై ఉన్న రౌడీషీటర్ అశోక్ ఇంటి నుంచి బయటకు వచ్చిన సమయంలో కాపుగాచిన గుర్తు తెలియని వ్యక్తులు తుపాకీతో కాల్చిచంపారు.

ఊపందుకుంటున్న వ్యవసాయం



జిల్లా వ్యాప్తంగా వ్యవసాయ పనులు జోరందుకున్నాయి, ఓ ప్రాంతంలో దుక్కిదున్ని సాగుకు సిద్ధం చేస్తున్న దృశ్యం

- విత్తన ప్రక్రియ ప్రారంభం
- జిల్లాలో 40 మి.మీ వర్ష పాతం నమోదు
- ఖరీఫ్ సీజన్‌పైనే రైతుల ఆశలు

సాక్షి,బళ్లారి: గత ఏడాది తీవ్ర వర్షాభావంతో పెట్టిన పంటలు చేతికందక, చేసిన అప్పులు తీరక అన్నదాతలు తీవ్రంగా నష్టపోయారు. అయితే జూన్‌లో కురుస్తున్న వర్షాలతో అన్నదాతల్లో ఆశలు మొలకెత్తుతున్నాయి. దీంతో దుక్కులు దున్నడం ప్రారంభించారు. జిల్లాలో దాదాపు ఐదు లక్షలు ఎకరాలు వ్యవసాయయోగ్యమైన భూమి ఉండగా, ఇందులో నీటిపారుదల భూములు అంటే తుంగభద్ర ఆయకట్టుతో పాటుతో పాటు బోరు, బావులు కింద ఉన్న వ్యవసాయ భూములు దాదాపు మూడు లక్షలు 50 వేలు ఎకరాలు భూమి ఉండగా, మిగిలిన ఒకటిన్నర లక్ష ఎకరాలు భూమి వర్షాధారిత భూములు. సండూరు, బళ్లారి తాలూకాల్లో వర్షాధారిత భూములు అధికంగా ఉండటంతో ఆయా తాలూకాల్లో ముందుగా సేద్యం పనులు పూర్తి చేసిన రైతన్నలు విత్తనాలు విత్తే కార్యక్రమాన్ని ప్రారంభించారు. వర్షాధారిత భూముల్లో వేరుశనగ, జొన్న తదితర సాగు మొదలు పెట్టారు. రెండు రోజులు నుంచి జోరు వాన కురవడంతో భూమి పూర్తిగా తడిసిముద్దయింది. గురువారం ఉదయం నుంచి చల్లని వాతావరణం ఉండటంతో వ్యవసాయ పనులు చేసుకుందుకునే రైతన్నలకు అనువైన వాతావరణం ఏర్పడింది. ఈ ఏడాది లక్ష్యానికి తగ్గట్టుగా జిల్లాలో ఐదు లక్షలు ఎకరాల్లో విత్తనసాగు, వరినాట్లు వేసేందుకు రైతన్నలకు అనుకూలమైన వాతావరణం ఏర్పడటంతో ముందుగా విత్తనాలు, ఎరువులు సిద్ధం చేసినట్లు వ్యవసాయ జిల్లాధికారి మల్లికార్జున సాక్షికి తెలిపారు. తుంగభద్ర ఆయకట్టు ప్రాంతంలో వరినాట్లు వేసే రైతులకు విత్తనాలు వడ్లుతో, వర్షాధారిత భూముల్లో సాగు చేసే రైతులకు కూడా కంది, జొన్న, సజ్జ, ఆయా ప్రాంతాలకు విత్తనాలు సిద్ధం చేసి, ఆయా వ్యవసాయ కేంద్రాల్లో ఉంచామన్నారు.

జిల్లా వ్యాప్తంగా 40 మి.మీ :

ఈవారంలో జిల్లా వ్యాప్తంగా సరాసరి 40 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. బళ్లారి తాలూకా 18 మి.మీ, సండూరు 16, సిరుగుప్ప 45, కురుగోడు 37, కంప్లి 32 మి.మీ నమోదు కావడంతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు.

గమక కళలకు ప్రాణం పోయాలి

రాయచూరు రూరల్: సమాజంలో నశించి పోతున్న గమక కళలకు ప్రాణం పోయాలని గమక కళా పరిషత్ అధ్యక్షుడు ప్రసన్న అన్నారు. శనివారం కన్నడ సంఘం భవనంలో గమక కళా పరిషత్ ఆధ్వర్యంలో 2023–24లో కుమార వ్యాస విదురాతిథ్య కావ్యవాచన వ్యాఖ్యాన గూర్చి మాట్లాడారు. గతంలో టీవీలు, మొబైళ్ల వాడకం లేని సమయంలో అలనాటి కళలకు ప్రాధాన్యత ఉండేదన్నారు. ఆధునిక తంత్రజ్ఞాన యుగంలో కళలకు ఆదరణ కరువైందన్నారు. కార్యక్రమంలో అంతర్జాతీయ క్లారినెట్ విద్వాంసుడు నరసింహులు, గమక కళా పరిషత్ అధ్యక్షుడు వెంకటరావ్ కులకర్ణి, జయలక్ష్మి మంగళమూర్తి, పకీరప్ప, లక్ష్మీకాంత్, పల్లవి, మురళీధర్, నాగరాజ్, అరుణ తదితరులు పాల్గొన్నారు.

బైక్ ప్రమాదంలో ఒకరు మృతి

రాయదుర్గం టౌన్: సరిహద్దు కర్ణాటకలోని మొలకాల్మూరులో జరిగిన రోడ్డు ప్రమాదంలో రాయదుర్గం పట్టణానికి చెందిన వెంకటేశులు (30) మృతి చెందగా మరొక యువకుడు విజయ్ కుమార్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన శనివారం రాత్రి మొలకాల్మూరులోని ఫైర్ స్టేషన్ సమీపంలో ప్రధాన రహదారిపై జరిగింది. రాయదుర్గం మారెమ్మగుడి ఏరియాకు చెందిన వెంకటేశులు, నేసే పేటకు చెందిన స్నేహితుడు విజయ్‌కుమార్‌తో కలిసి బైక్‌లో మొలకాల్మూరుకు వెళ్లారు. తిరిగి రాయదుర్గానికి వస్తుండగా అదుపుతప్పి కింద పడ్డారు. మొలకాల్మూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ వెంకటేశులు మృతి చెందగా తీవ్రగాయాలైన విజయ్‌కుమార్‌ను మెరుగైన వైద్యం కోసం బంధువులు అనంతపురానికి తరలించారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం


బ్యాటింగ్ చేస్తున్న జిల్లాధికారి దివాకర్

హొసపేటె: క్రీడాపోటీలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని కలెక్టర్ ఎంఎస్ దివాకర్ అన్నారు. విజయనగరం జిల్లా వర్కింగ్ జర్నలిస్టుల ఆధ్వర్యంలో విలేకరుల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన క్రికెట్ పోటీలను కలెక్టర్ దివాకర్, ఎస్పీ హరిబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... నిత్యం వత్తిళ్ల మధ్య విలేకరులు విధులు నిర్వహిస్తుంటారని, తరచూ క్రీడా పోటీలలో పాల్గొని ఒత్తిడిని తగ్గించుకోవచ్చన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ దివాకర్ బౌలింగ్ చేయగా ఎస్పీ శ్రీహరిబాబు బ్యాటింగ్ చేసి పోటీలను ప్రారంభించారు. ఎస్పీ శ్రీహరిబాబు మాట్లాడుతూ... స్నేహపూర్వక టోర్నీలు ఆనందాన్ని కలిగిస్తాయన్నారు. 11 మంది సభ్యులతో విజయనగర్ ఎలెవన్, హంపీ ఎలెవన్ జట్లు పోటీలో పాల్గొన్నాయి. తొలుత బ్యాటింగ్ చేసిన విజయనగర ఎలెవన్ 15 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 103 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన హంపీ ఎలెవన్ జట్టు 14 ఓవర్లలో ఒక వికెట్ నష్టపోయి 104 పరుగులు చేసి విజయం సాధించింది.

బెళగావిలో అబార్షన్ల దందా

- ఆర్ఎంపీ, అసిస్టెంటు బాగోతం


శిశువు మృతదేహం, నిందితుడు గఫూర్

సాక్షి, బళ్లారి: ఇటీవల బెంగుళూరు- మండ్య జిల్లాలో పెద్దఎత్తున భ్రూణ హత్యల బాగోతాలు బయటపడిన వైనం మరువకముందే, బెళగావి జిల్లాలో విచ్చలవిడిగా అబార్షన్లు చేస్తున్న ఒక నకిలీ వైద్యుని ఉదంతం బట్టబయలైంది. బెళగావిలోని కిత్తూరులో ఆర్ఎంపీ అబ్దుల్ గఫూర్ అబార్షన్ల దందా కొనసాగిస్తున్నాడు. కిత్తూరు తాలుకా తిగడోలి గ్రామంలోని ఫాం హౌస్‌లో ఆడ శిశువు శవం లభ్యమైంది. దీంతో పోలీసులు గఫూర్ సహాయకునిగా ఉన్న రోహిత్‌ను అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టగా మరిన్ని సంగతులు వెలుగుచూశాయి. తిగడోలి గ్రామంలోని గఫూర్ ఫాంహౌస్‌లో ఓ శిశువు మృతదేహం లభ్యమైంది. గత కొన్ని సంవత్సరాలుగా వీరిద్దరూ గుట్టుగా అబార్షన్లు సాగిస్తున్నట్లు తేలింది. ఫాంహౌస్‌లో రోహిత్ సమక్షంలో విచారణ చేస్తున్నారు. గర్భం వద్దనుకున్నవారి నుంచి పెద్దమొత్తంలో డబ్బు తీసుకుని గర్భవిచ్ఛిత్తి చేసేవారమని తెలిపారు.

కేడీపీపై సన్నాహక సమావేశం


మాట్లాడుతున్న అధికారి సదాశివ ప్రభు

హొసపేటె: విజయనగరం జిల్లాలో త్వరలో ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో త్రైమాసిక కేడీపీ సమావేశాన్ని నిర్వహించనున్నందున అవసరమైన సన్నాహాలు చేయాలని జిల్లా పంచాయతీ అధికారి సదాశివ ప్రభు వివిధ శాఖల అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా పాలన భవనంలోని కేస్వాన్ హాలులో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా స్థాయి కేడీపీ సమావేశంలో ముఖ్యమంత్రి పాల్గొని అధికారులతో సమావేశమై వివిధ శాఖల ప్రగతిని సమీక్షిస్తారు. విజయనగరం జిల్లా నూతనంగా ఆవిర్భవించి కొన్నేళ్లు గడిచాయి. జిల్లా ఇన్‌చార్జి మంత్రి అభ్యర్థన మేరకు విజయనగరం జిల్లా స్థాయి అధికారులతో ముఖ్యమంత్రి ప్రగతి సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు. జిల్లా విజయనగరం జిల్లాగా అవతరించిన తర్వాత జిల్లా స్థాయి అధికారులతో ముఖ్యమంత్రి సమావేశం కావడం విజయనగరం జిల్లా ప్రగతి చరిత్రలో కొత్త మైలురాయిగా నిలిచిపోనుంది. ఈ సమావేశంతో ప్రగతి వేగవంతం కానుంది. ఈ సందర్భంగా జిల్లా వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

జనసంద్రమైన మార్కెట్


జీవాలతో కిటకిటలాడుతున్న మార్కెట్

చింతామణి: సోమవారం బక్రీద్‌ను పురస్కరించుకొని ఆదివారం పట్టణంలోని మార్కెట్‌లో గొర్రెలు, పొట్టేళ్ల విక్రయాలు జోరుగా సాగాయి. గ్రామీణ ప్రాంతాలనుంచి రైతులు పొట్టేళ్లను తీసుకొచ్చి విక్రయించారు. ముస్లింలు పెద్ద సంఖ్యలో వచ్చి పొట్టేళ్లను కొనుగోలు చేశారు.

చెక్‌డ్యాం ప్లేట్ చోరీ

హుబ్లీ: బాగళకోట జిల్లా లోకాపుర వద్ద ఓ గ్రామంలోని చెక్ డ్యాంకు అమర్చడానికి ఉంచిన రూ.6.91 లక్షల విలువ చేసే ఇనుప ప్లేట్లను చోరీ చేసి తరలిస్తున్న గూడ్స్ వాహనాన్ని ధార్వాడ టౌన్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈనెల 13న ధార్వాడ సౌదత్తి రోడ్డులో పోలీసులు పెట్రోలింగ్‌లో ఉండగా ఈ వాహనంపై అనుమానం రావడంతో నిలపడానికి యత్నించారు. అదే సమయంలో వాహనం ఆపి పారిపోయారు. ఎట్టకేలకు వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకుని డ్రైవర్ లింగరాజును విచారణ చేపట్టగా అసలు విషయం వెల్లడించారు. తనకు హుబ్లీ నవనగరకు చెందిన అమృతసద్దంగి, హుస్సేన్ బేపారి, దర్శన మునిసబాగ, చంద్రు హిరేమఠ, మహంతేష్ అల్లావర సహకరించినట్లుగా నిందితుడు వెల్లడించినట్లు పోలీసులు తెలిపారు.

తమ్ముడి హత్యకు అన్న సుపారీ

- 8 మంది అరెస్ట్

హుబ్లీ: ఆస్తి కోసం సొంత తమ్ముడిని హతమార్చేందుకు అన్న సుపారీ ఇచ్చిన ఘటన బెళగావి జిల్లా రాయబాగ తాలూకా సుల్తానపుర గ్రామంలో ఆదివారం వెలుగు చూసింది. గ్రామానికి చెందిన ఈరప్ప చౌగల హతుడు. కేవలం ఎకరా పొలం కోసం ఈరప్పను అతడి అన్న శ్రీశైల చౌగల హత్య చేయించాడని పోలీసులు తెలిపారు. ఈ నెల 4న రాత్రి 9 గంటల సమయంలో తోటవైపు వెళ్తుండగా కారులో వచ్చిన దుండగులు ఈరప్పను కిడ్నాప్ చేశారు. బాగళకోట కోళార్ జ్యాక్‌వెల్ వద్ద హత్య చేసి మృతదేహాన్ని అక్కడే పడేశారు. ఈ ఘటనలో 8 మంది నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. సొంత అన్ననే హత్యకు సుపారీ ఇచ్చినట్లు పోలీసులు తెలిపారు.

దాడి కేసులో ఇద్దరి అరెస్ట్

ధార్వాడలోని పాత ఏపీఎంసీ వద్ద గో రక్షణకు వెళ్లిన వీహెచ్‌పీ కార్యకర్తపై జరిగిన దాడి కేసుకు సంబంధించి ఉపనగర పోలీసులు ఇద్దరిని అరెస్ట్ చేశారు. ధార్వాడ పాత ఏపీఎంసీ వద్ద గురువారం గోవులను తరలిస్తుండగా ఆ సమాచారాన్ని అందుకున్న సదరు కార్యకర్త సోమశేఖర్ వాటి రక్షణ కోసం ప్రయత్నించాడు. ఈ క్రమంలో 10 మంది గుంపు ఇతడిపై దాడి చేశారు. ఫిర్యాదు చేసినా పోలీసులు తగిన చర్యలు తీసుకోలేదని ఘటనపై ఆగ్రహంతో హిందూ పర సంఘాలు సదరు స్టేషన్ ఎదుట ఆందోళనకు చేపట్టారు. దీంతో పోలీసులు ఎట్టకేలకు దాడి చేసిన 10 మందిపై కేసులు నమోదు చేసుకొని, వీరిలో ధార్వాడ మైనుద్దీన్ బేపారి, ఇర్షాద్ బేపారిని అరెస్ట్ చేశారు. మిగిలిన వారి కోసం గాలిస్తున్నారు.

బాలిక హత్య కేసులో వ్యక్తి అరెస్ట్

- చిన్నారి హత్య కేసును ఛేదించిన పోలీసులు
- గుట్కా తీసుకురాలేదని కొట్టి చంపిన వైనం
- రెండు నెలల తరువాత పట్టుబడిన నిందితుడు

గంగావతి రూరల్: గుట్కా తీసుకురాలేదనే కోపంతో ఓ వ్యక్తి బాలికను హత్య చేసిన విషయం ఆలస్యంగా బయటపడింది. కొప్పళ తాలూకా కిన్నాల గ్రామానికి చెందిన అనూశ్రీ (7) ఏప్రిల్ 18న కనిపించకుండా పోయింది. తల్లిదండ్రులు కొప్పళ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో శిథిలావస్థలో ఉన్న ఓ ఇంటిలో సంచిలో అనూశ్రీ మృతదేహం బయటపడింది. దీంతో కేసును సీరియస్‌గా తీసుకున్న పోలీసులు దర్యాప్తు చేయగా గ్రామానికి చెందిన సిద్దిలింగయ్య అనే వ్యక్తి అనూశ్రీని గుట్కా తీసుకురావాలని కోరాడు. ఆ చిన్నారి నిరాకరించడంతో కోపంతో కొట్టాడు. దీంతో బాలిక మృతి చెందడంతో అక్కడే ఉన్న ఒక పాడుపడిన ఇంటిలో మృతదేహాన్ని సంచిలో పెట్టి ఏమీ తెలియనట్లు గ్రామంలో తిరుగుతున్నాడు. పోలీసులు కేసు విచారణ చేసి నిందితుడిని అరెస్ట్ చేశారు.

పంట నష్ట పరిహారం.. గందరగోళం

హొసపేటె: పంట నష్ట పరిహారం గందరగోళం ఇంకా కొనసాగుతూనే ఉంది. మే నెలాఖరు వరకు జిల్లాలో కేవలం 2549 మంది రైతులకు మాత్రమే పంటనష్ట పరిహారం జాబితాలో ఉన్నారు. పది దశల్లో నష్ట పరిహారం విడుదల చేస్తామని, రెవెన్యూ, వ్యవసాయ శాఖల సమన్వయంతో రైతు ఖాతాలో పన్ను జమ చేస్తున్నామని వ్యవసాయశాఖ చెబుతోంది. అయితే రైతుల బ్యాంక్ ఖాతా, ఆధార్ లింకేజీ సమస్య ఇంకా అలాగే ఉంది. మొదటి దశలో జిల్లాకు చెందిన 3,21,928 మంది రైతుల ఖాతాకు రాష్ట్ర ప్రభుత్వం వెయ్యి రూపాయలను ఇన్‌పుట్ సబ్సిడీగా అందజేసింది. నిధులు సేకరించిన పరిహార నిధులు పంపిణీ మాత్రం నత్తనడకన సాగుతోంది. రైతులు అయోమయానికి తెరపడింది. పది వేల మందికి పైగా రైతుల ఖాతాల సమస్యను పరిష్కరించలేక పోతున్నారు. వివిధ సమస్యల నుండి పరిష్కారాల పంపిణీ పని జరగలేదు. పంపిణీ చేసిన మొత్తానికి, రైతుల సంఖ్యకు తేడా ఉంది. పెండింగ్‌లో ఉన్న పంట నష్ట పరిహారం విడుదల చేస్తామని హామీ ఇవ్వడం తప్ప చేసిందేమీ లేదన్నది రైతుల ఆవేదన. విత్తనాలు, ఎరువుల కొనుగోలుకు పంట నష్టపరిహారం ఆశించిన రైతులకు వానాకాలం వ్యవసాయ పనులు ప్రారంభమైన సకాలంలో పరిహారం అందడం లేదు. త్వరగా బకాయి పంట నష్టపరిహారం చెల్లించాలని రైతులు కోరుతున్నారు.

వీరశైవ లింగాయత్‌లు ప్రత్యేక ధర్మానికి పోరాటం చేయాలి


జ్యోతి వెలిగిస్తున్న నేతలు

రాయచూరు రూరల్: రాష్ట్రంలో వీరశైవ లింగాయత్‌లు ప్రత్యేక ధర్మానికి పోరాటం చేయాలని అటవీ శాఖ మంత్రి, అఖిల భారత వీరశైవ లింగాయత్ మహాసభ ప్రధాన కార్యదర్శి ఈశ్వర్ ఖండ్రే పిలుపిచ్చారు. ఆదివారం కలబుర్గి కోటనూరడి కాలనీలో కలబుర్గి అఖిల భారత వీరశైవ లింగాయత్ మహాసభ ఆధ్వర్యంలో విద్యార్థినులకు హాస్టల్ ప్రారంభించి మాట్లాడారు. గతంలో వీరశైవ లింగాయత్ ప్రత్యేక ధర్మానికి గుర్తింపు ఆందోళనకు దారితీసిన విషయాన్ని మంత్రి ప్రస్తావించారు. వీరశైవ లింగాయత్ మహాసభ ఆధ్వర్యంలో అన్ని జిల్లాల్లో హాస్టళ్లను ప్రారంభిస్తామన్నారు. మంత్రి శరణు ప్రకాశ్ పాటిల్ మాట్లాడుతూ... ఆడపిల్లలు విద్యారంగంలో ఉన్నతంగా రాణించాలన్నారు. కార్యక్రమంలో మంత్రులు శరణ బసప్ప దర్శనాపూర్, శాసన సభ్యులు ఎంవై పాటిల్, శశిల్ నమోషి, శరణే గౌడకందకూరు, మాజీ శాసన సభ్యులు రాజ్ కుమార్, దొడ్డప్ప గౌడ, బిఆర్ పాటిల్, శరణు మోదిలు పాల్గొన్నారు.

కోలారు వార్తలు...

వైభవంగా ఆలయ ప్రతిష్టాపన


పాల్గొన్న ఎమ్మెల్యే మంజునాథ్

కోలారు: తాలూకాలోని బెళమారనహళ్లి గ్రామ పంచాయతీ పరిధిలోని గుట్టహళ్లి గ్రామంలో ఆదివారం కరగదమ్మ దేవి ఆలయ ప్రతిష్టాపనా మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ప్రతిష్టాపనా కార్యక్రమాన్ని పురస్కరించుకుని దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిపారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కొత్తూరు మంజునాథ్ అమ్మవారి కృపా కటాక్షాల వల్ల జిల్లాలలో ఉత్తమంగా వానలు కురిసి పంటలు బాగా పండి ప్రజలు సుభిక్షంగా ఉండాలని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి సిద్దరామయ్య, ఉప ముఖ్యమంత్రి డికె శివకుమార్ నేతృత్వంలోని రాష్ట్రం ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. ఈ సందర్భంగా విధాన పరిషత్ సభ్యుడు ఎంఎల్ అనిల్‌కుమార్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సీసంద్ర గోపాలగౌడ, పీఎల్‌డీ బ్యాంకు మాజీ అధ్యక్షుడు చంజి మలె రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో బీజేపీ నాయకుడి మృతి


సత్యనారాయణ (ఫైల్)

గంగావతి రూరల్: తాలూకాలోని శ్రీరామనగర్ అంజుర్ క్యాంపు బీజేపీ కనకగిరి మండల అధ్యక్షుడు, సౌత్ రైల్వే జోన్ సభ్యుడు కోమరిన సత్యనారాయణ (54) ఆదివారం తన నివాసంలో గుండెపోటుతో మృతి చెందారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మాజీ మంత్రి నాగప్ప, మాజీ ఎమ్మెల్యే కేసరేటి ఈరప్ప, ఢడేసూరు బసవరాజ్, డాక్టర్ బసవరాజ్ పలువురు నేతలు సంతాపం ప్రకటించారు.

పెరుగుతున్న టమాటా ధరలు

కోలారు: టమాటాలు మళ్లీ మోత మోగిస్తున్నాయి. డిమాండ్‌కు తగిన స్థాయిలో సరుకు అందుబాటులో లేకపోవడంతో ధరలు పెరిగాయి. పట్టణంలోని ఏపీఎంసీ మార్కెట్‌లో ఆదివారం 15 కిలోల టమాటా బాక్స్ ధర రూ. 850లకు విక్రయిస్తున్నారు. మార్కెట్‌లో టమాటాలు ధరలు అధికంగా ఉన్నా దిగుబడి మాత్రం తక్కువగా ఉంది.

అగ్నివీర్‌లకు ఘనంగా వీడ్కోలు


అగ్నివీర్‌లకు వీడ్కోలు పలుకుతున్న దృశ్యం

కోలారు: సైన్యంలోకి ఎంపికైన ఐదుగురు అగ్నివీర్ అభ్యర్థులను ఆదివారం ఘనంగా సన్మానించారు. నగరంలోని జయనగర్లో ఉన్న అంబేడ్కర్ పిల్లల ఉద్యానవనంలో వీరికి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా సైన్యంలోకి ఎంపికైన బాలాజీ, వినయ్, నాగరాజ ప్రసాద్, పవన్, శ్రీనివాస్‌లు మాట్లాడుతూ తాము అగ్నివీర్‌కు ఎంపిక కావడానికి సహకారం అందించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. కోలారు క్రీడా సంఘంలో ఉత్తమ శిక్షణ లభించడం వల్లనే తాము అగ్నివీర్‌కు ఎంపికయ్యామన్నారు. కోలారు క్రీడాసంఘానికి కృతజ్ఞతలు తెలిపారు. భారత సేవాదళ జిల్లా అధ్యక్షుడు గణేష్ మాట్లాడుతూ... దేశ సేవ చేసే సౌభాగ్యం అందరికి లభించదని. సైన్యంలో చేరి దేశానికి సేవలు అందించడానికి దేశానికి గర్వకారణమన్నారు. యువకులకు ఉచిత శిక్షణ నందించి వారు సైన్యంలో చేరడానికి అవకాశం కల్పించిన కోలారు క్రీడా సంఘం సామాజిక సేవ శ్లాఘనీయమన్నారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారి వందేమాతరం సోమశేఖర్, శిక్షకుడు కృష్ణమూర్తి, సురేష్‌బాబు, పురుషోత్తమ తదితరులు పాల్గొన్నారు.

యోగాతో ఉత్తమ ఆరోగ్యం


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

కోలారు: మానసిక, శారీరక రుగ్మతలను రూపుమాపి వికాసాన్ని కలిగించేదే యోగా అని జిల్లా స్కౌట్స్ అండ్ గైడ్స్ ముఖ్య కమిషనర్ కెవి శంకరప్ప తెలిపారు. ఆదివారం నగరంలోని మహిళా సమాజ పాఠశాల సదాశివ స్మారక భవనంలో జిల్లా స్కౌట్స్ అండ్ గైడ్స్ సంస్థ, జిల్లా ఆయుష్ శాఖ, నిరంతర యోగాభ్యాస కేంద్రం, రోటరీ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి యోగా కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు, యువకులు తమ ఆహార అలవాట్లలో మార్పులు చేసుకోవాలి. అప్పుడే ఉత్తమ ఆరోగ్యం పొందడానికి సాధ్యమన్నారు. రోగాలు వచ్చినప్పుడు ఆస్పత్రికి వెళ్లడం కంటె రోగాలు రాకుండా చూసుకోవడమే ఉత్తమమన్నారు. ప్రతినిత్యం ఓ గంటసేపు వ్యాయామం, యోగా, ధ్యానంతో ఎంతో ఆరోగ్యం కలుగుతుందన్నారు. యోగా మానవ జీవితంలో ఒక భాగమన్నారు. కార్యక్రమంలో మహిళా సమాజ పాఠశాల పాలనాధికారి, కోలారు తాలూకా స్కౌట్స్ అండ్ గైడ్స్ సంస్థ అధ్యక్షురాలు నవీనా, ఆయుష్ శాఖ డాక్టర్ బసవరాజ్ తదితరులు పాల్గొన్నారు.

పొగాకు ఉత్పత్తులను నిషేధించాలి


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

కోలారు: పొగాకు ఉత్పత్తులను నిషేధించడానికి ప్రతి ఒక్కరు కంకణ బద్ధులు కావాలని సీనియర్ సివిల్ న్యాయమూర్తి సునీల్ ఎస్ హొసమని తెలిపారు. ఆదివారం నగరంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన పొగాకు ఉత్పత్తుల నిషేధంపై అవగాహన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఆరోగ్యవంత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరు చేతులు కలపాలన్నారు. పొగాకు ఉత్పత్తిదారులు, విక్రయదారులు తప్పనిసరిగా కోట్పా చట్టాలను పాటించాలి. పబ్లిక్ ప్రాంతాలలో ధూమపానం చేయడం పూర్తిగా నిషేధమన్నారు. మైనర్లకు పొగాకు ఉత్పత్తులను విక్రయిస్తే నేరమన్నారు. పొగాకు ఉత్పత్తులను సేవించడం వల్ల కలిగే అనర్థాలను విద్యార్థులతో పాటు ప్రతి ఒక్కరికి అవగాహన కలిగించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎమ్ఎన్ అంబేడ్కర్, ఎన్ఎస్ఎస్ విభాగం సంచాలకుడు డాక్టర్ రంగనాథయ్య, డాక్టర్ గోపాల, రోవర్స్ సంచాలకుడు డాక్టర్ సుబ్రమణి తదితరులు పాల్గొన్నారు.